
అనగనగా
ఒక కథ
గోట్టు క
ఖరాబు చేసుక
మెంటు, మెలోడ్రా

అనగనగా ఓ కథ

"కృష్ణమోహన్‌గారూ...ఊటీలో నెల్లాళ్ళు క్యాంప్ పూర్తి అయ్యేసరికి వండ్రఫుల్ సిల్వర్ జూబిలీ స్టోరీ తయారు కావాలి. కథ, ఊటీ బ్యూటీలా మాంచి రొమాంటిక్‌గా, నవ యువతీ యువకులకు పులకింతలు, గిలిగింతలు పెట్టేదిగా ఉండాలి."

"డైరెక్టర్ గారికేం...ఆయన అలాగే చెబుతారు. డబ్బులు రాకపోతే దివాళా తీసేది నేను. ఆయన సొమ్మేం పోయింది. వట్టి రొమాన్సు చాలదు. ఆడవాళ్ళు కంటతడిపెట్టేట్టుగా సెంటిమెంటు, మెలోడ్రామా బాగా దట్టించాలి. సుఖాంతమో, దుఃఖాంతమో తెలీకుండా, చివరిదాకా మంచి సస్పెన్సుతో పకడ్బందీగా నడపాలి కథ మంచి పాకాన పడేట్టుంటే నెలరోజులు చాలకపోతే ఇంకో పదిహేను రోజులుండి రండి. మరేం ఫర్వాలేదు."

"ఇదుగో కృష్ణమోహన్ గారూ! ప్రొడ్యూసరుగారు చెప్పారుకదా అని మొహమాటానికి పోయి, ఒట్టి ఏడుపుగొట్టు కథ తయారుచేయకండి. అనవసరంగా మీపేరు కాస్తా ఖరాబు చేసుకోకండి. తెలుగు సినిమా అంటే కొంత సెంటిమెంటు, మెలోడ్రామా, కష్టాలు, త్యాగాలు అవసరమన్న

మాట నిజమేగానీ, టూమచ్ అయితే బోరు పిక్చరంటారు జనం. ఇంట్లో ఏడుస్తున్నది చాలక థియేటరుకు వచ్చి, డబ్బు లిచ్చికూడా ఏడవాలా అంటారు."

"టూమచ్ అయితే ఏదైనా నా మొహంమొత్తుతుందండీ. రొమాన్సు, సెంటిమెంటు, కష్టాలు, సుఖాలు సరైన మోతా దులో కలిపి కథ తయారు చేస్తాను. కథ నా మనస్సుకు పూర్తిగా నచ్చితేనే మీకు ఇస్తాను. నెలరోజుల్లో నేను కథ తయారుచేయలేక పోయినా, తయారుచేసిన కథ మీకు నచ్చక పోయినా ఊటీక్యాంప్ ఖర్చు నేనుభరిస్తాను. ఏమండీ ప్రొడ్యూ సరుగారు ఏమంటారు?"

"అబ్బెబ్బె ఖర్చుదేముంది లెండి. నిజంగా కథ మీ మన స్సుకు పూర్తిగా నచ్చితే, నా మట్టుకు నాకు అంతగా నచ్చక పోయినా సినిమా తీసేస్తాను. కథ నచ్చవలసింది జనానికి-మనకి కాదు. జనానికి ఏదినచ్చుతుందో, ఏది నచ్చదో నా కంటే, మన డైరెక్టర్ గారికంటే మీకే బాగా తెలుసనుకుంటాను. లేకుంటే వరసగా ఐదు సెంచరీలు, రెండు జూబిలీలు ఎలా కొడతారు? యూ ఆర్ వన్ ఆఫ్ ది మోస్టు బ్రిలియంట్ రైటర్స్ ఆఫ్ ది తెలుగూ స్క్రీన్."

మద్రాసు సెంట్రల్ స్టేషన్ నుంచి నీలగిరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి సిద్ధంగా ఉంది. టైము రాత్రి 8 గంటలు.

"ఇంక మీరు కంపార్టుమెంటులోనికి వెళ్ళి కూర్చోండి. టైమైనట్టుంది" అన్నాడు డైరెక్టర్.

కృష్ణమోహన్ కంపార్టుమెంటులోకి వెళ్ళి, కిటికీ దగ్గ రగా కూర్చున్నాడు. ఫస్టుక్లాస్ కంపార్టుమెంటులో ఒక యాభై యేళ్ళ ఆవిడ, ఒక ఇరవై యేళ్ళ యువతి మాత్రం

ఉన్నారు. ఇద్దరూ సీరియస్‌గా చెరో మాగజైన్ చదువు తున్నారు.

"అన్నట్లు మీ ఫాదర్, మదర్ వస్తారని చెప్పారు ఇంకా రాలేదేం?" అన్నాడు ప్రొడ్యూసరుగారు.

"అవునండీ వాళ్ళకోసమే చూస్తున్నాను. రైలుబయలు దేరేలోగా వస్తారో లేదో. ఇంతకీ అడగడం మరిచిపోయాను. మీ 'గాలిలో దీపం' ఎలా పోతోంది?"

"గాలిలో దీపంలాగే ఏడుస్తోంది-ఇప్పుడో కాస్సేపటికో ఆరిపోయేట్టు. మూడో వారంలోనే చతికిలబడి కాళ్ళు బార జాపింది. లంఖణాల బోటులాగా లాగిస్తోంది. ఈ వారంతో 'బి' సెంటర్స్‌లో ఎత్తేస్తారు. 'ఏ' క్లాస్ సెంటర్లలో కూడా ఇంకో రెండు వారాలు లాగిస్తే గొప్ప. ఆ రైటరూ, డైరెక్టరూ కలిసి నన్ను ముంచేశారనుకోండి. వాళ్ళని పెట్టుకోవడం బుద్ధి తక్కువైపోయింది. రెండు మూడు సెంచరీ పిక్చర్లు తీశాడు కదా అని అతన్ని పెట్టుకుంటే అతను అలా తగలేశాడు. నా మొదటి రెండు పిక్చర్లలో వచ్చినదంతా ఇందులో తుడిచి పెట్టుకుపోయింది. మీ 'జీవిత వలయాలు' విజయ ఢంకా మోగిస్తుందటగా?"

"అవునండీ. రికార్డ్ కలెక్షన్ అనిఅంటున్నారు. రెండు మూడు సెంటర్స్‌లో జూబిలీ చేస్తుందంటున్నారు."

"ఈజీగా జూబిలీ లాగించేస్తుందండీ. దానికేం రాజా లాంటి పిక్చరు. స్టోరీ అంటే అలా వుండాలండీ. స్కాచ్ విస్కీ నసాళానికెక్కితే మనకి ఎలా ఉంటుందో, మన పిక్చరు చూసే ప్రేక్షకులకి అలా ఉండాలండీ. ఆ 'కిక్' రావాలి, అలా 'కిక్' వచ్చేట్టు చెయ్యడంలోనే రైటర్ తడాకా, డైరెక్ట

తడాకా తెలుస్తుంది. నన్ను అడిగితే అసలు పిక్చర్ సక్సెస్ అంతా స్టోరీ మీద, డైరెక్షన్‌మీద ఆధారపడి వుంటుందండీ. తారాగణం, ఇతర ప్రొడక్షన్ వాల్యూస్ అన్నీ వాటి తర్వాతనే."

"పెద్ద స్టార్స్ వుంటే ఓపెనింగ్స్ బావుంటాయండీ. అదే అడ్వాంటేజ్."

"అఫ్‌కోర్స్ ఓపెనింగ్స్ బావుంటాయనుకోండి, కాని మంచి స్టోరీ లేకపోతే రెండో వారంలోనే పిక్చరు కాళ్ళు జాపేస్తుందండి! నేను మూడు పిక్చర్లు తీసిన అనుభవంతో చెబుతున్నా కృష్ణమోహన్‌గారూ! మొదటిపిక్చరు పెద్దతారాగణంతో తీశాను, ఓపెనింగ్స్ బ్రహ్మాండంగా వున్నాయి. స్టోరీ వాల్యూ వుంది. పది సెంటర్స్‌లో శతదినోత్సవం చేయించా. రెండో పిక్చరు చిన్న తారలతో చవగ్గాతీశాం. అది కూడా మంచి స్టోరీ కాబట్టి బాగా లాగించింది. ఓపెనింగ్స్ అట్టే బాగా లేకపోయినా నాకు బాగా డబ్బులొచ్చాయి. మూడో పిక్చరు ఆ బాక్సాఫీస్ డైరెక్టర్ని పెట్టుకుని, సరైన స్టోరీ లేకుండా, భారీ తారాగణాన్ని పెట్టుకుని దిబ్బయిపోయాను. నేను మొదట్నుంచీ మొత్తకుంటూనేవున్నాను, స్టోరీ మంచి పట్టుగా వుండాలయ్యా, అది లేకుండా ఎన్ని హంగులు చేసినా శవాలంకరణేనయ్యా అని. అబ్బే ఆ డైరెక్టరు వింటేనా? వరసగా మూడు సినిమాలు సక్సెస్ అయ్యేసరికి మన డైరెక్టర్లకి కళ్ళు నెత్తికొస్తాయండీ, ఆ ఘనత అంతా తమదేననుకుంటారు. బాక్సాఫీస్ రహస్యాలన్నీ ఔపోసనం పట్టినట్టు మాట్లాడతారు. బాక్సాఫీస్ హంగులన్నీవుంటే అసలు స్టోరీ లేకపోయినా ఫర్వాలేదనుకుంటారు. రైటర్ని

మహా చులకనగా చూస్తారు, ఇప్పుడు యీ 'గాలిలో దీపం' ఆరిపోయేసరికి ఆ డైరెక్టరు ఏమంటున్నాడో తెలుసాండి, నా జాతకం బాగాలేదుట. సక్సెస్ అయితే అది తన ఘనత, కాక పోతే అది నిర్మాత తలరాత."

"అవునండీ చాలా మంది ఒప్పుకోవడానికి ఇష్టపడరు గాని అల్టిమేట్‌గా పిక్చర్ సక్సెస్‌ని నిర్ణయించేది కథేనండీ. మొదటి రెండు వారాలూ తారాగణంవల్ల పోతుంది. మూడో వారం, నాలుగోవారం డైరెక్టర్ని బట్టి పోతుంది. ఆ తరువాత నించి పిక్చర్ని లాగించేది కథాబలమే. అతుకులబొంత లాంటి కథలతోకూడా బాగా డబ్బు చేసుకున్న సినిమాలు వున్నా యనుకోండి. కాని, వాటిల్లో కూడా జనాన్ని బాగా వూపేసే సెంటిమెంట్స్ కొన్ని తప్పక వుండి వుంటాయి. అవే వాటికి ఆయువు పట్టు. ఇవన్నీ కాక అదృష్టమనేది కూడా కొంత వుంటుందనుకోండి."

"మీరు చెప్పింది అక్షరాలానిజం కృష్ణమోహన్‌గారూ. మీరు రాసిన సినిమాలన్నీ చూశాను కదండీ. అన్నిట్లోనూ అలా 'కిక్' యిచ్చే సెంటిమెంట్లూ, సన్నివేశాలూ వున్నా యండీ. అందుకే ఈసారి మిమ్మల్ని పట్టుకున్నాను. కథ మీకు సంతృప్తికరంగా వచ్చే వరకూ మనం స్టూడియోలో అడుగు పెట్టనేవద్దండి. ఎంత టైమైనా తీసుకోండి మీ ఇష్టం."

ఇంతలో కృష్ణమోహన్ తల్లి, తండ్రీ హడావిడిగా వచ్చారు.

"అమ్మయ్య మొత్తానికి సమయానికి వచ్చాం. ఈపాటికి రైలు వెళ్ళిపోయి వుంటుందనుకున్నాం. ఇవాళ రైలు లేటు

కాబోలు. ముందు ఈ కారియరు లోపల పెట్టుకో" అంది ఆవిడ.

"ఈ కారియర్ ఏమిటమ్మా? దార్లో నాకు భోజనం దొరకదనుకున్నావా?"

"భోజనం కాదురా. నీకు చాలా ఇష్టమని కజ్జికాయలు, తొక్కుడు లడ్డూలు, జంతికలు చేసి తెచ్చాను. అన్నీ నిలవ వుండేవే. ఓ వారం రోజులు తినచ్చు. కారియర్ సీటుకింద పెట్టుకో" అంటూ ఆవిడ కిటికీలోంచి కంపార్టు మెంటులోకి తొంగి చూసింది.

అంతవరకు మాగజైన్ చదువుతూనే వీళ్ళ మాటలు వింటున్న ఆ యాభై ఏళ్ళావిడ ఒక్కసారిగా మాగజైన్ మొహానికి అడ్డం పెట్టుకుంది.

"ఏదైనా ఇంపార్టెంట్ లెటర్సు వస్తే ఊటీకి రీడైరెక్టు చెయ్యి నాన్నా- ఉడ్‌లాండ్స్ రూమ్ నెంబర్ సెవెంటీన్.

"సరేగానీ-నువ్వు వెళ్ళగానే వుత్తరం రాసి పడెయ్యి" అన్నాడు కృష్ణమోహన్ తండ్రి.

"అలాగే నాన్నా!"

గంట కొట్టారు. నీలగిరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది.

"టాటా బై బై చీరియో" చేయివూపుతూ అందరికీ టాటా చెప్పాడు.

సీటులో స్తిమితంగా కూర్చుని కంపార్టుమెంట్ అంతా కలయజూశాడు. ఆ యువతి, యాభై యేళ్ళావిడ-ఇద్దరే వున్నారు. ఇద్దరూ ఉలుకూ పలుకూ లేకుండా సీరియస్‌గా మాగజైన్‌లు చదువుతున్నారు-కనీసం చదువుతున్నట్లుగా కనిపిస్తున్నారు.

ముందు యువతికేసి చూశాడు. ఆ అమ్మాయి ఒకసారి అతనికేసి చూసి మళ్ళీ చూపు మాగజైన్‌మీదికి మళ్ళించింది- తర్వాత నడివయస్కురాలివైపు చూసేసరికి, సరిగ్గా అదే సమయంలో ఆవిడ అతనివైపు చూసింది. అతను చూపులుదించేసుకున్నాడు. తను నేరుగా వీళ్ళకేసి చూడడం బావుండదనీ, తను కూడా ఏదైనా అడ్డం పెట్టుకుంటే మంచిదనీ అనుకున్నాడు. బ్రీఫ్ కేస్ తీసి, అందులోంచి ఓ పొడుగాటి ఫైలు తీశాడు. జేబులోంచి బాల్‌పాయింట్ పెన్‌తీసి, ఆ ఫైలులో ఏదో గిలుకుతున్నట్లుగా నటిస్తూ, మధ్య మధ్య ఏదో ఆలోచించడాని కన్నట్లుగా తల ఎత్తి నా కళ్ళకేసి చూస్తున్నాడు. తను ఎప్పుడు తల ఎత్తిచూసినా ఆ పెద్దావిడ తనవేపే చూస్తూ వుండడం చూసి, కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యాడు. తను ఆ యువతి వైపు చూడడం ఆవిడ గమనిస్తున్నదికాబోలు ననుకున్నాడు.

అతని చేతిలో వున్నది సినిమా ఐడియాల రఛచిత్తు ఫైలు. అతను ఒంటరిగా ఎప్పుడు ప్రయాణిస్తున్నా ఆ ఫైలు తప్పనిసరిగా దగ్గరుంటుంది. వచ్చిన ఐడియా వచ్చినట్లు అందులోకి ఎక్కించేస్తూ వుంటాడు. ఏదో రాసుకుంటున్నట్టు చదువుకుంటున్నట్టు దీర్ఘాలోచనలో వున్నట్లు నటిస్తూ, తోటిప్రయాణికుల సంభాషణలను శ్రద్ధగా వినడం, వారి హావభావాలను, మేనరిజమ్స్‌ని గమనించడం, వాటిని ఫైలులోకి ఎక్కించడం అతనికి అలవాటు.. ఆ ప్రయాణీకులలో విచిత్రంగా విశేషంగా కనిపించిన వారిని సినిమాకథల్లో పాత్రలుగా ఎలా ఎక్కించాలో ఆలోచించి, వారి మేకప్, మాటతీరు వగైరాలను గురించి నోట్సు రాసుకోవడం అలవాటు. ఒక్కొక్క

ప్పుడు ఆ పాత్రలతో కూడిన సన్నివేశాలను ఎలా చిత్రీకరించాలో, కెమెరా యాంగిల్స్‌తో సహా నోట్స్ రాసుకుంటాడు.

అలవాటు ప్రకారం ఇప్పుడూ అదే పనిలో నిమగ్నుడై నాడు. ఆవిడ బాగా డబ్బుగలావిడలాగే ఉంది. లేకపోతే ఫస్ట్ క్లాస్‌లో ఎందుకు ప్రయాణం చేస్తుంది? రోల్డుగోల్డు ఫ్రేం వున్న కళ్ళజోడు పెట్టుకుంది, ఘనమైన కంచిపట్టుచీర కట్టుకుంది. పైగా-తెలుగు సినిమాలో జమిందారిణిలాగా కాశ్మీర్ శాలువా కప్పుకుంది. చలికోసం కాదు, డిగ్నిటీకోసం, కొద్దిగా పాపిడి దగ్గర జుట్టు నెరిసింది, వయస్సు యాభై దాకా వుండవచ్చు. కాని ఓ నాలుగైదేళ్ళు తక్కువగానే కనిపిస్తోంది, కళగల మంచి అందమైన మొహం, పచ్చగా దబ్బపండులా వుంది. మొహాన నయాపైసంత కుంకుమ బొట్టు పెట్టుకుంది. భర్త ఆఫీసరో ఎస్టేట్ యజమానో అయి వుంటాడు, ఇంగ్లీషు మాగజైన్ చదువుతోంది కనుక చదువుకొన్నావిడ అయివుండాలి. ఏదో సిటీలో బంగళా, కారు, ఫోను, రేడియోగ్రాము, ఫ్రిజ్ వుండివుంటాయి, ఓ అందమైన తెల్లటి బొచ్చుకుక్కపిల్లకూడా వుండివుంటుంది. నౌకర్లూ, చాకర్లూ వుండివుంటారు. ఆవిడ చేతులకి ఏడెనిమిది జతల బంగారు గాజులు, మెళ్ళో ఆరుపేటల చంద్రహారం, నల్లపూసలగొలుసు, సూత్రం గొలుసు వున్నాయి, ఇంట్లో ఇంకా చాలానగలుఉండేవుంటాయి. అన్నీ పెట్టుకుంటే మరీమోటుగా వుంటుందని పెట్టుకుని ఉండదు. ముఖం పోలికలు చూస్తుంటే తెలుగుతనం కనిపిస్తోంది. కోనసీమ మనిషి కావచ్చు.

ఆ యువతి ఆవిడ కూతురేమో. అయితే మొహంలో ఆవిడ పోలికలు లేవు-తండ్రి పోలికలు కావచ్చు, లేకపోతే మేనగోడలో, ఆ అమ్మాయికి ఇరవై ఒకటో, ఇరవై రెండో వుంటాయి, సన్నగా, పొడుగ్గా, తెల్లగా సన్నజాజిమొగ్గలాగా నాజూగ్గా స్టయిలుగావుంది, ఆ అమ్మాయికూడా ఇంగ్లీషు మాగజైన్ చదువుతోంది, ఓ చేతికి అరడజను బంగారుగాజులు ఇంకోచేతికి గోల్డుచైన్ రిస్ట్‌వాచ్, మెళ్ళో లాకెట్ వున్న ఒంటిపేటగొలుసు. రెండు చేతులకీ రెండు ఉంగరాలు పెట్టుకుంది.

ఒకటి లేత ఆకుపచ్చరాయి ఉంగరం, ఇంకోటి సిల్వర్ ఫిలిగ్రీవుంగరం. చెవులకి బంగారు రింగులు పెట్టుకుంది. కాలీ నిట్ శారీ కట్టుకుంది. ఆమె వ్యానిటీ బ్యాగ్ ఖరీదు వంద రూపాయలకి తక్కువ వుండదు, ఆమె వ్యానిటీ ఆ బ్యాగ్ లోనే కనిపిస్తోంది. ఆ డిగ్నిటీ, పోజూ చూస్తే కనీసం బి.ఏ. చదివినట్టుంది. ఎం. ఏ. చదివినా ఆశ్చర్యంలేదు. ఉద్యోగం చేస్తున్నట్లులేదు. "ఉద్యోగం చేయడానికి నాకేం ఖర్మ" అన్న ట్టుంది ఆ అమ్మాయి ధోరణి. హిందీ సినిమా హీరోయినంత అందంగా వుంది. తాను వెతుకుతున్న కథకి హీరోయిన్‌గా పనికొచ్చేటట్టుంది. వాళ్ళిద్దరూ వూటీకే వెడుతున్నట్టున్నారు. లేకపోతే మెట్టపాలయం రైలెందుకు ఎక్కుతారు? మెట్టపా లయంలో ఏమైనా పనుండి వెడుతున్నారేమో? అబ్బె-మెట్ట పాలయంలో వీళ్ళకేం పని-ఇంత నడివేసంగిలో ఊటీకే అయ్యుంటుంది. ఊటీలో వీళ్ళకో సొంతబంగళా వుండి వుం టుంది.

ఇలా వూరికే చూస్తూ, ఆలోచిస్తూ, ఊహిస్తూ కూర్చుంటే గమ్యస్థానం రానేవస్తుంది-వాళ్ళ దారిని వాళ్ళు పోతారు. ఈ ఆలోచనంతా దంటగే. నెమ్మదిగా మాటలు కలిపితే వాళ్ళసంగతి తెలుస్తుంది. రైలుదిగే సమయానికి రఫ్‌గా ఏదైనా స్టోరీ ఐడియా దొరకొచ్చు. తర్వాత ఊటీ ఉడ్‌లాండ్స్‌లో ఆ ఐడియాని పీకి పాకంపట్టచ్చు. ఊటీలో నెల్లాళ్ళు మకాంవేసి, మజాచేసి తీరా స్టోరీ ఏదీ దొరకత్తదంటే పెద్దమనిషి తరహాగావుండదు. పరువుపోతుంది. వందలూ వేలూ తగల్తయించానని ప్రొడ్యూసరు నెత్తీనోరూ కొట్టుకుంటాడు. మిడ్ సమ్మర్‌లో మద్రాసులో ఎంత ఎయిర్‌కండిషన్డ్ హోటల్లో మకాం వేసినా బుర్రలో ఐడియా పుట్టదనీ, వూటీ వెడితేగాని మూడ్ రాదనీ చెప్పి, ఊటీ ఉడ్‌లాండ్స్‌లో రూమ్ బుక్‌చేయించాడు. తను ఎలాగైనా ఈసారి మంచి బాక్సాఫీస్ స్టఫ్ సంపాయించగలిగితే, ప్రేక్షక మహాశయులు అనుగ్రహించి కనీసం శతదనోత్సవం అయినా జరిపిస్తే, నెక్స్ట పిక్చర్‌కి కాశ్మీర్ వెడితేగానీ మూడ్ రాదని దబాయించవచ్చు. అసలు హీరో హీరోయిన్‌ను వూటీలోనో, కొడైకెనాల్లోనో, తప్పితే డార్జిలింగ్‌లోనో కలుసుకొని, డ్యూయెట్లు పాడుకున్నట్లుగా కథని తయారుచేసి ఆ ప్రదేశాల్లో షూటింగ్ ఏర్పాటు చేయించాలి.

అదంతా సరే...ఇప్పుడు వీళ్ళని మాటల్లోకి దింపడం ఎలా? తనంతట తాను మాట్లాడిస్తే డిగ్నిటీకి తక్కువ. ఎంత అయినా టాప్‌క్లాస్ సినీ రచయిత కదా... ఆ విషయం ఈ పాటికి వాళ్ళకి తెలిసేవుండాలి-తెలుగు వాళ్ళైతే. వాళ్ళు

పలకరిస్తే బావుండు. అప్పుడు తను అనర్గళంగా వాగినా అట్టే ఆక్షేపణ వుండదు.

మళ్ళీ ఒక్కసారి ఆ యువతికేసి చూశాడు. అంతకు ముందే ఆ అమ్మాయి తనను చూస్తూవుంది. తను చూడగానే గబుక్కున మాగజైన్ చాటున దాక్కుంది. 'సహజంగా డబ్బు గలవాళ్ళు కాబట్టి అంత స్టయిలుగా వుందిగానీ, పాపం ఆ అమ్మాయికి టెక్కు, గొప్పలేవు, మామూలు సింపుల్, నైస్‌గర్ల్. కొందరికి పుట్టుకతోనే దర్జా, ఠీవి వుంటాయి. అందులో తప్పేముంది. కాస్త నీటుగావుంటే బూర్జువా అనుకుంటే ఎలా? వెరీస్వీట్ గర్ల్' అనుకున్నాడు. తను, ఆ అమ్మాయి ఒకరి నొకరు చూసుకుంటున్న సంగతి ఆ పెద్దావిడ పసిగట్టిందేమోనని ఆవిడవైపు చూసేసరికి, ఆవిడ చాలా సేపటినుంచి రెప్పవాల్చకుండా, తదేక దీక్షతో తననే చూస్తున్నట్టుగా కనిపించింది. పట్టుబడిన దొంగలా తను గాభరా పడుతుండగా ఆవిడే పలకరించింది.

"సినిమా రచయిత కృష్ణమోహన్ మీరేనా?"

"అవునండి-ఇందాక మా డైలాగ్స్ అన్నీ విన్నారేమిటి?"

"శబ్దగ్రహణం అంత నిర్దుష్టంగా వుంటే వినకుండాఎలా వుండగలం?" అంది ఆవిడ నవ్వుతూ.

పక్కనున్న ఆ సుకుమారి, సన్నజాజి మొగ్గకూడా మాగజైన్‌లోనుంచి తలతిప్పకుండానే సన్నగా నవ్వింది. తనూ నవ్వాడు.

"మీరు రాసిన సినిమాలు చూశాం. అయితే మీరు వయస్సులో ఇంత చిన్నవారని అనుకోలేదు. నలభై యేళ్ళు

దాటివుంటాయనుకున్నాం. చూస్తే నిండా ముప్ఫయికూడా వున్నట్లు లేదు."

"అవునండీ-నాకిప్పుడు ఇరవై యేడు."

"రచయితగా మీ పేరు చాలా కాలంగా వింటున్నామే."

"నేను పద్దెనిమిదో యేడునుంచి రాస్తున్నాను. అయితే సినిమా రంగంలోకి వచ్చి మూడేళ్ళు అయింది."

"ఇందాక స్టేషన్‌కు వచ్చినావిడ మీ అమ్మగారా?"

"అవునండీ."

"మీ నాన్నగారు ఏంచేస్తున్నారు?"

"పిల్లన్ అండ్ కంపెనీ మేనేజర్...ఆయన చాలా బిజీగా వుంటారు ఎప్పుడూ. ఈ మధ్య నేనూ బిజీగా వుంటున్నాను. మేమిద్దరం ఒకరి నొకరు చూసుకోవడమే అపురూపం. మళ్ళీ వెల్లాళ్ళదాకా కనిపించనని హడావుడిగా స్టేషన్ కొచ్చారు.

"అదేమిటీ? మీరు మీ తల్లిదండ్రులతో కలిసి వుండడం లేదా?"

"ఒకే ఇంట్లో ఉంటున్నాం. కాని కలుసుకోవడం తక్కువ. నేనెప్పుడూ సినిమా జనంతో తిరుగుతూ ఏ హోటల్లోనో మకాం వేస్తాను. అక్కడే రాతపని సాగిస్తూ వుంటాను. రోజులతరబడి యింటికే వెళ్ళను. నేను వెళ్ళినప్పుడు మా నాన్నగారు ఇంట్లో వుండరు. ఒకవేళ నేను ఏ అర్ధరాత్రి వేళో ఇంటికి వచ్చినా, ఇంట్లోవాళ్ళని డిస్టర్బ్ చేయకుండా నాగదిలోకిపోయి పడుకుంటాను. నేను బారెడు పొద్దెక్కి లేచే

టప్పటికి మా నాన్నగారు ఆఫీసుకి వెళ్ళిపోతారు. అదీ మా వరస."

"మీకు ఎయిర్ కండిషన్ హోటల్లో తప్ప రచనకి మూడ్ రాదా?" కొంచెం చనువుతీసుకుంటున్నట్లుగా నసుగుతూ అడిగింది ఆవిడ.

"అది కొంతవరకు పోజుఅన్నమాట నిజమేగానిండీ-హోటల్లో మకాంవెయ్యడంలో సౌకర్యంవుంది. ఇంటోఅయితే బంధువులు మిత్రులు వస్తూపోతూఉంటారు. మాట్లాడుతూ కూర్చుంటే మనటైము వేస్టవుతుంది. మన టైము వేస్టయితే టైము, ప్రొడ్యూసరుడబ్బుకూడా వేస్టయినట్లే. పైగా పేపర్ వర్కు జరుగుతుండగా ప్రొడ్యూసరూ,డైరెక్టరూవచ్చిడిస్కుషన్స్ జరుపుతూ ఉంటారు, అటువంటి డిస్కుషన్స్‌కీ, హోటల్లో అయితే వసతిగా ఉంటుంది. చీటికీ మాటికి కాఫీలు, సిగరెట్లు బాటిల్సూ కావాలంటే ఇంట్లో అయితే ఇబ్బంది."

"అయితే సినిమా రచన తయారవ్వాలంటే అవన్నీ తప్పనిసరి అన్నమాట!"

"అబ్బెబ్బే. నాకు ఆ అలవాట్లన్నీ లేవండీ! అవన్నీ వాళ్ళకి. నేను రోజుకి రెండుసార్లకంటే కాఫీకూడా తాగను మా అమ్మకి నేనొక్కడినే అయినా, గారాబం అన్నమాట లేకుండా మహాస్ట్రిక్టుగా పెంచింది. పిచ్చివేషాలేస్తే చెమడా లెక్కతీస్తుంది,"

"అలాకంగారుపడి, సంజాయిషీ చెప్పుకుంటారేం! వూరికే సరదాగా అడిగాను గానీ, సినిమావాళ్ళ అలవాట్లు ఎలాంటివయితే మాకు దేనికి చెప్పండి ఇదుగో ఈ పిల్ల మీ

అభిమానసంఘంలో ప్రముఖ సభ్యురాలు. మిమ్మల్ని గురించి తెలుసుకోవడంలో నాకంటే దానికే ఎక్కువ ఇంట్రెస్టు. అందుకే మిమ్మల్ని పలకరించాను. నా ప్రశ్నలు మీకు ఇబ్బంది కలిగించాయేమో!"

"అబ్బే లేదండీ! మీతో మాట్లాడుతుంటె మాఅమ్మతో మాట్లాడుతున్నట్లేఉంది. నాతో మీరు అరమరిక లేకుండా మాట్లాడవచ్చు. ఆ అమ్మాయి మీ అమ్మాయేనాండీ?"

"మా అమ్మాయిలాంటిది. మా పిల్లలెవరూ లేరు. కాబట్టి ఇది మా అమ్మాయి కిందే లెక్క. పేరు ప్రమీల. బి.ఏ. పాసై గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంది. పత్రికల్లో సీరియల్స్ చదవడం, సినిమాలు చూడడం, వాటిల్లోని అసందర్భాలని ఏకెయ్యడం దీని హాబీలు. ఏమే? అంత ముంగిలా కూర్చున్నావు? నీ ఫేవరెట్ సబ్జక్టు చర్చించడానికి ఇంత గొప్ప రచయిత దొరికితే మెదలకుండా వూరుకున్నావేం!"

"ఫో పిన్నీ... సినిమావాళ్ళదగ్గర పరాచికాలాడతావు" అంది ఆ అమ్మాయి సిగ్గుపడుతూ.

"నాతో మాట్లాడుతుంటే వాళ్ళ అమ్మతో మాట్లాడుతున్నట్లుందని అతను అన్నాడా లేదా? అందుకే అతను నాకు పరాయివాడిలాగ కనిపించలేదు." అంటూ ఆవిడ నాలిక కరుచుకున్నట్లుగా "మిమ్మల్ని 'అతను' అంటూ ఏకవచనంతో మాట్లాడాను-మీకేమన్నా చిన్నతనంగా వుందేమో" అన్నది.

"అబ్బెబ్బె లేదండీ! మీరు నాకన్నా చాలా పెద్దవారు-ఏకవచనంతో సంబోధిస్తేనే సముచితంగా వుంటుంది అన్నట్లు మిమ్మల్ని గురించి చెప్పలేదు."

"మమ్మల్ని గురించి చెప్పుకునేందుకు ఏముంది? అయినా సినీ కథా రచయితలు తెలుసుకోదగినంతటి విశేషమైన వ్యక్తు లంకాదనుకుంటాను. అయినా అడిగావు కాబట్టి క్లుప్తంగా చెబుతాను. మాది బెంగుళూరు. అసలైతే మాది ఆంధ్రా కోనసీమ. ముప్ఫయ్యేళ్ళుగా బెంగుళూరులోనే మానివాసం. బెంగుళూరులో మాకు ఒక వ్యాపార సంస్థ వుంది. దానికి మావారు మేనేజింగ్ పార్ట్నర్. ఊటీలో మాకో చిన్న బంగళా ఉంది. ఒక అమెరికన్ కుటుంబానికి అద్దెకిచ్చాం. సాధారణంగా ప్రతి వేసవిలో అక్కడికి వెళ్ళి కొద్ది రోజులు గడుపుతూ వుంటాము. మేము ముందుగా ఉత్తరం రాస్తే వాళ్ళు ఒక పోర్షన్ ఖాళీచేసి అట్టే పెడతారు. ఈసారి ఈ పిల్లకూడా వస్తానని బయలుదేరింది. మావారు, నేను, ఈపిల్ల మద్రాసులో ఒక బంధువుల ఇంట్లో పెళ్ళికని వచ్చాము. ఆయన బిజినెస్ పనిమీద అర్జంటుగా బెంగుళూరు తిరిగి వెళ్ళాల్సివచ్చింది. ఇందాక మమ్మల్ని రైలెక్కించేసి ఆయన వెళ్ళిపోయారు. ఈ రాత్రే మెయిల్లో బెంగుళూరు వెడతారు. మేము కొన్నాళ్ళు ఊటీలోఉండి, బెంగుళూరుకి తిరిగి వెడతాము. ఇంతకూ మీరు ఊటీకి వెళ్ళడం ఇదే మొదటి సారా?"

"ఇదివరకు ఒకసారి ఓ ప్రొడ్యూసరు బలవంతంచేసి లాక్కెళ్ళాడు-ప్రకృతి సౌందర్యం కోసంకాదు-రేసులకోసం. మూడు రోజుల్లో చిత్తుగా దివాలా తీసేసరికి, హోటల్ బిల్లు చెల్లించగా థర్డ్ కాస్ ప్రయాణానికి మాత్రం డబ్బులు బొటాబొటిగా మిగిలాయి. వూటీ సరిగా చూసినట్లేలేదు.

అందుకని ఈ సంవత్సరం కథ అన్వేషణ కోసమని వంకపెట్టి బయలుదేరాను. ఇంతకీ మీపేరు చెప్పలేదేం?"

"నాకు పేరేమిటి? అ గామకుటాలిని."

"అదేమిటండీ అలా అంటారు? మీపేరు నేనుతెలుసుకో కూడదంటారా?"

"తెలుసుకోగూడక పోవడానికేం వుందిలే - రాజ్య లక్ష్మమ్మగ్రావాలు" అంటూ నవ్వింది ఆవిడ.

"మీరు సినిమాకి కథ రాయాలన్నప్పుడల్లా ఇలా ప్రయాణం బయద్దేరతారాండి...ఇంతకుముందు సినిమా కథ లన్నీ అలాగే రాశారా?" అంతవరకు పెళ్ళికూతురులా ముడుచుకు కూర్చున్న హీరోయిన్ ధైర్యంచేసి అడిగింది.

ఆ అమ్మాయి తనతో నేరుగా మాట్లాడేసరికి ఎంతో సంబరం కలిగింది హీరోకి ఆ సంబరంలో కొంత తబ్బిబ్బు కూడా కలిగింది.

"అబ్బెబ్బే...కథ రాయాలంటే ప్రయాణం బయల్దే రక్కర్లేదండీ. కాని, సాధారణంగా ప్రతి ప్రయాణంలోనూ నాకు కొన్ని మంచి ఐడియాలు దొరుకుతూ ఉంటాయి."

"అయితే ఈసారి సినిమాలో మమ్మల్ని ఎక్కిస్తారన్న మాట" అంది రాజ్యలక్ష్మమ్మగారు నవ్వుతూ.

"మీతో మాట్లాడడం చాలా కష్టమండీ-గొప్ప చాక చక్యం కావాలి."

"నేనన్నదాంట్లో వెటకారం ఏముందండీ? అలా నిజంగా తటస్థపడిన మనుషులనీ, వాళ్ళ ప్రవర్తనల తీరును ఉన్నది వున్నట్లుగా ప్రవేశపెట్టితేనే సినిమాల్లో పాత్రలు సవ్యంగా ఉంటాయి. అలా చేయకపోవడంవల్లనే మన సిని

మాల్లోపా తలుక్రుతిమంగా కేవల అట్టబొమ్మల్లావు టున్నాయి. వచ్చే సినిమాలో మీరు మమ్మల్ని వెండితెరమీదకి ఎక్కించాల్సిందే.

"నేనుఅడిగినదానికి మీరు సరిగా చెప్పలేదు. మీరుసినిమా కథను ఎలాతయారు చేస్తారు? కథావస్తువును ఎక్కడనుంచి గ్రహిస్తారు?" అని అడిగింది హీరోయిన్

"కథావస్తువు ప్రధానంగా జీవితంలోనుంచే వస్తుంది కొన్ని మన జీవితంలోనుంచి, మరికొన్ని మనం చూసిన జీవితాలనుంచి, ఇంకా కొన్ని మనం విన్న జీవితాలనుంచి ప్రతి జీవితంలోనూ కొన్ని కొన్ని అనుభవాలు సినిమా కథలకు పనికొచ్చేవిగా ఉంటాయి. ఒకానొక అనుభవాన్ని. లేదా సంఘటనను కేంద్రంగా పెట్టుకొని, దానిచుట్టూ ఇంకా అనేక సంఘటనలను పేర్చుకొని, రకరకాల పాత్రలను చేకూర్చుకుని కథను తయారుచేస్తాము. మామూలుగా సినిమాకథని రచయిత ఒక్కడే రాయడు. డైరెక్టరూ, ప్రొడ్యూసరూ, డిస్ట్రిబ్యూటరూ, హీరో ఒకరేమిటి... నోరుగల ప్రతివాడికీ కథారచనలో భాగస్వామ్యం వుంటుంది తీసుకొన్న కథ సినిమాగా తయారయ్యేలోగా పధ్నాలుగు సార్లు మారుతుంది."

"అందుకే అంత అపభ్రంశంగా తలా తోకా లేకుండా ఉంటాయి తెలుగు సినిమా కథలు. తెలుగు ఏమిటిలెండి- హిందీ సినిమాలూ అంతే."

"సినిమా కథలు తలాతోకా లేకుండా ఉండటానికి ముఖ్యకారణం పదిమంది చేతులు పట్టడమే. పూర్తిగా రచయితే తయారుచేసిన కథలో కొంత యూనిటీ ఉంటుంది. అయితే ఎప్పుడయినా మంచి రచయిత రాసిన కథ

రావుంటుంది. చచ్చు రచయిత రాసింది చౌకబారుగానే ఉంటుంది."

"అవును. కాని, ఎందుకనో మీరు రాసే సినిమాలు మరీ అంత అధ్వాన్నంగా ఉండవండీ. అక్కడక్కడా కొన్ని అసందర్భాలు కనిపించినా మొత్తంమీద కొంత సహజంగా ఉంటాయండీ."

"థాంక్స్ అండీ. చాలామంది అలాగే అన్నారు! దానికి కారణం ఏమీలేదు-మిగతా రచయితలకంటే నాకు ఎక్కువ స్వేచ్ఛఉంది. అది నాఅదృష్టం అనే చెప్పాలి. నా ఫస్ట్ పిక్చరే రజతోత్సవం చేసుకుంది, తర్వాత పిక్చర్లన్నీ శతదినోత్సవాలు చేసుకున్నాయి. అందుకని నేను ఏది రాసినా దానికి తిరుగులేదనే అభిప్రాయం సినిమా వర్గాలలో ఏర్పడింది. అందుకే నా రచనల్లో మార్పులు చేసేందుకు వాళ్ళు సాహసించడంలేదు. అయినా మధ్యమధ్య చొరబడుతూనే ఉంటారనుకోండి. దీన్నుంచి మనం పూర్తిగా తప్పించుకోవడం సాధ్యంకాదు. ఏమైనా, నేను సాధ్యమయినంత వరకు సహజమైన, సజీవమైన కథలను తయారుచేయడానికి ప్రయత్నిస్తున్నాను. ఇంకో రెండు మూడు సంవత్సరాలపాటు నా పిక్చర్లన్నీ డబ్బు చేసుకుంటే చాలావరకు తెలుగుసినిమాల ట్రెండ్ నే మార్చవచ్చునంటున్నాను. కాని, దురదృష్టవశాత్తూ రెండు మూడు సినిమాలు వరసగా దెబ్బతింటే నా మొహం చూసేవాడెవడూ ఉండడు. మన అభిప్రాయాలను కేర్ చేసే వాళ్ళూ వుండరు."

"ఆ ఫైలు చూడచ్చాండీ?"

"చూసినా మీకేమీ అర్థంకాదు. ఇది ఐడియాల రణ చిత్తుఫైలు. కథలకి ముడిపదార్థాలు ఇందులో వుంటాయి. కుర్చీలు, మంచాలు తయారయ్యే వడ్రంగి కార్ఖానా ఎంత కంగాళీగా ఉంటుందో, కథలను తయారుచేసే నా బ్రెయిన్ కూడా అలాగే ఉంటుంది. నా బ్రెయిన్‌కి ప్రతిరూపం ఈ ఈ ఫైలు. వడ్రంగి కార్ఖానాలో కొయ్య దుంగలు, ఇనుప కమ్మీలు, మేకులు, సుత్తులు, బాడిదలు, రంపాలు ఉంటాయి. అక్కడ కోస్తూవుంటారు. అతుకులు పెడుతూవుంటారు. చిత్రికపడుతూ ఉంటారు. అతా అయిన తరువాత పాలిష్ పెడుతూఉంటారు. నా బుర్రలో కథల తయారీకికూడా అంత హంగామా జరుగుతుంది.

"ఏదీ-ఇలా ఇవ్వండి. చూసేసి ఇస్తాను" అని ఫైలు తీసుకొని, అటూ ఇటూ తిరగేసి చూసింది. ఒక్కముక్క కూడా అర్థంకాలేదు. ఏవో అర్థంలేని కొన్ని వాక్యాలు వున్నాయి. వాటిల్లో కర్త కర్మ క్రియ కూడా లేవు. ఏమీ అంతు పట్టక తిరిగి యిచ్చేసింది.

"ఇదేమిటండీ మరీ ఇంత ఘోరంగా వుంది" అంది.

"చెప్పానుగా మీకు అర్థం కాదని. నాకు తప్ప ఎవరికీ అర్థంకాదు. ఈ ఐడియాలని ఎవరూ కాపీకొట్టే అవకాశం కూడాలేదు. అవన్నీ కేవలం సంకేతాలు" అని చెప్పాడు కృష్ణమోహన్.

రాజ్యలక్ష్మమ్మగారికేసి చూస్తే, ఆవిడ ఏదో ఆలోచిస్తు న్నట్లు కన్నార్పకుండా తనకేసే చూస్తోంది. తను చూసేసరికి ఆవిడ చిన్నగా నవ్వి "అయిందా మీ సంభాషణ? ఏదోస్టేషన్ వచ్చినట్లుంది" అంది.

"కాఫీతాగి వస్తానండి" అని దిగబోయాడు.

"స్టేషన్‌లో కాఫీ దేనికి? మాదగ్గర కావలసినంత కాఫీ వుంది. ఇక్కడే తాగుదాం" అంది ఆవిడ ఫ్లాస్క్ తీస్తూ.

"అయితే మా అమ్మ ఇచ్చిన పిండివంటలు మీరు రుచి చూడాలి" అంటూ కృష్ణమోహన్ కారియర్ తీశాడు.

ముగ్గురూ టిఫిన్ తిని, కాఫీతాగారు. పిండివంటల రుచిని రాజ్యలక్ష్మమ్మగారు మహా మెచ్చుకుంది.

"అచ్చమైన ఆంధ్రాపిండివంటలు కదుపిన్నీ?" అంది ప్రమీల.

తర్వాత మరి కాసేపు సినిమాలమీద, నవలలమీద చర్చ జరిగిన తర్వాత కృష్ణమోహను పై బెర్త్ మీదికి వెళ్ళి పడుకున్నాడు. అవతలివైపు కింది సీటుమీదనే దిండు వేసుకుని ప్రమీల పడుకుంది. రాజ్యలక్ష్మమ్మగారు అదే సీటుపై కిటికీ దగ్గరగా కూర్చుంది.

"నాకింకా నిద్ర రావడంలేదు. మీరు పడుకోండి"- అంటూ ఆవిడ పెద్ద లైటు తీసి, డిమ్‌లైట్ వేసింది.

కృష్ణమోహన్ కళ్ళు మూసుకుని, ఆలోచన ప్రారంభించాడు. బుర్రలో కార్ఖానా పని చేయడం మొదలెట్టింది. ఈ ప్రయాణంలో వీరిద్దరితో తన పరిచయం ఏవిధంగా పరిణమిస్తుంది? కేవలం ప్రయాణీకులలాగే రైలు దిగగానే ఎవరి దారిన వారు వెళ్ళిపోతారా? రైలుదిగిన తర్వాతకూడా పరిచయం కొనసాగుతుందా? ఇంకా వృద్ధి పొందుతుందా? దాని పర్యవసానం ఎలావుంటుంది? వీరిద్దరూ తన కథలో ప్రధాన పాత్రలవుతారా? అయితే ఆ కథ ఎలా ఉంటుంది? ప్రమీల హీరోయిన్ అవుతుందా? హీరో ఎవరు? తనేనా? అనగా ఒకా

నొక రచయిత హీరో అవుతాడా? లేక తన జీవిత కథలోనే వీరిద్దరూ ప్రవేశిస్తారా? ఎందుకో-వీరితో తన సంబంధం ఈ ప్రయాణంతోనే ముగుస్తుందని అనిపించడంలేదు. తన మనస్సు తనకు తెలియకుండానే, తన అనుమతితో నిమిత్తం లేకుండా ఈ అమ్మాయితో అనుబంధాన్ని పెంచుకుంటున్నది. రైలు దిగినతర్వాత, వూటీ చేరినతర్వాత రాజ్యలక్ష్మమ్మగారు తాము బసచేసే చోటికి రమ్మని మర్యాదకోసం ఆహ్వానించవచ్చు. తను ఒకసారి వెళ్ళి చూసి రావచ్చు. కొద్దిరోజుల తర్వాత వాళ్ళు బెంగుళూరుకు తిరిగి వెళ్ళిపోవచ్చు. అంతేనా? ప్రమీలతో తన పరిచయం అంతటితోనే ముగుస్తుందా? అలా అని తలచుకుంటే ఇప్పుడే బాధగావుంది. ఆమెతో తనపరిచయానికి ముగింపువుండకూడదు. అది నిరంతరంకావాలి. ఆమెను గురించి ఏమీతెలియకపోయినా అంతా తెలిసినట్లనిపిస్తోంది. పరిచయమైన కొద్దిగంటలే అయినా చిన్నప్పటినుంచీ తెలిసినవ్యక్తిలా తనతో పిచ్చిక గూళ్ళుకట్టి గుజ్జన గూళ్ళు ఆడిన బాల్యమిత్రురాలిలా అనిపిస్తోంది. ఎందుకిలాఅనిపిస్తోంది? కాసేపటిలో ఇంతగా తన మనస్సును ఆకట్టుకొని, ఏమీఎరగనట్లుగా నిశ్చింతగా నిద్రిస్తున్నట్టుంది. ఒక్కసారి ఆమె ప్రశాంతమైన ముఖాన్ని చూడాలనిపించింది. కళ్ళు తెరిచి చూశాడు. ఆమె తనవైపే చూస్తోంది. తను చూడగానే ఆమె గబుక్కున కళ్ళు మూసుకోలేదు. ఎందుకంటే తనుపడుకున్న బెర్త్‌మీద కొంత చీకటిగావుంది. తన మొహం ఆమెకు మసక మసకగానే కనిపిస్తుంది. తనుకళ్ళుతెరచినా మూసినా ఆమెకు కనిపించదు. నీలం బల్బుకాంతిలో ఆమె ముఖంమాత్రంతనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఆమెసోగకళ్ళతో ఎంతోస్నేహంగా తనవైపే చూస్తున్నది. కళ్ళతోనే ఏదో

ఆలోచిస్తున్నది. సగంమెలుకువలో సగంకలలో వున్నట్లున్నది. తన హృదయమంతటినీ కళ్ళలోనింపి చూస్తున్నది ఆమెకళ్ళు తనతో నిశ్శబ్దంగా మాటలాడుతున్నాయి ఆమె కూడా తన లాగే ఆలోచిస్తున్నదా? తనను గురించే ఆలోచిస్తోందా? తాను కూడా ఆమెకు చిన్నప్పుడు పిచ్చిక గూళ్ళు కట్టిన నేస్తం లాగా కనిపిస్తున్నాడా? ఈ పరిచయం త్వరలో ముగుస్తుందోమోనని ఆమెకూడా బెంగపడుతున్నదా? కొందరు పరస్పరం అంతత్వరగా ఎందుకు ఆకర్షితులవుతారో తెలీదు. ముక్కు మొహం తెలియక పోయినా మొదటిసారి కలుసుకున్నప్పుడే ఎందుకు ఆకర్షితులవుతారో కారణం తెలీదు.

ఆలోచిస్తున్న కొద్ది కృష్ణమోహన్‌కి గుండె బరువెక్కుతోంది. మళ్ళీ తనపై తనకే చిరాకు కలుగుతోంది -"నీకసలు బుద్ధి లేదు. ఈ కాసేపటిలో ఇంతగా బెంగపడటం ఏమిటి? ఆ అమ్మాయెవరు? నువ్వెవరు? నీకేమైనా జ్ఞానం ఉందా? మరీ ఇంత ఇడియట్ వై పోయావేం" అని తనని తనుచివాట్లు పెట్టుకున్నాడు. "అవును బుద్ధిలేదు, జ్ఞానంలేదు. ఇడియట్‌నే! ఏం చెయ్యను- బెంగపడకుండా ఉండ లేక పోతున్నాను. నా మనస్సు నా హృదయం ఏదీ నా అదుపులో లేవు. నేను నిస్సహాయ స్థితిలో ఉన్నాను. ఈ బెంగ గుండెను తొలిచేస్తున్నట్లుగా వుంటే- నీకేమర్థమవుతుంది." అనితనే సమాధానంచెప్పుకున్నాడు. తలచుకున్న కొలది ఏడుపు కూడా వచ్చేస్తోంది. తనంత ఇడియట్ ఈ భూప్రపంచంలో ఉండడు.

రాజ్యలక్ష్మమ్మగారు కిటికీలోంచి బైటకు చూస్తున్నదల్లా ఒక్కసారి పక్కకు తిరిగేసరికి ప్రమీల గబుక్కున కళ్ళు మూసుకుంది. అమ్మాయి నిద్రపోతున్నదనే నమ్మకం ఆవిడకి

కలిగినట్లుంది. ఆవిడ తనవంకే చూస్తున్నది. తను చీకట్లో ఉన్నందున తనుచూస్తున్న సంగతి ఆవిడకు తెలియదు ఆవిడ ముఖం మాత్రం తనకు కనిపిస్తూనే వుంది. తదేకంగా ఆవిడ తనవంక చూస్తోంది. ఆవిడ చూపులో విపరీతమైన వాత్సల్యం ఆప్యాయత కనిపిస్తున్నాయి. ఇదివరకెవ్వరూ తనవంక అలా చూడలేదు. ఎందుకు ఆవిడ అలాచూస్తుంది? అసలు ఆవిడముందుగా తనని ఎందుకు పలకరించింది? కేవలం తను ఒకసినిమా రచయిత అనా? అయితే ఏ సినిమా రచయిత నయినా ఆవిడ అలాగే పలకరిస్తుందా? రచయితగా తనమీద గౌరవంవల్ల అభిమానంవల్ల పలకరించిందా? తనకంటే గొప్ప రచయిత పరిచయం అయితే ఆవిడ అతన్ని ఇంత ఆప్యాయంగా చూస్తుందా? అసంభవం అని పించింది. తనపట్ల ఆవిడకి ఏదో ప్రత్యేక మయిన భావం ఉన్నది. అది ఏమిటి? ఎందుకు? ఈ ప్రయాణం ముగిసేలోగా లేక ఈ పరిచయం ముగిసేలోగా ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయా?

రెప్పవాల్చకుండా తనవైపే చూస్తున్న ఆవిడ కళ్ళ నుంచి నీరుకారుతోంది. ప్రమీల కొద్దిగా కదలడంతో ఆవిడ కన్నీరు తుడుచుకొని కిటికీవయిపు ముఖం తిప్పుకుంది. మరికాసే పటికి ప్రమీల పూర్తిగా నిద్రలో మునిగిపోయింది కంపార్ట్ మెంటులో బాగా ఉక్కపోస్తున్నది. రాజ్యలక్ష్మమ్మగారు లేచి నిలుచుంది. కృష్ణమోహన్ గబుక్కున కళ్ళుమూసుకున్నాడు. ఆవిడ ఫాన్‌ని అతనికి బాగా తగిలేటట్లు తిప్పి అతడి బెర్త్ కింద సీటుమీద దిండువేసుకొని పడుకుంది.

కృష్ణమోహన్‌కి కొంచెం కొంచెం నిద్రవస్తోంది. నీటి మీది రాతలాగా మనోఫలకంమీద ఆలోచనలు అస్పష్టంగా

వస్తూ చెరిగి పోతున్నాయి. గాలిలో దూదిపింజలలాగా మబ్బు తునకలలాగా మనస్సు అగమ్యంగా.ఎక్కడికో కొట్టుకుపోతు న్నది...ఆవిడ ఎందుకు కన్నీరు పెట్టుకుంది? ... మాటలో కొంత చమత్కారం కొంత కలుపుగోలుతనం ప్రదర్శించిన ఆవిడ సీరియస్ టైపు మనిషి. ఏవో పాత జ్ఞాపకాలతో కన్నీరు పెట్టుకొని వుంటుంది... అంత డబ్బు కలిగీ ఏలోటు లేనట్లు కనిపించే ఆవిడకి కూడా బాధ కలిగించే జ్ఞాపకాలు వున్నాయి కాబోలు ... ఆవిడ అంత శ్రద్ధగా లేచి, తనవేపు ఫాన్ ఎందుకు తిప్పింది?... ఏమిటో అంతా అయోమయంగా వున్నది. ప్రతి చిన్న దాంట్లో తనే అర్థాలు లాగుతున్నాడో లేక ఈ సంఘటనలన్నీ అర్థవంతమైనవేనో?...ఈఅమ్మాయి ప్రమీల, తను...

మనస్సు సొమ్మసిల్లి కలలలోకి వాలిపోతోంది.మద్రాసు బీచ్...ఈస్టమన్ కలర్ మిడ్‌లాంగ్ షాట్...తను, ప్రమీల తడి యిసుక పోగు చేసి పిచ్చుక గూడు కడుతున్నారు. గూడు పైన నెమలి పింఛంలాగా ఒక సరుగుచెట్టు రెమ్మను గుచ్చి, ఎంత బావుందో చూడు అన్నట్టు నవ్వుతోంది.

అద్భుతమైన ఊటీ బొటానికల్ గార్డెన్స్‌దృశ్యం, లాంగ్ షాట్...బ్యాక్‌గ్రవుండ్ మ్యూజిక్ లేదు... నిశ్శబ్దంలో తను ప్రమీల చేయి చేయి పట్టుకొని ఇంకోచేతితో బెలూనుల గుత్తి పట్టుకుని పరిగెత్తుతున్న దృశ్యం- స్లోమోషన్‌లో-ఈదృశ్యం బొటానికల్ గార్డెన్స్ సీనరీ మీద సూపరింపోజ్-- ఓహో ఏం ఫొటోగ్రఫీ! తరువాతిషాట్ తిరువణ్ణామలై దేవాలయ ప్రధాన గోపురం-తను, ప్రమీల లోపలకు వెడుతున్నారు.... కట్- ప్రదక్షిణం చేస్తున్నారు....కట్... పూజారి శఠగోపం

పెట్టి ఉద్ధరిణతో తీరం ఇస్తున్నాడు. పూజారి మొహంక్లోజప్! దీర్ఘ సుమంగళీభవ...పమిట నిండుగా కప్పుకుని సిగ్గుతో తల వంచిన ప్రమీల ముఖం క్లోజప్, నుదుట పెద్ద కుంకుమ బొట్టు దానికింద వీబూది...మళ్ళీ ఊటీ... ఒక గుట్టమీద తివాచీలా దట్టమైన పచ్చిక మీద... చెట్టుకింద ప్రమీల ఒడిలో తలపెట్టు కుని తను. ఆమె మెత్తగా తన తలని నిమురుతోంది... ఇది కలా, నిజమా? నిజంలాగే ఉంది. కాని కళ్ళు తెరిస్తే కలగా కరిగి పోతుందని భయం. కదిలితే ప్రమీల అంతర్ధాన మవు తుందని భయం. కదల కుండానే కళ్ళు సగం మాత్రమే తెరి చాడు... నిజంగానే ఒక చెయ్యి తన తలని నిమురుతున్నది... కాని...కాని...అ చెయ్యి ప్రమీలది కాదు, రాజ్యలక్ష్మమ్మ గారిది. ఆసంగతి తెలియగానే కొద్దిగా ఉలిక్కి పడ్డాడు. ఆమె కంగారుగా కూర్చుని మళ్ళీ నిశ్శబ్దంగా పడుకుంది.

కృష్ణమోహన్‌కి కొంత గాభరాగా, చికాకుగా, అయోమయంగాఅనిపించింది. మనస్సు అల్ల కల్లోలమయింది., ఇదంతా ఏమిటి? అసలు ఈవిడ అభిమానం శ్రుతిమించి రాగానపడుతున్నట్లుందే... అది అభిమాన మేనా? తనకీ ప్రమీలకీ, మధ్య పానకంలో పుడకలా తయారయిందే? తనివి తీరా కాసేపు ప్రమీలముఖాన్ని చూద్దామన్నా వీలు లేకుండా ఈవిడ గుడ్లప్పగించి తననే చూస్తూ కూర్చుంటుందే? తనుగాఢ నిద్రలో ఉన్నాడనే అవిడ అనుకున్నట్లుంది...అలా అనుకోవ డమే మంచిది.

ప్రమీల ప్రశాంతంగా నిద్రపోతోంది. ఆమెకూడా ఈస్ట్ మన్ కలర్‌లో కలలు కంటుందేమో... ఆ కలల్లో హీరో తనేనా...

రాజ్యలక్ష్మమ్మ గారికి నిద్ర పడుతున్నట్లు లేదు. అశాంతిగా అటూఇటూ కదులుతోంది. నెమ్మదిగా లేచి ప్రమీల దగ్గరకు వెళ్ళికూర్చుంది. ఆవిడ ప్రమీలముఖంవంక ఎంతో ఆప్యాయంగా భరించరానంత వాత్సల్యంతో చూస్తోంది. మెల్లగాఆమె తనపై చేయి వేసి నిమిరింది. హృదయంలో పొంగి పొరలే ప్రేమను అణచుకోలేక స్పర్శ వాంఛనుభరించలేక ఆవిడప్రమీల శిరస్సును స్పృశించిందని కృష్ణమోహన్‌కి అనిపించింది. ఆవిడ నెమ్మదిగా వంగి ప్రమీల బుగ్గమీద మెత్తగా,చప్పుడుగాకుండా ముద్దు పెట్టుకుని లేచింది. ప్రమీల గాఢనిద్రలోనే సిగ్గుపడుతూ సన్నగా నవ్వింది. ఆ నవ్వు అర్థమేమిటో కృష్ణమోహన్‌కి తెలిసింది. తానూ నవ్వుకున్నాడు. రాజ్యలక్ష్మమ్మగారు ఆ ఇద్దరినీ ఫూల్స్‌చేసిందికదా అనుకున్నాడు.

రాజ్యలక్ష్మమ్మగారు మళ్ళీ పడుకుంది. ఆవిడ దిగులుకు కారణమేమిటా అనీ, ఆవిడ ప్రవర్తనకు అర్థం ఏమిటా అనీ ఆలోచిస్తూ నిద్రలోకి ఒరిగిపోయాడు కృష్ణమోహన్.

2

కృష్ణమోహన్ నిద్రలేచేసరికి ఉదయం ఆరున్నరయింది. అప్పటికే రాజ్యలక్ష్మమ్మ గారు, ప్రమీల టాయిలెట్ అయి ఫ్రెష్‌గా వున్నారు. నవ్వుతూ "గుడ్‌మార్నింగ్" చెప్పారు.

"బాగా గాఢంగా నిద్రపోయినట్లుందే! కలలో ఏదైనా మంచి కథావస్తువు దొరికిందా?' అని అడిగింది రాజ్యలక్ష్మమ్మ గారు.

"ఏదో కొద్దిగా ముడి పదార్థం దొరికిందండీ, నాసౌండ్ స్లీప్ వల్ల మీకు నిద్రా భంగం కలిగిందా?"

"నీ నిద్ర వల్ల మాకు నిద్రాభంగం దేనికి?"

"సౌండ్ స్లీప్ అంటే సౌండ్‌తో కూడిన స్లీప్ కదండీ—అంటే నేనేమైనాగురక పెట్టానేమోనని..."

రాజ్యలక్ష్మమ్మగారు, ప్రమీల ఇద్దరూనవ్వారు.

"అబ్బె...నువ్వేంగురక పెట్టలేదులే" అంది ఆవిడ.

"నేను గురక పెట్టలేదు అని అంత గట్టిగా చెబుతున్నారంటే మీరు రాత్రంతా నిద్రపోలేదన్నమాట."

"లేదు...అదికాదు... నువ్వు గురక పెడితే నాకు నిద్ర పట్టి వుండేది కాదు. నువ్వు గురక పెట్టలేదు కాబట్టి గాఢంగా నిద్రపోయానన్న మాట"

"సరే ...ఓ అర్ధగంటలో నేను టాయిలెట్లయి వస్తా" అంటూ కృష్ణమోహన్ బ్రష్, పేస్ట్, టవల్, పౌడర్, షేవింగు సెట్ తీసుకుని వెళ్ళాడు. అరగంటలో నున్నగా గడ్డంగీసుకుని టాయిలెట్టయి పండులా వచ్చి కూర్చున్నాడు.

ఏడున్నరకి కోయంబత్తూరు స్టేషను వచ్చింది. కృష్ణమోహన్ రైలు దిగి వెళ్ళి ఇడ్లీలు, వడలు పొట్లాలు కట్టించి తెచ్చాడు. ఫ్లాస్క్‌లో కాఫీ పోయించుకు వచ్చాడు, రెండు డైలీ న్యూస్ పేపర్లు, కొత్త ఫిలిం పత్రిక తెచ్చాడు. వాటర్ బాటిల్ నిండా నీళ్ళు పోయించుకొచ్చాడు. టిఫిన్, కాఫీ ముగించినతరువాత ముగ్గురూ పేపర్లుతిరగేశారు.

సుమారు ఎనిమిది ముప్పావుకి రైలు మెట్టుపాలయం చేరింది. ముగ్గురూ సామాన్లతో సహాదిగారు. తొమ్మిదింబావుకి ఊటీకి వెళ్ళే రైలుంది. ఈ అరగంటలో ఫస్ట్ క్లాస్ వెయి

టింగు రూములో ముగ్గురూ స్నానాలు చేసి బట్టలు మార్చు కున్నారు.

తొమ్మిదింబావుకి మళ్ళీ ఊటీ రైలు ఎక్కారు. కొండల మీదుగా లోయల మధ్యగా రైలు సాగి పోతుంటే కృష్ణ మోహన్, ప్రమీల నీలగిరుల సౌందర్యానికి పరవశిస్తున్నారు. ఇదివరకు ఒకసారి చూసినా ఈ ప్రకృతి మళ్ళీకొత్తగానే కని పిస్తోంది. కృష్ణ మోహన్‌కి రకరకాలఉపమానాలతో ప్రకృతిని వర్ణిస్తోంది. అతడి మనస్సు. ఈ ప్రకృతి నిత్యనూతన వధువు. శైశ వార్ధక్యాల నెరుగని నిత్యాయవ్వన సుందరి. కాలగమనంతో నిమిత్తం లేని నిరంతర నిరవధిక సౌందర్యం ఇది. ఇక్కడఅసలు కాలం ఆగిపోతుంది. ఇక్కడ గడియారాలు పనిచేయవు. ఇక్కడకు వచ్చేవారు కాలెండర్లను తగల బెట్టి రావాలి. సంకు చితమైన లౌకిక వ్యవహారాలన్నింటినీ మాసిన వస్త్రాలవలె విస ర్జించి సుస్నాతులై, పునీతులై రావాలి. మలినమైనఆలోచనలతో ఈ నిర్మల వాతావరణాన్ని కలుషితం చేయకూడదు. సముద్ర మట్టంనుంచి ఏడువేల అడుగులు వచ్చినందుకు మనిషిసంస్కారం అంత ఉన్నతం కావాలి. దేహమంతా చందనం అలుముకున్న ట్లుగా నిలువునా ఈ సౌందర్యంలో మునిగి ఈ నైర్మల్యంతో తడిసి మనిషి వ్యక్తిత్వం పరిమళభరితం కావాలి.

నీలగిరుల అవర్ణనీయ నిసర్గ సౌందర్యస్పర్శతో కృష్ణ మోహన్ అణువణువునా పులకించి పోతున్నాడు. పరవశంతో అతడి మనస్సు సొక్కి సోలిపోతున్నది. వినీలాకాశం క్రింద కనుచూపు మేర వృక్షసంపద తప్ప మరేమీ కనిపించడంలేదు. దూరపుకొండలు నీలంగా కన్పిస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఎక్కడా మట్టికనిపించడంలేదు. పచ్చని తివాచీలా కొండల

మీద అంగుళం ఖాళీలేకుండా దట్టమైన పచ్చిక పరచుకుని ఉంది. లోయల్లో మైళ్ళ తరబడి కాఫీ తోటలు, ఎత్తుగా, నిటారుగా, విచ్చుకత్తుల్లాగా ఆకాశంలోకి దూసుకుపోతున్న యూకలిప్టస్ చెట్లు. తెల్లటి రెక్కల మబ్బులు ఆ చెట్లని దూసుకుపోతున్నాయి. రైలు కొండలమీదుగా పోతుంటే పక్కనున్న లోయల్లోకూడా మబ్బులు విలాసంగా విహరించడం కనిపిస్తోంది. దేవకన్యలు ఈ మబ్బులుగా మారి నీలగిరిలో వ్యాహ్యాళికై వచ్చారేమోననిపించింది.

రైలు శబ్దంతో నిద్రాభంగం కాగా ఇప్పుడే ఆవలిస్తూ బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటున్నట్లుగా వుంది ప్రకృతి. దట్టమైన అడవులను చీల్చుకుంటూ రైలు ముందుకుపోతుంటే మహాద్భుతమయిన ప్రకృతి దృశ్యం తన కళ్ళఎదుట సర్కోరమా ఎఫెక్టుతో గిరగిర తిరుగుతున్నట్టు అనిపించింది కృష్ణ మోహన్‌కి. "ఓహో! సృష్టికర్త ఎంత గొప్ప ఫొటోగ్రాఫర్! ఎంత గొప్ప ఆర్ట్ డైరెక్టర్!" అనుకున్నాడు. ఈ స్పెక్టాక్యులర్ సర్కోరమా ప్రకృతి దృశ్యానికి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ లాగా రైలు పరుగులతో లయ కలుపుతూ, ఉస్తాద్ విలాయత్‌ఖాన్ సితార్‌పై రాగేశ్వరీ రాగం తీన్‌తాల్‌లో ఉధృతంగా వాయిస్తున్న ఝాలా స్టీరియో ఎఫెక్టుతో మనస్సులో వినిపిస్తోంది. ఆ సంగీతం ఈ దృశ్యానికి రన్నింగ్ కామెంటరీ లాగా వుంది.

కృష్ణమోహన్, ప్రమీల కిటికీల దగ్గరగా ఎదురు బొదురుగా కూర్చుని బయటికి చూసున్నారు, మధ్య మధ్య వారి చూపులు కలుస్తున్నాయి. ఈ అనంత గంభీర సౌందర్యంలో, తన మనస్సులో కెరటాల హోరుగా వినిపిస్తున్న రాగేశ్వరీ

ఝుంకార నాదంలో ప్రమీల లీనమైనట్లుగా అనిపించింది అతనికి. అద్భుతమైన నీలగిరి దృశ్యంపై సూపరింపోజ్ చేసిన లలిత మనోహార రాగేశ్వరీ మూర్తిగా ఆమె కనిపించింది.

రాజ్యలక్ష్మమ్మగారు కొంచెం ఎడంగా కూర్చొని చేతిలో మేగజైన్ పట్టుకొని ఆలోచనల లోతుల్లోకి మునిగి పోయారు.

క్రమంగా రైలు వేగం తగ్గింది. ఒక్కసారి రైలు కూత వేయడంతో ముగ్గురూ ఆలోచనల నుంచి తేరుకున్నారు. రైలు కూనూరు స్టేషన్‌లో కొద్ది నిమిషాలు ఆగి మళ్ళీ బయలుదేరింది.

"ఎలా ఉన్నాయి ప్రకృతి దృశ్యాలు? నీ కథకి మరి కాస్త ముడి పదార్థం దొరికిందా?" అని అడిగింది రాజ్య లక్ష్మమ్మగారు.

"ఇవన్నీ అసలు కథకు అలంకారాలుగా పనికొస్తాయి. కాని అసలు కథ దొరకాలిగా!"

"ఇందాక ఏదో దొరికిందన్నావు?"

"అదా...రైలు ఎక్కినప్పటినుంచి జరిగినదంతాకూడా ఉపోద్ఘాతంగా మాత్రమే పనికొస్తుంది. అసలు కథ ఇంకా దొరకలేదు. ఊటీలో వేటాడి పట్టుకోవాలి."

"సరే వేటాడు, నీకు దొరక్కపోతే నేనే ఒక కథ చెబుతాను. పనికొస్తే ఉపయోగించుకో."

"అలాగేనండి...రెండు మూడు రోజుల్లో నాకు ఏ ఐడియా తట్టకపోతే మీ కథ వింటాను. ఎందుకంటే, ప్రధాన కథా భాగం దొరికితే దానికి చిలువలు పలువలు పెట్టి, పిట్ట కథలుచేర్చి, తెలుగు సినిమా కథగా తయారు చేయడానికి

చాలా రోజులు పడుతుంది. సాధ్యమయినంతవరకు ఆ పనంతా ఊటీలోనే పూర్తి చేసుకోవాలనుకుంటున్నాను. అయినా, మీరు చెబితే అది మీ కథ అవుతుంది గానీ, నా కథ ఎలా అవుతుంది? పోనీ కొంత రాయల్టీ మీకూ చెల్లిస్తానులెండి."

"ఫర్వాలేదు-నేను చెప్పినా అది నీ కథే. రాసేది నువ్వు కనుక అది నీ కథే అవుతుంది. అలా కాదంటే అది మన ఇద్దరి కథ అనుకుందాం. రాయల్టీ అక్కరలేదు. కావాలంటే "రాజ్యలక్ష్మమ్మ సౌజన్యంతో" అని రాసుకో."

"మీరు ఎలాచెబితే అలా."

"ఊటీలో మా బంగళా ఉడ్‌లాండ్స్‌కి దగ్గరే. రెండు మూడు ఫర్లాంగులుంటుందేమో. స్టేషన్‌లో దిగిన తర్వాత టాక్సీలో మా బంగళాకి వెడదాం. ఆ టాక్సీలోనే నువ్వు నీ హోటల్‌కి వెళ్ళవచ్చు. వీలయితే రోజూ ఏదో ఒక టైములో కాసేపు వచ్చి చూసి వెడుతూవుండు."

"అలాగేనండి. ఒకవేళ నాకు కథ ఏదైనా దొరికినా, మీరు చెప్పేకథ కూడా వింటాను."

మధ్యాహ్నం ఒంటిగంటన్నరకి రైలు వూటీ చేరింది. ముగ్గురూ దిగారు. ఇద్దరు కూలీలు వచ్చి సామాను దింపి, బయట టాక్సీలో పెట్టారు. ఎటువెళ్ళాలో డ్రైవరుకి చెప్పారు రాజ్యలక్ష్మమ్మగారు.

కొద్ది నిముషాల్లో టాక్సీ 'శాంతి కుటీర్' చేరింది. కారు హారన్ విని బంగాళాలోంచి ఒక నౌకరు వచ్చాడు. అమ్మగారికి దండాలుపెట్టి, సామానులు లోపలకు తీసుకువెళ్ళాడు.

"సాయంత్రం వస్తావా? లేకపోతే ఇవాల్టికి రెస్ట్ తీసుకుంటావా?" అని అడిగింది రాజ్యలక్ష్మమ్మగారు.

"రాత్రంతా తీసుకున్న రెస్టుచాలు. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో వస్తాను."

"తప్పకుండా రండి" అంటె ప్రమీల.

టాక్సీ ఉడ్‌లాండ్స్‌కి దారి తీసింది. ఉడ్‌లాండ్స్‌లో రూమ్ నెంబర్ సెవెంటీన్ తనకోసం ఎదురుచూస్తోంది.

భోజనం చేసిన తర్వాత రూమ్‌లో కిటికీలకు .. తెరలు వేసేశాడు. డిమ్‌లైటు వేసి, నాలుగైదు గులాబీ అగరువత్తులు వెలిగించాడు. రికార్డుప్లేయర్ తీసి సన్నగా విలాయత్‌ఖాన్ రాగేశ్వరి రికార్డు పెట్టుకొని మంచంమీద పడుకున్నాడు. కళ్ళుమూసుకుంటే మనస్సనే వెండి తెరపై నీలగిరుల ప్రకృతి దృశ్యాలు, ప్రమీల ప్రశాంత వదనం, రాత్రి కలలోదృశ్యాలు, రాజ్యలక్ష్మమ్మగారు తన తల నిమరడం. ఆవిడ ప్రమీల చెక్కిలిపై ముద్దుపెట్టుకున్నప్పుడు నిద్రలోనే ఆ అమ్మాయి సిగ్గు పడుతూ నవ్వుకోవడం, టాక్సీ దిగిన తర్వాత తప్పకుండా, రండి అని చెప్పినప్పటి ఆమె కళ్ళు-వరస వరసగా వెంట వెంటనే మాంటేజ్ షాట్స్‌లాగా కనిపించాయి.

3

సాయంత్రం ఐదుగంటలకి, 'శాంతికుటీర్'కు వెళ్ళేసరికి రాజ్యలక్ష్మమ్మగారు, ప్రమీల తనకోసమే ఎదురు చూస్తున్నట్లుగా కనిపించారు. రాజ్యలక్ష్మమ్మగారు ఆప్యాయంగా ఆహ్వానించారు. హాలులోసోఫాలోకూర్చోగానేప్రమీలలోపలకు

వెళ్ళి, ఒక ట్రేలో టీ,బిస్కట్లు తెచ్చి, టీపాయ్ మీద వుంచి 'తీసుకోండి' అంది. టీ సేవించిన తర్వాత రాజ్యలక్ష్మమ్మగారు 'మా ఇల్లు చూస్తావా?' అంటూ అన్నిగదులూ చూపించింది. ఇంటికి ముందూ వెనకా వున్న ఆవరణలో పూల మొక్కలన్నీ చూపించింది. తర్వాత ముగ్గురూ డాబామీదకు వెళ్లారు. బంగళా ఒక గుట్టమీదవున్నందువల్ల డాబా మీద నుంచి ఊరు చాలా భాగం కనిపిస్తూంది.

"నువ్వు ఇక్కడి విశేషాలన్నీ చూడాలంటే రోజూ ఉదయం 11 దాటిన తర్వాత సాయంత్రం ఐదులోపుగా చూడడం మంచిది. పొద్దున్న 11 గంటలదాకా చలి విపరీతంగా వుంటుంది. సాయంత్రం ఐదుదాటితే చలిపెరుగుతుంది. మధ్యాహ్నం బాగా ఎండగా వున్నప్పుడైతే ఉత్సాహంగా వుంటుంది చూడు. ఐదున్నరకే ఎంత చలిగావుందో!"

"అవునండీ...రాతపని రాత్రికి అట్టేపెట్టుకుని పగలు ప్రదేశాలన్నీ చూడాలి. ఈ చుట్టుపక్కల చూడవలసిన ప్రదేశాలు చాలా వున్నాయి కదూ...ఇక్కడన్నీ చూసిన తర్వాత రోజుకో చోటికి వెళ్ళిరావాలి."

"కూనూరు, కోటగిరి వెళ్ళిరావచ్చు. రోజూబస్సులుంటాయి. నువ్వు ఎలాగూ వెడతావు కనుక ప్రమీలను కూడా తీసుకువెళ్ళు. నీకు పుణ్యం వుంటుంది."

"ఏం మీరు చూడరా?"

"నేను అవన్నీ చాలాసార్లు చూసేశాను. ప్రమీల ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. ఏదో బొటానికల్ గార్డెన్స్ దాకా రాగలను గానీ, ప్రతి రోజూ అన్నిప్రదేశాలూ తిరగాలంటే ఈ వయసులో కష్టం. నువ్వు లేకపోతే నేనే

దానివెంటవెళ్ళి చూపించవలసి వచ్చేదనుకో. కాని నువ్వు వున్నావు. కనుక నాకా శ్రమ తప్పింది. రేపు 11 గంటలకి భోజనానికి ఇక్కడికిరా. అసలు రోజూ పగటిపూట మాయింట్లోనే భోజనం చెయ్యొచ్చు."

"అక్కర్లేదండీ! రోజూ హోటల్లో భోజనం చేసేసి వస్తాను."

"రోజూ సంగతి తర్వాత చూద్దాం. ముందు రేపు భోజనానికిరా."

అలాగేనని చెప్పి రూమ్‌కి తిరిగి వచ్చాడు. రాత్రి భోజనం అయిన తర్వాత స్థిమితంగా కూర్చుని, మద్రాసులో తను రైలు ఎక్కినప్పటి నుండి ఇంతవరకు జరిగినదంతా వివరంగా సంభాషణతో సహా రాశాడు. దీనిని ప్రారంభంగా పెట్టుకొని కథను అల్లుకుంటూ పోవాలని అనుకున్నాడు. పెద్దలైటు తీసేసి డిమ్‌లైటువేసుకొని రెండు అగరొత్తులు వెలిగించాడు. అప్పటి తన మూడ్‌కి అనుగుణంగా అలీ అక్బర్ ఖాన్ సరోద్ "యమన్ కళ్యాన్" లాంగ్‌ప్లే రికార్డుపెట్టుకొని నిండా రగ్గు ముసుగుపెట్టి పడుకుని ఆలోచన ప్రారంభించాడు.

తన కథలో హీరోయిన్ ప్రమీలే అయినా అంత కంటే రాజ్యలక్ష్మమ్మగారి పాత్ర ప్రధానంగా తయారయ్యేట్టుంది. రాజ్యలక్ష్మమ్మగారికి సంతానం లేదు. పుట్టిపోయారేమో... ప్రమీల తన కూతురు కాదు కానీ, కూతురు లాంటిదే అని ఆవిడ చెప్పింది. ప్రమీల తల్లిదండ్రులను గురించి, ఆస్తిపాస్తులు వగైరా వివరాలు తెలుసుకోవాలి. ఆమెకు, రాజ్యలక్ష్మమ్మగారికీ మధ్యగల అనుబంధం స్వభావాన్ని తెలుసుకోవాలి. ఆ

వివరాలు ఆధారంగా ఆ రెండు పాత్రలను డెవలప్ చేస్తూ పోవాలి. కథలో కొంత సస్పెన్సుకు కూడా అవకాశం వుంది. రాత్రి రాజ్యలక్ష్మమ్మగారు అలా ఎందుకు ప్రవర్తించింది? తనపట్ల ఆవిడకి అంత అభిమానంగానీ, వాత్సల్యంగానీ మరోభావంగానీ దేనికి?తనకిఆవిడకిఏమిటి సంబంధం?ఆవిడ ఆపుల పోలిక లేవైనా తనలో వున్నాయా? ఈ రహస్యాలన్నీ తెలుసుకోవాలి. కాని, ఎలా తెలుస్తాయి? ఆవిడ చెబితే తప్ప తెలిసే అవకాశంలేదు. ప్రమీల నడిగితే చెబుతుందా? ఆ అమ్మాయికి కూడా పూర్తిగా ఆవిడ జీవిత విశేషాలు తెలిసివుండవు. ఎంత వరకు తెలిస్తే అంతవరకే చెప్పించుకుని మిగతాది ఊహించుకోవాలి. తన సినిమా కథకి సంబంధించినంతవరకు ఆవిడ జీవితాన్ని యథాతథంగా ఎక్కించడం దేనికి? ఆవిడ గత జీవితం ఆవిడ మనస్తత్వం ఏ విధంగా వుండివుంటాయో రచయితగా వూహించి, పాత్రను పోషించవచ్చు. కొన్నిరోజులపాటు అలా వూహాలు అల్లితే, కథకు కావలసిన ప్రధాన భాగం దొరకవచ్చు.

తర్వాత ఐదురోజులు గడిచినా కథకి కావలసిన ఐడియా దొరకలేదు కృష్ణమోహన్‌కి. రోజూ రాజ్యలక్ష్మమ్మగారింటికి వెడుతూనే వున్నాడు. వేట ఎంత వరకు వచ్చిందని ఆవిడ అడుగుతూనే వుంది. ఇంకా ఏం దొరకలేదని తాను చెబుతున్నాడు. అనేక విషయాలు ఆవిడతో మాట్లాడుతున్నాడు. ప్రమీలతో కలిసి రోజూ చూడవలసిన ప్రదేశాలుచూస్తున్నాడు. ఊళ్ళోనే ఎప్పుడైనా కొద్దిదూరం షికారుగా వెళ్ళినప్పుడు రాజ్యలక్ష్మమ్మగారు కూడా వచ్చేది. ఒకరోజు ప్రమీల, తను కూనూరు వెళ్ళి సాయంత్రానికి తిరిగి వచ్చారు. ఇంకో రోజు

కోటగిరికి వెళ్లి వచ్చారు. మరోరోజు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం నాలుగుదాకా బొటానికల్ గార్డెన్స్‌లో గడిపారు. సినిమాతీసే పద్ధతి గురించి, సినిమారంగంలో వాళ్ళదైనందిన జీవితం గురించి ప్రమీల అడుగుతూ వుండేది. తను వివరంగా చెబుతూ వుండేవాడు. ఆమె ఒక చిన్న ప్రశ్న అడిగితే దానికి తను పావుగంటసేపు సమాధానం చెప్పవలసి వచ్చేది. తను చెప్పేవాటిని ఆమె సావధానంగా వినేది. ప్రశ్న అడగడానికి తప్ప పెదవి కదిపేదికాదు. కొన్ని నవలలపైన, కొందరు రచయితలపైన, కొన్ని సిద్ధాంతాలపైన అభిప్రాయాలు అడిగేది. "మీ ఆశయాలేమిటి? భవిష్యత్తులో ఏం సాధించాలనుకుంటున్నారు? ఏం కలలు కంటున్నారు?" అని అడిగేది. తనను గురించి ఏమీ చెప్పేదికాదు. తనను గురించి అడిగేందుకు అవకాశం ఇచ్చేదికాదు ఆమె అడిగినట్లుగా తాను అడగలేకపోయేవాడు ఎందుకో.

ప్రమీలతో గడిపిన ప్రతిక్షణం వాస్తవమే అయినా అదొక మధురస్వప్నంలా అనిపించేది. ఇదంతా నిజమేనా అని మాటిమాటికీ మనస్సు శంకించేది. నిజమేనని ఎంత రూఢిచేసుకున్నా, "ఏమో కలలో అంతా నిజంగానే కనిపిస్తుంది-మెలుకువ వచ్చిన తర్వాత కదా అది అబద్ధమని తెలిసేది?" అనిపించేది. ప్రమీల సాన్నిహిత్యంలాగే ఊటీ ప్రకృతి సౌందర్యం కూడా వాస్తవంలాగా అనిపించడంలేదు. ఇది తన మనస్సు చిత్రించిన రంగురంగుల కల అనిపిస్తోంది. ఈ సుందరమైన ప్రకృతిలో ప్రమీల నడుస్తుంటే నీలగిరి లోయలో విలాసంగా విహరించే మబ్బుకన్నెలాగానే కనిపించేది. పాదాలు నేలమీద ఆనుతున్నాయా లేవా అన్నట్లు, గాలిలో తేలిపోతున్న హంస

త్సూలికలాగా కనిపించేది. ఒకరిపట్ల ఒకరికిగల అభిమానాన్ని మాటల్లో ఎప్పుడూ వ్యక్తం చేసుకోనక పోయినా మానసికంగా ఇద్దరూ చాలా సన్నిహితులైనారు.

రాజ్యలక్ష్మమ్మగారు చెబుతానన్న కథ వినాలని అనిపించేది కృష్ణమోహన్‌కి రోజూ. కాని తను కథ కోసం పూర్తిగా ప్రయత్నించకుండా ఆవిడనుంచి కథను తీసుకోవడం దేనికని వూరుకున్నాడు. అలా ఐదురోజులు గడచిన తర్వాత ఆవిడ కథని వినడానికి నిర్ణయించుకున్నాడు. ఆవిడ చెప్పేకథ వింటే ఏం పోయింది? ఆ కథవిన్న తర్వాత కూడా తన కథాన్వేషణ సాగించ వచ్చు. ఆవిడ కథనే తీసుకోవాలనే ఏముంది? అసలు ఆవిడ చెప్పేకథ తనకి పనికొస్తుందని గ్యారంటీ ఏముంది? పనికొచ్చినాపూర్తిగా పనికి రాకపోవచ్చు. పూర్తిగా పనికొచ్చినా, తను ఇక్కడినుంచి మకాం ఎత్తేసేలోగా అంతకంటే మంచి కథకి ఐడియాదొరకవచ్చు. అందుచేత ఆవిడ చెబుతానన్న కథని ముందు వినేయడం మంచిదనుకున్నాడు;

ఆ రోజు సాయంత్రం షికారుముగించి ప్రమీల వెంట 'శాంతికుటీర్' కువెళ్ళినప్పుడు రాజ్యలక్ష్మమ్మగారితో "ఇవాళ మీరు చెబుతానన్నకథ వింటానండీ" అన్నాడు.

రాజ్యలక్ష్మమ్మగారు నవ్వుతూ "చెప్పడం కాదు రాస్తున్నాను. ఇవాల్టితో పూర్తి అవుతుంది రేపు నువ్వు మామూలుగా వచ్చేవేళకి వస్తే ఇస్తాను. రూమ్‌కి వెళ్ళి తీరుబడిగా చదువుకో" అంది.

"అరె! ఎప్పుడు మొదలు పెట్టారు రాయడం? అప్పుడే పూర్తి కావచ్చిందా?"

"నువ్వు నా కథ కోసం వస్తావని నాకు తెలుసు. అందుకని ఇక్కడికి వచ్చిన రోజే మొదలు పెట్టాను రాయడం. నోటితో చెప్పడం కంటే చిన్న నవలలాగా రాసి ఇస్తే నీకు బాగా ఉపయోగపడుతుందని అలా రాస్తున్నాను."

"నాకు తెలీకుండా నువ్వెప్పుడు రాస్తున్నావు పిన్నీ?" అని అడిగింది ప్రమీల.

"రాత్రిపూట నువ్వు నిద్రపోయిన తర్వాత రాస్తున్నాను లేవే."

"ఒక్కసారి నాకూ ఇవ్వవూ? నేనూ చదువుతాను."

"ఇవాళరాత్రి పూర్తి చేస్తానుగా! రేపు పొద్దున్న మొదలుపెట్టి, కృష్ణమోహన్ వచ్చేలోపుగా చదివేసెయ్యి" అని చెప్పింది ఆవిడ.

తర్వాత కృష్ణమోహన్ మరి కాసేపు కూర్చుని, రాజ్యలక్ష్మమ్మగారు ఇచ్చిన టీ సేవించి, రూమ్‌కి వెళ్ళాడు.

మర్నాడు ఉదయం 11 గంటలకల్లా మళ్ళీ శాంతి కుటీర్‌కు చేరాడు. రాజ్యలక్ష్మమ్మగారు తను రాసిన నవల తీసుకొచ్చి ఇచ్చింది.

"ఇదుగోనోయ్, చూడు నీకు పనికొస్తుందేమో, నేను నీలాగా ఆరితేరిన రచయిత్రిని కాను. భాష బాగా లేకపోవచ్చు. అయినా నీకు భాషతో పనేముంది? కథ కదా కావాల్సింది. అన్నట్లు చెప్పడం మరిచిపోయాను. ఇది అసంపూర్తి కథ. దీనిని ముగించే పని నీది. ఇందులో నేను ఆపుచేసినట్లుగా అలాగే ఉంచితే సినిమాకి పనికిరాదు." అంది ఆవిడ.

"మీరు భలే అదృష్టవంతులండీ! కష్టపడకుండా మంచి కథ దొరికింది మీకు. నిజంగా భలే బావుంది. నవల ముగింపు

కూడా సిన్మాచేస్తే ఏదైనా పత్రికలో సీరియల్‌గా కూడా వేయించవచ్చు. ఇప్పుడొస్తున్న సీరియల్స్ అన్నింటి కంటే బావుంది ఇది" అంది ప్రమీల.

"అవునండీ - ఆ పని చెయ్యరాదూ" అన్నాడు కృష్ణమోహన్

"అది అల్లాగే అంటుంది లేవయ్యా-దాని మాటలకేం. నేను రచయిత్రిని కాదని చెప్పానుగా! నేను రాయగలిగిన కథ, నాకు తెలిసిన కథ ఇదొక్కటే. దీనికి కూడా ముగింపు నాకు తెలీదు. ఏదోరకంగా ముగించడం నాకు ఇష్టంలేదు. ఇది ప్రచురణకోసం రాసింది కాదు. ప్రత్యేకంగా నీ కోసం రాశాను. ఇది నీకు అంకితమైన కథ. నీకథ."

కృష్ణమోహన్ ఒక నిమిషం మాట్లాడ లేకపోయాడు. ఆవిడ తనవైపు, తన కళ్ళలోకి సూటిగా చూస్తోంది. ఆ చూపు భరించలేక తలవంచుకున్నాడు. ఆవిడ మాటలో, చూపులో తనపట్ల విపరీతమైన అభిమానం, ప్రేమ, వాత్సల్యం ఇంకా ఎన్నెన్నో వ్యక్తమవుతున్నాయి. అవి తనను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఆవిడవైపు తాను విపరీతంగా ఆకర్షితు డవుతున్నాడు. తన శరీరం స్వాధీనం తప్పుతున్నట్లుగా అని పిస్తుంది. లోలోపలనుంచి ఏడుపు పెళ్ళగించుకుని వస్తున్నట్లుగా అనిపిస్తుంది. కంఠం పూడుకుపోతుంది. ఏకాంతంగా, నిశ్శ బ్దంలో ఆవిడ ఒడిలో తల పెట్టుకొని కన్నీరు కార్చాలనీ, ఆవిడ తనను లాలించాలనీ, తనకు జోలపాడాలనీ అనిపిస్తుంది. తనను గురించి ఈ క్షణంలో ఆవిడ కూడా అలాగే అనుకుం టున్నదని అనిపించింది. ప్రమీల అక్కడ లేకపోతే ఆవిడ తనని ఒడిలోకి తీసుకునేదని అనిపించింది.

"సాయంత్రంలోగా చదివేసి తీసుకువస్తానండి" అన్నాడు బలవంతంగా గొంతు పెగుల్చుకొని. తన మనసులోని సంచలనాన్ని ఆవిడ, ప్రమీల కనిపెట్టలేకుండా, మామూలుగా మాట్లాడాలని ప్రయత్నించాడు. కాని తన సంగతి ఆవిడ గమనించినట్లే అనిపించింది.

"తీసుకురావడం దేనికి? నేనేం చేసుకుంటాను అది? నీకోసమే రాశానని చెప్పానుగా. నా జ్ఞాపకార్థం నీదగ్గరే వుంచుకో" అంది ఆవిడ.

హోటల్‌కి తిరిగివస్తూ తనలో కలిగిన సంచలనాన్ని గురించే ఆలోచించాడు. ఇదివరకు ఏ స్త్రీని చూసినప్పుడూ తనలో అటువంటి అలజడి కలుగలేదు. ఈవిడ ఎవరు? ఎందుకిలా ఆకర్షిస్తోంది. ఇంతటి సౌజన్యమూర్తిని తను ఎప్పుడూ చూడలేదు. ఇంత మంచి ఆవిడ ప్రపంచంలో లేదని అనిపిస్తుంది. ఇంత గొప్ప అందం, తేజస్సు, ప్రశాంతత కూడా తానెప్పుడూ చూడలేదు. ఈవిడ పట్ల తనకు కలుగుతున్న ఇంత బలమైన ప్రేమ అప్పుడప్పుడూ తన అమ్మమీద కలుగుతూ వుంటుంది. అలా ప్రేమ పొంగివచ్చినప్పుడు ఇప్పటికీ ఇంత వయస్సులో కూడా తను అమ్మ ఒళ్లో తలపెట్టుకు పడుకుంటాడు. అమ్మ చేత అన్నంముద్దలు పెట్టించుకు తింటాడు. "ఏమిట్రా రోజు రోజుకూ పసిపిల్లాడివై పోతున్నావు? ఊరికే గారాలు పోతావు. అన్నం కలుపుకొని తినలేవుట్రా?" అని అమ్మ విసుక్కుంటు నట్లు నటిస్తుంది కాని, తనకు ముద్దలు పెట్టడం అమ్మకి ఇష్టమే! ఆ సంగతి తనకి బాగా తెలుసు. అమ్మకి తను ఒక్కడే కొడుకు. అమ్మ ప్రేమ అంతా తనదే. అలా తలుచుకుంటే తనకెంతో సంతోషంగా, తృప్తిగా, గర్వంగా వుంటుంది.

అమ్మ ప్రేమను తను ఇంకెవ్వరితోనూ పంచుకోలేడు. తనకెవ రైనా తోబుట్టువులుంటే వాళ్ళని అమ్మదగ్గర చేరకుండా పోట్లాడేవాడేమో.

ఈ రాజ్యలక్ష్మమ్మగారు అమ్మలాగానే వుందికాని, అమ్మ కంటే ఎక్కువగా ఆకర్షిస్తోంది. అమ్మదగ్గర చిన్నప్ప ట్నించి పెరగడం వల్ల, అమ్మమీద ప్రేమ, బెంగ కలగడం సహజమే. కాని మొన్నటి వరకు ముక్కూ మొహం తెలీని ఈవిడమీద తనకెందుకు బెంగ కలుగుతుంది! పూర్వజన్మాను బంధం లాంటి దేదైనావుందేమో? సినిమాల్లో ఎవరైనా పూర్వ జన్మ గీర్వజన్మ అంటే స్టుపిడ్, నాన్సెన్స్, సెంటిమెంటల్ స్టఫ్ అని తను ఏకిపారేస్తాడు. ఇప్పుడు 'ఏమో అటువంటివి వున్నాయేమో' అని అనుమానం కలుగుతోంది. పూర్వజన్మ అనేదేదీ లేకపోతే తనలోని అలజడికి కారణం ఏమిటో ఎవరైనా గొప్ప మనస్తత్వ శాస్త్రజ్ఞులు చెప్పాలి.

రూములో పడుకుని, రాజ్యలక్ష్మమ్మగారి అనామిక, అసంపూర్తి నవల తీశాడు చదవడానికి.

4

పాతికేళ్ళ క్రిందటి కథ. కథాస్థలం బెంగుళూరులో మల్లేశ్వరం, ఓ వీధిలో ఓ చిన్న అందమైన బంగాళా. అందులో చిలకా గోరింకల్లాగా ఓ అమ్మాయి, ఓ అబ్బాయి కాపరం చేస్తూవుండేవారు. ఆమె వయస్సు సుమారు ఇరవై రెండు. అతని వయస్సు ఇరవై ఏడు. వాళ్ళకి ముచ్చటైన చిన్నకారు కూడా వుండేది. అతను ఓ కంపెనీ బ్రాంచి ఆఫీ

సుకు మేనేజర్‌గా వుండేవాడు. జీతం అతనికి ఒక లెక్కలోది కాదు. అతను బాగా ఆస్తిపరుడు. పిత్రార్జితం లక్షలు వుంది. తూర్పుగోదావరి జిల్లాలో పొలాలు, కొబ్బరితోటలు యాభై ఎకరాలు పైగా వున్నాయి.

రోజూ ఆఫీసు నుంచి రాగానే దంపతులిద్దరూ కారులో షికారుకో, సినిమాకో వెళ్ళేవారు. ఆ అమ్మాయి పేరు లక్ష్మీరాజ్యం. అతని పేరు దుర్గాప్రసాద్. అతను ఆమెను 'లక్ష్మి' అని పిలిచేవాడు. డబ్బుగలవాళ్ళమనే డాబూ దర్పం ఇద్దరికీ లేవు. లక్షాధికారులతోనూ, పనిమనుషులతోనూ ఒకే విధంగా మాట్లాడేవారు. డబ్బుగల వాళ్ళకి ప్రత్యేక మర్యాదలు చేసేవాళ్ళు కాదు. డబ్బులేని వాళ్ళని తక్కువగా చూసేవాళ్ళు కాదు. అందరితోనూ మర్యాదగా, చనువుగా, సహజంగా మాట్లాడేవాళ్ళు. తమని కూడా ఇతరులు అలాగే చూడాలని అనుకునేవారు. డబ్బునిబట్టి తమను ఇతరులెవరైనా ప్రత్యేకమైన గౌరవంతో చూస్తే చిరాకుపడేవాళ్ళు. డబ్బును దృష్టిలో పెట్టుకోకుండా కేవలం స్నేహంకోసం మాట్లాడే వాళ్ళంటే వాళ్ళకు ఇష్టం.

ఆ వీధిలో అందరికంటే డబ్బు గలవాళ్ళు వాళ్ళే. ఆ వీధిలో అన్నిటి కంటే అందమైన ఇల్లు వాళ్ళదే. చీకూ చింతా లేకుండా అందరికంటే సంతోషంగాజీవిస్తున్నదీ వాళ్ళే. ఆ వీధిలో పెద్ద మేడలు కూడా వున్నా, అవన్నీ మధ్యతరగతి వాళ్ళకి అద్దెకివ్వబడినవే. వీధిలో దాదాపు అందరూ మధ్య తరగతి వాళ్ళు. బొటాబొటీ నెలజీతాలమీద ఆధారపడి బ్రతుకుతున్నవాళ్ళూ. దుర్గాప్రసాద్ ఉదయం తొమ్మిది గంటలకు వెళ్ళి, సాయంత్రం ఐదుదాటిన తర్వాత వచ్చేవాడు.

అందుచేత అతడికి వీధిలో ఎవరితో ఆట్టే పరిచయాలు లేవు. అతనేకాదు-ఆ వీధిలో మగవాళ్ళెవరికీ ఒకళ్ళతో ఒకళ్ళకి పరిచయాలు లేవు. అందరూ పగలంతా ఆఫీసుల్లోనే వుంటారు కదా మరి. ఆడవాళ్ళకి మాత్రం వీధి ఈ చివరినుంచి ఆ చివరి దాకా ఒకళ్ళతో ఒకళ్ళకి పరిచయాలున్నాయి. తమిళులు, కన్నడంవాళ్ళు, తెలుగువాళ్ళు, కొందరు మళయాళం వాళ్ళు కూడా వున్నారు. భర్తలు ఆఫీసులకెళ్ళగానే ముగ్గురు నలుగురు ఆడవాళ్ళు కలిసి ఏ గుడికో, మార్నింగ్ షో సినిమాకో మాట్నీ సినిమాకో పోతుండేవారు. మధ్యాహ్నం పూట ఎవరింటిలోనో చెట్టుకింద గచ్చుమీద పచ్చీసు ఆడుతూ కూర్చునేవారు. ఇరుగమ్మమీద, పొరుగమ్మమీద వ్యాఖ్యానాలు చేసుకునేందుకు ఆదే వారికి అనుకూలమైన సమయం. ముసలాళ్ళకే కాదు-కొత్తగా కాపరానికొచ్చిన అమ్మాయిలకి కూడా ఇతరులను ఆక్షేపిస్తూ, ఆడిపోసుకుంటూ, మూతి మూడు వంకర్లు తిప్పుకుంటూ మాట్లాడుకోవడం ముఖ్యమైన హాబీగా వుండేది.

పచ్చీసు మీదకంటే ఈ కబుర్లమీద వాళ్ళకి ఎక్కువ ఆసక్తి వుండేది. పచ్చీసేమిటి-కబుర్లమీద వున్న ఆసక్తి సినిమాలమీద, నవలలమీద, అసలు ప్రపంచంలో మరిదేనిమీదా వుండేదికాదు. కబుర్లకోసం సమావేశం కావడానికి పచ్చీసు ఒక నెపం మాత్రమే. తెల్లారి లేచినప్పటి నుంచి భర్త ఎప్పుడు కొంపలోంచి పోతాడా, ఎప్పుడు పచ్చీసు మొదలెడదామా అని చూస్తూ వుండేది ప్రతి ఆడదీ. ఒకళ్ళని ఆక్షేపించవచ్చు, మరొకళ్ళని ఆక్షేపించకూడదు అన్న పక్షపాతం, విచక్షణ వాళ్ళకిలేదు. ఎవరికీ ఎవరిమీద ప్రత్యేకాభిమానం గానీ, ప్రత్యేక

మైన ఈర్ష్యాద్వేషాలు గానీ లేవు. అందరూ నిష్పక్షపాతంగా అందరినీ చాటుగా వంకలు పెడుతుంటారు. ప్రతి ఒక్కరూ ప్రతిఒక్కరి గురించి వంకరగా మాట్లాడుతూ వుంటారు. ఒకరికొకరు తీసిపోకుండా అందరూ పుకార్లు పుట్టిస్తూ, ప్రచారంచేస్తూ వుంటారు. ఉదయం వీధికి ఈ చివర ప్రారంభమైన గుసగుస సాయంత్రం చీకటిపడేలోపుగా అంచెలంచెలుగా ఆ చివరికి పాకేది. ఎవరైనా ఒక అమ్మాయి స్నానం చేసి, కొత్త శుభ్రమైన చీరకట్టుకుని, పౌడరు రాసుకుని కనిపిస్తే "ఇంత షోకు చేసింది. ఏమిటో విశేషం?" అని వ్యాఖ్యానించేవాళ్లు. మాసిన చీరకట్టుకుని కనిపిస్తే "ఏంటి ఈవిడ ఇవాళ మరీ అశోకవనంలో సీతలావుంది? ఏం కష్టం వచ్చిందో?" అనుకునేవాళ్ళు. పచ్చీసు ఆడే నలుగురిలో ఒకావిడ కూరలో తిరగమోత పెట్టి రావడానికి వెడితే మిగిలిన ముగ్గురూ ఆవిడ మీద చెప్పుకొనేవారు. ఆవిడ వచ్చి, ఇంకో ఆవిడకు కుంపటిమీద నుంచి పప్పుగిన్నె దింపిరావడానికి వెడితే ఈ ముగ్గురూ మళ్ళీ ఆవిడమీద గుసగుసలాడేవారు. ఇలా ప్రతి ముగ్గురూ నాలుగో ఆవిడ మీద గుసగుసలు చెప్పుకొనేవారు.

ఈ పచ్చీసుమీద, పోసుకోలు కబుర్లమీద చెవులు కొరుక్కోవడం మీద ఆసక్తిలేని అమ్మాయిలు ఆ వీధిలో ఇద్దరే వున్నారు. ఒకమ్మాయి లక్ష్మీరాజ్యం. మరొకమ్మాయి ఆమె ఎదురింట్లో కాపరం వున్న శివకామసుందరి. ఆమెను అందరూ సుందరి అనేవారు. ఆమె భర్తపేరు రామచంద్రరావు అతను ఒక ప్రైవేట్ కంపెనీలో స్టోర్‌కీపర్‌గా పని చేసేవాడు. నెలకో వందరూపాయలు జీతం. సుందరికూడా అదే ఆఫీసులో టైపిస్టుగా పని చేసేది. జీతం ఓడెబ్బయి రూపా

యలు వచ్చేది. అతను గ్రాడ్యుయేట్. ఆమె మెట్రిక్ పాసై, షైపు నేర్చుకుంది. అతను తన తల్లి దండ్రులకి నెల కోముప్పయ్ పంపేవాడు. ఆమె తన తల్లిదండ్రులకి ఓ పాతిక పంపేది. మిగిలిన డబ్బుతోనే సరిపెట్టుకునేవారు. అయినా మరీ నిరుపేదల్లాగా వుండేవారు కాదు. శుభ్రంగా, ఉత్సాహంగా ఉల్లాసంగా వుండేవారు. అప్పటికింకా వాళ్ళకి పిల్లల్లేరు. పాతికేళ్ళ క్రితం బెంగుళూరులో మొగుడూ పెళ్ళాం వందా, నూటపాతిక రూపాయల్లో బాగానే బతక గలిగేవారు. వాళ్ళ ఇద్దరి కుటుంబాలు పేద కుటుంబాలు కావడంవల్ల, వాళ్ళకి సహాయం చేయడం కోసమే సుందరి కూడా ఉద్యోగం చేయాల్సి వచ్చింది. ఆ వీధిలో పెళ్ళయి, ఉద్యోగం చేస్తున్న అమ్మాయి సుందరి ఒక్కతే. సుందరి, లక్ష్మిరాజ్యం ఇంచుమించు ఒక ఈడువాళ్ళే. దుర్గాప్రసాద్, రామచంద్రరావులు కూడా దాదాపు ఒక ఈడువాళ్ళే. ఈ రెండు జంటల స్వభావాలు ఒకటే. రామచంద్రరావు, సుందరి కూడా కలవారితోనూ, లేనివారితోనూ, అధికారులతోనూ, చప్రాసీలతోనూ ఒకేవిధంగా సరళంగా, సహజంగా మాట్లాడే వారు రామచంద్రరావు ఉదయం తొమ్మిదికల్లా ఆఫీసుకు వెళ్ళిపోయేవాడు. భోజనం చేసి మళ్ళీ సాయంత్రం ఆరున్నర దాటిన తర్వాత వచ్చేవాడు. సుందరి 11 గంటలకు వెళ్ళి సాయంత్రం ఐదింటికే తిరిగివచ్చేది.

భర్తలు ఆఫీసులకి వెళ్ళగానే లక్ష్మిరాజ్యం, సుందరి వీళ్ళింట్లోనో, వాళ్ళింట్లోనో చేరి కబుర్లు చెప్పుకునేవారు. సాధారణంగా లక్ష్మిరాజ్యమే సుందరియింటికివచ్చికూర్చునేది మళ్ళీ సాయంత్రం ఐదింటికి సుందరిఆఫీసునుంచిరాగానే లక్ష్మి

రాజ్యం వెళ్ళి కూర్చునేది. సుందరి వంటచేస్తుంటే పక్కనకూర్చుని అవీఇవీఅందిస్తూ కబుర్లు చెప్పేది. లక్ష్మికి తన ఇంట్లో వంటపని లేదు. వంటమనిషివుంది. అయినా ఆమె సుందరికి వంటపనిలో సహాయం చేస్తూ వుండేది. వద్దని ఎంత చెప్పినా వినిపించుకోకుండా బలవంతంగా చొరబడి మధ్యమధ్య తనే వంటచేస్తూ వుండేది. ఇంట్లో వంటచెయ్యకపోయినా చిన్నప్పుడు పుట్టింట్లో వంట బాగా అలవాటైనందువల్ల లక్ష్మి అద్భుతంగా వంట చేసేది.

"అంత డబ్బుగలదానివి నా ఇంటికి వచ్చి వంట చేసి పెట్టడం నీకేం ఖర్మ" అనేది సుందరి

"అదుగో ఆ మాటే అనవద్దని నీకు కొన్ని వందలసార్లు చెప్పాను. నాకు డబ్బుందో లేదో నీకు దేనికి? స్నేహానికి డబ్బుతో సంబంధం దేనికి? స్నేహం కావాలనుకున్నప్పుడు ఒకళ్ళకొకళ్ళు ఏపని చేసి పెట్టినా తప్పులేదు. కావాలంటే నీకు తీరిక వుంటే నువ్వు ఎప్పుడయినా మా యింటికి వచ్చి వండిపెట్టు. నేనేం అభ్యంతర పెట్టను" అనేది లక్ష్మి.

అలాగే ఎప్పుడయినా ఆదివారంనాడు సుందరి వెళ్ళి లక్ష్మికి వంట చేసిపెట్టేది. ఆ రోజు వంటమనిషిని రావద్దని చెప్పేది లక్ష్మి. ఇద్దరూ కలిసి రకరకాల వంటకాల్లో కొత్త కొత్త ప్రయోగాలు చేసేవారు. అలా ఉమ్మడి వంటచేసిన రోజున రామచంద్రరావు కూడా దుర్గాప్రసాద్ ఇంటికి భోజనానికి వచ్చేవాడు. రెండు జంటలూ కలిసి భోజనం చేసేవారు ఒకొక్కప్పుడు ఉమ్మడి వంట సుందరి ఇంట్లో జరిగితే వాళ్ళింట్లోనే రెండుజంటలూ భోజనం చేసేవారు. సుందరీవాళ్ళింట్లో భోజనానికి వెళ్ళేముందు లక్ష్మి తనభర్తని హెచ్చరించేది.

"అక్కడ వేపుడు కూరలుండవు. కోరివికారం, గోంగూర పచ్చడి వేసుకుని తినాల్సిందే" అని. సుందరి వాళ్ళింట్లో పచ్చళ్ళని జ్ఞాపకం చేసుకొంటూనే దుర్గాప్రసాద్‌కి నోరూరేది. వంటమనిషి చేసి వంటతో బోరుకొట్టేసిన అతనికి సుందరీ వాళ్ళింట్లో భోజనం మహారుచిగా వుండేది. మధ్య మధ్య "నోరు చచ్చినట్టుంది- మీ ఫ్రెండునడిగి ఏదైనా పచ్చడి తెచ్చిపెడుదూ" అని అడుగుతూ వుండేవాడు.

రామచంద్రరావు ఎప్పుడయినా ఆఫీసు పనిమీద మద్రాసు హెడ్ ఆఫీసుకు వెళ్ళివస్తూ వుండేవాడు. అతను వూళ్ళోలేని రెండు మూడు రోజులూ సుందరికి తోడుగా వాళ్ళింట్లోనే పడుకొనేది లక్ష్మి. అటువంటప్పుడు అర్ధరాత్రి దాటి పోయేవరకు కబుర్లు చెప్పుకునేవారు. ఎంతసేపు మాట్లాడుకున్నా ఇంకా మాట్లాడవలసినవి చాలా వున్నాయని అనిపించేది వాళ్ళకి. రోజు రోజుకీ ఒకరిపై ఒకరికి ఆపేక్ష పెరిగిపోతూ ఉండేది. సుందరితో మాట్లాడుతుంటే లక్ష్మికి తన పుట్టింటివాళ్ళతో మాట్లాడుతున్నట్లనిపించేది. లక్ష్మి పుట్టింటివాళ్ళూ పేదవాళ్ళే. అందుకే ఆమెకు సుందరి తన తోబుట్టువులాగా కనిపించేది. లక్ష్మినిచూస్తే సుందరికి అలాగే అనిపించేది. కాని లక్ష్మి డబ్బున్న ఇల్లాలు ఆమె తన ఇంటికి ఎన్నిసార్లు వచ్చినా ఫర్వాలేదు. కాని తను పదేపదే ఆమె ఇంటికి వెడితే వీధిలో అందరూ ఆక్షేపణగా చూస్తారేమో అనే అనుమానం, బెరుకు సుందరి మనస్సులో అతి సూక్ష్మంగా వున్నాయి. అయితే వాటిని ఆమె ఎప్పుడూ వ్యక్తం చేయు లేదు. తను వాళ్ళింటికి తరచుగా వెళ్ళకుండా లక్ష్మి తన

ఇంటికి వచ్చేటట్లు చేసేది. సుందరిలో ఈ బెరుకు వున్నట్లు లక్ష్మి ఎప్పుడూ అనుమానించలేదు. ఇతరులు ఏమనుకుంటారోనన్న ఆలోచన ఆమె కెప్పుడూ వచ్చేదికాదు. ఏమైనా అనుకున్నా అంతగా పట్టించుకునే స్వభావం కాదు ఆమెది.

సాయంత్రం సుందరి ఆఫీసునుంచి ఎప్పుడు తిరిగొస్తుందా అని పగలంతా ఎదురుచూసేది లక్ష్మి. తన భర్త కోసంకూడా అంతగా ఎదురు చూసేదికాదు. కిటికీ దగ్గర కూర్చుని చూస్తూ సుందరి రాగానే బెంగపెట్టుకున్నట్లుగా పరుగెత్తుకు వెళ్ళేది. సుందరి భర్త ఆఫీసునుంచి వచ్చేదాకా అక్కడే కూర్చునేది. ఈలోగా తన భర్త యింటికి తిరిగొచ్చినా కదిలేది కాదు. తను ఇంటికి వచ్చే సమయానికి లక్ష్మి సుందరీవాళ్ళింట్లో వుంటుందని దుర్గాప్రసాద్‌కు తెలుసు. అందుకని తను వచ్చానని ఆమెకు తెలియడంకోసం అతను కారు హారన్ కొట్టేవాడు. లక్ష్మి ఒక్కసారి బైటికొచ్చి "ఇదుగో ఒక్క నిముషంలో వచ్చేస్తున్నా! ఈలోగా మీరు కారు గారేజీలో పెట్టేయండి" అని చెప్పి మళ్ళీ వెళ్ళి ఇంకో అరగంట సుందరితో బాతాఖానీ కొట్టేది. "ఇంటికి రాగానే నువ్వు ఎదురుగావచ్చి కాఫీ ఇవ్వకపోతే ఆయనకి కోపం రాదూ? అస్తమానం నాతో బాంతాఖానీ కొడుతున్నావని విసుక్కోకరూ?" అని సుందరి అడిగితే "అబ్బే ఆయన అలా అనుకునే రకంకాదు. మన ఇద్దరి సంగతి ఆయనకి బాగా తెలుసు. మనం భార్యాభర్తలకంటే ఆత్మీయులమని ఆయనకి తెలుసు. నేను వెళ్ళేలోగా వంటావిడే కాఫీ ఇచ్చేస్తుంది ఆయనకి" అని చెప్పేది. రామచంద్రరావు ఆఫీసునుంచి తిరిగి రాగానే లక్ష్మి అయిష్టంగానే అక్కడినుంచి కదిలి ఇంటికి

వచ్చేవి. రామచంద్రరావు వచ్చాడా లేదా అని దుర్గాప్రసాద్ మధ్య మధ్య కిటికీలోంచి తొంగిచూస్తూ వుండేవాడు. రామచంద్రరావు తిరిగి రాగానే "హమ్మయ్య రక్షించాడు. ఆయనగారు వస్తేగాని ఈవిడగారు అక్కడినించి కదిలిగాదు" అనుకునేవాడు.

"రోజూ చెప్పుకునేందుకు అన్ని కబుర్లు ఎక్కడినుంచి వస్తాయి మీకు? ఊట లాగా అనంతంగా వూరుతుంటాయా ఏమిటి?" అనేవాడు దుర్గాప్రసాద్ లక్ష్మితో.

"పోదురూ... మేం ఆడవాళ్ళం ఏవేవో మాట్లాడుకుంటాం అవన్నీ మీకు దేనికి? మా చెల్లెళ్ళో అక్కయ్యలో ఇంట్లో వుంటే అస్తమానం మాట్లాడుకోమూ? ఇంకా మాట్లాడేందుకు ఏమీ లేదని మానేసి నోరుమూసుకుంటామా? మాట్లాడుతుంటే అలా ఏవో కబుర్లు వుంటూనే-వుంటాయి. ఎన్ని కబుర్లయినా ఒక్క సుందరితోనేగా, మిగతా వాళ్ళతో మాట్లాడుతున్నానా?" అనేది లక్ష్మి.

లక్ష్మికి తనకంటే సుందరే ఎక్కువై పోయిందని అతను ఎప్పుడూ కించిత్తుకూడా బాధపడలేదు కాని, ఒకరిపై ఒకరు మరీ అంత మమకారం పెంచుకుంటే ఎప్పుడయినా విడిపోవలసివస్తే చాలా బాధపడవలసి వస్తుందని అనుకునేవాడు. ఒకటి రెండుసార్లు ఆ విషయం జ్ఞాపకంచేసి, నెమ్మదిగానే ఆమెని హెచ్చరించాడుకూడా. అయినా ఆమె ఆ మాటలను అంతగా పట్టించుకోలేదు. అదీగాక, సుందరిపై లక్ష్మికి వున్నంత వెర్రి అభిమానం, ప్రేమ, మమకారం సుందరికి లక్ష్మిపై లేవనీ, అస్తమానం సుందరికోసం లక్ష్మి కలవరించినట్లుగా లక్ష్మి కోసం

సుందరి కలవరించదనీ, లక్ష్మికి సుందరిపైన మరీ మోతాదు మించిన పిచ్చిప్రేమ వున్నదనీ, అందుచేత ఒకవేళ వారి దారులు వేరుకావడం జరిగితే లక్ష్మి బాధపడినంతగా సుందరి బాధపడదనీ అనుకునేవాడు అతను.

"త్వరగా ఒక పిల్లాడిని కని నాకిచ్చెయ్యి సుందరీ" అంటూ వుండేది లక్ష్మి ఎప్పుడూ.

"పిల్లలంటే అంతమోజు వున్నదానివి నువ్వే కన వచ్చుగా. నీకోసం నేను కనియివ్వడం ఏమిటి?" అని నవ్వేది సుందరి.

"నవ్వులాటకాదు సుందరీ. నాకేమిటో పిల్లల్ని కనా లనిపించదు. నాకు పుట్టే పిల్లలమీద అంత ఇంట్రెస్టులేదు. నువ్వు పిల్లల్నికంటే వాళ్ళని పెంచాలని అనిపిస్తుంది. వాళ్ళని నా దగ్గరే పడుకోబెట్టుకోవాలనీ, వాళ్ళకి లాలి పాడాలనీ, నీళ్ళుపోసి, పౌడరువేసి, బట్టలు వేయాలనీ, పాలు పట్టాలనీ, అనిపిస్తుంది. నాకు పిల్లలు పుట్టాలనీ, ఈ పను లన్నీ నా పిల్లలకే చేసుకోవాలనీ నాకు అంతగా అనిపించదు ఎందుకో. ఈ మనస్తత్వం నీకు అర్థం కాదేమో. బహుశా ఎవరికీ అర్థంకాదేమో" అనేది లక్ష్మి. అలా మాట్లాడుతున్నప్పుడు ఆమె ముఖం గంభీరంగా వుండేది. ఆమె కంఠంలో భావోద్వేగం స్పందించేది. సుందరికి పుట్టిన పిల్లలకు తాను లాలిపాటపాడుతున్నట్లు ఆమె వూహించు కునే వూహాలన్నీ ఆమె కళ్ళలో కనిపించేవి. ఆ కళ్ళలోని వూహాలను చూసి సుందరి కళ్ళు చెమ్మగిల్లేవి. ఆ సమయంలో లక్ష్మి బుగ్గలమీద ముద్దు పెట్టుకోవాలనిపించేది సుందరికి. కాని అలా చేసేదికాదు. అయినా ఆమెకు అలా అనిపించినట్లు

ఆమె చూపును బట్టి లక్ష్మికి తెలిసేది. తమ ఇద్దరికీ ఒకరిపై ఒకరికి ఎంత ప్రేమ వున్నదో ఇద్దరికీ తెలుసు.

"నీ మనస్తత్వం నేను అర్థం చేసుకోగలను లక్ష్మి. కాని నీకు పిల్లలు పుట్టేవరకే అలా అన్పిస్తుంది. నిజంగా పిల్లలు పుట్టిన తర్వాత వారిమీద నీకు తప్పకుండా మమకారం ఏర్పడుతుంది. అప్పుడు నాకు పిల్లలు పుట్టినా, నాపిల్లలకంటే నీ పిల్లలమీదే నీకు ఎక్కువ మమకారం ఉంటుంది. అది సహజం. ఎవరికయినా అలాగే వుంటుంది. మాతృహృదయం అంటే అదేగామరి" అనేది సుందరి.

లక్ష్మి బాధగా మొహం పెట్టేది. "ఏమో నువ్వు చెప్పింది నిజమేమో. నాకు పిల్లలు పుట్టిన తర్వాత అలాగే మారిపోతానేమో! అందుకే నాకు పిల్లలు వద్దనిపిస్తుంది. నీ పిల్లలకంటే నా పిల్లలపై ఎక్కువ మమకారం వుండడంనాకు ఇష్టం లేదు" అనేది.

"ఛీ! ఛీ! అలా అనుకోకూడదు. అయినా పిల్లలు మనం కావాలనుకుంటే పుడతారా? వద్దనుకుంటే మానేస్తారా? దేవుడు ఎలా రాసిపెడితే అలా జరుగుతుంది. నీకేం, నువ్వు డబ్బుగలదానివి. ఎంతమందినన్నా కనవచ్చు. చేసేందుకు నౌకర్లూ, చాకర్లూ వుంటారు. బాదరబందీ ఏమీ వుండదు. అదే నాకయితే ఎంత అవస్థో చూడు. ముందు వుద్యోగం మానెయ్యాల్సి వస్తుంది. ఉద్యోగం మానేస్తే ఆదాయం తగ్గుతుంది. పిల్లలవల్ల ఖర్చు పెరుగుతుంది. మా వాళ్ళకు డబ్బు పంపేందుకు వీలుండదు. పంపకపోతే వాళ్ళకి ఇబ్బందిగా వుంటుంది."

"అదేమిటి సుందరీ అలా అంటావు? నేనేమైపోయా ననుకుంటున్నావు? పిల్లల్ని కని నిన్ను పెంచమన్నానా? నాకు ఇచ్చేయ్యమనేకదా చెబుతున్నది? నువ్వు ఉద్యోగం మానెయ్యటం దేనికి? నీ పిల్లల్ని చూసేందుకు నేను లేనూ?"

"సరేలే-పిల్లలు పుట్టినప్పటి సంగతికదా-ఇప్పట్నుంచీ దేనికి ఆచర్చ? ఎన్ని సమస్యలున్నా, ఇబ్బందులున్నా, వద్దనుకున్నా ఛాసిపెట్టి వుంటే పిల్లలు పుట్టక మానరు. నువ్వు వద్దనుకున్నా నాకంటే ముందు నీకే పుట్టొచ్చు."

5

సుందరి అన్నట్లుగానే ఆమెకంటే ముందు లక్ష్మి గర్భవతి అయింది. అందుకు లక్ష్మి తప్ప అందరూ సంబర పడ్డారు. తండ్రి కాబోతున్నందుకు దుర్గాప్రసాద్ ఎంతో సంతోష పడ్డాడు. అతని కంటే ఎక్కువగా సుందరి సంతోషించింది. లక్ష్మికి ఒక పిల్లాడు పుడితే తనకు కన్నుల పండువుగా వుంటుంది. చంటిపిల్లాడిని ఒళ్లో బెట్టుకుని లక్ష్మి తన ఎదురుగా కూర్చుంటే ఆమె లక్ష్మీ కళతో వెలిగిపోతుంది. మాతృత్వ సౌభాగ్యంతో ఆమె ఎంతో నిండుగా గంభీరంగా కనిపిస్తుంది. అప్పటి లక్ష్మికీ, ఇప్పటి బేల లక్ష్మికీ ఎంత తేడా! తల్లిగా లక్ష్మిని వూహించుకుంటేనే సుందరికి ఆనందం పట్టలేనట్లుగా అనిపించేది. తన వూహల్లో తల్లిగా కనిపించే లక్ష్మితో పోల్చుకుంటే ఇప్పటి లక్ష్మిలో ఎంతో వెలితి కనిపిస్తుంది. ఇప్పటి లక్ష్మిలో అమాయకత్వం, బేలతనం, మాత్రమే కనిపిస్తాయి. మాతృత్వంతో గాని ఆమె ఒక వ్యక్తిత్వం వచ్చినట్లుగా

కనిపించదు. సుందరి ఇలాంటి తన భావాలను, వూహాలను అప్పుడప్పుడు లక్ష్మి దగ్గర వెల్లడిస్తూ వుండేది.

లక్ష్మికి ప్రసవం ఇంకా ఎన్నాళ్ళకు వస్తుందా అని సుందరి నెలలు, వారాలు లెక్కబెట్టి అంచనా వేస్తూవుండేది. "వచ్చే దీపావళి పండక్కి దీపాలు, మతాబాలు, చిచ్చుబుడ్లు లేకుండానే మీ యిల్లు వెలిగి పోతూవుంటుంది-" అనేది.

సుందరి తన భావాలు, ఊహాలు చెబుతుంటే లక్ష్మికి అవన్నీ తన భావాలే ననిపించేది. సుందరిని ఆ విధంగా చూడాలనుకున్నది తను. కాగా ఇప్పుడు తనే ఆ విధంగా కనిపించబోతోంది. తల్లి కాబోతున్నానన్న సంబరమేమీ తనకు కలగడం లేదు ఎందుకో.

"తల్లి కావడంలో అంత నిండుతనం గొప్పతనం వున్నా యనుకుంటే నువ్వు కూడా తల్లివి కావచ్చుగా" అనేది లక్ష్మి.

"నేను ఇదివరకే చెప్పాగా! మనం కావాలనుకుంటే పుట్టరు. అక్కర్లేదనుకుంటే పుట్టకుండానూ వుండరు. నాకు నీలాగా తల్లిని కాకూడదని అనిపించదు. తల్లిని కావడం నాకు యిష్టమే. కాని నా పరిస్థితులు చెప్పానుగా. పిల్లలు డబ్బుగల వాళ్ళింట్లో పుడితే సుఖపడతారు గానీ, ఏరోజు కారోజు ప్రతి దానికీ అణాపైసలు లెక్కపెట్టుకునే బీదవాళ్ళింట్లో పుడితే ఏంసుఖపడతారు? పిల్లలు ముచ్చటపడిపద్దైనా అడిగితే కొనిపెట్టలేని స్థితిలో వుంటే, పిల్లలు కావాలని అనిపించదు. ఆర్థికంగా మాపరిస్థితిబాగుపడితే పిల్లలని కనడానికి నాకేమీ అభ్యంతరంలేదు" అనేది సుందరి.

'తను ఉండగా సుందరి పిల్లలకు లోటు ఏముంటుంది, అనుకునేది లక్ష్మి మనస్సులో. సుందరి కోరితే తను ఎంతైనా సహాయం చేయగలదు. కోరకుండానే సహాయం చేయగలదు- ఆమె స్వీకరిస్తే చాలు. కాని సుందరి అభిమానవతి. ఎంత స్నేహమైనా దమ్మిడీ ఎత్తు సహాయం స్వీకరించదు. మరీ అవసరమైతే అప్పుగా తీసుకుంటుందేమో.మళ్ళీ దమ్మిడీలతో సహా లెక్క బెట్టి యిచ్చేస్తుంది. తననుంచి సహాయం తీసుకోక పోవడంలోనే తమ ఇద్దరి మధ్య అగాధం వున్నదనిపిస్తుంది లక్ష్మికి. ఒకరికొకరు పరాయివారనే భావంవల్లనేకదా తీసుకోనక పోవడం? ఆత్మీయత ఇద్దరం ఒక్కటేనన్న భావం వుంటే అలా వుండకూడదు. సుందరి ఎప్పుడు కావాలంటే అప్పుడు స్వతంత్రంగా వచ్చి తనతో చెప్పకుండానే తన బీరువా తీసి డబ్బు తీసుకోవాలి. తన చీరలన్నీ- పెళ్ళినాటి చీరలతో సహా తీసి కట్టుకోవాలి. తన నగలన్నీ పెట్టుకోవాలి. తను లేనప్పుడుకూడా తనవంట ఇంట్లోకి వచ్చి పచ్చళ్లు, అప్పడాలు, వడియాలు తీసుకుపోవాలి.అలాగే ఆమె చీరలు- పాతవైనా సరే, చౌకవైనా సరే- తను కట్టుకోవాలి. ఆమె ఇంటో కూడా తనకు అంత చనువు వుండాలి. అదీ ప్రాణస్నేహమంటే. తను ఎన్నోసార్లు చెప్పింది, తన చీరలు కట్టుకోమని. సుందరి ఒప్పుకోలేదు. "కావాలంటే నా చీరలు కట్టుకో" అనేది. సరేనని తను సుందరి చీర కట్టుకుంటే సుందరికి యిష్టం వుండేది కాదు.

"లక్ష్మి...నువ్వు ఇంతచౌక చీర కట్టుకుంటే నీ లక్ష్మి కళ పోతుంది, వద్దు. బంగారపు బొమ్మలాంటి దానివి. ఇటువంటి చౌక బారు చీరలు కట్టుకోవడానికి నీకేం ఖర్మ? వద్దు తీసెయ్యి" అనేది.

"వద్దు. ఇవాళ పగలంతా వుంచుకుని సాయంత్రం ఇచ్చేస్తాము" అని ఆ చీరతోనే వచ్చేసేది తను. సుందరి చీర కట్టుకుంటే, సుందరి దగ్గరే వున్నట్లు, సుందరి తనకు అతి సన్నిహితమైనట్లు, ఆమె స్పర్శ తన శరీరంపై నిలిచినట్లు అనిపించేది. ఆ చీరతో మంచంమీద పడుకుని, ఇదమిత్థమని తెలియని భావంతో, అనుభూతితో కన్నీళ్లు కార్చేది. పెళ్ళి కాక పూర్వం పుట్టింట్లో తను అటువంటి చీరలే కట్టుకునేది. తను కూడా సుందరిలాగా పేదదై వుంటే ఎంత బావుండేది-తాము ఇద్దరూ ఇంకా సన్నిహితులై ఈ అరమరికలు, సంకోచాలు వుండేవి కాదు కదా అనుకునేది.

చౌకరకం సాదా చీర కట్టుకున్న లక్ష్మిని చూస్తే దుర్గాప్రసాద్‌కి పెళ్ళికి ముందు లక్ష్మిరూపం మనస్సులో మెదిలి ఏదో పులకింతగా అనిపించేది. "ఆ అమ్మాయి చీరలు తెచ్చి కట్టుకోవడం దేనికి? నువ్వు కూడా ఇటువంటి చీరలు కొనుక్కోరాదూ?" అనేవాడు.

"చౌక చీరలమీద మోజుతో కట్టుకోలేదు. ఇది సుందరి చీర కాబట్టి కట్టుకున్నాను. నేను బజారులో కొనుక్కుంటే అది సుందరి చీర ఎలా అవుతుంది?" అనేది.

తను సుందరి చీరలు కట్టుకున్నందుకైనా మొహమాటపడి తన చీరలు సుందరి ఎప్పుడూ కట్టుకోలేదు. పైగా-"నా చీరలు నువ్వు కట్టుకుంటె ఏదో స్నేహరీత్యా కట్టుకున్నావనుకుంటారు. కాని నీ చీరలు నేను కట్టుకుంటే నిన్ను ఒడుపుగా బుట్టలో వేసుకొని, నీ చీరలు కట్టేస్తున్నానని అనుకుంటారు వీధిలో జనం. నీ డబ్బును చూసి నీతో స్నేహం చేస్తున్నానని అనుకుంటారు. నీకు ఎప్పుడూ మన

ఇద్దరి స్నేహమే తప్ప ఇతర ప్రపంచం కనిపించదు. ఇతర ప్రపంచాన్ని చూడకుండా కళ్ళు మూసుకోవడం ప్రమాదం తెలుసా?" అనేది సుందరి.

"అవును-నీ కెప్పుడూ ఇతరులేమనుకుంటారోనన్న ధ్యాసే. ఇతరులకు భయపడి, నా స్నేహాన్ని కూడా వదులుకో గలవు" అనేది తను

ఇలా తనకి, సుందరికి మధ్యగల అంతస్థు అంతరాన్ని తలుచుకుని బాధపడేది లక్ష్మి. ఒకవేళ సుందరికి పిల్లలు పుట్టినా, వాళ్ళకోసం తను ఏమైనా కొంటే కూడా సుందరి తీసుకోదేమోనని బాధపడేది. "ఈ స్నేహం కోసం బాధపడే దంతా నేనే-తన కేమీలేదు" అనుకునేది.

ఐదో నెలలో లక్ష్మి పుట్టింటి వాళ్ళు సూడిదలు తీసుకు వచ్చారు. ఆమె తల్లి అక్కయ్య వచ్చారు. అట్టే స్థితి మంతులు కాకపోవడంవల్ల వాళ్ళు అంతగా ఖర్చు పెట్టలేక పోయినా, దుర్గాప్రసాదే బోలెడు డబ్బు ఖర్చుపెట్టి, ఘనంగా జరిపించాడు. లక్ష్మి వాళ్ళ అమ్మ, అక్కయ్య పదిరోజులుండి వెళ్ళేటప్పుడు లక్ష్మిని పుట్టింటికి తీసుకువెళ్ళారు. ఆ పది రోజులూ వాళ్ళతో సుందరి చాలా చనువుగా వుంది. వాళ్ళు కూడా సుందరిని ఎంతో ఆప్యాయంగా తమ కూతురులాగే చూచుకున్నారు. ఇంత మహానగరంలో లక్ష్మికి ఒంటరితనం లేకుండా తోబుట్టువు లాంటి స్నేహితురాలు దొరికినందుకు వాళ్ళు ఎంతో సంతోషించారు.

పుట్టింటికి వెళ్ళి తండ్రిని, చెల్లెళ్ళనీ చూడాలన్న కోరిక వున్నా, భర్తను, సుందరినీ విడిచి వెళ్ళడానికి ఎంతో దిగులుగా అనిపించింది లక్ష్మికి. "పిచ్చిదానా...ఎల్లకాలం అక్కడే

వుండబోతున్నావా ఏం? రెండు నెలలో, మూడు నెలలో వుండి వచ్చేసే దానికి అంత దిగులు పడతావేం? నువ్వు వచ్చే లోగా మేమంతా ఇక్కణ్ణించి మాయమై పోతామనుకుంటున్నావా?" అని బుజ్జగించింది సుందరి.

స్టేషనుకు వెళ్ళడానికి కారులో కూర్చుని సుందరికి 'టా టా' చెప్పేటప్పుడు లక్ష్మి కళ్ళు చెమర్చాయి. లక్ష్మి వెడుతున్నందుకు దుర్గాప్రసాద్‌కీ ఎంతో దిగులుగా వుంది. స్టేషన్‌లో రైలు కదులుతుంటే చేయి వూపుతూ భర్తదగ్గర వీడ్కోలు తీసుకుంటున్నప్పుడు లక్ష్మి కన్నీళ్ళు పెట్టుకుంది. లక్ష్మిలేని ఇంటికి వెళ్ళాలనిపించలేదు దుర్గాప్రసాద్‌కి.

లక్ష్మి వెళ్ళిన వారంరోజులకే దుర్గాప్రసాద్ అత్తవారింటికి బయల్దేరాడు. అక్కడ మూడురోజులుండి ఇంకా ఎక్కువరోజులు వుండడం బావుండదని తిరిగి వచ్చేశాడు. కాని ఆ తర్వాత మళ్ళీ పదిరోజులకే ఇంకోసారి వెళ్ళాడు. ఈ సారి తిరిగి వచ్చేటప్పుడు లక్ష్మి వెంటబడి, తల్లిదండ్రులు ఎంత చెప్పినా వినిపించుకోకుండా వచ్చేసింది. "నాకు ఈ వూళ్ళో ఏం తోచడంలేదు. బెంగుళూరే బావుంది. కావాలంటే మీరే అక్కడికి రండి" అంది. పుట్టింట్లో వున్నన్నాళ్ళూ ఆమెకు ఎప్పుడూ సుందరే జ్ఞాపకం వచ్చేది. తలుచుకున్నకొద్దీ బెంగ ఎక్కువవుతూ వుండేది. బెంగుళూరులో వుండగా తల్లిదండ్రుల మీద కూడా అంత బెంగ ఎప్పుడూ కలగలేదు. లక్ష్మి వెళ్ళిన తర్వాత సుందరికి కూడా ఒంటరితనం, ఏదో వెలితి, నిరుత్సాహం ఏర్పడ్డాయి.

మొత్తంమీద నెల తిరక్కుండా లక్ష్మి పుట్టింటినుంచి తిరిగి వచ్చింది. స్టేషన్‌నుంచి ఇంటికివచ్చి కారు దిగగానే

ఇంట్లోకి అడుగు పెట్టకుండానే సుందరి ఇంటికి వెళ్ళి, ఆమెను కావలించుకుంది. 'నీకోసమే ఇంత త్వరగా తిరిగి వచ్చాను తెలుసా' అంది. ఆ రోజు సుందరిని ఆఫీసుకు వెళ్ళనివ్వకుండా సెలవు పెట్టించింది.

ఆ తర్వాత పురిటికి కూడా పుట్టింటికి వెళ్ళలేదు లక్ష్మి. ఆమెను తీసుకురావలసిందని ఆమె తల్లిదండ్రులు వుత్తరం రాసినప్పటికీ భార్యను ఆ పల్లెటూరిలో వదిలిపెట్టటానికి దుర్గాప్రసాద్ ఇష్టపడలేదు. మొదటి కాన్పు కనుక వైద్య సౌకర్యాలన్నీ వుండే బెంగుళూరులోనే ఏదైనా పెద్ద ఆసుపత్రిలో చేర్పించడం మంచిదనుకున్నాడు. పురిటికి లక్ష్మి తల్లీ, అక్కయ్యా మళ్ళీ వచ్చారు దుర్గాప్రసాద్ భయపడినట్లుగానే లక్ష్మికి ప్రసవం చాలా కష్టమయింది. ఆమెకు బంగారు బొమ్మలాంటి మగపిల్లవాడు పుట్టాడు. కాని లక్ష్మికి ఇంకొక కాన్పు రాకూడదనీ, వస్తే బ్రతకడమే కష్టమవుతుందనీ, అందుకని ఇక ఆమెకు గర్భం రాకుండా ఇప్పుడే ఆపరేషన్ చేయడం మంచిదని డాక్టర్లు చెప్పారు. భార్య ఆరోగ్యం దృష్ట్యా దుర్గాప్రసాద్ వెంటనే అందుకు అంగీకరించాడు. "ఈ బంగారపు బొమ్మ ఒక్కడు చాలునాకు" అనుకున్నాడు. పిల్లలు కావాలన్న తపన లక్ష్మికి ఎప్పుడూ లేదు కనుక ఇక ముందు తనకు పిల్లలు పుట్టరన్న బాధ ఆమెకీ లేదు. ఆపరేషన్ సవ్యంగా జరిగింది. లక్ష్మి ఆస్పత్రిలో వున్న పదిరోజులూ సుందరి రాత్రిపూట ఆమెకు తోడుగా ఆస్పత్రిలోనే పడుకుంది. ఎంతో ఆప్యాయంగా సపర్యలు చేసింది. పదిరోజులు వరుసగా సుందరితో గడపగలిగినందుకు లక్ష్మి ఎంతో సంతోషించింది.

6

పిల్లవాణ్ణి చూసుకొని మురిసిపోయాడు దుర్గాప్రసాద్ కొన్ని వందలు ఖర్చుపెట్టి మిఠాయిలు తెప్పించి, వీధిలో అందరికీ పంచిపెట్టించాడు. తన ఆఫీసులో అందరికీ ఒక పెద్ద హోటల్లో డిన్నర్ ఇచ్చాడు. భార్య ఆస్పత్రి నుంచి ఇంకా ఇంటికి రాకముందే పిల్లాడి కోసం ఒక అందమైన ఉయ్యాల, దోమతెరలు, గిలక్కాయలు, ఆటబొమ్మలు, చిన్నచిన్న చొక్కాలు, చెడ్డీలు, ఉగ్గుగిన్నె, గ్రైప్ వాటర్, అన్నీ కొనుక్కొచ్చాడు. అతని హడావిడిచూసి అమ్మలక్కలు ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు. లక్ష్మి ఆస్పత్రినుంచి ఇంటికి వచ్చేసరికి పిల్లాడికి, తల్లికి కూడా సర్వం సిద్ధంగా వున్నాయి.

పిల్లాడు పుడితే తన భర్త ఇంత సంతోషిస్తాడని లక్ష్మి అదివరకెప్పుడూ అనుకోలేదు. తనకు పిల్లలు కావాలని ఇది వరకెప్పుడూ అనిపించలేదు. కాని, భర్త ఇంత సంతోషిస్తాడని తెలిస్తే ఆయన సంతోషం కోసమయినా పిల్లలు కావాలని కోరుకొని వుండేది. ఇప్పుడు పిల్లడు పుట్టిన తర్వాత శారీర కంగా మానసికంగా కూడా తనలో ఏదో మార్పు కన్పిస్తోంది. ఇదివరకెప్పుడూ ఎరుగని విచిత్రమయిన, ప్రబలమయిన అను భూతి ఏదో తనని వూపి వేస్తున్నది. మాతృత్వం అంటే ఎలా వుంటుందో, తనకు పుట్టిన బిడ్డపై తల్లి మమకారం, ప్రేమ యెలా వుంటాయో, ఆ అనుభూతి ఎంత అద్భుతమయినదో యిప్పుడు తెలుస్తున్నది. కథల్లో చదివినా, సినిమాల్లోచూసినా అది స్పష్టంగా అర్థంకాదు. తల్లి అయితే తప్ప అది అర్థం

కాదుకాబోలు. దాన్ని అర్థం చేసుకోవాలంటే తల్లి కావడం తప్ప వేరే మార్గం లేదు. సుందరి చెప్పింది నిజమే. పిల్లలు అక్కర్లేదని పిల్లలు పుట్టేవరకే అనిపిస్తుంది. పుట్టిన తర్వాత అలా అనిపించదు. పిల్లలు అక్కర్లేదని ఇదివరకు ఎందుకు అనుకున్నానా అని ఆశ్చర్యపడుతోంది ఇప్పుడు.

"పిల్లడి ప్రేమ కేవలం మానసికం అనిపించడం లేదు లక్ష్మికి. తన శరీరంకూడా యెప్పుడూ వాడి సామీప్యాన్ని, స్పర్శనూ కోరుతున్నది. వాడి స్పర్శలో ఎంతో హాయి కలుగుతుంది వాడిని ఎప్పుడూ దగ్గరే పడుకోబెట్టుకోవాలనీ తన చెయ్యి ఎప్పుడూ వాడిమీదవుండాలనీ అనిపిస్తుంది. వాడిని ఉయ్యాలలో పడుకోబెట్టాలని అనిపించదు. వాడికీతనకీగల బాంధవ్యం, అందులోని అనిర్వచనీయమయిన మాధుర్యం తన దగ్గర వాడికి పాలిస్తున్నప్పుడు తెలిసేది. ఆ సమయంలో తన కేదో మైమరపుగా వుండేది. అటువంటప్పుడు తనకు సుందరి జ్ఞాపకం వచ్చేది. తనకు కలిగే ఏ అనుభూతినయినా ఆమెతో పంచుకోకుండా వుండలేదు తను. "ఈ మాతృత్వానుభూతి ఎంత అద్భుతమయినదో ఆమె కెలా అర్థమవుతుంది? ఎంత వర్ణిస్తే అర్థమవుతుంది? అది అనుభవైకవేద్యం" అనుకునేది. అలా అనుకున్నప్పుడు సుందరిపై జాలివంటి భావం కలిగేది. పాపం ఆమెకు ఈ అనుభవం లేదు కదా అనిపించేది.

పిల్లాడు పుట్టిన తర్వాత సుందరి తనకు కొంచెం దూరమయినట్లుగా అనిపిస్తోంది. మళ్ళీ అంతలోనే "కాదు నేనే ఆమెకు దూరమయ్యాను" అనుకునేది. అలాఅనిపిస్తే బాధగా వుండేది. "పిల్లడు పుట్టిన తర్వాత తనకి నేను అక్కరేకుండా పోయాను" అని సుందరి అనుకుంటుందేమోనని బాధపడేది.

కాని సుందరి అలా అనుకున్నట్లు కనిపించలేదు. ఇది సహజమని ఆమె ముందే అర్థంచేసుకున్నట్లు తెలుసుకుంది. తల్లి, అక్కయ్య దగ్గరలేకుండా తనూ, సుందరీ ఏకాంతంగా వున్నప్పుడు తన కొత్త అనుభవాన్ని గురించి శాయశక్తులా వర్ణించి చెప్పేది. "ఇది నీకు ఎలా అర్థమవుతుంది సుందరీ. నువ్వు కూడా త్వరగా పిల్లాడ్ని కను. అప్పుడు బాగా అర్థమవుతుంది" అనేది.

పిల్లాడు పుట్టిన తర్వాత లక్ష్మి సుందరి ఇంటికి వెళ్ళడం బాగా తగ్గిపోయింది. చంటిపిల్లాడిని ఇంట్లో వదిలి బైటికి వెళ్ళాలనిపించడంలేదు. ఇప్పుడు సుందరే రోజూ వచ్చి లక్ష్మితో, పిల్లాడితో కాలక్షేపం చేసి వెడుతోంది.

21 వ రోజున యథావిధిగా, బారసాల చేసుకుని పిల్లవాడికి ఆనందమోహన్ అని పేరు పెట్టారు. బారసాలకు లక్ష్మి తండ్రికూడా వచ్చాడు. తర్వాత వారంరోజులకు ఆయన భార్యను పెద్దకూతురునీ తీసుకుని తనవూరికిపోయాడు. లక్ష్మిని, పిల్లాడిని కూడా తీసుకువెడదామనుకుంటే, "ఇప్పుడు కాదు. కొన్ని నెలలు ఆగి మేమేవస్తాంలే" అనిచెప్పి తప్పించుకుంది లక్ష్మి. వాళ్ళ అమ్మ వెళ్ళేటప్పుడు కూతుర్ని సుందరికి అప్పగింత పెట్టి వెళ్ళింది. "నువ్వు తోడుగా వున్నావనే మేము మా అమ్మాయిని గురించి ఏ చింతాలేకుండా వుండగలుగుతున్నాము. లేకపోతే ఈ మహాపట్నంలో ఎవరికెవరు చెప్పు?" అంది ఆవిడ.

పుట్టింటి వారు వెళ్ళిపోయినా, భర్త ఆఫీసుకు వెళ్ళి సాయంత్రందాకా రాకపోయినా, సుందరి కూడా ఆఫీసుకు వెళ్ళి సాయంత్రం ఐదింటిదాకా కనిపించకపోయినా లక్ష్మికి

యిప్పుడు పగలంతా పిల్లాడితో కాలక్షేపం అవుతోంది. ఆఫీసు నుంచి రాగానే సుందరే వచ్చి, ఓ గంట సేపు కూర్చుని, పిల్లాడిని ముద్దులాడి, లక్ష్మితో కబుర్లు చెప్పి, ఆఫీసు నుంచి భర్త వచ్చే వేళకు తిరిగి వెడుతోంది. ఒకొక్కప్పుడు తన భర్తకు చూపించడం కోసం పిల్లాడిని ఇంటికి తీసుకు వెళ్ళేది. రామచంద్రరావు కూడా కాసేపు పిల్లాడితో ఆడుకునేవాడు. తర్వాత సుందరి మళ్ళీ పిల్లాడిని లక్ష్మికి యిచ్చేసేది. ఆకాసేపటిలోనే పిల్లాడి కోసం బెంగపెట్టుకునేది లక్ష్మి.

దుర్గాప్రసాద్ ఇంట్లో వున్నంత సేపూ పిల్లాడి ఉయ్యాల దగ్గరే కాలక్షేపం చేసేవాడు పిల్లవాడి గది అంతా బొమ్మలతో నింపేశాడు. పిల్లవాడు ఇంకా పాకటం మొదలుపెట్టకుండానే ఆత్రంగా మూడు చక్రాల సైకిలు, కొయ్యగుర్రం కొనుక్కొచ్చాడు.

లక్ష్మి, సుందరి కలిసి సంక్రాంతి పండగకి లక్ష్మి వాళ్ళింట్లో ఆంధ్ర సంప్రదాయం ప్రకారం బొమ్మలకొలువు పెట్టి, పిల్లవాడికి భోగిపళ్ళు పోశారు. అప్పటికి వాడికి మూడోనెల. లక్ష్మికి ఇప్పుడు వాడిధ్యాసతప్ప మరొకటిలేదు. ఎప్పుడూ వాడి పనులే చేస్తూ వుండేది. సుందరి సలహా ప్రకారం వాడికి అస్తమానం దిష్టితీసేది. సుందరి తను ఇంటికి వెళ్ళేటప్పుడు కూడా "ఎందుకయినా మంచిది నేను వెళ్ళగానే కాస్త ఉప్పు తీసిపడెయ్యి. ఎవరికళ్ళల్లో ఏ దోషంవుందో ఎవరికి తెలుసు" అనేది. "ఛీ...అవేం మాటలు సుందరీ... పిల్లాడికి తల్లి దిష్టి తగలదు. నువ్వు వీడికి తల్లితో సమానం" అనేది లక్ష్మి.

ఒకరోజు సాయంత్రం ఉన్నట్టుండి పిల్లాడికి జ్వరం వచ్చింది. లక్ష్మి వాడికి దిష్టి తీసేసి, విభూది పెట్టింది. అయినా ఫలితం కనిపించలేదు. రాత్రి 7 గంటలకు దుర్గాప్రసాద్ ఆఫీసునుంచి ఇంటికి చేరేసరికి పిల్లవాడికి జ్వరంఉధృతమయింది. వెంటనే దుర్గాప్రసాద్ డాక్టరును తీసుకు రావడానికి హడావిడిగా కారులో వెళ్ళాడు. పిల్లవాడు మూసిన కన్ను తెరవడం లేదు. ఒళ్ళు సలసల కాగిపోతోంది. ఆందోళనతో లక్ష్మి విలవిలాడిపోతుంది. సుందరి ఆమెకి ధైర్యం చెబుతోంది.

డాక్టర్ కోసం వెళ్ళిన దుర్గాప్రసాద్ తిరిగిరావడం చాలా ఆలస్యమయింది. తెలిసిన డాక్టర్ ఇంటికి వెడితే ఆయన వూళ్ళో లేరని చెప్పారు. ఇంకో డాక్టరును వెతికి పట్టుకోడానికి చాలాసేపు తిరగవలసి వచ్చింది. ఎలాగో ఒక డాక్టరును పట్టుకుని ఇంటికి తీసుకువచ్చేసరికి సమయం మించిపోయింది. తల్లి ఒడిలోనే పిల్లవాడు శాశ్వతంగా కళ్ళుమూశాడు. లక్ష్మి సుందరి భుజంపై తల ఆనించి వెక్కి వెక్కి ఏడుస్తున్నది. సుందరి కూడా దుఃఖం ఆపుకోలేక పోయింది. దుర్గాప్రసాద్ భార్య ఒడిలోంచి పిల్లవాడిని తీసుకుని వాడి దేహమంతా ముద్దులు పెట్టుకుంటూ పసివాడిలా విలపించాడు.

7

పిల్లవాడు పోయిన తర్వాత చాలా రోజుల వరకు లక్ష్మి కోలుకోలేక పోయింది. కోలుకున్న తర్వాత కూడా

ఆమె ఇదివరకటి మనిషిలాగాలేదు. ఆ చలాకీతనం, చిలిపితనం, పేలతనం ఇప్పుడు లేవు. ఉత్సాహం లేదు. దేనిమీదా ఆసక్తి లేదు. భవిష్యత్తును గురించి ఎటువంటి ఆశలూ లేవు. దేనిని గురించీ కలలుగనడం లేదు. కేవలం యాంత్రికంగా, జీవచ్ఛవంలాగా జీవిస్తోంది. ఇక తనకు పిల్లలు పుట్టేదిలేదు. అందుకు తను బెంగపడడంలేదు కూడా. చర్మం మొద్దుబారి స్పర్శ తెలియకుండా పోయినట్లుగా మనస్సు మొద్దుబారిపోయింది. ఈ మనస్సుకు ఇక దిగులులేదు. కోరిక లేదు, ఆశలేదు, నిరాశలేదు. అలా అయిపోయింది మనిషి.

అసలు తనకు పిల్లవాడు పుట్టకపోతే బావుండేది. పుట్టాలని తనెప్పుడూ కలవరించలేదు. తన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే పుట్టాడు. పుట్టి తనకెన్నో కొత్త అనుభూతులు కలిగించాడు. తనలో మాతృత్వాన్ని, మమకారాన్ని రెచ్చగొట్టాడు. ఆ మమతతో తనను పిచ్చిదాన్నిచేసి, వదిలేసి ఏ లోకంలోకో పారిపోయాడు. ఆ నాలుగునెలల భాగ్యానికీ ఎందుకు పుట్టినట్టు? వాడు పుట్టకముందు తను నిక్షేపంగావుంది. పిల్లలు కావాలని అనుకున్న మాట నిజమే. కాని పిల్లలు తన కడుపునే పుట్టాలని అనుకోలేదు. పిల్లలను సాకాలనీ, వాళ్ళు ఎప్పుడూ తనదగ్గర వుండాలనీ ఇప్పటికీ అనిపిస్తుంది, కాని తను మాత్రం ఇక పిల్లల్ని కనకూడదు. ఆ మమకారం, బాధ అంతా తను అనుభవించింది- ఇంకవద్దు. తను ఇక పిల్లల్ని కనలేకపోవడం కూడా అదృష్టమే ననుకుంది.

దుర్గాప్రసాద్ కూడా వైరాగ్యంలో పడ్డాడు. తనకి దేనిమీదా ఆసక్తిలేదు. పిల్లల్నికని, వాళ్ళమీద వల్లమాలిన మమకారం పెంచుకుని వాళ్ళు దూరమైపోతే ఆ చిత్రహింస

అనుభవించడం కంటె అసలు పిల్లలు లేకపోతేనే హాయి అనుకున్నాడు. అతని జీవితం కూడా యంత్రప్రాయమై పోయింది. పిల్లవాడి కోసం తనుకొన్న బొమ్మలు, పాకే వయిస్సుకూడా రాకుండానే వాడి కోసం కొన్న మూడుచక్రాల సైకిలు, కొయ్యగుర్రం కనిపించినప్పుడు వైరాగ్యంతో తనలోతనే నవ్వుకునేవాడు.

పిల్లవాడు పోగానే లక్ష్మి తల్లిదండ్రులు వచ్చి కొద్ది రోజులు వుండి, ఆమెను తనువెంట తీసుకు వెళ్ళారు. పుట్టింట్లోన కూడా వుండలేక నెలతిరకుండాతిరిగి వచ్చేసింది లక్ష్మి త మనస్సులో బాధను అణచివేసుకుని భార్యను మళ్ళీ మామూలు మనిషిగా చేయడానికి ఎంతో ప్రయత్నించేవాడు దుర్గాప్రసాద్. సినిమాలకు తీసుకు వెళ్ళేవాడు. పుస్తకాలు కొనితెచ్చేవాడు. చుట్టు ప్రక్కల చూడదగిన ప్రదేశాలన్నింటికీ తీసుకు వెళ్ళి చూపించేవాడు. అయినాఆమెలో మార్పేమీలేదు. ఎప్పుడైనా నవ్వినా అది ప్రయత్నపూర్వకంగానవ్వినట్లేవుండేది.పగలంతా ఇంట్లో ఒంటరిగా కూర్చుని ఎన్నో పుస్తకాలు చదివేది. ఇంగ్లీషు నవలలు చదివి భాషా జ్ఞానం పెంపొందించుకుంది. చదివినవాటి గురించి ఆలోచిస్తూ కాలం గడిపేది.అయినా మనస్సు జడస్థితినుంచి బయటపడలేదు.

ఆమె పరిస్థితిని సుందరి గమనిస్తూనేవుంది. ఆమెను మళ్ళీ ఇదివరకటి లక్ష్మిగా చేయాలని శాయశక్తులా ప్రయత్నించింది. అయినా ఫలితం కనిపించక పోవడంతో ఆమెను గురించి బెంగ పెట్టుకుంది.ఇదివరకు ఎప్పుడూ గలగలా నవ్వుతూ, అస్తమానం ఏదో మాట్లాడుతూఉండే లక్ష్మి ఇప్పుడు మాట్లాడడమే అరుదయింది. ఎప్పుడూ పరధ్యానంగాఉంటోంది. ఏ విషయాన్ని

గురించి మాట్లాడినా విని వూరుకోవటమే తప్ప తను మళ్ళీ మాట్లాడడంలేదు. మాట్లాడినా ముక్తసరిగా అడిగినదానికి సమాధానం చెప్పినట్లుగా మాత్రమే మాట్లాడుతోంది. ఆమె ముఖంలో సంతోషంగానీ, ఆశ్చర్యంగానీ, ఆసక్తిగానీ మరే భావంగానీ వ్యక్తమయ్యేది కాదు. పిల్లవాడు పోయిన తర్వాత అలా నిస్తేజంగా నాలుగు నెలలు గడిచిపోయాయి. లక్ష్మి ఇదివరకటిలా సుందరి ఆఫీసు నుంచి ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడడంలేదు. సుందరి రాగానే వాళ్ళింటికి వెళ్ళి కూర్చోవటం లేదు. ఇప్పుడు సుందరే ఆఫీసు నుంచి రాగానే లక్ష్మి ఇంటికి వెళ్ళి కబుర్లు చెబుతోంది.

ఒకరోజు సుందరి లక్ష్మితో మాట్లాడుతూ ఒక్కసారి ఆగి ఆమె భుజాలు పట్టుకుని, ఆమె కళ్ళల్లోకి చూస్తూ "నీకో వార్త చెప్పనా" అంది. "ఊ" అంది లక్ష్మి అనాసక్తంగా. "నాకిప్పుడు మూడోనెల" అనిచెప్పింది సుందరి. లక్ష్మి ఒక్కసారి అదిరి పడినట్లుగా, ఆశ్చర్యంగా చూసింది. తాను పూర్తిగా మరచి పోయిన ఒక విషయాన్ని తన లోపలనుంచే ఏదో శక్తి గట్టిగా వెన్నుచరిచి జ్ఞాపకం చేసినట్లు అనిపించింది. "నిజమేనా?" అని అడుగుతున్నట్లు చూస్తూ ఒక నిమిషంసేపు అలాగే నిశ్చలంగా వుండి పోయింది. ఆ నిమిషంలోనే ఆమె మనస్సులో అస్పష్టంగా ఏవో భావాలు మెదిలాయి. సుందరి గర్భవతి కావడంలో విడ్డూరం ఏమీ లేదు. అది సామాన్యమైన విషయం. అందులో ఆశ్చర్యపోవడానికేమీలేదు కాని, ఎందుకో ఆశ్చర్యం కలిగింది. కారణం ఏమిటి? సుందరికి పిల్లలు పుట్టాలనీ, వాళ్ళని తను పెంచాలనీ తహ తహ లాడిన రోజుల్లో సుందరి ఈ మాట చెప్పి

వుంటే తనకి ఆశ్చర్యం కలిగి వుండేది కాదు. విపరీతమైన సంతోషం మాత్రమే కలిగేది. ఇప్పుడు పిల్లవాడు పోయిన తర్వాత ఏర్పడిన జడస్థితిలో, పూర్తిగా ఆ విషయాన్నే మరచిపోయినస్థితిలో సుందరి ఆ మాట చెప్పడంతో ఆశ్చర్యం కలిగింది. ఈ ఆశ్చర్యం మనస్సును ముంచెత్తడం వల్ల సంతోషం వెంటనే కలగలేదు.

సుందరి గర్భవతి కావడం అన్నది ప్రత్యేకంగా పరిగణించనవసరంలేని మామూలు విషయంగా అనిపించడం లేదు ఎందుకో. దానికేదో ప్రత్యేక ప్రాముఖ్యం వున్నట్టు మనసుకు అనిపిస్తోంది. తనలో ఎవరో అస్పష్టంగా ఏదో రహస్యం చెబుతున్నట్లుగా అనిపిస్తోంది. మనస్సు అంతా అయోమయంగా అనిపించింది. అర్థంకాని గజిబిజిగా కనిపించింది. లక్ష్మి మానసిక స్థితి స్పష్టంగా కాక పోయినా కొంత వరకు సుందరికి అర్థమయింది. పిల్లవాడు పోయిన తర్వాత నాలుగు నెలల్లో లక్ష్మిలో అటువంటి సంచలనం ఆమె ఎప్పుడూ చూడలేదు. తను చెప్పిన మాట లక్ష్మికి షాక్ ట్రీట్ మెంట్ గా పని చేసిందనీ, ఇప్పుడిప్పుడే లక్ష్మి జడస్థితి నుంచి బైటపడుతున్నదని ఆమెకు అనిపించింది. లక్ష్మికి మనస్సులో అవ్యక్తమైన అలజడితో తల తిరుగుతున్నట్లుగా అనిపించింది. కళ్ళు మూసుకుని, మెల్లగా సుందరి భుజంపై తల ఆన్చింది. సుందరి పట్టరాని వాత్సల్యంతో, స్నేహంతో లక్ష్మి చెక్కిలిపై ముద్దు పెట్టుకుని, ఆమె వెన్ను నిమిరింది. తనపట్ల సుందరి వ్యక్తం చేసిన ప్రేమతో, వాత్సల్యంతో లక్ష్మి చకితురాలయింది. నాలుగు నెలల క్రితం మనస్సులో మంచులా గడ్డకట్టు పోయిన సంతోషం, దుఃఖం ఉద్వేగం అన్నీ ఒక్కసారిగా

కరిగి కన్నీరయి ప్రవహించగా ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. తాను ఎందుకు ఏడుస్తున్నదో తనకే తెలియదు. తన అంతరాంతరాలలోని అనుభూతులేవో కూకటి వేళ్ళతో పెళ్ళగించుకు వస్తున్నట్లు, తనలో మూలమూలల కరడు కట్టిన భావాలు కదలి, ప్రిదిలి, కరిగి పొంగి, వరదలా ఉరవడితో, వరవడితో తనను వూపివేస్తున్నట్లు, తనను ముంచి ఎత్తుతున్నట్లు అనిపించింది. ఆమెలోని జడత్వం వదిలి పోతున్నదనీ, ఈ సంక్షోభానికి కారణం అదేననీ సుందరి గ్రహించింది. లక్ష్మి స్వభావం సుందరికి అర్థమైనంతగా దుర్గాప్రసాద్‌కి కూడా అర్థం కాదు. లక్ష్మి ఇంక మామూలు మనిషి అవుతుందని సంతోషించింది సుందరి.

లక్ష్మి చాలాసేపు శోకించింది. అప్పటికి ఆమె మనస్సులో తుఫాను ఉధృతం తగ్గింది. వరదపొంగు తగ్గింది. క్రమంగా నిశ్చలత, ప్రశాంతత ఆవరించుకున్నాయి. ఆమె కన్నీరు తుడుచుకుని, తల ఎత్తి, సుందరి ముఖంలోకి చూసి, మెల్లగా శాంతంగా నవ్వింది. ఆమె ముఖం మబ్బులులేని నిర్మలాకాశంలాగా వుంది. ఏదో పెద్ద బరువు తొలగిపోయినట్లు మనస్సు తూలికవలె తేలికయిపోయింది. ఆమె నవ్వగానే సుందరి కూడా సన్నగా నవ్వింది.

"ఒక్కొక్కప్పుడు నువ్వు మరీ ఇంత పాపాయిలాగా
? ఇలా కనిపించినప్పుడు నిన్ను పెంచుకో
) జోల పాడాలనీ. చిచ్చికొట్టాలనీ అని
ందరి.

నువ్వు పెంచుకో. నీకు పుట్టే పాపాయిని

నేను పెంచుకుంటాను. అప్పుడు నీకో పాపాయి నాకో పాపాయి వుంటారు" అంది లక్ష్మి.

లక్ష్మి మళ్ళీ ఇదివరకటిలా మాట్లాడడంతో సుందరికి ఎంతో సంతోషంగా వుంది. లక్ష్మిని గురించిన బెంగ తీరిపోయింది. మళ్ళీ ఇదివరకటిలా రోజూ లక్ష్మి తన ఇంటికి వస్తుంది. ఇద్దరూ గంటల తరబడి కబుర్లు చెప్పుకోవచ్చు. ఇద్దరూ కలిసి మళ్ళీ కలలు కనవచ్చు.

లక్ష్మి ఆ రాత్రంతా సుందరికి పుట్టబోయే పాపాయిని గురించే ఆలోచిస్తూ గడిపింది. ఇక తన జీవితంలో పాపాయిలెవరూ రారని యింతకుముందు అనుకుంది. కాని ఇప్పుడు ఒక పాపాయి తన ఒళ్ళోకి పాకుతూ రాబోతున్నాడు. వాడు ఎల్లా వుంటాడు? తెల్లవారుజామున ఎప్పుడో నిద్రపట్టింది.... సుందరికి బాబు పుట్టాడు. వాడు పాకుతూ తన దగ్గరకు వచ్చాడు. వాడిని ఒళ్ళోకి తీసుకుంది. అరె...వీడు తనపిల్లాడే సుందరి పిల్లాడుకాదు...సుందరికి పుట్టాడని నిజంగా సుందరి పిల్లాడే ననుకుంది...కాదు...వీడు తన పిల్లాడే...తన ఆనంద మోహన్. తను లేకపోతే అమ్మ ఏమవుతుందో చూద్దామని తమాషా చేశాడు. అమ్మతో దాగుడుమూతలాడాడు. మళ్ళీ తనకే అమ్మమీద బెంగపుట్టి వచ్చేశాడు...'అమ్మా' అంటూ మెడ వాటేసుకున్నాడు...వీడు...అమ్మని విడిచి ఎక్కడికి పోతాడు...వెళ్ళిపోయాడని అనవసరంగా తనే భ్రమపడ్డది. బెంగపెట్టుకుంది...వాడు తన దగ్గరే పాలు తాగుతాడు...

అంతలో మెలకువ వచ్చింది. అందమయిన కల కరిగిపోయింది. అయినా ఏదో తృప్తిగా వుంది. అది కేవలం కల అనిపించడంలేదు. అది నిజమే ననిపిస్తున్నది. 'అమ్మా! నా

కోసం దిగులుపడకు. నీకోసం నేను మళ్ళీ పుడతాను. నిన్ను విడిచి నేను స్వర్గంలోకూడా వుండలేను. కాని నీ కడుపున పుట్టటానికి వీల్లేదు. అందుకే సుందరి అమ్మ కడుపున పుడతాను. అయినా నేను నీ పిల్లాడినే'- అని చెప్పడానికే వాడు కలలోకి వచ్చాడు. కలలో కాకపోతే మరొక విధంగా ఎలా చెబుతాడు? చెప్పే అవకాశం ఏది? చెప్పకపోతే తనకు తెలిసేది ఎలా?

అసలు కల రాకముందే ఆ సంగతి తనకు లీలగా స్ఫురించింది. సుందరి క్రిందటి రోజు ఆ మాట చెప్పగానే తనలో అంత అలజడి కలగడానికి కారణం ఇదేనని ఇప్పుడు అనిపిస్తోంది. సుందరి గర్భవతి కావడం కేవలం మామూలు విషయం కాదనీ, తన జీవితంతో ముడిపడిన ప్రత్యేక ప్రాముఖ్యం ఏదో దానికి వుందనీ తనకెవరో రహస్యం చెబుతున్నట్లు అప్పుడే అనిపించింది. ఆ రహస్యం కలలో స్పష్టమయింది. ఇప్పుడు మనస్సుకు ఎంతో తృప్తిగా, సంతోషంగా వుంది. ఈ సంతోషాన్ని తను ఒక్కతే భరించలేదు. సుందరితో పంచుకోవాలి.

సాయంత్రం సుందరి ఆఫీసునుంచి ఇంటికి తిరిగిరాగానే లక్ష్మి సంతోషంగా పరుగెత్తుకు వెళ్ళింది. తను ఆఫీసునుంచి రాగానే ఇదివరకటి లాగా లక్ష్మి పరుగెత్తుకు రావడం సుందరికి ఎంతో సంతోషంగా వుంది. పైగా లక్ష్మిముఖం తృప్తితో ఆనందంతో వెలిగి పోతోంది. 'ఒక్క రోజులో ఎంత మార్పు' అనుకుంది సుందరి మనస్సులోనే. ఏదో చెప్పాలన్న తహతహ కనిపిస్తోంది లక్ష్మిమొహంలో. "పిచ్చిపిల్ల! మనస్సులో

ఏ భావం వచ్చినా అది నాకు చెప్పేదాకా ఆగలేదు" అనుకుంది సుందరి.

సుందరి ఆఫీసు బట్టలు మార్చుకుని, కాళ్ళు చేతులు మొహం కడుక్కుని వచ్చి మంచంమీద కూర్చుని, లక్ష్మిని తన ఎదురుగా కూర్చోబెట్టుకుంది. నవ్వుతూ "ఊఁ ఇప్పుడు చెప్పు. పాపం చాలా ఆత్రపడుతున్నావు చెప్పడానికి" అంది. సుందరీ సుందరీ... అని ఆత్రంగా చెప్పబోతూ మళ్ళీ ఆగి, సందేహంగా మొహం పెట్టింది లక్ష్మి. "అసలు నిన్న నువ్వు ఆ విషయం చెప్పావా?" అని అడిగింది.

"ఏ విషయం? రాబోతున్న పాపాయి సంగతా?"

"ఆ అదే...అయితే నిజమేనన్నమాట. కలకాదన్నమాట..."

"కల ఏమిటీ?"

"అది కాదు సుందరీ...తెల్లవారుజామున ఓ కల పాపాయిని గురించే. కలగంటున్నంత సేపూ అంతా నిజంలాగానే అనిపించింది. మెలకువ వచ్చిన తర్వాత గానీ అది కల అని తెలియలేదు. అందుకని అసలు నిన్న నువ్వు చెప్పినదికూడా కలలో భాగమేమోననే సందేహం వచ్చింది."

"ఇంతకీ ఆ కల ఏమిటి? తెల్లవారు జామున వచ్చే కలలు నిజమవుతా యంటారు."

"అవును, తప్పకుండా నిజమే అవుతుంది సుందరీ. కలలో నా బాబు ఆనందమోహన్ కనిపించాడు. నేను మళ్ళీ నీ దగ్గరికి వస్తున్నానమ్మా" అని చెప్పాడు.

సుందరి ప్రశ్నార్థకంగా మొహం పెట్టింది. "ఈ కల

ఎలా నిజమవుతుంది లక్ష్మీ...నీకు మళ్ళీ పిల్లలు పుట్టే అవకాశం లేదు కదా?" అంది.

"నీకింకా అర్థంకాలేదా సుందరీ! నా ఆనందమోహన్ ఇప్పుడు ఎక్కడున్నాడో తెలుసా? ఇక్కడ వున్నాడు" అంటూ సుందరి కడుపుమీద చెయ్యి పెట్టి చూపింది లక్ష్మి.

ఆ మాటకు షాక్ కొట్టినట్లుగా అనిపించింది సుందరికి. కాని తన ఆశ్చర్యాన్ని ముఖంలో కనిపించనివ్వలేదు. అయినా లక్ష్మి అదంతా పట్టించుకునే స్థితిలో లేదు. సుందరి చేతులను తన చేతుల్లోకి తీసుకుని, పరవశంగా, ఈ ప్రపంచాన్నే మరచినట్లుగా, సగం నిద్రలో కలవరిస్తున్నట్లుగా మాట్లాడుతోంది. "అవును సుందరీ! ఆనందమోహన్ చెప్పాడు. నన్ను విడిచిపెట్టి స్వర్గంలో కూడా వుండలేనని చెప్పాడు. నామీద బెంగగా వుందని వుందని చెప్పాడు. నాకడుపున పుట్టడానికి వీల్లేదు కదూ అందుకే నీ కడుపున పుడుతున్నాడుట. సుందరీ ఈ సారి వాడికి మనం ఇద్దరు తల్లులం. అప్పుడు మాతృత్వంలో మనం ఇద్దరం ఏకమయిపోతాం. నువ్వూ నేనూ అనే తేడా లేకుండా ఒక్కటై పోతాం. అప్పుడు మన స్నేహం పూర్తిగా సార్థకమై పోతుంది."

మైమరపుతో లక్ష్మి సుందరి ఒడిలో తల పెట్టుకుంది- "సుందరీ ఇంత అద్భుతమైన, మధురమైన అనుబంధం ప్రపంచంలో ఇంకెక్కడయినా వుంటుందా? ఇద్దరు తల్లులకి ఒక్కడే పిల్లాడు. ఒక్క పిల్లాడికి ఇద్దరు తల్లులు. ఇద్దరిలో ఒకరు కన్నతల్లి, మరొకరు పెంచిన తల్లి అనడానికి కూడా వీల్లేదు. ఇద్దరూ కన్నతల్లులే. క్రిందటి జన్మలో వాడికి నేను కన్నతల్లిని. మళ్ళీ జన్మలో నువ్వు కన్నతల్లివి కాబోతు

న్నావు. ఇదివరకు-వాడు పుట్టకముందు-నాకు పిల్లలు పుట్ట కూడదనీ, నీకే పిల్లలు పుడితే వాళ్ళని నేను పెంచాలనీ ఎంతో అనుకునేదాన్ని. నీకు పిల్లలు పుట్టకుండానే, పుడతారని ఊహించుకుంటూనే, వాళ్ళమీద నాకెంతో ప్రేమకలిగేది. వాళ్ళు ఎప్పుడు ఈ లోకంలోకి వస్తారా అని ఎదురుచూసే దాన్ని. కానిఎందుకో దేవుడు ఆనందమోహన్‌ని నా కడుపున పుట్టించాడు. కన్నప్రేమ ఎలా వుంటుందో నాకు చూపించ డానికి అలా చేశాడేమో దేవుడు. మళ్ళీ ఏమనుకున్నాడో ఆయన. వాడిమీద ప్రేమతో ప్రపంచాన్నే మరచిపోయిననేను నీకు పుట్టే పిలలను అంత ప్రేమగా చూడలేనని అనుకున్నాడు కాబోలు. ఆనందమోహన్‌ని తీసుకుపోయాడు. నీ పిల్లాడిని నా పిల్లాడిగా చూసుకోవడంకోసం మళ్ళీ వాడినే నీ కడుపున పుట్టిస్తున్నాడు. ఇదంతా ఎంత తమాషాగా వుందో చూశావా? నిజంగా నాకు ఎంత సంతోషంగా వుందో తెలుసా?" లక్ష్మి పరవశంతో చెప్పుకుపోతోంది. తన మాటలు వింటూ సుందరి ఏమనుకుంటున్నదోననే ధ్యాసలేదు ఆమెకు. తను మాట్లాడే ప్రతి మాటా సుందరి హృదయపు పునాదులను కదిలించి వేస్తున్నదని ఆమెకు తెలియదు.

"ఈ పిచ్చి లక్ష్మిని ఏంచెయ్యాలి? ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? ఇదంతా ఆమె మనస్సు కల్పించుకున్న భ్రమ అని ఎలా చెబితే ఆమెకు అర్థమవుతుంది?" అని ఆలోచిస్తున్నది సుందరి. "నిన్న నేను ఆ సంగతి చెప్పినప్పటి నుంచి నువ్వు దాన్ని గురించే ఆలోచిస్తూ వుండివుంటావు. రాత్రి పడుకున్న తర్వాతకూడా అదే ఆలోచించి వుంటావు. పైగా నీ బాబు జ్ఞాపకాలే ఇంకా నీ మనస్సంతా ఆక్రమించివున్నాయి. అందుకే

అలాంటికల వచ్చింది. కల అంటే కలేగానీ నిజమెలా అవుతుంది? పోయినవాడు మళ్ళీ పుట్టడమేమిటి? అటువంటి కలలనీ, వూహాలనీ, భ్రమలని వదుల్చుకుని వాస్తవ ప్రపంచాన్ని చూడడం నేర్చుకో"అని లక్ష్మికి హితవు చెప్పాలా? అది అసాధ్యం. బుజ్జగించి నెమ్మదిగా నచ్చచెప్పాలా? అలా చెబితే ఆమె తట్టుకోలేదు. పూర్తిగా పిచ్చిదై పోతుంది. అటువంటి మాటలు చెప్పి, ఆమెను చిత్రహింస పెట్టకూడదు. జడమై పోయిన ఆమె మనస్సు నిన్న తను ఆ సంగతి చెప్పిన తర్వాతనే కోలుకున్నది. అటువంటి కల రావడంవల్లనే, ఆ కల నిజం కాబోతున్నదనే ఆశవల్లనే, విశ్వాసంవల్లనే ఆమె మళ్ళీ ఇంత సంతోషంగా ఇంత ధారాళంగా మాట్లాడుతోంది. ఇదంతా కల్ల, భ్రాంతి తప్ప మరేమి కాదని తెలిస్తే మళ్ళీ జీవచ్ఛవంగా మారిపోతుంది. పిల్లవాడు పోయినప్పటి కంటే ఇప్పుడు మరీ విరాగి అయిపోతుంది. అందుకే ఆమెను అందమయిన ఆ అబద్ధంలోనే వుండనివ్వాలి. అయితే...తనకు పుట్టబోయే పిల్లవాడిని ఆమెకు ఇచ్చెయ్యాలా? తన బిడ్డ తన బిడ్డ కాదా? తన బిడ్డను ఆమె తీసుకుపోతుంటే తను మెదలకుండా వూరుకోవాలా? వూరుకోగలదా? తనలో మాత్రం మాతృత్వం లేదా?...ఛీ...ఇలా ఆలోచిస్తున్నదేమిటి తను? ఇంత స్వార్థం ఎలా వచ్చింది తనకి? లక్ష్మి ఎవరు? పరాయిదా? తన లక్ష్మి, తన ప్రాణస్నేహితురాలు. పాపాయిలాంటి అమాయకురాలు. ఇటువంటి స్వార్థపు ఆలోచన, సంకుచితమయిన ఆలోచన తనకు కాబట్టి వచ్చింది. లక్ష్మికి ఎప్పుడూ రాదు. ఆమెది స్వచ్ఛమయిన మనస్సు. 'నేను వేరు, తను వేరు' అనే భావన ఆమె కెప్పుడూ రాదు. పుట్టే బిడ్డను తను తీసుకు

పోవాలని ఆమె అనుకోవడంలేదు. 'వాడికి ఇద్దరు తల్లులం' అని అంటోంది. వాడిని తనకంటే ముద్దుగా పెంచుతుంది. వాడికి ఏలోటు రాకుండా చూస్తుంది. వాడు తన ఇంట్లో కంటే లక్ష్మి ఇంట్లోనే సుఖంగా వుంటాడు వాడు సుఖంగా వుండడమే కదా తనకు కావలసింది. ఆమె పెంచినంత మాత్రాన, ఆమె దగ్గర అలవాటైనంత మాత్రాన వాడు తన బిడ్డ కాకుండా పోతాడా? పైగా లక్ష్మికి ఇక పిల్లలు పుట్టరు. పిల్లలంటే ఆమెకు ప్రాణం. 'నా పిల్లాడు నీకు ఏమీ కాడు' అంటే ఆమె ఏమయిపోతుంది? అనగలిగినంతటి కర్కశత్వం తనలో లేదు.

మనస్సులో ఈ ఆలోచనలన్నీ మెదులుతున్నా లక్ష్మి మాటలు వినిపిస్తూనే ఉన్నాయి. కాని, సుందరి పరధ్యానంగా వుండి తన మాటలు వినడం లేదనుకుంది. లక్ష్మిమాట్లాడడం ఆపి, "సుందరీ! నేను చెప్పేది వింటున్నావా? అని అడిగింది.

"వింటున్నా లక్ష్మీ... శ్రద్ధగా వింటున్నా... కావాలంటే నువ్వుచెప్పినవన్నీ మళ్ళీ చెబుతాను."

"అవేఅక్కర్లేదులే, వింటున్నానని చెప్పావుగా చాలు."

సుందరి భర్త రామచంద్రరావు అఫీసు నుంచి రావడంతో లక్ష్మి అయిష్టంగానే ఇంటికి తిరిగి వెళ్ళింది.

8

ఒక్కరోజులో తన భార్యలో వచ్చిన మార్పును చూసి దుర్గాప్రసాద్ ఆశ్చర్యపోయాడు. సంతోషించాడు కూడా. ఆ మార్పుకి కారణం తెలీలేదు. ఆమెలో మళ్ళీ ఇది వరకటి

చలాకీతనం, ఉత్సాహం కనిపిస్తున్నాయి. ఆమె కళ్ళు సంతోషంతో మెరిసిపోతున్నాయి. కాని ఆమె తనతో మాట్లాడడం లేదు. అసలు ఈ లోకంలో వున్నట్లేలేదు. ఏదో ఆలోచించుకుంటూ, కళ్ళ ఎదుట ఏదో దృశ్యాన్ని చూస్తున్నట్టుగా తనలో తనే నవ్వుకుంటోంది. ఆ నవ్వుని చూసి దుర్గాప్రసాద్‌కి కొద్దిగా అనుమానం, భయం కలిగాయి. నవ్వుతూ ఆమెను దగ్గరకు తీసుకొని అడిగాడు. "అంత హుషారుగా ఉన్నావు ఏమిటి విశేషం?" అని.

"ఓహో మీకు ఇంకా ఆ సంగతి తెలీదుకాబోలు" అన్నట్టుగా భర్త కళ్ళలోకి చూసి నవ్వింది. "మన బాబు ఆనందమోహన్ మళ్ళీ వస్తున్నాడండీ" అంది.

దుర్గాప్రసాద్ గతుక్కుమన్నాడు. తన అనుమానం భయం నిజమేనేమో ననిపించింది. "పోయిన పిల్లాడు మళ్ళీ రావడం ఏమిటి లక్ష్మి?" అన్నాడు.

"అవునండి...పుట్టబోతున్నాడు."

"ఎల్లా పుడతాడు? నీకు ఆపరేషను జరిగిన సంగతి మరచిపోయావా?"

"అబ్బ...మీకు ఏమీ అర్థం కాదు. నాకు కాదు పుట్టేది, నాకెలా పుడతాడు? నాకేమన్నా పిచ్చెక్కిందనుకున్నారా? మన సుందరికి పుట్టబోతున్నాడు. సుందరి ఇప్పుడు కడుపుతో ఉంది."

"ఇది మరీ బావుంది. ఆ అమ్మాయి కడుపుతోవుంటే ఆనందమోహన్ పుట్టడం ఏమిటీ? కలగంటున్నావా? మరో ప్రపంచంలో వున్నావా?"

"అరె! నేను కలగన్నట్టు మీకెలా తెలిసింది? నిజంగానే తెల్లారుజామున కలవచ్చింది. ఆనందమోహన్ కనిపించి తను నా కోసం మళ్ళీ సుందరి కడుపున పుట్టబోతున్నట్టు చెప్పాడు. సుందరికి పుట్టే పిల్లాడు మన పిల్లాడే. వాడిని నేనే పెంచుకుంటాను."

"మనస్సులో ఎప్పుడూ వాడిని గురించే ఆలోచిస్తూ వుంటే అటువంటి కలలే వస్తూవుంటాయి. ఆ కలలన్నీ నిజా లనుకోవడం వెర్రితనం. పోయినవాడు మళ్ళీ పుట్టడం ఏమిటి? ఈ మాట నాతో అంటే అన్నావుగానీ ఆ అమ్మాయితోఅనకు. బాధపడుతుంది. ఆమెకు పుట్టేవాడు ఆమె బిడ్డ అవుతాడు గానీ, మన బిడ్డ ఎలా అవుతాడు? వీడు మా అబ్బాయి, నాకు ఇచ్చేసెయ్యి అని అడిగితే నిన్ను పిచ్చి దనుకుంటారు."

"అలా అని మీరు అనుకుంటారుగానీ, సుందరి అను కోదు. మీకంటే ముందే ఇదంతా ఆమెతో చెప్పాను."

"ఆ....! చెప్పావా? ఏమంది?"

"మీలాగా అనలేదు. నిజమేనంది.నన్ను సుందరి అర్థం చేసుకొన్నంతగా మీరుకూడా అర్థం చేసుకోలేరు. అయినా పుట్టబోయే వాడికి నేనే తల్లిననీ, వాడిని నేనే తీసుకుంటాననీ అనలేదు. వాడికి యిద్దరు తల్లులం. నేను క్రిందటి జన్మలో తల్లిని. ఆమె ఈ జన్మలో తల్లి. వాడికి ఇద్దరం సమానమే. సుందరి ఆఫీసుకి వెడితే వాడు నా దగ్గరవుంటాడు."

దుర్గాప్రసాద్ ఇంకేమీ అనలేక వూరుకున్నాడు. సుందరి ఔదార్యానికి, లక్ష్మిపట్ల ఆమెకుగల స్నేహభావానికి అతను ముగ్ధుడైనాడు. ఆమెకు అభ్యంతరం లేనప్పుడు లక్ష్మి అంతగా తలుచుకుని మురిసిపోతున్నప్పుడు తను ఎందుకు కాదని

వారించడం? పుట్టే బిడ్డ తన ఆనందమోహానే నన్న భ్రమలో ఆమెవున్నందువల్ల ఇప్పుడు వచ్చేనష్టమేమీలేదు. ఆమె సంతోషంగా ఉత్సాహంగా వుండడమే తనకు కావలసింది. ఇది ఒక రకమైన ఉన్మాదమైతే కావచ్చు కాని, తను ఆమెను గట్టిగా వారిస్తే హెచ్చరిస్తే ఆమె పూర్తిగా ఉన్మాదంలో పడిపోవచ్చు. అది మరీ ప్రమాదం. దానికంటే ఇది చాలా నయం.

సుందరి పుట్టింటివారు ఆమెను ఏడో నెలలో తమ ఊరు తీసుకువెళ్లారు. లక్ష్మి చాలా బాధపడింది. సుందరి కూడా బెంగుళూరులోనే ఏదైనా ఆస్పత్రిలో పురుడు పోసుకుంటుందనీ, తను దగ్గరుండి ఆమెకు సేవ చేయవచ్చుననీ బిడ్డను పుట్టిన మరు నిమిషంలో చూడవచ్చుననీ ఇన్నాళ్లు, అనుకుంది. కాని తను అనుకున్నదంతా తలక్రిందులయింది. సుందరి తల్లి దండ్రులు వచ్చి తన ప్రాణ మిత్రురాలిని నిర్దాక్షిణ్యంగా తన నుంచి దూరంగా తీసుకుపోతున్నారు. మళ్ళీ పురుడు అయిన తర్వాత మూడు నెలలకు గానీ తీసుకురారు. అన్ని నెలలు ఆమెను చూడకుండా తన బాబును తీసుకోకుండా ఎలా ఉండగలదు తను.

"నేనుండగా మీ అమ్మాయికి ఏ లోటూ రాదండి. మీరేమీ భయపడకండి. శుభ్రంగా ఇక్కడే ఏదైనా పెద్ద ఆస్పత్రిలో పురుడు పోయండి. ఆస్పత్రిలో అయితే అన్ని సదుపాయాలు వుంటాయి" అని చెప్పి చూసింది. కాని వాళ్ళకి ఈ సలహా నచ్చలేదు.

"ఎంతైనా మేము దగ్గర లేకుండా జరగదమ్మా, ఇప్పటి నుంచి పురుడు వెళ్ళిన తర్వాత మూడో నెల దాకానైనా మేను దగ్గరుండాల్సిందే. లేకపోతే అది చేసుకోవడం కష్టం.

మరి ఇన్ని నెలలు ఈ మహా పట్టణంలో మాలాంటి వాళ్ళకు జరుగుబాటు కావడమంటే మాటలా చెప్పు. పైగా ఆస్పత్రిలో అంటే మరి బోలెడు డబ్బు ఖర్చు. వందలకి వందలు పోయాలి మా ఊళ్ళో అయితే ఈ గొడవంతా వుండదు" అంది సుందరి తల్లి.

"డబ్బు విషయంలో మీరేమి బెంగపడకండి పిన్నిగారు! నేనుండగా మీ జరుగుబాటుకు ఏం లోటు? మీకు తెలీదు-గాకూ, సుందరికి ఒకటే ప్రాణం. మా ఇద్దరి మధ్య అటువంటి అరమరికలు లేవు" అంది లక్ష్మి. లక్ష్మి ఆప్యాయతకి సుందరి తల్లి దండ్రులు మురిసి పోయారు గానీ, ఆమె సలహా మాత్రం పాటించ లేదు. సుందరి పట్ల లక్ష్మికి గల స్నేహ స్వరూపం పూర్తిగా వాళ్ళకి ఎలా అర్థమవుతుంది? అది ఒక్క సుందరికి, కొంత వరకు దుర్గ ప్రసాద్ కి తప్ప ఇంకెవరికి అర్థం కాదు లక్ష్మి డబ్బు సహాయం చేస్తానంటే మాత్రం మళ్ళీ ఆ బాకీ తీర్చుకోవలసిందే కదా అనుకున్నారు సుందరి పుట్టింటివారు. ఇచ్చినా లక్ష్మి పుచ్చుకోకపోతే ఉచితంగా తీసుకున్నట్లే అవుతుంది కదా. అది మాత్రం ఏం బావుంటుంది. లక్ష్మి నుంచి ఉచితంగా డబ్బు సహాయం పొందడం సుందరి తల్లి దండ్రులకే కాదు-అసలు సుందరికే యిష్టం లేదు.

"ఒక్క ఐదారు నెలల్లో మళ్ళీ సుందరినీ, దాని బిడ్డనీ తాంబూలంలో పెట్టి నీకు అప్పగిస్తాం సరేనా? ఈ మహాపట్టణంలో దానికి నువ్వు కాకపోతే ఇంకెవ్వరున్నారు చెప్పు. నీ మాట కాదని తీసుకువెడుతున్నందుకు మరోలా అనుకోకు

తల్లీ. నువ్వూ నా కూతురు లాంటి దానివి"-అని సుందరి తల్లి లక్ష్మికి బుజ్జగించి చెప్పింది.

"సుందరిని చూడకుండా అన్ని నెలలు ఎలాగండీ ఉండడం?" అంది లక్ష్మి బేలగా.

సుందరి తల్లి ఆప్యాయంగా లక్ష్మి బుగ్గ పుచ్చుకుని "పోనీ నీకు మరీ బెంగపుట్టినప్పుడు రైలెక్కి మా వూరు వచ్చేసెయ్యి. బెంగతీరే వరకు అక్కడే వుందువుగాని. నీకు అక్కడ బోలెడుమంది చెల్లెళ్ళు, తమ్ముళ్ళు వున్నారు. కాలక్షేపానికేమీ కొదవ వుండదు" అని చెప్పింది.

"మీరు మాట వరసకి పిలిచినా, నేను నిజంగానే వస్తానండోయ్" అంది లక్ష్మి.

"తప్పకుండా రమ్మనేకదా పిలిచేది. నాకు తెలుసు నువ్వు వస్తావని. నా కోసం కాకపోయినా, పాపాయి కోసమైనా వస్తావు" అంటూ నవ్వింది సుందరి.

"పాపాయి కోసం కాకపోతే నీ కోసం రానను కున్నావా? ఇది వరకు మా పుట్టింటికి వెళ్ళినప్పుడు నెల కూడా తిరక్కుండా పరుగెత్తు కొచ్చింది నీ కోసం కదూ. నాకు పాపాయి ఎంతో నువ్వూ అంతే సుందరీ."

"అయితే నీ దృష్టిలో నేను పాపాయితో సమాన మన్నమాట" అంది సుందరి.

సుందరి బయలుదేరి వెళ్ళేటప్పుడు లక్ష్మి కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "ఏయ్ ఏమిటిది! పిచ్చిదానిలా? ఛీ...మరీ అంత పనికిరాదు తెలుసా?" అంటూ సన్నగా మందలించి కన్నీరు తుడిచింది సుందరి. ఆమె తల్లి ఆప్యాయంగా లక్ష్మి తల నిమిరి మెటికలు విరుచుకుంది. "నీ సహాయం తీసుకో

లేదని మనస్సులో పెట్టుకోకు తల్లీ. సుందరి చంటి బిడ్డని పెట్టుకుని వుద్యోగం ఎలా చేసుకుంటుందా అని అనుకుంటున్నాం! నువ్వు కాస్త బిడ్డని చూసుకుంటే అది మళ్ళీ ఉద్యోగానికి వెడుతుంది. అప్పుడు మాకు నీ సహాయం ఎలాగూ తప్పదు."

"సహాయం ఏమిటి పిన్నిగారూ? పుట్టేవాడు నా బిడ్డ. నా బిడ్డకి నేను చేసుకోవడంలో సహాయం ఏముంది?"

సుందరి వెళ్ళిపోయిన తర్వాత లక్ష్మికి మళ్ళీ తన జీవితం ఎంతో వెలితిగా కనిపించింది. సుందరీ వాళ్ళ అమ్మగారు ఆ కొద్ది కాలంలోనే తనకు బాగా అలవాటై పోయింది. ఆవిడ వచ్చిన తర్వాత సుందరి సెలవు పెట్టేసి ఇంట్లోనే వుండిపోయింది. అందుకని రోజంతా బోలెడు కాలక్షేపం. తను పగలంతా వాళ్ళింట్లోనే వుండేది. వద్దంటున్నా వినిపించుకోకుండా సుందరీ వాళ్ళ అమ్మగారికి వంట పనిలో సహాయం చేసేది. ఇప్పుడు వాళ్ళు వెళ్ళి పోయేసరికి ఏమీ తోచడం లేదు. ఇరుగు పొరుగు ఇళ్ళ వాళ్ళు పలకరిస్తే అడిగినదానికి సమాధానం చెప్పి వూరుకోవడం తప్ప, వాళ్ళతో ఏమీ మాట్లాడ బుద్ధి కాదు. వాళ్ళు తన స్నేహం కోసం ఎంత పాకులాడినా ఆట్టే దగ్గరికి చేరనిచ్చేదికాదు. వాళ్ళు మాట్లాడుతుంటే సోది లాగా బోరు కొట్టి తల నెప్పి వచ్చేది. వాళ్ళు వెళ్ళి పోయిన తర్వాత ఓ మాత్ర వేసుకుని కాఫీ తాగేది.

9

ఒంటరిగా వుంటే ఎన్నెన్నో ఆలోచనలు వచ్చేవి. ఆలోచనలతో మనస్సు బరువై పోతున్నట్లు అనిపించేది. సుందరి

వుంటే అవన్నీ ఆమెకు చెప్పుకుని మనస్సును తేలిక పరచు కునేది. ఇప్పుడు ఆమె లేకపోవడంవల్ల ఆ ఆలోచనల భారాన్ని తను ఒక్కతే భరించవలసివస్తోంది. సుందరిని తన ఎదురుగా వూహించుకుని, తన భావాలన్నీ ఆమెతో చెప్పు కుంటున్నట్లుగా వూహించుకునేది. ఒకొక్కప్పుడు మరీ భరించలేనప్పుడు తన ఆలోచనలన్నీ కాగితాలమీదికి ఎక్కించేది. తావులు తావులు ఉత్తరాలు రాసి సుందరికి పోస్టు చేసేది. వాటికి సుందరినుంచే సమాధానాల కోసం ఎదురు చూస్తూ కూర్చునేది. తను రాసినన్ని పేజీలు సుందరి రాయ డం లేదని మధ్య మధ్య కోపం తెచ్చుకునేది. "ఇంకెప్పుడూ సుందరికి రాయకూడదు" అనుకునేది. పంతం పట్టి ఓ వారం రోజులు రాయకుండా వూరుకునేది. తర్వాత మళ్ళీ "ఆమె తీరు అంతే" అని సరిపెట్టుకుని, రాయకుండా వుండలేక ఇంకో పెద్ద ఉత్తరం రాసి పోస్టు చేసిన రోజునే సుందరినుంచి వుత్తరం వచ్చేది. ఆమె తన అలక తీరుస్తూ బుజ్జగించుతూ రాసేది.

తన భార్యకు సుందరి తోడిదే లోకమైపోయిందని బాధ పడేవాడు దుర్గాప్రసాద్. లక్ష్మి ఎప్పుడూ సుందరిని గురించే ఆలోచిస్తూ వుంటుంది. ఆమెకు ఉత్తరాలు రాసుకుంటూ కూర్చుంటుంది. ఆమెకు పుట్టబోయే పాపాయిని వూహించు కుంటూ ఉంటుంది. తనను గురించి ఆలోచించదు. తన విష యం పట్టించుకోదు. తను ఎప్పుడు పలకరించినా సుందరిని గురించి, పుట్టబోయే పాపాయిని గురించి మాట్లాడుతుంది. తను ఇంకే విషయం మాట్లాడినా, కాసేపటిలో సంభాషణను సుందరి మీదికి మళ్ళిస్తుంది.

తన భార్య క్రమంగా తనకు దూరమై పోతున్నట్లు అని పించేది అతనికి. ఆమె తన ఎదురుగానే వున్నా తమ ఇద్దరి మధ్య ఏదో అగాధం వున్నట్లుగా, అది అంతకంతకు పెద్దదై పోతున్నట్లుగా అనిపించేది. ఆమె జీవితంలోకి సుందరి ప్రవే శించకముందు ఆమె ఈ విధంగా వుండేది కాదు. సుందరితో స్నేహం ఏర్పడిన తర్వాతకూడా ఆమె తనకు దూరమవు తున్నట్లు అనుకోలేదు. పిల్లవాడు పుట్టినప్పటినుంచి ఆమె దూరం కావడం మొదలుపెట్టింది. పిల్లవాడు పోయినతర్వాత ఇంకా దూరమయింది. సుందరికి పాపాయి పుట్టబోతున్నట్లు తెలిసినప్పటి నుంచి మరీ దూరమయింది. ఇక ఆ పాపాయి వస్తే ఆమె తన వునికినే గుర్తించకపోవచ్చు.

ఇలా ఆలోచించుకొంటున్నా అతనికి సుందరిపట్ల అసూయగాని, కోపంగానీ, చిరాకుగానీ కలగలేదు. సుందరి పట్ల తన భార్యకు అంత విపరీతమయిన స్నేహం, అభి మానం, ప్రేమ ఎందుకు కలిగాయో తెలీదు. ఒక్కొక్కరికి ఒక్కొక్కరిపై సహజంగా అంత ప్రబలమయిన ఆకర్షణ ఏర్పడుతుంది. దానికి కారణాలను అన్వేషించడం అనవసరం. ఒక్కొక్కప్పుడు విధివశాత్తూ వారి మధ్య ఆకర్షణ తొలగి పోవచ్చు. ఆకర్షణ తొలగకపోయినా పరిస్థితులవల్ల వారు విడిపోనూవచ్చు. ఎలాగైనా అటువంటి స్నేహం సాధార ణంగా విషాదాంతమే అవుతుంది. అలా అని బలవంతంగా వారిని విడదీయడమూ మంచిదికాదు. అందుకే మళ్ళీసహజంగా తన భార్య తనకు చేరువయ్యేవరకు ఆమె విషయంలో తను జోక్యం చేసుకోకూడదనుకున్నాడు. కాని, సుందరితో స్నేహమనే ప్రవాహంలో తన భార్య ఎక్కడికి కొట్టుకు

పోతుందోనని భయపడేవాడు. పిచ్చిగా ప్రేమించడం, మమకారం పెంచుకోవడం, బెంగపెట్టుకోవడం తప్ప ఇంకేమీ తెలియని అమాయకురాలు లక్ష్మి. అంత పిచ్చిగా ప్రేమించిన నేరానికి విధి ఆమెను ఎలా శిక్షిస్తుందోనని భయపడేవాడు. సుందరి, రామచంద్రరావు ఎల్లకాలం బెంగుళూరులోనే, ఈ వీథిలోనే, ఈ ఇంట్లోనే వుంటారని గ్యారంటీ ఏముంది? ఉద్యోగాలమీద ఆధారపడినవారు, అద్దె ఇళ్ళలో వుండేవారు ఎప్పుడయినా వూరు మారవచ్చు. ఇల్లు మారవచ్చు. అలా వాళ్లు వెళ్ళవలసివస్తే ఏమవుతుంది? లక్ష్మి అంతదూరం ఆలోచించదు. ఆ వూహనైనా మనస్సులోకి రానివ్వదు. తను చెప్పినా ఆమె పట్టించుకోదు. "ఎప్పుడో విడిపోవలసి వస్తుందని ఇప్పుడే స్నేహాన్ని తుంచేసుకుంటామా? ఎప్పుడో బాధపడవలసివస్తుందని ఇప్పటినుంచే బాధపడతామా?" అంటుంది. అందుకని ఆమె విషయంలో ఇప్పుడు తను చేయగలిగిందేమీ లేదనుకున్నాడు.

సుందరితో స్నేహ వ్యామోహంలోపడి తను భర్తను పట్టించుకోవడంలేదనే ఆలోచన లక్ష్మికి ఎప్పుడూరాలేదు. తను భర్తకు దూరమవుతున్నానని ఆమెకు అనిపించలేదు. అసలు ఆమెకు ఆ ధ్యాసేలేదు. తన సంగతి తనకేమీ విడ్డూరంగాకనిపించలేదు. అంతా మామూలుగానే వుంది ఆమెకు.

లక్ష్మి తన సంగతి పట్టించుకోవడం లేదన్న బాధ కలగకుండా మనస్సును మరపించడానికై దుర్గాప్రసాద్ సాహిత్యంలో నిమగ్నుడయినాడు. లైబ్రరీనుంచి పుస్తకాలు తెచ్చుకొని ఇంట్లో వున్నంతసేపు అవి చదువుతూ కూర్చునేవాడు. కేవలం కాలక్షేపం కోసం చదివే పుస్తకాలు కాక, తీవ్రంగా

ఆలోచింపజేసే గ్రంథాలు తెచ్చుకుని చదివేవాడు. ఆ పుస్తకాలు క్రమంగా అతన్ని మరో ప్రపంచంలోకి తీసుకు వెళ్ళాయి. కొన్నాళ్ళకి పుస్తకాలుతప్పమరో ఆలోచనలేకుండా పోయింది అతనికి. పరధ్యానం మనిషిలా తయారయ్యాడు. పుస్తకాల నిషాలో సమస్తాన్ని మరచిపోయాడు. అతను లైబ్రరీనుంచి తెచ్చుకోవడంతో తృప్తి చెందక పుస్తకాలు కొనడం ప్రారంభించినాడు. కొద్దిరోజుల్లో పుస్తకాలు చదవడంతో పాటు వాటిని సేకరించడం ఒక వ్యాసనంగా తయారయింది. తనకు కావలసిన ఒక్కొక్క పుస్తకంకోసం వూళ్ళోవున్న పుస్తకాల షాపులన్నీ తిరిగి గాలించేవాడు ఆ షాపుల వాళ్ళందరూ అతనికి స్నేహితులయినారు. కొన్ని షాపుల్లో కాతాలు పెట్టాడు. ఇంట్లో పెద్ద లైబ్రరీ వెలిసింది. ఇంట్లో వున్నంతసేపూ ఆ లైబ్రరీ గదిలోనే అతని నివాసం. రాత్రి పూట అక్కడే చదువుకుంటూ నిద్రపోయేవాడు. ఆఫీసులో కూడా పుస్తకాలు చదువుకుంటూ వుండేవాడు. మేనేజర్ కనుక అజమాయిషీతప్ప వేరే పనివుండేదికాదు. తీరిక కాలాన్ని పూర్తిగా పుస్తక పఠనానికి ఉపయోగించేవాడు.

భర్త జీవితంలో వచ్చిన ఈ మార్పు లక్ష్మి దృష్టికి రాలేదు. గమనించగల స్థితిలో లేదు ఆమె. తను పూర్తిగా వేరే ప్రపంచంలో వుంది. భార్యాభర్తలిద్దరూ ఒకరి సంగతి ఒకరు పట్టించుకోకుండా, పరధ్యానంగా, అయోమయంలో పడిపోయినట్లుగా, ఎవరిదారిని వారు రోజులుగడుపుతున్నారు. వారి విచిత్ర ప్రవర్తనను వంటమనిషి మాత్రం గమనిస్తోంది. ఏ తగాదా లేకుండా, ఏ సంఘటనా జరగకుండా, నిష్కారణంగా వారిద్దరు అంటీముట్టనట్లుగా ఎందుకు వుంటున్నారో

ఆవిడకి అర్థంకాలేదు. ఏమీలేకుండా వాళ్ళు అలా ఎందు కుంటారు? బయటికి కనిపించనిది ఏదో జరిగే ఉంటుంది అను కుంది. కాని వాళ్ళ మొహాల్లో ఎంత నిశితంగా పరిశీలించినా తగాదాపడిన సూచనలేవీ కనిపించడంలేదు. ఆ దంపతులకు మాత్రం తమను ఎవరయినా గమనిస్తున్నారేమోనన్న ధ్యాస కూడా లేదు.

లక్ష్మికి సుందరిపై బెంగ ఎక్కువయింది. ఉత్తరాలు రాసుకున్నా బెంగ తీరడంలేదు. ఒకసారి వెళ్ళి చూసివస్తా నని భర్తని అడిగింది.

"అదేమిటి లక్ష్మీ! మనకు వాళ్ళేమయినా బంధువులా? కేవలం స్నేహాన్నిబట్టి వెళ్ళి తిష్ఠవేస్తే వాళ్ళేమనుకుంటారు?" అన్నాడు దుర్గాప్రసాద్.

"వెళ్ళేటప్పుడు వాళ్ళ అమ్మగారు తప్పకుండా రమ్మని పిలిచిందండీ. పిలవకుండా వెళ్ళడంలేదుగా. ఒకసారి సుందరి కూడా రాసింది రమ్మని. తనకీ నన్ను చూడాలనిపిస్తోందిట."

"వాళ్ళేదో మాటవరసకి రమ్మంటే నిజంగానే వెళ్ళి కూర్చుంటే ఏం బావుంటుంది చెప్పు? అయినా అంతదూరం ప్రయాణం నువ్వు ఒక్క దానివీ ఏంచేయగలవు? మద్రాసులో రైలు మారాలి. మళ్ళీ బెజవాడలో బస్సు ఎక్కాలి. నీతో పాటు నేనుకూడా వచ్చి దిగబెట్టాలి. సుందరి వెళ్ళింతర్వాత ఇంతవరకు రామచంద్రరావే వెళ్ళలేదు చూడడానికి. వాళ్ళా విడమీద అతనికంటే నీకు బెంగ ఎక్కువయిపోయింది. వాళ్ళ అత్తారింటికి అతనికంటె ముందుగా నిన్ను తీసుకొని వెడితే అందరూ నవ్వుకోరూ?"

"మరి ఎల్లాగండీ సుందరిని చూడడం? పోనీ ఒక పని చేద్దాం. మీరు రావలసిన అవసరం లేకుండా ఒక ఉపాయం చెబుతాను. మీరు నన్ను మావూళ్లో దింపి వచ్చేసేయండి. నేను మావూళ్లో కొద్దిరోజులుండి అక్కడ్నించి వాళ్ళవూరు ఒక్కతెనీ బస్సులో వెడతాను. మావూళ్ళో బస్సెక్కితే వాళ్ళవూళ్ళో దిగవచ్చు. మధ్యలో ఎక్కడా మారవలసిన పనిలేదు. లేకపోతే మా చిన్నతమ్ముడ్నికూడా తోడు తీసుకు వెడతాను. సుందరీ వాళ్ళ వూళ్ళో కొన్నాళ్ళు వుండి, మళ్ళీ అక్కడ్నించి మావూరు వెళ్ళి మీకు ఉత్తరం రాస్తాను. మీరు వచ్చి నన్ను తీసుకురండి. అప్పుడు మీరు సుందరీ వాళ్ళవూరికి రావాల్సిన అవసరం వుండదు. నేనుకూడా ప్రత్యేకంగా సుందరిని చూడటానికి వెళ్ళినట్లుకాక, మావూరుకు వెళ్ళినట్లు, ఎలాగూ అంతదూరం వెళ్ళాను కనుక సుందరీవాళ్ళ వూరుకూడా వెళ్ళి చూసినట్లు వుంటుంది. అప్పుడు ఎవరూ ఏమి అనుకోరు, ఏవండీ చెప్పండి. అలా చేద్దామా?"

"సరే అలాగే చేద్దాం కాని, ఇప్పుడు కాదు. ఇప్పుడే వెళ్ళి చూసివస్తే, మళ్ళీ ఆ అమ్మాయికి పురుడు వచ్చిం తర్వాత పాపాయిని చూడడానికి ఇంకోసారి వెడతానంటావు. రెండుసార్లు వెళ్ళడం బాగుండదు. అందుకని ఓ పదిహేను రోజులు ఆగి వెడదాం. నువ్వు మీవూరు వెడుతున్నట్లు ఆ అమ్మాయికి ఉత్తరం రాయి. పురుడురాగానే మీ వూరి అడ్రసుకే ఉత్తరం రాయమని చెప్పు. ఆ అమ్మాయికి పురుడువచ్చి నట్లు ఉత్తరంరాగానే మీవూరునుంచి మీ తమ్ముడ్ని తీసుకుని వెళ్ళు."

"అవును నిజమే అలా అయితే రెండుసార్లు వెళ్ళాల్సిన అవసరం ఉండదు. ఓ పదిహేను రోజులాగి బయల్దేరితే, ఆ తర్వాత సుమారు వారం రోజులకి సుందరికి పురుడు రావచ్చు. ఆ వారం రోజులూ మావూళ్ళో వుంటాను."

ఈ పథకమంతా లక్ష్మి ఆరోజునే సుందరికి రాసేసింది. ఆ మర్నాటినుంచి రోజులు లెక్కబెట్టుకుంటూ కూర్చుంది. సుందరి పుట్టింటివాళ్ళు పేదవాళ్ళు. తను వెళ్ళి తిష్ఠవేస్తే వాళ్ళకి ఇబ్బందిగా వుంటుందేమో అనుకుంది. వట్టిచేతులతో వెళ్ళకుండా వాళ్ళకేమయినా ముట్టచెప్పాలనుకుంది. సుందరికి ఆమె తల్లి దండ్రులకి, చెల్లెళ్ళకి, తమ్ముళ్ళకి అందరికీ బట్టలు కొన్నది. వాళ్ళతోపాటు తన తల్లిదండ్రులకి, చెల్లెళ్ళకి తమ్ము ళ్ళకి బట్టలుకొన్నది. అన్నింటికంటే ముఖ్యంగా-సుందరికి పుట్టబోయే తన బంగారు తండ్రికోసం బోలెడు వస్తువులు కొన్నది. మూడుజతల చొక్కాలాగులు కొన్నది. ఊలుకొని చిన్న స్వెట్టరు, టోపీ, మేజోళ్ళు తను స్వయంగా అల్లింది. అవన్నీ పెట్టెలో సర్దుకుంది. ఇదివరకు భద్రంగా ఆనంద మోహన్ చొక్కాలు, చెడ్డీలు, వాడికి వుపయోగించిన వెండి ఉగ్గుగిన్నె, వెండి చెంచాకూడా పెట్టెలో సర్దుకుంది.

పంచాంగం తీసి తను బయలుదేరవలసిన తేదీ, వారం తిథి అన్నీ నిర్ణయించుకుంది. తేది నిర్ణయమయినప్పటి నుంచి తొందర ఎక్కువయింది. ఎప్పుడెప్పుడు రైలెక్కుదామా అని రోజులు, గంటలు లెక్కబెట్టుకుంటోంది. లక్ష్మి ఎంత తొందర పడుతున్నా కాలంమాత్రం యథాప్రకారం తన మామూలు వేగంతో గంటకు 60 నిమిషాల చొప్పునే నడుస్తోంది. లక్ష్మికి

చిరాకుగా వుంది. తన తొందరచూసి తనను ఉడికించడానికి కాలం కావాలని సోమరిగా, బద్ధకంగా, మందకొడిగా నడుస్తోందని అనుకున్నది.

బయలుదేరడానికి రెండురోజులు ముందుగా మళ్ళీ సుందరికి ఉత్తరం రాసింది-ఇక తనకు రాసే ఉత్తరాలు తన పుట్టింటి అడ్రసుకే రాయవలసిందని. తర్వాత మరి రెండురోజులు కూడా గడిచిపోయాయి. ఇంటికి తాళంపెట్టి భార్యాభర్తలిద్దరూ ప్రయాణమయ్యారు. చాలా రోజుల తర్వాత భర్తతో కలిసి రైలులో ప్రయాణం చేస్తున్నందుకు లక్ష్మికి సంతోషంగానే వుందికానీ, అంతకంటే ఎక్కువగా త్వరలో సుందరిని చూడబోతున్నందుకు, తన ఆనందమోహన్ మళ్ళీ భూమిపై అవతరించబోతున్నందుకు పట్టరానంత సంతోషంగా వుంది. రైల్లోనుంచి అటూఇటూ చూస్తూ భర్తకు చూపిస్తూ ఉత్సాహంగా మాట్లాడుతోందికానీ ఆ ఉత్సాహమంతా తనతోకలిసి ప్రయాణం చేస్తున్నందుకు కాదని దుర్గాప్రసాద్‌కు తెలుసు. అందుకని సహజంగా అతనికేమీ ఉత్సాహం కలగలేదు కాని, లక్ష్మి చిన్నబుచ్చుకుంటుందని లేని ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుని అతనూ నవ్వుతూ మాట్లాడుతున్నాడు.

లక్ష్మి మాట్లాడుతుంటే తరచుగా సుందరి ప్రస్తావన ఆనందమోహన్ ప్రస్తావన వస్తూనే వున్నాయి. వాళ్ళ వాళ్ళ ప్రస్తావన వచ్చినప్పుడల్లా భర్తమొహంలో అనాసక్తిని ఆమె గమనిస్తూనే వుంది. కొంతసేపు మౌనంగా వుండిపోయి ఆలోచనలో పడింది. అవును - ఆయనకు బాధగానే వుంటుంది. మరి తను ఆయనపట్ల శ్రద్ధచూపించడం మానేసింది. ఇప్పుడు కాదు- తనకడుపున ఆనందమోహన్ పుట్టినప్పటి

నుంచి, ఇప్పుడుకూడా సుందరికోసం ఆమెకూ పుట్టబోయే పాపాయి కోసం కలవరిస్తూ ఆయన సంగతి పట్టించుకోడడం లేదు. ఆయన ఒంటరివాడై పోయాడు. తనకు సుందరిలాగా ఆయనకు ఎవ్వరూ లేరు. ఆయనకుతోడు తనుఒక్కతే, తను కూడా దూరమైపోతుంటే ఆయనకు బాధగా వుండదా?

"నేను అస్తమానం సుందరినీ, ఆమెకు పుట్టబోయే బాబునీ కలవరిస్తూ మీ సంగతి పట్టించుకోవడం లేదని మీకు బాధగా వుంది కదూ?" అంది.

ఇంతసేపూ మౌనంగాపున్న భార్య నోటినుండి ఆ మాటలు రావడంతో దుర్గాప్రసాద్ ఉలిక్కి పడ్డాడు. ఆ మాటలు ఆశ్చర్యం కలిగించాయి. తనను గురించి ఆమె ఆలోచిస్తున్నదని గాని తన ఒంటరితనాన్ని ఆమె గమనిస్తునదని గాని అతను ఎప్పుడు అనుకోలేదు. తనను గురించి ఆలోచిస్తే ఆమె అంత నిర్లిప్తంగా వుండలేదని అనుకునేవాడు తను ఆమెనుగురించి ఆలోచిస్తున్నట్లే. ఆమెకూడా అంత ఎక్కువగా కాకపోయినా- మొత్తం మీద తనను గురించి ఆలోచిస్తూనే వున్నదని ఇప్పుడు మొదటిసారిగా తెలిసింది.

"లేదు. లక్ష్మి.... నువ్వు అనుకున్నట్లుగా నేను బాధ పడడంలేదు. మానసికంగా నువ్వు నాకు దూరమై పోతున్నావనే గానీ, వాళ్ళని కలవరిస్తున్నావని బాధపడడంలేదు. నీ పరిస్థితి, నీ మనస్తత్వం నేను బాగా అర్థంచేసుకోగలను."

"మీరు అర్థం చేసుకోగలరనే ధైర్యంతోనే వున్నాను. మనిద్దరిమధ్య ఈ దూరం ఎప్పుడూ ఇలాగే వుండదు, ఇది తాత్కాలికమైన ఒక ... మళ్ళీమన ఆనందమోహన్ వస్తాడు, వాడి ఆట పాటల్లో మళ్ళీ మనం ఏకమవుతాము.

"పోయిన పిల్లాడు మళ్ళీ పుడతాడనుకోవడం నీ భ్రమతప్ప మరేమికాదు లక్ష్మీ! నేనిలా అంటే నీకు కోపం రావచ్చు. బాధ కలగవచ్చు. అందుకే ఇన్నాళ్లు ఈ మాట గట్టిగా చెప్పలేదు. ఇప్పుడు ఈ నిజానికి నువ్వు తట్టుకోగలవనే నమ్మకంతో చెబుతున్నాను. నీకు కలవచ్చి వుండవచ్చు. కాని, కల నిజమవుతుందనుకోవడం కేవలం అమాయకత్వం. ఆ అమ్మాయికి పిల్లాడు పుడితే వాడు మన వాడెలా అవుతాడు? అసలు అమ్మాయికి ఆడపిల్ల పుడితే? అప్పుడు నువ్వు ఇంకా క్రుంగి కృశించి పోతావా? అటువంటి పరిస్థితికి నువ్వు ఇప్పటి నుంచే సిద్ధంగా వుండాలి. ఆ అమ్మాయికి ఆడపిల్ల పుడితే అది నీకు షాక్ కాకూడదు."

"నా నమ్మకం నాకు తప్ప మిగిలిన వాళ్ళందరికీ విడ్డూరంగా వుండడం సహజమే. ఆ సంగతి నాకు తెలుసు. సుందరికి ఆడపిల్ల పుడితే ఇదంతా నా వెర్రితనమేనని ఒప్పుకుంటాను. మగపిల్లాడు పుడితే నాకల నిజమని మీరు ఒప్పుకుంటారా? మీరు ఒప్పుకోరు- నాకు తెలుసు. అయినా మీరు వాడిని గుర్తుపడతారని నాకునమ్మకముంది. చూద్దాం ఏం జరుగుతుందో. మీరు చెప్పినట్లు నేను అనుకున్నదంతా తల్లకిందులైనా నేనేమీ అయిపోనులెండి."

"నాకు నమ్మకం లేదన్నానేగాని...నీ కల నిజం కావడం నాకు ఇష్టంలేదనుకోకు. మన పిల్లాడు మళ్ళీ కనిపిస్తాడంటే అంతకంటే సంతోషకరమైనదేముంటుంది? కాని, సుందరి నీకు ఎంత సన్నిహితురాలైనా, ఆమెకు పుట్టే బిడ్డ కిందటి జన్మలో మనపిల్లాడే అయినా ఈ జన్మలో వాడికి మనం

తల్లిదండ్రులం కాలేము. వాడు నిన్ను 'అమ్మా' అని పిలవడు. ఆ సంగతి కూడా నువ్వు జ్ఞాపకం ఉంచుకోవాలి."

10

మామగారింట్లో రెండురోజులున్న తర్వాత బెంగుళూరుకు తిరిగి వెళ్ళాడు దుర్గాప్రసాద్. లక్ష్మి వచ్చినందుకు ఆమె తల్లి దండ్రులు, చెల్లెళ్ళు, తమ్ముళ్ళు సంబరపడ్డారు గానీ, పుట్టింటికి వచ్చానన్న సంతోషం ఆమెకు అంతగా కలగన్లేదు. ఆ సంగతి రెండోరోజునే ఆమె తల్లి గ్రహించింది. లక్ష్మి వచ్చినప్పటి నుంచి చెప్పుల్లోకాళ్ళు పెట్టుకున్నట్లే మసులుతోంది. ఒక రైలు దిగి ఇంకోరైలు ఎక్కడానికి ప్లాట్ ఫారం మీద ఎదురు చూస్తున్న దానిలా వుంది. సుందరీ వాళ్ళ వూరికి వెళ్ళడానికి ఒక వంకగా తను ఈ వూరు వచ్చినట్లు ఆమె చెప్పలేదు. కాని, ఆమె మనస్ఫూర్తిగా ఇక్కడకు రాలేదని తల్లి తెలుసుకుంది. అయినా లక్ష్మి ఎందుకు అలావుందో ఆవిడకి అర్థంకాలేదు. అప్పుడే బెంగుళూరు మీదకి గాలి మళ్ళిందేమోననుకుంది. "అదేమిటే అలా ఉన్నావు?" అని అడిగితే, "నాకేం, మామూలుగానే ఉన్నానుగా!" అని సమాధానమిచ్చింది. అప్పటికీ ఆవిడ అనుమానం తీరనట్లుగా కనిపించేసరికి "ఇక్కడకు వచ్చేవరకూ రావాలనే వుంటుంది గానీ, తీరా వస్తే ఇక్కడ ఏమీ తోచదమ్మా" అని చెప్పింది.

తను ఈ వూరు వచ్చినట్లు సుందరికి ఉత్తరం రాసింది. రాసిన మూడోనాటినుంచి సమాధానం కోసం ఎదురు

చూడడం మొదలు పెట్టింది. పోస్టుమాన్ వచ్చే వేళకు గుమ్మంలో నుంచునేది. ఉత్తరం ఇవ్వకుండా పోస్టుమాన్ వెళ్ళిపోతుంటే ఉసూరుమంటూ లోపలకు వచ్చేది. భర్త ఉత్తరం కోసం ఎదురు చూస్తుందేమో ననుకుంది తల్లి. ఒక రోజు భర్తనుంచి ఉత్తరం వచ్చింది. అయినా లక్ష్మిలో పెద్ద ఆసక్తి కనిపించలేదు. సమాధానం రాసి పోస్టు చేసింది. మళ్ళీ పోస్టుకోసం ఎదురు చూడడం మొదలు పెట్టింది. ఆమె ఎదురు చూస్తున్నది భర్త ఉత్తరం కోసం కాదనీ, ఇంకెవరి ఉత్తరం కోసమో ఎదురు చూస్తూందనీ తల్లి గ్రహించింది. ఒక రోజు సుందరి నుంచి ఉత్తరం వచ్చింది. దాన్ని చూడగానే లక్ష్మి మోహం చాటంత అయింది. ఆమె సుందరి వుత్తరం కోసం ఎదురు చూస్తోందని తల్లికి అప్పటికి అర్థమయింది. లక్ష్మి సుందరికి తావుల తరబడి ఉత్తరాలు రాస్తుంటే ఆవిడ ఆశ్చర్యపోయేది. సుందరి ఎంతమంచి అమ్మాయో, ఆమెకీ లక్ష్మికీ ఎంత స్నేహమో ఆవిడకి బాగా తెలుసు.

సుందరి పుట్టింట్లో వుందనీ, త్వరలో ఆమెకు పురుడు రాబోతుందనీ, పురుడు రాగానే వెళ్ళి చూడాలనుకొంటున్నాననీ చెప్పింది లక్ష్మి. "తప్పకుండా వెళ్ళిరా. పాపం ఆ అమ్మాయి నీకోసం ఎంత చేసింది! ఇది వరకు అంతమంచి మనస్సుగల స్నేహితులు ఈ రోజుల్లో దొరుకుతారా?" అంది తల్లి.

ఆ తర్వాత పదిరోజులకి సుందరికి మగ పిల్లవాడు పుట్టినట్లు టెలిగ్రాం వచ్చింది. అది చూచి లక్ష్మి సంతోషం పట్టలేక పోయింది. "నామాటే నిజమయింది. నా కలే నిజమయింది. నా బాబే పుట్టాడు. నేను చెబితే ఆయన నమ్మలేదు

ఇప్పుడు తప్పకుండా ఒప్పుకుంటారు-" అంటూ వెర్రిగా ఏదో మాట్లాడేస్తోంది. ఆమె తల్లికి ఒక్కముక్క కూడా అర్థం కాలేదు. సుందరికి మగపిల్లాడు పుడితే లక్ష్మికి ఇంత సంబరం దేనికో! సుందరి పుట్టింటి వాళ్ళు తీరిగ్గా ఓకార్డు ముక్క రాసిపడెయ్యక టెలిగ్రాం ఎందుకు కొట్టారో ఆవిడకి అర్థం కాలేదు.

"అంత సంబరం ఏమిటే! మగపిల్లాడు పుట్టడం అంత విశేషమా?" అనడిగింది. లక్ష్మి గబుక్కున తెలుసుకుంది తనతప్పు. పుట్టిన పిల్లాడు తన ఆనందమోహన్ అని వీళ్ళందరికీ తెలియడం అనవసరం. వీళ్ళెవరూ నమ్మరు. అది వీళ్ళకి ఇష్టం వుండదు. తను వీళ్ళ ఎదుట మరీ ఎక్కువ సంతోషం వ్యక్తం చెయ్యకూడదు అనుకుంది. "అబ్బె అది కాదమ్మా... సుందరికి మగపిల్లాడంటే ఇష్టం. వాళ్ళాయనకి ఆడపిల్లంటే ఇష్టం. సుందరికి ఆడపిల్ల పుడుతుందని మీ అల్లుడుగారు అన్నారు. కాదు-మగపిల్లాడు పుడతాడని నేను పందెం వేశాను. ఇక్కడికి వచ్చేటప్పుడు రైల్లోకూడా ఇదే వాదించుకున్నాము. ఇప్పుడు నా మాటే నెగ్గింది. ఆయనే ఓడిపోయారు" అని చెప్పింది.

టెలిగ్రాం వచ్చిన రోజునే సుందరి వాళ్ళ వూరికి ప్రయాణం కట్టింది లక్ష్మి. "అంత తొందరేమిటే, మంచి రోజు చూసుకుని నెమ్మదిగా బైల్దేరుదువుగాని. నీ తొందర, నీ హడావిడి చూసి అక్కడ వాళ్ళంతా ముక్కుమీద వేలేసుకో గలరు" అని ఆపుచేసింది తల్లి.

మూడోరోజు వర్జంలేకుండా చూసి పసుపు, కుంకుమ, చలిమిడి, కొబ్బరిబొండాలు, రవికలగుడ్డలు, ఒక చీర ఇచ్చి

పంపించారు. అవన్నీ సుందరికి ఇవ్వాలని చెప్పారు. లక్ష్మికి తోడుగా చిన్న తమ్ముడు వెళ్లాడు. "అక్కడికి వెడితే మళ్ళీ జ్ఞాపకం వుంటామా? రెండురోజులో, మూడురోజులో ఉండి వచ్చేసెయ్యి"-అని చెప్పింది తల్లి. సరేనని తలవూపింది లక్ష్మి. లక్ష్మిరాక సుందరీ వాళ్ళింట్లో ఎవరికీ ఆశ్చర్యం కలిగించలేదు. ఆమె కోసం వాళ్ళంతా రెండు రోజుల క్రిందటినుంచే ఎదురు చూస్తున్నారు. సుందరి రోజూ తన తమ్ముళ్ళకీ, చెళ్ళెళ్ళకి లక్ష్మి గురించి చెబుతూ వుండేది. ఆమె ఎలా వుంటుందో, ఎలా మాట్లాడుతుందో వర్ణించి చెప్పేది. అందుకని, చూడక పోయినా, ఇంట్లో అందరికీ లక్ష్మి సుపరిచితురాలే. టెలిగ్రామ్ చూడగానే లక్ష్మి నించున్నపళంగా బయల్దేరి వచ్చేస్తుందని చెప్పింది సుందరి. అందుకని ఇంటిల్లిపాదీ 'లక్ష్మి అక్క' కోసం రోజూ ఎదురు చూస్తున్నారు. రోడ్డు మీద బస్సు చప్పుడు వినిపించినప్పుడల్లా వీధి గుమ్మంలోకి పరుగెత్తుకు వచ్చి చూస్తున్నారు.

ఇంటిముందు బస్సు ఆగగానే సుందరి తమ్ముళ్ళిద్దరూ వీధిలోకి పరుగెత్తారు. బస్సులోంచి లక్ష్మి, ఆమె తమ్ముడు దిగడం చూసి "లక్ష్మి అక్క వచ్చింది, లక్ష్మి అక్క వచ్చింది" అని కేక పెట్టి బస్సు దగ్గరికి పరుగెత్తారు. సుందరి చెల్లెళ్ళిద్దరూ వీధి గుమ్మం దగ్గరకి వచ్చి నుంచున్నారు. వంట చేసుకుంటున్న సుందరి వాళ్ళ అమ్మగారు కూడా వరండాలోకి వచ్చింది. సుందరీ వాళ్ళ నాన్నగారు పైపంచ బుజాన వేసుకొని బస్సు దగ్గరికి వచ్చారు. సుందరి తమ్ముళ్ళిద్దరూ సాయంపట్టి లక్ష్మి పెట్టెను ఇంట్లోకి చేరవేశారు.

లక్ష్మి గుమ్మంలో అడుగు పెట్టగానే సుందరి చెల్లెళ్ళిద్దరూ చెరోవైపు పట్టుకుని, "రా అక్కా. నీ కోసం మొన్నటినించి చూస్తున్నాం" అంటూ లోపలికి తీసుకు వెళ్ళారు.

"ఏదీ నా బాబు? ఎక్కడ? ముందు వాడిని చూడాలి" అంది లక్ష్మి ఆత్రంగా.

"ముందు నూతి దగ్గరకు రా అక్కా. కాళ్ళు కడుక్కుందుగాని" అంటూ ఒక పిల్ల నూతి దగ్గరకి తీసుకు వెళ్ళింది.

"ఏమ్మా ప్రయాణం బాగా జరిగిందా, అవస్త అయిందా?" అని అడిగింది సుందరి తల్లి.

"అవస్తేముందండి. అక్కడ ఎక్కితే ఇక్కడ దిగడమే."

"మీ వాళ్ళంతా కులాసానా?"

"ఆ! అందరూ కులాసాయే. ముందు నాకు అర్జెంటుగా మా అబ్బాయిని చూపించండి పిన్నిగారూ"

"కాళ్లు కడుక్కున్నావుగా... ఇంక రా...సుందరి రోజూ నీ కలవరింతే" అంది ఆవిడ నవ్వుతూ.

పురిటిగదిలో మంచంమీద పడుకునివుంది సుందరి... ఆమె పక్కనే పొత్తిళ్ళలో ఎర్రగా పసికందు. లక్ష్మి ఆత్రంగా గదిలోకి వచ్చింది.

"ఏమ్మా ఇంత తీరుబడిగా వచ్చావు? టెలిగ్రాం చూడగానే పరుగెత్తుకొస్తావనుకున్నాలే! నా కోసం కాకపోయినా మీ అబ్బాయి కోసమైనా వస్తావనుకున్నాను" అంది సుందరి చిరుకోపంతో.

పాపాయిని ఎత్తేసుకుని, ముద్దులు పెట్టేసు కోవాలను కున్న లక్ష్మికి వాడిని చూడగానే ఎలా ఎత్తుకోవాలో తెలీలేదు. "ఎలాగురా నిన్ను ఎత్తుకోవడం? ఇంత పిల్లి కూనలాగా వుంటే నిన్ను ముట్టుకోవాలంటేనే కందిపోతావేమోనని భయంగా వుంది" అంటూ సుతారంగా మునివేళ్ళతో వాడి బుగ్గలు నిమిరింది. లక్ష్మి తర్వాత అతి జాగ్రత్తగా పొత్తిళ్ళతో సహా వాణ్ణి చేతుల్లోకి తీసుకొని మెల్లగా ముద్దు పెట్టుకుంది. "అల్లా చూస్తావేరా? నేనురా... గుర్తుపట్టలేదూ? అమ్మనిరా" అంది.

సుందరి చెల్లెళ్ళిద్దరూ తెల్లమొహం వేసుకుని చూస్తున్నారు సుందరి వాళ్ళమ్మగారు దగ్గరకొచ్చి "ఒరే బుజ్జిగా చూడరా... నీ ఇంకో అమ్మ వచ్చింది" అంది.

"ఇంక నాతో ఎందుకు మాట్లాడతావు? వాడితోనే సరిపోతుంది నీకు" అంది సుందరి

"అదికాదు సుందరీ...వెంటనే బయల్దేరదామనుకుంటే మా అమ్మ చలిమిడీ అవీ చేసి ఇస్తానని ఆపింది. పైగా తమ్ముడికి స్కూలు, వాడికి ఇవాళా రేపూ సెలవు. ఇంతకీ మీవారు వచ్చినట్టులేదే ఇంకా?"

"వచ్చినా పిల్లాడినిచూడకూడదు. శాంతివుంది. పురుడు వెళ్ళగానే వస్తారు."

"కన్నగాడు, కుట్టిగాడు, కాసుగాడు, బుజ్జిగాడు" అంటూ పిల్లాడిని ముద్దులు పెట్టుకుంటూ సుందరికేసి చూసింది లక్ష్మి. "అయ్యో ఇంతల్లా ముద్దులు పెట్టేసుకుంటూంటే మీ అమ్మకి భయంగా వుందిరా ఏమైపోతావోనని. బెంగుళూరు వెళ్ళేదాకా నువ్వు ఆ అమ్మ దగ్గరే పడుకో" అంటూ

నెమ్మదిగా మళ్ళీ వాడిని సుందరి ప్రక్కన పడుకోబెట్టేసింది.

"బావుందర్రా మీ ఇద్దరి వరస. ఇద్దరు తల్లుల గారంతో వాడు ఎంత గడుగ్గాయి అవుతాడో" అంది సుందరి అమ్మగారు.

"ఇంతకీవీళ్ళల్లోఎవరుఎవరో తెలుసా?" అంటూ సుందరి తన చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ పరిచయం చేసింది. "ఇది అరుణ, అది కమల, వాడు రామం, వీడు చంద్రం. అరుణ తర్వాత రామం, వాడి తర్వాత కమల, తర్వాత చంద్రు"-అని చెప్పింది.

"వీడు మా తమ్ముడు గోపాలం" అని చెప్పింది లక్ష్మి. సుందరి తండ్రి తప్ప మిగతా అందరూ ఆ పురిటి గది దగ్గరే ఉన్నారు. లక్ష్మికి, గోపాలానికి రెండు పీటలు తెచ్చివేశాడు రామం. అరుణ ఇద్దరికీ కాఫీలు తెచ్చి యిచ్చింది. లక్ష్మి కాఫీ తాగుతూ పాపాయికేసి చూస్తోంది. వీడు ఆనందమోహనే సందేహం లేదు అనుకుంది.

సుందరి మెల్లగా పాపాయి బుగ్గలు నిమురుతోంది. ఆమె ముఖం ప్రసన్నంగా వుంది. ఆమె చాలా అందంగా కనిపించింది లక్ష్మికి. అందం ఇదివరకే వుంది. ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. కాని శోభ మాత్రం కొత్తగా వచ్చింది. సాఫల్యం వల్ల వచ్చిన శోభ అది. వసంతంలో చిగిర్చిన చెట్టులాగా నిండుగా కన్నుల పండువుగా వుంది అనుకుంది లక్ష్మి.

కాని, మాతృత్వం వల్ల తనలో మార్పువచ్చినట్లు కనిపించకుండా వుండాలని సుందరి ప్రయత్నిస్తున్నట్లు కనిపించింది లక్ష్మికి. తనని లక్ష్మి గమనిస్తున్నట్లు తెలుసుకుంది సుందరి.

"మీరంతా ఇక్కడ దేనికర్రా ఇంక వెళ్ళండి. ఒసే అరుణా! లక్ష్మి అక్కకి నీళ్ళు పెట్టు స్నానానికి. కమలా వంటింట్లో అమ్మకి సాయం కూర్చో పో. ఒరే రామం, బజారు నుంచి ఏవైనా తీసుకురావాలో ఏమిటో చూడుపో. చంద్రూ...నువ్వు గోపాలాన్ని గిళ్ళగదికి తీసుకెళ్ళివేణ్ణీళ్ళు తోడుపో" అంటూ అందర్నీ పంపేసింది సుందరి.

అందరూ వెళ్ళిన తర్వాత గదిలో ఇద్దరు తల్లులూ, పిల్లాడూ మిగిలారు. "వీడు ఆనందమోహనే నంటావా?" అంది నవ్వుతూ సుందరి.

"ఇంకా సందేహమా? ఖలేటక్కరి వీడు. నీ కడుపున పుట్టాలని సరదాపుట్టింది వీడికి. చూడు ఎంత నంగనాచిలా చూస్తున్నాడో ఏమీ తెలీనట్లు. నేనేం తక్కువ చేశానురా నీకు. నువ్వు ఇక్కడ అవతరించావు?"

"నువ్వు తక్కువ చెయ్యలేదు. మరీ ఎక్కువ చేశావు గారాబం. ఆ గారాబంతో ఉక్కిరిబిక్కిరై పోయి ఇక్కడ పుట్టాడు."

"అయితే నా గారాబం వీడి ఒంటికి పడలేదన్నమాట. నిజం చెప్పావు సుందరీ...ఉక్కిరి బిక్కిరై పోయే లక్షణం. ఉక్కిరి బిక్కిరి చేసే లక్షణం నాలోవుంది. నువ్వు అప్పుడప్పుడూ నన్ను అదుపులో పెడుతూ వుండాలి."

"నిన్నూ, వాణ్ణీ ఇద్దర్నీ కనిపెడుతూ వుండాలన్న మాట."

"అది సరేగానీ సుందరీ. వీడు పుట్టిన తర్వాత నువ్వు అద్దంలో మొహం చూసుకొన్నావా?"

"ఏం... చూసుకో వలసినంత విశేషం ఏముంది? ఎప్పుడూ వున్న మొహమేగా?"

"ఎప్పుడూవున్న మొహమే కాని ఎలా వెలిగిపోతోందో చూసుకో!"

"ఆ వెలుగు నీ కళ్ళలో వుంది. నా మొహంలో లేదు. నేను ఎప్పటిలాగ్గే వున్నాను."

"నీమొహం బావుందంటే అంత మొహమాటం పడతావే ఒప్పుకోవడానికి? పెళ్ళికూతురుకి వద్దన్నా కళవచ్చినట్లు, మొదటి కాన్పుకు కూడా ఒకరకం కళవస్తుంది. ఆ కళ వచ్చిందోలేదో చెప్పవలసింది నువ్వుకాదు. చూసేవాళ్ళు చెప్పాలి. నేను చెబుతున్నాను కనుక నువ్వు నమ్మాలి."

లక్ష్మి పీట మంచం దగ్గరికి జరుపుకొని కూర్చుని, సుందరి తలపై చెయ్యివేసి, ఆప్యాయంగా నిమురుతూ, రహస్యం చెబుతున్నట్లుగా "నువ్వు ఇప్పుడు ఎంత అందంగా ఉన్నావో తెలుసా? నానిగాడిలాగానే నువ్వూ ముద్దొచ్చేస్తున్నావ్" అంది.

సుందరి కొద్దిగా సిగ్గుపడింది. మళ్ళీ అంతలోనే మందలిస్తున్నట్లుగా "ఏయ్...అదుగో మళ్ళీ ఉక్కిరి బిక్కిరి అవుతున్నావ్, చేస్తున్నావ్" అంది.

"ఓ...తప్పైపోయింది" అంటూ సుందరి తలమీద నుంచి చెయ్యి తీసెయ్యబోయింది లక్ష్మి. సుందరి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని మెత్తగా నొక్కుతూ "లక్ష్మి... నేనంటే నీకు అంత మమకారం దేనికి" అంది. ఆ మాట అంటుంటే సుందరి కళ్ళు చెమర్చాయి.

"ఎందుకో తెలిస్తే ఇన్నాళ్ళు చెప్పకుండా వుంటానా? నువ్వూనేను ఒకటేననీ, నాలో నువ్వు ఒక భాగమనీ అనిపిస్తుందినాకు. అందుకే నీకు పుట్టినబిడ్డ నావాడేనని అనుకో గలుగుతున్నాను. ఇంకెవ్వరికైనా పుట్టిన వాడిని అలా అనుకోగలనా? పునర్జన్మఅంటూవుంటే ఆనందమోహన్ నీకడుపున తప్ప ఇంకెక్కడా పుట్టడని అనుకున్నాను. దీన్ని మూఢనమ్మకం అని ఎవరైనా అనుకున్నా ఫర్వాలేదు. నిజంగా మూఢనమ్మకమే అయినా కావచ్చు. మూఢురాలినే కావచ్చు. కాని నాకు అలా అనిపించడంలో మాత్రం అబద్ధం లేదు."

ఏదో చెప్పాలనుకుని గదివైపు వచ్చిన సుందరి తల్లి వాళ్ళిద్దరూ చేయి చేయి పట్టుకొని ఎంతో స్నేహంగా మాట్లాడుకోవడం చూసి, అంతరాయం కలిగించడం ఇష్టం లేక వెళ్ళిపోయింది. అది గమనించి లక్ష్మి పీట కొంచెం అవతలకి జరుపుకుని కూర్చుంది. "లక్ష్మీ! మనం ఇద్దరం మంచి స్నేహితులమని మా ఇంట్లో వాళ్ళందరికీ తెలుసుగానీ మన అనుబంధం ఎంత గాఢమైనదో వాళ్ళకి తెలియదు. తెలియనవసరం లేదు. వీడు నీ ఆనందమోహన్ అనేమాట వాళ్ళెవరి దగ్గరా అనకు, నీ మనస్సులోనే ఉంచుకో. నీకు ఈ నమ్మకం ఉన్నట్లు నేను మా వారికి కూడా చెప్పను."

"అది అంత అపరాధమా సుందరీ?" లక్ష్మి దిగులుగా మొహం పెట్టింది.

"కాదు లక్ష్మీ... నీ భావాలు, అనుభూతులు అసాధారణమైనవి. నిన్ను ఎవరూ అర్థం చేసుకోలేరు."

"అవును సుందరీ, నా నమ్మకాన్ని మా వారే కొట్టి పారేశారు. నేను బాధపడతానని మరీ ఎక్కువగా వాదించ లేదు గానీ, ఆయన కసలు నమ్మకంలేదు. ఎవరు నమ్మక పోయినా, అర్థంచేసుకోక పోయినా నువ్వు అర్థం చేసుకుంటే చాలు. సుందరీ...మీవాళ్ళ దగ్గర అలా మాట్లాడను."

"స్నానానికి రా అక్కా" అని పిలిచింది అరుణ. వస్తున్నాపద" అని లేచింది లక్ష్మి.

"స్నానం చేసిన తర్వాత మరీ ఇంక దగ్గరగా రాకు" అని నెమ్మదిగా చెప్పింది సుందరి. సరేనని తలవూపింది లక్ష్మి.

స్నానం చేసిన తర్వాత లక్ష్మి పెట్టె తెరుస్తుంటే పిల్ల లంతా చుట్టూ మూగారు.

"ఇది బుజ్జిగాడికి ఉగ్గుగిన్నె. ఇది చెమ్చా. ఇవిగో గిలక్కాయలు" అంటూ అన్నీ పెట్టెలోంచి తీసింది లక్ష్మి. పాపాయికి తెచ్చిన చొక్కాలు లాగులు తీసింద.

"అమ్మా బుజ్జిగాడి కోసం లక్ష్మి అక్క బోల్డన్ని తెచ్చిందే" అంటూ వంటింట్లోకి పరుగెత్తాడు చంద్రు.

సుందరి తల్లి కూడా వచ్చి చూసి "దేనికమ్మా ఇవన్నీ తెచ్చావు?" అంది.

"నానిగాడికి అన్నీ వుండద్దుటండీ" అందిలక్ష్మి. తర్వాత పిల్లలందరికీ తెచ్చిన బట్టలన్నీ చూపించింది. వాటిని చూసి పిల్లలు "ఎంత బావున్నాయో! బెంగుళూరులో కొన్నావా అక్కా?" అని అడిగారు.

"పిన్నిగారూ, ఇది బారసాల పీటల మీదికి సుందరికోసం తెచ్చాను. ఈ పంచలు మీ అల్లుడిగారికి. ఈ చీరమీకు. ఈ పంచలు బాబయ్యగారికి" అంటూ తీసిచూపింది లక్ష్మి.

"ఇవన్నీ నువ్వు దేనికమ్మా తీసుకురావడం?" అంది ఆవిడ.

"మీరు కొంటారనే నేనే ముందుగా తీసుకొచ్చాను. బారసాల వ్యవహారమంతా నా చేతులమీదుగాం జరగాలి పిన్నిగారూ...నేను మాత్రం మీ అమ్మాయిని కషూ. నేను సుందరికీ, అరుణకీ మధ్య పిల్లననుకోండి."

"అవునే అమ్మా...లక్ష్మి అక్క మాకు చిన్నక్క" అంటూ లక్ష్మి చెయ్యిపట్టుకుంది అరుణ.

11

లక్ష్మి ఆరోజే భర్తకు ఉత్తరం రాసింది- తను సుందరీ వాళ్ళ వూరు వచ్చినట్లు. "సుందరికి పుట్టిన పాపాయి మన ఆనందమోహానే. చూస్తే మీరూ ఒప్పుకుంటారు. మీరు అసలు సుందరికి మగపిల్లవాడు పుడతాడనే నమ్మలేదు మొదట. చూశారా! నేను చెప్పింది నిజమయింది. నాకల నిజమయింది. రామచంద్రరావు గారితోపాటు మీరూ రాకూడదూ ఇక్కడికి? మన అబ్బాయిని చూద్దురుగాని. ఇక్కడనుంచి మనిద్దరం మా వూరు వెళ్ళి అక్కణ్ణించి బెంగుళూరు తిరిగివెడదాం" అని రాసింది. కాని దుర్గాప్రసాద్ రాడనీ, ఆనందమోహన్ తిరిగి పుట్టాడన్న మాటను నమ్మడనీ ఆమెకు తెలుసు. పిల్లాడిని స్వయంగా చూస్తే నమ్ముతాడన్న ఆశ వుంది.

రెండు రోజుల తర్వాత గోపాలం "ఇంక వెడదామే అక్కా" అన్నాడు. అంతవరకు ఈ వూరునుంచి తిరిగి వెళ్ళాలన్న ఆలోచనే రాలేదు లక్ష్మికి. "నువ్వు వెళ్ళరా...నేను

బారసాల అయిన తర్వాత వస్తాను. అమ్మతో చెప్పు నేనింకో వారం పదిరోజుల్లో వస్తానని. నేనొక్కతెనీరాగలను. ఇక్కడ ఇంటి ముందు బస్సు ఎక్కితే మన ఇంటిముందు దిగవచ్చు" అని చెప్పింది. సరేనని గోపాలం ఒక్కడూ తిరిగి వెళ్ళాడు వూరికి.

పాపాయిని ముద్దులాడుతూ మురిసిపోవడం, పిల్లలందరినీ చుట్టూ చేర్చుకుని కబుర్లు చెప్పడం, ఇంటిపనుల్లో సుందరీ వాళ్ళ అమ్మగారికి సాయపడడం, సుందరికి కావలసినవి అందించడం యిలా లక్ష్మికి రోజులు ఇట్టేగడచిపోతున్నాయి. ఇంట్లో పిల్లలందరికీ ఆమె బాగా అలవాటయిపోయింది. "అక్కా' అక్కా" అంటూ అస్తమానం కొంగు పట్టుకుతిరుగుతున్నారు. సుందరీ వాళ్ళ అమ్మగారికి లక్ష్మి సొంతకూతురు లాగానే అనిపిస్తోంది. వద్దంటున్నా వినిపించుకోకుండా లక్ష్మి అన్ని పనుల్లోనూ కల్పించుకుని చేస్తోంది. ఒకొక్కక్క పూట వంటంతా తనే చేస్తోంది. వేరే వాళ్ళ ఇంటికి వచ్చామన్న ఆలోచనే రాలేదు ఆమెకు. సుందరీ వాళ్ళ అమ్మగారు వంట చేసుకుంటుంటే దగ్గర కూర్చుని, బారసాల నాటికి చేయవలసిన ఏర్పాట్లన్నీ సొంత తల్లితో చర్చించినట్లుగానే చర్చించేది. లక్ష్మి చకచకా ఇల్లంతా తిరుగుతూ వుంటే సుందరీ వాళ్ళ అమ్మగారికి కన్నులు పండువుగా వుండేది, "నువ్వు వచ్చినప్పటి నుంచి ఇల్లు పెళ్ళిపందిరిలా కళకళ లాడిపోతోంది తల్లీ" అని ఆవిడ ఆప్యాయంగా మెటికలు విరుచుకునేది.

దుర్గాప్రసాద్ నుంచి లక్ష్మికి ఉత్తరం వచ్చింది. "ఆ వూళ్ళో ఎక్కువ రోజులుండడం బావుండదు. వీలయినంత త్వరగా మీవూరు తిరిగి వెళ్ళి, అక్కడినుంచి నాకు ఉత్తరం

రా స్తే నేను అక్కడకి వస్తాను. ఇద్దరం కలిసి తిరిగి రావచ్చు ఇక్కడికి. నేను రామచంద్రరావు వెంటరావడం బావుండదు. పాపాయి ఎలాగూ ఇక్కడికి వచ్చేవాడేగా. ఇక్కడచూస్తాను" అని రాశాడు.

పదోనాటికి బెంగుళూరు నుంచి రామచంద్రరావు వచ్చాడు. మర్నాడు శుద్ధి అయిన తర్వాత, బ్రాహ్మణుడు వచ్చి పుణ్యాహవచనం అంతా చేసిన తర్వాత, శాంతి తతంగం అయిన తర్వాత పిల్లాడిని చూపించారు అతనికి. అంతవరకు అతను కాలుకాలిన పిల్లిలాగా తిరిగాడు, అతని ఆత్రంచూసి నవ్వుకున్నారు సుందరి, లక్ష్మి.

శుద్ధి అయినప్పటినుంచి పాపాయి పనులన్నీ తనేచేయడం మొదలు పెట్టింది లక్ష్మి. పాపాయిని కాళ్ళమీద పడుకోబెట్టుకుని తనే నీళ్ళుపోసేది. ఒళ్ళు తుడిచి, ఒళ్ళంతా పౌడరు వేసేది.కళ్ళకు కాటుక పెట్టేది. బుగ్గకుచుక్క పెట్టేది.ఆమెఊపనులన్నీచేస్తుంటే పిల్లలంతాచుట్టూమూగేవారు. సుందరిప్రక్కకోన కూర్చుని చూస్తూ వుండేది. పిల్లాడి పనులు చేస్తున్నప్పుడు మధ్య మధ్య జ్ఞాపకం వచ్చినప్పుడల్లా లక్ష్మి "ఇదిగో నమ్మోయ్...ఇక ఈ మిగిలిన పనులన్నీ నువ్వు చేసుకోవాల్సిందే"-అని సుందరికి పాపాయిని ఇచ్చేసేది. "ఫర్వాలేదు చెయ్యి. నేనేమీ అనుకోనులే. నువ్వు చెయ్యకపోతే వాడికి నీ ఋణం ఎల్లా తీరుతుంది? ఎంత ఋణపడ్డావో ఏమిటో" అనేది సుందరి.

రామచంద్రరావు పిల్లాడిని చూడాలని గదిలోకి తొంగి చూచినప్పుడల్లా పిల్లాడిదగ్గర లక్ష్మి వుండేది. తన ఆత్రం చూసి లక్ష్మి నవ్వుకుంటుందేమోనని అతను గప్‌చిప్‌గా వెళ్ళి

పోయేవాడు. అతను ఆ విధంగా తొంగిచూడడం గమనించి నప్పుడు లక్ష్మి కాసేపు పిల్లాడిని విడిచి వంట ఇంట్లోకి వెళ్ళి పోయేది. అప్పుడు రామచంద్రరావు వచ్చి కాసేపు పిల్లాడిని ముద్దులాడేవాడు. అతనూ, సుందరీ కలిసి పిల్లాడి పోలికలను గురించి చర్చించేవారు. రామచంద్రరావు అవతలికి వెళ్ళగానే లక్ష్మి వచ్చి మళ్ళీ పిల్లాడి పనుల్లో నిమగ్నమయ్యేది.

తను బారసాలదాకా వుండి పుట్టింటికి వెడుతున్నట్టు భర్తకు రాసింది లక్ష్మి. ఆ విషయమే తన తండ్రికి కూడా రాసింది. బారసాల అయిన తర్వాతనైనా తను పిల్లాడిని విడిచి వెళ్ళక తప్పదు. ఆ విషయం తలచుకుంటేనే పిల్లాడి మీద బెంగ ఎక్కువై పోయేది. ఎంత ప్రాణానికి ప్రాణంగా చూసుకున్నా, దగ్గరున్నప్పుడు వాడి పనులన్నీ తనే చేసినా వాడు సుందరి పిల్లాడే అవుతాడుగానీ తన పిల్లడు కాడని అనుకుంటే కళ్ళవెంట నీళ్ళు వచ్చేవి మళ్ళీ అంతలోనే "సుందరి పిల్లడైతేనేం, నా పిల్లడైతేనేం. సుందరి పిల్లడైతే నాపిల్లడు కాకుండా పోతాడా? సుందరీ, నేను ఒక్కటే. వాడు మా ఇద్దరిలో ఎవరి పిల్లడయినా ఒక్కటే. వాడిని విడిచి వెళ్ళ వలసివస్తుందనే బాధతప్ప వాడు సుందరి పిల్లాడైనందుకు నాకేమీ బాధ లేదు" అనుకున్నది తనలో. తనూ, సుందరీ బెంగుళూరు చేరేదాకా యింతేనని మనస్సును సమాధాన పరుచుకుంది.

"సుందరీ...నానిగాడికి ఏం పేరు పెడతావు?" అని అడిగింది లక్ష్మి.

"నువ్వే చెప్పు"

"నేను చెబితే ఏం లాభం? మగపిల్లాడు పుడితే ఏంపేరు

పెట్టాలో, ఆడపిల్ల పుడితే ఏం పేరు పెట్టాలో నువ్వూ-మీ వారూ ఇదివరకే అనుకునేవుంటారు"

"లేదు లక్ష్మి. మేము ఏమీ అనుకోలేదు. నేను ఏదో పేరు నిర్ణయించుకుని వుంటాననే ఉద్దేశంతోనే ఆయన ఏదీ నిర్ణయించలేదు. నిన్ను అడిగి నిర్ణయించుదామనే ఉద్దేశంతో నేనుఏమీ అనుకోలేదు."

"ఆనందమోహన్ అనే పెడదామా?"

"ఆనందమోహనా? ఆపేరు ఇదివరకు పోయిన నీ పిల్లాడిపేరు అని మా ఆయనకి, మా అమ్మా, నాన్నావాళ్ళకీ తెలుసుగదా? ఆపేరు పెడదామంటే వాళ్ళకి ఆక్షేపణగా వుంటుంది. వాళ్ళకి అనుమానం లేకుండా మురళీమోహన్ అని పెడదాం. మోహన్ అనే పేరు కలుస్తుంది కదా. నీ మాట కాదన్నానని కోపం తెచ్చుకోకేం?"

"లేదు సుందరీ. నువ్వు చెప్పిందే నిజం. మురళీ మోహన్ అని పెట్టడమే బావుంటుంది. ఇతరులెవ్వరికీ అనుమానం రాకూడదు. ఆక్షేపణగా వుండకూడదు."

12

లక్ష్మి స్వయంగా శ్రద్ధపట్టి 21 వ రోజు బారసాల కార్యక్రమం యథావిధిగా జరిపించింది. పురోహితుడ్ని పిలిపించి బారసాలకు కావలసినన్నీ జాబితా రాయించింది. అవన్నీ తన ఖర్చుతో బజారు నుంచి తెప్పించింది. తను తీసుకొచ్చినవికాక ఇంకా కొనవలసిన బట్టలకోసం షాపు నుంచి పెద్ద మూట తెప్పించి, తనే స్వయంగా మంచివి ఏరింది. గాజుల

బత్తులను పిలిపించి, ఆడవాళ్ళందరికీ మంచి మంచి గాజులు వేయించింది. బారసాలనాడు పిల్లలందరికీ తలంట్లుపోయడం దగ్గర్నుంచి, వంటవాళ్ళకి పురమాయించడం, పురోహితునికి కావలసినవన్నీ అందించడం వరకు అన్ని పనుల్లో కల్పించుకుని చేసింది. పెద్ద జరీ పట్టు చీర కట్టుకుని, హడావిడిగా ఇల్లంతా తిరుగుతూ పెత్తనం వహించింది.

బారసాలకి సుందరీ వాళ్ళదగ్గర బంధువులు కూడా కొందరు వచ్చారు. కాని వాళ్ళందరికంటే తనే ఎక్కువగా కల్పించుకుని పని చేసింది లక్ష్మి. వచ్చిన వాళ్ళందరి కళ్ళు లక్ష్మిమీదనే ఉన్నాయి. 'ఎవరండీ ఆ అమ్మాయి' అనిఅందరూ సుందరి తల్లి దండ్రులను అడిగారు. "సుందరి స్నేహితురాలు" అని చెప్పేసరికి అందరూ ఆశ్చర్యపోయారు. స్నేహితురాలయితే కూర్చుని మర్యాదలు చేయించుకోకుండా ఇలా ఇంట్లోవాళ్ళకంటే ఎక్కువగా పని చేస్తోందేమిటని ముక్కున వేలేసుకున్నారు.

సుందరి నానిగాడిని ఒళ్ళో పెట్టుకుని భర్త ప్రక్కన పీటమీద కూర్చుంది. పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. ఆ దృశ్యాన్ని చూస్తూ లక్ష్మిపరధ్యానంలోపడింది. నానిగాడ్ని ఒళ్ళో పెట్టుకుని సుందరి స్థానంలో తను వుండాల్సింది. రామచంద్రరావు స్థానంలో తన భర్త ఉండాల్సింది. నానిగాడితో పీటలమీద తనని, తన భర్తనీ వూహించుకుంది. నానిగాడితో సుందరి పీటలమీద కూర్చుంటే తనకేమీ బాధకలగలేదు. కాని, తనకి కూడా అలా కూర్చోవాలని పిస్తోంది. బెంగుళూరుకు వెళ్ళిన తర్వాత నానిగాడిని ఒళ్ళో పెట్టుకుని, తన భర్తతోపాటు పీటలమీద కూర్చుని బారసాల

చేసుకుంటే! ఊహూఁ...ఎవ్వరూ ఒప్పుకోరు. అందరూ నవ్వుతారు. సుందరి అభ్యంతరం చెప్పదు. తనముచ్చట తీర్చడానికి అయిష్టంగానయినా తన భర్తకూడా ఒప్పుకోవచ్చు. కాని రామచంద్రరావుకి ఇష్టం వుండదు. అతను ఒప్పుకోడు. ఇలా తల్చుకుంటే ఒక్కసారి రామచంద్రరావు మీద బోలెడు కోపం వచ్చేసింది లక్ష్మికి. "అసలు ఇతనెవరు మధ్యలో వాడు నా పిల్లాడు. సుందరి పిల్లాడు. మా ఆయనకి పిల్లాడు. ఇతనికేం సంబంధంలేదు" -అనుకుంది. నానిగాడికి రామచంద్రరావు పరాయివాడనిపించింది. పళ్ళెంలో పోసినబియ్యంలో బంగారు ఉంగరంతో అతను 'మురళీమోహన్' అని పేరు రాస్తుంటే అతనికి అధికారం లేదనిపించింది. "ఎవరో పరాయివాడు వచ్చేసి జబర్దస్తీగా పీటలమీద కూర్చుని నా పిల్లాడిపేరు రాసేస్తున్నాడు బాబోయ్" అని మనస్సు విలవిల్లాడిపోయింది. "అదేమిటండీ అతను వచ్చి చొరబడి అలా మనబ్బాయి పేరు రాసేస్తుంటే చూస్తూ వూరుకుంటారేమిటండీ, రెక్కుచ్చుకుని ఇవతలికి లాక్కుండా" అని భర్తకు ఫిర్యాదుచేసింది మనసులోనే.

కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నట్లుగా అనిపించేసరికి గబుక్కున లేచి పక్కగదిలోకి వెళ్ళింది లక్ష్మి. అక్కడ ఒంటరిగా కూర్చుని దిండుమీద తల పెట్టుకుని ఏడ్చింది. ఛీ...రామచంద్రరావును గురించి తను ఎందుకు అలా అనుకుంటుంది? పిల్లడికి అతను కన్న తండ్రికదూ? పిల్లడిమీద తనకి, సుందరికి ఎలా వుంటుందో అతనికి మాత్రం అలా వుండదూ? ఇలా మనస్సుకి ఎంతగా సర్ది చెప్పుకున్నా ఎందుకో వూరట కలగడంలేదు. తలుచుకున్న కొద్దీ అసలు పిల్లాడిమీదనే కాదు.

సుందరిమీదకూడా అతనికి అధికారంలేదని అనిపించడం మొదలు పెట్టింది. సుందరి, నానిగాడు ఇద్దరూ తన సొంతం. వాళ్ళమీద ఇంకెవరికీ అధికారం వుండకూడదు. నానిగాడు, సుందరి, తను, తన భర్త వున్న పరిధిలోకి రామచంద్రరావు ప్రవేశించడం దురాక్రమణగా అనిపిస్తోంది. ఈ చట్రంలో అతను ఇమడడు అనిపిస్తోంది. కొన్ని సంవత్సరాలుగా సుందరి భర్తగా రామచంద్రరావును తను చూస్తున్నా, ఇదివరకెప్పుడూ అలా అని పించలేదు. అంతరాంతరాల్లో ఆ భావం గుప్తంగా వున్నదేమో, కాని, ఎప్పుడూ ఇలా పైకి తేలలేదు. ఇప్పుడు అతను బహిరంగంగా పీటలమీద కూర్చుని, నానిగాడిమీద తనకున్న అధి కారాన్ని వూళ్ళో జనం అంతటికి చాటుకుంటుంటే సహించలేక పోతోంది. అందులో అతని తప్పేమీలేదని తెలుసు. అయినా అతన్ని చూస్తుంటే చిరాకు కలుగుతోంది. తమ మధ్య అతని ఉనికి అసందర్భంగా, అప్రస్తుతంగా అనిపిస్తోంది.

రామచంద్రరావును చూస్తుంటేతనకు ఎలాఅనిపిస్తుందో, తనభర్తనుచూస్తే సుందరి కూడా అలాగే అనుకుంటుందేమో. ఉహూఅలా అనుకోదు. ఎందుకు అనుకోకూడదు? రామచంద్రరావును గురించి తను ఇలా అనుకుంటున్నట్లు సుందరికి తెలుసా? తన భర్తను గురించి ఆమె అలా అనుకుంటే మాత్రం తనకెలా తెలుస్తుంది? నానిగాడిమీద ప్రేమను తను సుందరితోనూ, తన భర్తతోనూ మాత్రమే పంచుకోగలదు. ఇంకెవరితోనూ పంచుకోలేదు. అందుకే రామచంద్రరావు మీద అంత చిరాకు కలుగుతోంది. అలాగే సుందరి కూడా నానిగాడిమీద ప్రేమను తనతోనూ రామచంద్రరావుతోనూ తప్ప

ఇంకెవరితోనూ పంచుకోలేకపోవచ్చు. తన భర్త నానిగాడిని ముద్దులాడుతుంటే సుందరికి అలాగే చిరాకు కలుగుతుందేమో. బెంగుళూరు వెళ్ళిన తర్వాత గమనించాలి. సుందరి చూస్తుండగా తనభర్త నానిగాడిని ముద్దులాడకుండా చేయాలి సుందరి చూడకుండా తను, తన భర్త నానిగాడితో ఆడుకోవాలి. కాని, తన భర్త ఈ నానిగాణ్ణి పరాయి పిల్లాడిగా చూస్తాడేమో! అలా చూస్తే తను సహించలేదు. వీడు ఆనందమోహన్ అనీ, తన బిడ్డేననీ ఆయన గుర్తించాలి.

అసలు నానిగాడికి తనకు మధ్య అనుబంధం ఎటువంటిదో రామచంద్రరావుకు తెలియదుకదా ఇంతవరకు. తెలిస్తే అతను సహించగలడా? "నాకు పెళ్ళానికి మధ్య అడ్డువచ్చింది చాలక ఇప్పుడు నా పిల్లాడికీ, నాకూమధ్య అడ్డువస్తోంది ఈవిడ ఎవత్తె? పోనీకదా అని చనువిస్తే ఈవిడ నా పిల్లాడిని నాకు కాకుండా చేసేట్టుంది" అని చిరాకు పడతాడేమో. ఆ చిరాకులో ఇల్లు మార్చేసి దూరంగా ఎక్కడికైనా వెళ్ళిపోతాడేమో. నానిగాణ్ణి తనకు కనిపించకుండా చేస్తాడేమో! నానిగాడ్ని చూడకుండా తను ఉండగలదా? అంతదాకా రాకుండా తనే నిగ్రహించుకోవాలి. నానిగాడిమీది ప్రేమతో తను సుందరిని, ఆమె భర్తను కష్టపెట్టగూడదు. రామచంద్రరావు మీద చిరాకు పడే అర్హత, అధికారం తనకు లేవు. నిజానికి అతనే తనను చూసి చిరాకుపడాలి. చిరాకు పడకపోతే అది అతని ఔదార్యం. అందుకు తనే అతనికి కృతజ్ఞురాలై ఉండాలి

ఇలా ఆలోచిస్తున్న కొద్దీ ఆమె మనస్సు అశాంతితో వేగిపోయింది. తనకు ఇక జీవితంలో శాంతి ఉండదు-ఇలా బాధపడుతూ ఉండాల్సిందే అనుకుంది.

గదిలోకి ఎవరో వచ్చిన అలికిడి కాగానే గబుక్కున కన్నీళ్ళు తుడుచుకుంది లక్ష్మి. కాని, సుందరి అప్పటికే చూసేసింది. ఇక పిల్లవాడిని విడిచి పుట్టింటికి తిరిగి వెళ్ళాలి కదా అని ఆలోచించుకుంటూ లక్ష్మి బాధ పడుతున్నదని అనుకుంది సుందరి. దగ్గరకు వచ్చి ఆప్యాయంగా తల నిమురుతూ "బెంగుళూరు వెళ్ళే దాకా ఓపిక పట్టు లక్ష్మి. అక్కడికి వెళ్ళాక ఇక వాడు నీవాడే" అంది.

13

లక్ష్మి మరి రెండు రోజులుండి, ఇంకా ఎక్కువ రోజులుంటే బావుండదని పుట్టింటికి ప్రయాణమయింది. లక్ష్మి వెడుతుంటే సుందరికీ బాధగా అనిపించింది సుందరి తల్లికి కూడా ఆమె వెడుతుంటే కూతురు అత్తవారింటికి వెడుతున్నట్లు అనిపించింది. "నువ్వు వెళ్ళిపోతే ఇల్లంతా చిన్నబోతుంది అక్కా. ఇంకో రెండు రోజులుండు" అని పిల్లలంతా బ్రతిమాలారు.

"రెండు రోజులు ఆగి వెడితేమాత్రం ఇల్లు చిన్నబోదా? ఎప్పటికైనా వెళ్ళాల్సిందే కదా? మళ్ళీ ఎప్పుడైనా వస్తాలే. లేకపోతే మీరంతా ఒకసారి బెంగుళూరు రండి వేసాకాలం సెలవుల్లో" అంది లక్ష్మి.

"అలాగే వస్తాం అక్కా! మాకు బెంగుళూరు చూడాలని ఉంది. ఏమే అమ్మా ఈ సారి సెలవుల్లో మమ్మల్ని పంపిస్తావులే" అంది అరుణ.

"అబ్బో-ఎక్కడ బెంగుళూరే. కాస్తాకూస్తా దూరంలో ఉందిలే ఇట్టిట్టే వెళ్ళడానికి? పైగా మీరంతా వెడితే సుందరి అక్కావాళ్ళింట్లో పడుకునేందుకు కూడా చోటుండదు-అంత చిన్న ఇల్లు" అంది సుందరి తల్లి.

"ఎంత మంది" వచ్చినా మా ఇంట్లో సర్దుకోవచ్చులెండి పిన్నిగారూ పంపించండి" అంది లక్ష్మి.

"సరే చూద్దాంలెండరా. అప్పటి పరిస్థితులు బావుంటే వెళ్ళవచ్చు దానిదేముంది" అంది సుందరి తల్లి.

ఆవిడ లక్ష్మికి పీటవేసి కూర్చోపెట్టి, బొట్టు పెట్టి, కాళ్ళకు పసుపురాసి, చీరరవికలగుడ్డ,తమలపాకులు, వక్కలు, అరటిపళ్ళు, కొబ్బరిబొండాలు, పసుపుకొమ్ములు ఇచ్చింది. "నువ్వు వెడుతుంటే ఎలాగో ఉంది తల్లీ-" అంటూ ఆప్యాయంగా లక్ష్మి తల నిమిరి మెటికలు విరుచుకుంది ఆవిడ.

లక్ష్మి వీడ్కోలుగాపిల్లాడిని ముద్దులు పెట్టుకుని "త్వరగా వచ్చేయరా బెంగుళూరు. లేకపోతే నాకు తోచదు" అని చెప్పి బస్సు ఎక్కింది. సామాను ఎక్కించి బస్సు కదిలే వరకు ఇంటిల్లి పాదీ వీధి గుమ్మంలోనే నుంచున్నారు. చంటి పిల్లాడిని చేతుల్లో పెట్టుకుని సుందరికూడా గుమ్మంలో నుంచుంది. బస్సు కదులుతుంటే పిల్లాడి చేయి వూపుతూ 'టాటా' చెప్పించింది.

లక్ష్మి బస్సుదిగి పుట్టింట్లో అడుగు పెట్టగానే అమ్మవచ్చి. ఆదేమిటే అన్నాళ్ళు వుండిపోయావు. అసలు మళ్ళీ వస్తావా

అనిపించి అంటే బెంగుళూరు వెళ్ళిపోతావా అనుకున్నాను తల్లీ.

"నాకు వాళ్ళ ఇల్లూ పుట్టిల్లులాగానే అనిపించింది. అమ్మా! ఎంత అప్యాయంగా చూశారో తెలుసా? సొంత కూతురులా చూశారు."

"అయితే మాత్రం మరీ అన్నాళ్ళులే? సుందరి పిల్లాణ్ణి కూడా చూసి కలవరించిపోయావు. ఎలా వున్నాడు?"

"ఎలా వున్నాడంటావేమిటే. బంగారు బొమ్మలాగా వున్నాడు. అసలు వాడిని విడిచి పెట్టిరావాలనిపించలేదు. నిజం చెప్పాలంటే అక్కడ ఇన్నాళ్ళు తిష్ట వేసింది వాడికోసమే."

"నువ్వు అన్నీ విపరీతంగా మాట్లాడతావే. ఏది చెప్పినా పట్టడం కష్టం నిన్ను."

లక్ష్మి ఆరోజే భర్తకు వుత్తరం రాసింది. తాను క్షేమంగా పుట్టింటికి చేరాననీ, తిరుగు టపాలో వచ్చి తనను బెంగుళూరు తీసుకువెళ్ళవలసిందనీ రాసింది. ఆ వుత్తరం తమ్ముడికిచ్చి పోస్టు చేయించిన మరు నిముషం నుంచి అది భర్తకు ఎప్పుడు అందుతుందో, భర్త ఎప్పుడు బయలు దేరుతాడో, ఎప్పుడు ఇక్కడికి చేరుతాడో లెక్క వేసుకోవడం మొదలు పెట్టింది. ఉత్తరం మూడో నాటికి బెంగుళూరు చేరుతుంది. భర్త వెంటనే బయలు దేరితే ఐదో నాటికి చేరుతాడు. ఆరో నాడో, ఏడో నాడో తాను తన భర్తతో కలిసి ప్రయాణం కట్ట వచ్చుననుకుంది.

బెంగుళూరు మీదికి గాలి మళ్ళినప్పటి నుంచి లక్ష్మి కాలు గాలిన పిల్లి లా తిరగడం మొదలు పెట్టింది. ఇట్లో ఏమీ తోచనట్టుగా, బోరు కొడుతున్నట్టుగా, చికాకుగా ఉన్నట్లు కనబడుతోంది. ఆ అమ్మాయి వరస తల్లికేం అర్థంకాలేదు.

పుట్టింటికివచ్చామన్న సంతోషంలేదు. సరదాలేదునలుగురితో కలిసి తంగా కబుర్లు చెప్పడం లేదు. ఇదేం పిల్ల! చెప్పుల్లో కాళ్ళు పెట్టు కున్నట్లు, లేటయిన రైలు కోసం ఎదురు చూస్తున్నట్లు ఎవరో పరాయి వాళ్ళింట్లో తప్పని సరిగా మకాం వేయాల్సి వచ్చినట్లు ఇలా వుంటుందేం? బెంగుళూరు నుంచి వచ్చినప్పుడు నుంచి సుందరి వాళ్ళ వూరు వెళ్ళడానికి తహతహ లాడింది. అక్కడనుంచివచ్చినప్పటినుంచి బెంగుళూరువెళ్ళడానికి తొందర పడుతోంది.సుందరి వాళ్ళయింట్లో అన్ని రోజులు మకాం వేసినా అక్కడిన్నుంచి రావాలనిపించలేదట దీనికి.ఆసుందరి అంటే అంత ఇదేమిటి. అది వరకు పురిటి కోసంతీసుక వచ్చినప్పుడూ అంతే నెలతిరక్కుండా బెంగుళూరుకు పరుగెత్తుకెళ్ళింది కొంప మునుచుకు పోతున్నట్లు-అని ఆశ్చర్యపోయింది ఆవిడ.

ఆవిడకే కాదు లక్ష్మికే తన ప్రవర్తన ఆశ్చర్యంగా అని పించింది. తనెప్పుడూ దేని కోసమో ఆత్రంగా ఎదురు చూస్తున్నట్లు, రోజులు, గంటలు, నిముషాలు లెక్కపెట్టు కున్నట్లు వుంటుందేం? బెంగుళూరు లోనూ అంతే. సుందరి ఆఫీసునుంచి ఎప్పుడు తిరిగొస్తుందా అని పగలంతా ఎదురు చూసేది.ఇప్పుడు భర్త కోసం ఎదురు చూస్తోంది.ఆయన వచ్చిన తర్వాత ఎప్పుడు బయల్దేరదామా అని యెదురు చూస్తుంది. బయలుదేరిన తర్వాత బెంగుళూరు ఎప్పుడు చేరతామా అని యెదురు చూస్తుంది. చేరిన తర్వాత నానిగాడ్ని తీసుకుని సుందరిపుట్టింటి నుంచి యెప్పుడు తిరిగొస్తుందా అని ఎదురు చూస్తుంది. ఇలా ఎదురు చూడటమే తన జీవితలక్షణమేమో! తనజీవితమంతా ఇలా దేని కోసమో ఎదురు చూడడం లోనే గడిచి పోతుందేమో! కాదు. సుందరి కోసం, నానిగాడి కోసం తప్ప తను ఎప్పుడూ దేని కోసం

ఎదురు చూడ లేదు. సుందరితో పరిచయం కాక ముందు తను భర్తతో ప్రశాంతంగా స్థిమితంగా గడిపింది. సుందరితో పరిచయమైన తర్వాత, సుందరి దగ్గరున్నంత సేపు, ఆమెతో కబుర్లు చెబుతున్నంత సేపు తను చాలా స్థిమితంగా వుండేది. ఆ సమయంలో తను దేని కోసం ఎదురు చూసేది కాదు. ఇంకేదో కావాలని తనకు అనిపించేది కాదు. ఆనందమోహన్ పుట్టిన తర్వాత సుందరి కోసం కూడా తను ఎదురు చూసేది కాదు ఆ పిల్లాడు తప్ప తనకు వేరే ప్రపంచం లేకుండా పోయింది. అప్పుడూ తను ఎంతో తృప్తిగా, స్థిమితంగా జీవించింది. పిల్లాడు పోయిన తర్వాత కొన్ని నెలలు తను ఏ అనుభూతి లేకుండా జడ ప్రాయమై పోయింది. ఆనంద మోహన్ మళ్ళీ సుందరి కడుపున పుట్టబోతున్నాడట తెలిసినప్పుడే తను మామూలు మనిషి అయింది. అప్పటి నుంచే మళ్ళీ ఎదురు చూడడం ప్రారంభించింది. ఇప్పుడు నానిగాడు తన ఒళ్లోవుంటే తనకింకేమీ అక్కర్లేదు. ఇంక దేని కోసం ఎదురు చూడనక్కర్లేదు. తన జీవితానికి లక్ష్యం, గమ్యం, పరమార్థం అన్నీ వాడే. వాడు లేకపోతే అసలు తన జీవితానికే అర్థం లేదు.

లక్ష్మి రమ్మన్నట్లుగానే దుర్గాప్రసాద్ తిరుగుటపాలో అంటే ఐదోనాటి కల్లావచ్చేశాడు. అతను రాగానే తిరుగు రైలులో బయలు దేరడానికి లక్ష్మి పెట్టెసర్దేసుకుని సిద్ధంగా వుంది. అతను ఇంట్లో అడుగు పెట్టగానే ఆత్రంగా దగ్గరకు వెళ్ళి "ఏవండీ ఇవాళ రాత్రి రైలుకే వెళ్ళిపోదామా?" అని అడిగింది. ఆమెతొందరచూసి ఆశ్చర్యపోయాడు దుర్గాప్రసాద్. ముక్తసరిగా "సీఇష్టం" అన్నాడు.

కాని అంతలోనే లక్ష్మిని వాళ్ళమ్మగారు గట్టిగా మందలించింది. "ఓసి నీఇల్లు బంగారంగానూ! అంత తొందరేమిటే? వచ్చిన ఆయన్ని గుమ్మంలోనే నిలబెట్టి మళ్ళీ బయల్దేర మంటావు? ఇక్కడే ఇంకో నాలుగు రోజులుంటే ఆ బెంగుళూరు ఎక్కడికైనా పోతుందటే?" అంది ఆవిడ.

"అల్లుడుగారు ఆరువందల మైళ్ళ దూరప్రయాణం చేసి వస్తే నాలుగు రోజులు రెస్టుతీసుకోకుండా అప్పుడే బయలుదేర దీస్తావేమిటే?" అని లక్ష్మి నాన్నగారు కూడా అన్నారు.

లక్ష్మి తన తొందరపాటుకు నొచ్చుకుంది. భర్త ఏమైనా అనుకున్నాడేమోనని బాధపడింది. ఇప్పుడు తను అర్జెంటుగా బెంగుళూరు వెడితే మాత్రం అక్కడ తనకు స్వాగతమివ్వ డానికి సుందరి నాసిగాడు సిద్ధంగా వున్నారా? అక్కడకు వెళ్ళినా వాళ్ళ కోసం ఎదురుచూడడమే కదా? ఆమాత్రానికి అక్కడకు వెళ్ళాలని అంత తొందరదేనికి?

"లేదండీ...ఊరికేఅన్నాను. బెంగుళూరుమీద బెంగపుట్టి అలా అన్నాను. మీరు వచ్చేశారుగా...ఇంక బెంగలేదు... నాలుగైదు రోజులుండి వెడదాం" అంది భర్తతో అనున యంగా, నెమ్మదిగా.

"అబ్బేలేదు. నేను సెలవు పెట్టిందే నాలుగురోజులు. అందులో రెండు రోజులు ప్రయాణానికే పోతుంది. రెండు రోజులు కంటే ఉండడం కుదరదు. అయినా ఈ వూళ్ళో ఏం తోస్తుంది నాకు?"

"నేనున్నాను కదండీ ... తోచకపోవడానికేముంది? బోలెడు కబుర్లు చెబుతాను. గదిలో పెద్దమంచం మీద పరుపు

వేస్తాను. భోజనంచేసి శుభ్రంగా ఇవాళంతా నిద్రపోండి. బోలెడు దూరం ప్రయాణం చేసివచ్చారు కదూ?"

తర్వాత స్నానానికి నీళ్ళుతోడి, భర్తను నీళ్ళగదిలోకి తీసుకు వెళ్ళింది. "రైలు దుమ్ము అంతా మీ తలలోనేవుంది. కూర్చోండి తలంటి పోస్తాను" అంది. అతను బుద్ధిమంతుడులా తలవూపి కూర్చున్నాడు. లక్ష్మి అతనికి నెత్తిమీద నూనెపెట్టి మర్దన చేసింది. ఒంటికి నూనెరాసి, నలుగుపెట్టింది. నెత్తి మీద కుంకుడుకాయ రసంపోసి రుద్దింది. అంత ఆప్యాయంగా భర్తకు తలంటి పోస్తుంటే ఎంతో తృప్తిగా అనిపించింది. ఇంత మంచి అబ్బాయిని తను సుఖపెట్టవలసినంతగా సుఖపెట్ట లేక పోతున్నానని బాధపడింది కాసేపు. తలతుడుస్తూ అతని ముఖం తన చేతులోకి తీసుకుని "నా బంగారుకొండ" అంటూ బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

అతను నవ్వుతూ "నేనేం పాపాయిననుకున్నావేమిటి?" అన్నాడు.

"అవును పాపాయిలాగానేవున్నారు. కాదు-పాపాయే మీలాగా వున్నాడు. నిజంగానండీ. నానిగాడు అంతా మీ పోలికే."

"ఛీ...ఏం మాటలవి?" అంటూ మొట్టికాయవేశాడు అతను.

రాత్రి మంచంమీద పడుకున్నప్పుడు లక్ష్మి భర్త ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని "మీరు భలే అందంగా వుంటా రండీ" అంది.

"మీ నానిగాడి కంటేనా?" అన్నాడు దుర్గాప్రసాద్

నవ్వుతూ. "మీ నానిగాడు ఏమిటండీ-ఎవరో పరాయిపిల్లాడ్ని గురించి అన్నట్లు, మన నానిగాడు అనక."

"మన నానిగాడు ఎలా అవుతాడు? వాడు మీ సుందరి పిల్లాడు, రామచంద్రరావు పిల్లాడు. నీకున్న మమకారాన్ని బట్టి మహా అయితే నీ పిల్లాడుకూడా అవుతాడేమో కాని, నా పిల్లాడు మాత్రం కాదు." "అదేమిటండి అలా అంటారు? వాడు మీ పిల్లాడేనండీ. లేకపోతే మీ పోలికలు ఎలావస్తాయి? అంత అందంగా ఎందుకుంటాడు?" "ఛ! మళ్ళీ అదేమాట అంటావు. వాడికి నా పోలికలు రావడం ఏమిటి? నీకేమయినా మతివుందా? అందంగా వున్నంత మాత్రాన నా పోలికలు వున్నట్లా ఏమిటి? రామచంద్రరావు బావుంటాడా? సుందరి బావుంటుందా? వాళ్ళ పోలికలే ఎందుకు రాకూడదు?" "అది కాదండీ! నేను చెప్పేది మీకు అర్థంకావడంలేదు. మన ఆనంద మోహన్ మీ పోలికవునా కాదా? ఆ ఆనందమోహనే అదే పోలికలతో ఇప్పుడు మురళీమోహన్‌గా సుందరికి పుట్టాడు. వాడు రామచంద్రరావుకు పుట్టినా మీ పిల్లాడే. మీ అంశలో పుట్టినవాడే. అలా అనుకుంటేనే నాకు తృప్తిగా వుంటుంది. వాడు రామచంద్రరావు పిల్లాడని నాకు జ్ఞాపకం చెయ్యకండి! నాకెందుకో బావుండదు. వాడు నా పిల్లాడు, మీ పిల్లాడు. సుందరి పిల్లాడు అంతే. వాడ్ని మీరు పరాయి పిల్లాడిగా చూస్తే నాకు చాలా బాధగా ఉంటుంది. అసలు వాడ్ని చూస్తే మీరే గుర్తు పడతారు."

"సరే నీ సంతృప్తికోసం నువ్వు ఎలా అనుకున్నా సరే. కాని, ఇటువంటి మాటలు ఇంకెవరి దగ్గరనయినా అంటే మాత్రం చాలా అసహ్యంగా వుంటుంది జాగ్రత్త. నోరుజారి

మీ సుందరి దగ్గరయినా అలా మాట్లాడకు. ఆ అమ్మాయి చాలా బాధపడుతుంది."

లక్ష్మి భర్త గుండెమీద తలపెట్టుకుని అంది. "ఛ! ఇతరులతో ఎందుకంటానండీ...మీరు కాబట్టి చెప్పాను. నా మనస్సులో ఉన్నది...మీతో కాక ఇంకెవరితో చెప్పుకుంటాను? మీతో చెప్పకూడనివి నాకు ఏముంటాయి? సుందరితోకూడా మిగతా విషయాలన్నీ మాట్లాడినా ఈ ఒక్క విషయం మాత్రం మాట్లాడను. నాకు తెలుసు ఆమె బాధపడుతుందని."

ఆ మరునాడుకూడా లక్ష్మి భర్తతో ఏకాంతంగా ఉన్నంతసేపూ నానిగాడ్ని గురించే చెప్పింది. సుందరీవాళ్ళ వూళ్లో విశేషాలన్నీ చెప్పింది. వాళ్ళంతా తనని ఎంత ఆప్యాయంగా చూశారో చెప్పింది.

"నానిగాడ్ని ఎప్పుడూ నువ్వే ఒళ్ళో పెట్టుకుకూర్చుంటే రామచంద్రరావు విసుక్కునేవాడు కాదూ?" అని అడిగాడు దుర్గాప్రసాద్.

"అవును గదిలోకి తొంగిచూసినపుడల్లా నేను పిల్లాడ్ని మంచంమీద పడుకోబెట్టి వెళ్ళిపోయేదాన్ని. అతను కాసేపు ముద్దులాడి వెళ్ళిపోయిన తర్వాత నేను వెళ్ళేదాన్ని. అయినా అతను విసుక్కునేవాడేమో నాకు తెలీదు. నాకు మాత్రం అతన్నిచూస్తే చిరాకుగా అనిపించేది. ఎందుకో తెలీదు. పాపం అతను మంచివాడే. అయినా నానిగాడిమీద ప్రేమను సుందరితోనూ, మీతోనూ తప్ప ఇంకెవరితోనూపంచుకోలేను. అసలు బారసాల పీటలమీద సుందరి పక్కన రామచంద్రరావు కూర్చుని, పిల్లాడి పేరు రాస్తుంటే నాకు ఎంతకోపం, బాధకలిగాయో తెలుసా? ఏడుపు ఆపుకోలేకపోయాను."

"దేనికి? అందులో బాధపడేందు కేముంది?"

"మీకు అర్థం కాదు...సుందరి పక్కన మీరుకూర్చోవా ల్సింది. పిల్లాడి పేరు మీరు రాయాల్సింది."

"ఛ...అలా మాట్లాడతావేం లక్ష్మి. నా పక్కన నువ్వు కూర్చోవాలి. సుందరి కూర్చోవడమేమిటి?"

"సుందరి కూర్చున్నా నేను కూర్చున్నా ఒకటే...మా ఇద్దరికీ భేదం లేదు. ఇద్దరం ఒకటే. నాకు అసూయ కలగదు. ఆనందంగా కూడా ఉంటుంది. అసలు అలా అయితే సుందరి ఎప్పుడూ మనింట్లోనే వుండేది. పిల్లాడు మనింట్లోనే వుండేవాడు."

దుర్గాప్రసాద్ భార్య నోటికి చెయ్యి అడ్డం పెట్టాడు. "ఇక చాలు. అలా మాట్లాడకు. బావుండదు. ఎవరిమీదనైనా మరీ అంత అభిమానం పనికిరాదు" అన్నాడు.

14

లక్ష్మి దుర్గాప్రసాద్ బెంగుళూరుకు తిరిగివచ్చారు. మళ్ళీ లక్ష్మికి జీవితం బోరు కొట్టడం ప్రారంభించింది. దుర్గా ప్రసాద్ పొద్దున ఆఫీసుకు వెళ్ళినప్పటి నుంచి, మళ్ళీ సాయంత్రం ఇంటికి చేరే వరకు ఆమెకు ఒంటరితనం. మధ్య మధ్య ఇరుగుపొరుగు అమ్మలక్కలు ఎవరయినా, వచ్చి కబుర్లు పెట్టుకు కూర్చున్నా, వారి కబుర్లు లక్ష్మికి తలనొప్పి తెప్పించేవి. వీలయినంత త్వరగా వాళ్ళని పంపించేసి, 'హమ్మయ్య' అని హాయిగా వూపిరి పీల్చుకునేది. వాళ్ళ కబుర్ల కంటే

ఒంటరితనమే బావుండేది. ఒంటరితనంలో కనీసం నానిగాణ్ణి, సుందరిని తలుచుకునైనా తృప్తిపడవచ్చు. ఎవరయినా వచ్చి కూర్చుంటే అదీ వుండదు. గంటల తరబడి తిష్టవేసి, లక్ష్మి ఏమైనా టిఫిను, కాఫీ ఇస్తే పుచ్చుకుని, ఇరుగమ్మ మీద పొరుగమ్మ మీద అడ్డమైన కబుర్లూ చెప్పుకుందామనే ఆశతో వచ్చే అమ్మలక్కలు లక్ష్మి ఏదో వంకతో తమను పంపించేస్తుంటే మూతి మూడు వంకర్లు తిప్పుకుంటూ వెళ్ళేవారు. సుందరి వూళ్ళోలేని ఛాన్సు చూసుకుని, లక్ష్మిని కాకాపట్టి మంచి చేసుకుని, సుందరి మీద మనసు విరిచేద్దామని వాళ్ళు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. "ఆ సుందరి ఏంమందు పెట్టిందో, ఆవిడంటే అంత పడి ఛస్తుంది. మా మొహం చూస్తూనే కరక్కాయ తిన్నట్టు మొహం పెడుతుంది"- అని ఒకావిడ తన వంటమనిషితో అనడం కూడా లక్ష్మి వింది. వాళ్ళు తనని గురించి అలా అనుకుంటారని లక్ష్మికి ముందే తెలుసు.

కిటికీ దగ్గరగా ఈజీ ఛైర్ వేసుకుని కూర్చుని, సుందరి ఇంటికేసి చూస్తూ, సుందరిని గురించి, నానిగాడ్ని గురించి గంటల తరబడి ఆలోచిస్తూ గడిపేది. ఆలోచించి, ఆలోచించి ఇక వుండబట్టలేక సుందరికి పేజీల తరబడి వుత్తరం రాసేది. "నా కన్నగాడు, కాసుగాడు, బంగారు కొండగాడు ఏమంటున్నాడు? ఏం చేస్తున్నాడు? వాడికి నామీద బెంగలేదా? అసలు ఇక్కడో అమ్మవుందని వాడికేమయినా జ్ఞాపకం ఉందా?" అంటూ రాసేది. "సుందరీ! మన నానిగాడ్ని తీసుకొని తొందరగా వచ్చెయ్యి. మీ ఇద్దరూ లేకపోతే నాకు జీవితమే లేదు. మీ ఇద్దరిని గురించే నా ఆలోచనలన్నీ. ఆ ఆలోచనలు

లేకపోతే నా మనస్సు శూన్యమే అవుతుంది. మన మధ్య ఇంత దూరాన్ని భరించడం కష్టంగా ఉంది. కనీసం మూడో నెల అయినా రానిదే మీ వాళ్ళు పంపరేమో కదూ? అందుకని మూడో నెల రాగానే బయలుదేరి వచ్చెయ్యి"-అనిరాసేది.

అలా రాస్తున్నప్పుడు, నిజంగా సుందరికి కొన్నాళ్ళ పాటు పుట్టింట్లో ఉండాలని ఉందేమో. నా స్వార్థంకోసం నేను ఆమెను తొందర పెడుతున్నానేమో అనిపించేది. వెంటనే 'పోనీ నీకు నిజంగా ఉండాలనిపిస్తే ఇంకా కొన్నాళ్ళుండిరా. నేను నీ జ్ఞాపకాలతోనే ఎలాగో కాలక్షేపం చేస్తాను' అని మరో వాక్యం రాసేది. మధ్య మధ్య రామచంద్రరావు మీద చిరాకు కలిగేది- 'నాకున్నపాటి బెంగకూడా లేదేం ఈ పెద్ద మనిషికి పెళ్ళాం మీద! తొందరగా వెళ్ళి తీసుకురాక, అంత నిశ్చింతగా కూర్చుంటాడేం? అసలు ఇంట్లో ఒక్కడికీ ఏం తోస్తుంది? ఆ హోటలు మెతుకులు ఎల్లా తింటున్నాడు? శారసాలకి వచ్చినప్పుడు పెళ్ళాం మీద, పిల్లాడిమీద అంత ప్రేమ ఒలకబోశాడు. నిజంగా ప్రేమ ఉన్నవాడయితే ఇంత నిమ్మకు నీరెత్తినట్లు ఉండగలడా?' అనుకునేది.

తనకి సుందరి మీద ఉన్నంత ప్రేమ తన మీద సుందరికి ఉండదేమో నన్న వూహా ఎప్పుడయినా వస్తే చాలా బాధగా ఉండేది లక్ష్మికి. అంతేకాదు-సుందరికి తన మీద కంటే రామచంద్రరావు మీదే ఎక్కువ ప్రేమ ఉంటుందని అనిపించినా అంత బాధగానూ వుండేది. రామచంద్రరావు మీద అసూయగా ఉండేది. అంతగా సుందరి ప్రేమను పొందే యోగ్యత అతనికి లేదనిపించేది. ఈ ఆలోచనలు వచ్చినప్పుడల్లా కొంత సేపు ఏడ్చి, గుండెబరువు దింపుకునేది.

లక్ష్మి మూడు ఉత్తరాలు రాసిన తర్వాత సుందరి నుంచి సమాధానం వచ్చింది. పుట్టింట్లో తనకూ తోచడం లేదనీ, తన భర్త కూడా త్వరగా రమ్మని వుత్తరాలు రాస్తున్నాడనీ, త్వరగా బెంగుళూరు రావాలని తహతహగా వుందనీ ఆమె రాసింది. మూడో నెల రాగానే మంచి రోజు చూచి బయలుదేరుతాననీ, తన భర్త వచ్చి తీసుకువెడతారనీ, ఈలోగా తన తల్లిదండ్రులు పంపరనీ రాసింది. "నానిగాడు నీ కోసం బెంగపడడం లేదు. (అప్పుడే కోపంతో బుంగమూతి పెట్టేశావా?) ఎందుకో తెలుసా? వాడి దృష్టిలో నువ్వూ, నేనూ ఒకటే. నాలోనే నిన్ను చూస్తున్నాడు, అందుకని వాడికి బెంగలేదు. వాడు నీ దగ్గర ఉండిపోయి నేను దూరంగా ఉన్నాననుకో-అప్పుడు నాకోసం కూడా బెంగపడడు. నీలోనే నన్ను చూస్తాడు"- అని రాసింది సుందరి.

ఆ ఉత్తరం చూసి సంతోషించింది లక్ష్మి. తనమీద సుందరి అంత ప్రేమ వ్యక్తం చేసినందుకు ఎంతో తృప్తి కలిగింది. సుందరి తనమీది ప్రేమను దాచిపెట్టుకుని, గుంభనంగా ఉంటే తనకు ఇష్టం ఉండదు. మధ్య మధ్య దాన్ని మాటల్లో వ్యక్తం చేస్తూవుంటేనే తనకు హాయిగా ఉంటుంది. నానిగాడికి మూడోనెల ఎప్పుడు వస్తుందో కాలండరు చూసి, రోజులు లెక్కబెట్టింది. "ఇంకా పదిరోజులు" అనుకుంది. ఆ తర్వాత సుందరి పుట్టింటి వాళ్ళు మంచి రోజు ఎప్పుడు నిర్ణయిస్తారో, ఈ రామచంద్రరావు ఎప్పుడు వెళ్ళి ఆమెని తీసుకొస్తాడో ఏమిటో అనుకుంది. 'పెళ్ళాం రాకకోసం అతనుకూడా తొందరపడుతున్నాడన్నమాట. ఫరవాలేదు- ఒట్టి మొద్దు అనుకున్నాను' అనుకుంది.

దుర్గాప్రసాద్ ఇంట్లో ఉన్నంతసేపూ లక్ష్మి నానిగాడిని గురించే హుషారుగా కబుర్లు చెబుతూవుండేది. ఆమె చెప్పే మాటలబట్టి అతనికి నానిగాడిని చూడాలనిపించేది. రామచంద్రరావు ఎప్పుడు వెళ్ళి సుందరిని, నానిగాడిని తీసుకొస్తాడా అని అతనికి తహతహాగా వుండేది. కాని అతను తన ఆత్రాన్ని వ్యక్తం చేసేవాడుకాడు. అయినా, పిల్లాడి విషయంలో అతని ఆసక్తిని లక్ష్మి గమనించి, సంతోషించింది. అప్పుడప్పుడూ దుర్గాప్రసాద్ వెళ్ళి రామచంద్రరావును పలకరిస్తూ ఉండేవాడు, "ఏమండీ మీ అబ్బాయి ఏమంటున్నాడు" అంటూ. "మీవాడు ఎప్పుడొస్తాట్ట? ఉత్తరాలురాస్తున్నాడా?" అని అడిగేవాడు. "ఇంకెప్పుడు చూపిస్తారండి మీ అబ్బాయిని? సస్పెన్సుతో చంపేస్తున్నారే" అనేవాడు. తన పిల్లాడిని గురించి అడిగితే రామచంద్రరావు మొహం సంతోషంతో, గర్వంతో, తృప్తితో వెలిగిపోయేది. కొంచెం సిగ్గుతో ముసిముసి నవ్వులు నవ్వేవాడు. దుర్గాప్రసాద్ అప్పుడప్పుడూ రామచంద్రరావుని కాఫీకి పిలుస్తూ ఉండేవాడు. ఇద్దరూకలిసి కాఫీ తాగుతుంటే రామచంద్రరావు తన పిల్లాడి సంగతులు చెప్పేవాడు. తన పిల్లాడి రాకకోసం తనతోపాటు వీళ్ళిద్దరూ కూడా ఎదురుచూస్తున్నందుకు సంతోషించేవాడు రామచంద్రరావు.

15

మూడోనెల వచ్చిన తర్వాత సుందరిని, పిల్లాడిని తీసుకురావడానికి వెళ్ళాడు రామచంద్రరావు. అతను వెళ్ళినప్పటి

నుంచి లక్ష్మి నానిగాడికి స్వాగత సన్నాహాలు చేయడం మొదలు పెట్టింది.

"నానిగాడికి ఒక మంచి ఉయ్యాల, దోమతెర, ఉయ్యాలలో కట్టేందుకు రంగు రంగుల చిలకలు కొనాలండీ" అంది భర్తతో. "ఇదివరకు మన పిల్లాడి కోసం కొన్నవి ఉన్నాయిగా? మళ్ళీ కొనడం దేనికి?" అని అడిగాడు దుర్గాప్రసాద్.

"అవి మన ఇంట్లోనే వుండాలండీ. సుందరి మళ్ళీ ఆఫీసుకు వెళ్ళడం మొదలుపెడితే పిల్లాడు పగలంతా మన ఇంట్లోనే ఉంటాడు కదా. రాత్రిపూట పిల్లాడు వాళ్ళింట్లో ఉంటే మరి అక్కడ ఇంకో ఉయ్యాల ఉండద్దూ? పైగా మన ఇంట్లో ఉన్నది పెద్ద ఉయ్యాల. అంత పెద్దది వాళ్ళింట్లో పట్టదు. చిన్నది, అందంగా వుండేది ఇంకోటికొనాలి. ఇప్పుడు వాడికి కావలసినవన్నీ రెండేసి ఉండాలండీ. ఒక సెట్టు మనింట్లో, ఇంకో సెట్టు వాళ్ళింట్లో ఉండాలి" అంటూ లక్ష్మి ఉగ్గుగిన్నె దగ్గర్నుంచి, అన్నప్రాసనకి వెండి గిన్నెవరకు ఒక పెద్ద జాబితా రాసి ఇచ్చింది.

దుర్గాప్రసాద్ శ్రద్ధగా అవన్నీ కొనుక్కొచ్చాడు. సుందరి, పిల్లాడు వూరునుంచి ఎప్పుడు దిగుతారోనని లక్ష్మి పగలంతా కిటికీదగ్గరే కూర్చుని ఎదురుచూసేది. అలా వారం రోజులు ఎదురుచూసిన తర్వాత ఒక రోజు వాళ్ళు వూరు నుంచి తిరిగి వచ్చారు. వాళ్ళు ఇంకా ఇంటితాళం తియ్యక ముందే లక్ష్మి పరుగెత్తుకు వెళ్ళి సుందరిని కావిలించేసుకుని, ఆమె చేతుల్లోనుంచి పిల్లాడిని తీసుకుని ముద్దులు పెట్టేసుకుంది.

ఇంట్లోకి వెళ్ళగానే లక్ష్మి, "ఇదుగో ఈపూట వంట ప్రయత్నం ఏమీ చెయ్యద్దు సుందరీ. అందరికీ మా ఇంట్లోనే

వంట చేయిస్తాను. అందరం అక్కడే భోజనం చేద్దాం. ఎన్నో నెలల తర్వాత వచ్చావు. ఇల్లు సర్దుకునే పని వుంటుందికదూ. అంతా సర్దుకుని తీరుబడిగా రాత్రికి వంట మొదలెడుదువు గాని" అంది.

సుందరి సరేనన్నది. ఇప్పుడే ఊరునుంచి వచ్చారు కనుక, తను ఇప్పుడు కబుర్లు వేసుకు కూర్చుంటే బావుండ దని బయలుదేరింది లక్ష్మి. "నానిగాడిని ఒక్కసారి మావారికి చూపించేసి, రెండు నిమిషాల్లో తీసుకువస్తాను" అని చెప్పి, పిల్లాడిని తీసుకుని ఇంటికి వచ్చింది. ఆదివారం కావడంవల్ల ఆరోజు దుర్గాప్రసాద్ ఇంట్లోనే ఉన్నాడు. పిల్లాడిని చూడ గానే అతనికి ఏదో విచిత్రమయిన సంతోషం కలిగింది. పిల్లా డిని ముట్టుకోవాలనీ అనిపించింది. అతను లక్ష్మిచేతుల్లోంచి నెమ్మదిగా పిల్లాడిని తీసుకుని, వాడి లేత బుగ్గలపై మెత్తగా ముద్దుపెట్టుకున్నాడు. ఆ సమయంలో భర్త కళ్ళలోని కాంతిని చూసి లక్ష్మి ఎంతో తృప్తి చెందింది.

పిల్లాడిలో కొద్దిగా ఆనందమోహన్ పోలికలు కని పించాయి దుర్గాప్రసాద్‌కి. మూడో నెలలో ఆనందమోహన్ కొంచెం ఇలాగే ఉండేవాడని అనిపించింది. అయితే అది తన దృష్టిలో ఉందేమో. లక్ష్మి చెప్పగా అలా అనిపిస్తోందేమో అనుకున్నాడు. లేకపోతే సుందరి మనస్సులో ఆనంద మోహన్ రూపం చెరగని ముద్రగా మిగిలిపోవడంవల్ల, మళ్ళీ ఆనందమోహనే పుట్టబోతున్నాడని లక్ష్మి ముందునుంచీ చెబుతూ వచ్చినందువల్ల ఈ పిల్లాడికి ఆపోలికలు వచ్చాయేమో ననుకున్నాడు. కాని, రామచంద్రరావుకి మాత్రం పిల్లాడిలో

ఆనందమోహన్ పోలికలేవీ కనిపించినట్లు లేదు. కనిపిస్తే చెప్పేవాడేగా. అతనికి తన పిల్లాడిలో తన పోలికలే కన్పిస్తున్నాయేమో! పోలికలు కనిపించడం అనేది చూసేవాళ్ళ దృష్టిని బట్టి వుంటుందేమో!

లక్ష్మి వంటావిడకి వంటపనులు పురమాయించి, తను పిల్లాడిని తీసుకొని సుందరి ఇంటికి వెళ్ళింది. ఇల్లు సర్దుకోవడంలో కాసేపు సుందరికి సహాయం చేసింది. తర్వాత పిల్లాడి కోసం కొన్న ఉయ్యాల, దోమతెర, ఇతర సామానులు నౌకరుచేత సుందరి ఇంటికి చేరవేయించింది. అవన్నీ చూసి ముక్కున వేలేసుకుంది సుందరి. "ఇవన్నీ ఎప్పుడుకొన్నావు లక్ష్మి" అని అడిగింది.

"మొన్ననే కొన్నాను-ఏం?"

"మేము వచ్చిన తర్వాత తీరుబడిగా కొనుక్కునే వాళ్ళంగా, నువ్వు దేనికి కొనడం?"

"ఏం, నేను కొనగూడదా?"

"అయినా, ఇదివరకు ఆనందమోహన్‌కి కొన్నవివున్నాయిగా! మళ్ళీ ఇవి కొనడం దేనికి?"

"నానిగాడికి ఇద్దరు అమ్మలు. రెండు ఇండ్లుకదూ? మరి అన్నీ రెండేసి వుండద్దూ? లేకపోతే ఉయ్యాలని పగలు మా ఇంటికి రాత్రి మీ ఇంటికి చేరవేస్తూంటామా?"

"బావుంది. వాడు మరీ సుఖం మరిగితే కష్టం లక్ష్మి. పెద్దయిన తర్వాత వాడి గొంతెమ్మ కోరికలన్నీ నేను తీర్చలేను. నేను పేదదాన్ని."

"నువ్వు పేదదానివైనా వాడు మహారాజే. వాడు

కష్టాలు పడకూడదు. నేను చెబుతున్నానుగా వాడికి ఏలోటూ రాదు. వాడు అదృష్టవంతుడు. వాడ్నిబట్టి మీకూ అదృష్టం తిరుగుతుంది చూడు."

"నీలాంటి తల్లి వుంటే వాడు అదృష్టవంతుడు కాక ఏమవుతాడు? మా సంగతి ఎలా ఉన్నా, నీ మాట చల్లగా వాడు మహారాజైతే చాలు" అంది సుందరి.

ఆ పూట అందరూ లక్ష్మి వాళ్ళ ఇంట్లోనే భోజనాలు చేశారు. లక్ష్మి దుర్గాప్రసాదుల ఆపేక్షకు, ఆప్యాయతకు ఎంతో సంతోషించాడు రామచంద్రరావు పిల్లాడిని గురించి మాట్లాడితే అతను సంతోషిస్తాడని దుర్గాప్రసాద్ గ్రహించాడు. అందుకని భోజనాలయినంతసేపు పిల్లాడిని గురించే మాట్లాడాడు.

"అన్నట్లు పిల్లాడికి పేరు ఏం పెట్టారండీ?" అని అడిగాడు తెలియనట్లు, మరచిపోయినట్లు.

"మురళీమోహన్ అండీ" అని చెప్పాడు రామచంద్రరావు.

"మంచి ఆర్టిస్టిక్‌గా వుండే పేరు పెట్టారే?"

"పేరు సెలక్షన్ నాది కాదండీ, వాళ్ళ అమ్మే పెట్టింది మోజుపడి. నేనైతే వెంకట లక్ష్మీనరసింహం అని మానాన్నగారి పేరే పెట్టి ఉండేవాడ్ని."

"ఇప్పుడయితే మాత్రం ఏం? మీ నాన్నగారి పేరు కలిసొచ్చేటట్లు వెంకట మురళీమోహన్ అంటేసరి."

"అనవచ్చుననుకోండి గాని ఆవిడగారికి నచ్చదు. ఆర్టిస్టిక్‌గా లేదంటుంది."

తర్వాత కాసేపు పిల్లాడి పోలికలను గురించి మాట్లాడుకున్నారు. "మా అబ్బాయికి మా నాన్నగారి పోలికలు వచ్చాయండి, మా ఆవిడమాత్రం నా పోలికలే నంటుంది" అన్నాడు రామచంద్రరావు.

"రెండూ నిజమే కావచ్చు. మీకు మీ నాన్నగారి పోలికలు వచ్చివుండవచ్చు. మా పోలికలు మీ అబ్బాయికి వచ్చివుండవచ్చు. అందులో ఆశ్చర్యం ఏంవుంది" అన్నాడు దుర్గాప్రసాద్.

"అబ్బే కాదండీ, నాకు మా అమ్మ పోలికలున్నాయి. మా అబ్బాయికి మాత్రం మా నాన్నగారి పోలికలు వచ్చాయి."

"అసలు పోలికలనేవి చూసేవాళ్ళ దృష్టిని బట్టి ఎలా కావాలంటే అలా కనిపిస్తాయి. నిజం చెప్పాలంటే వాడికి ఎవరి పోలికలు రాలేదు. వాడి పోలికలు వాడివే. కిందటి జన్మలో పోలికలేవో వచ్చివుంటాయి-" అంది సుందరి లక్ష్మిని క్రీగంట చూస్తూ.

ఆ మాటలు లక్ష్మికీ, దుర్గాప్రసాద్‌కీ మాత్రమే అర్థమైనాయి. వాళ్ళిద్దరూ నవ్వారు. లక్ష్మిఒడిలోవున్న పాపాయి కూడా నవ్వాడు.

"ఏమిటోయ్ పెద్ద. ఏదో అర్థమయినట్లుగా నువ్వు కూడా నవ్వుతున్నావు? మీ అమ్మ అన్నట్లు పూర్వ జన్మ వాసన ఏమైనా ఉందేమిటి?" అన్నాడు రామచంద్రరావు పిల్లాణ్ని చూస్తూ.

"వీడు క్రిందటి జన్మలో జమీందార్ల ఇంట్లో పుట్టి

ఉంటాడు. పుట్టుకతోనే ఆ స్టైల్సు అన్నీ చూపిస్తున్నాడు" అంది సుందరి,

"ఆ స్టైల్సు అన్నీ మరచి పోవాలి నాయనా! మనదగ్గర అవేం సాగవు" అన్నాడు రామచంద్రరావు.

"ఎందుకు సాగవు? లక్షణంగా సాగుతాయి. చూస్తూ ఉండండి. వాడు పెద్దవాడై స్టైల్సు అన్నీ మీకు నేర్పుతాడు-" అంది లక్ష్మి.

"ఆదాయం పెరక్కుండా స్టైల్సు వస్తే దివాళా యే."

"ఆదాయం కూడా పెరుగుతుంది. అమాంతం మీకో ప్రమోషన్ రావచ్చు" అన్నాడు దుర్గాప్రసాద్.

"తథాస్తు" అన్నాడు రామచంద్రరావు నవ్వుతూ.

సుందరి, రామచంద్రరావు పిల్లాడిని తీసుకుని ఇంటికి వెళ్ళిపోగానే లక్ష్మికి ఎంతో దిగులుగా అనిపించింది. ఇల్లంతా చిన్నబోయినట్లుగా, కళావిహీనమై బావురు మంటున్నట్లుగా అనిపించింది. అప్పటివరకు ఉత్సాహంగా కబుర్లు చెబుతున్న మనిషి ఒక్కసారిగా మాటా పలుకూ లేకుండా పరధ్యానంలో పడిపోయింది. ఇక రోజూ పిల్లాడు వెళ్ళిపోగానే ఇలాగే ఉంటుందా ఇల్లు? వాడు దగ్గర లేనంత సేపూ తనకు ఇలా దిగులుగానే వుంటుందా? తను ఇలా ఉండకూడదు. తన దగ్గర లేకపోయినా వాడు సుందరి దగ్గరే, ఎదురింట్లోనే వున్నాడుగా? తెల్లారేసరికి మళ్ళీ కనిపిస్తాడు. సుందరి మళ్ళీ ఆఫీసుకు వెళ్ళడం ప్రారంభిస్తే వాడు పగలంతా తన దగ్గరే వుంటాడు అప్పుడు సుందరి ఆఫీసులో ఉన్నంత సేపూ వాడి కోసమే బెం

పడుతూ ఉంటుందా? ఉహూ ఆమె తనలాంటిది కాదు. ఆమె నిశ్చింతగా ఉండగలదు. తనూ అలాగే పిల్లాడు ఆమె దగ్గ రున్నంత సేపూ నిశ్చింతగా వుండగలగాలి.

లక్ష్మి మానసిక స్థితిని దుర్గాప్రసాద్ గ్రహించాడు. ఇద్దరూ మంచంమీద పక్కపక్కనే మౌనంగా పడుకున్నారు. ఎవరి ఆలోచనల్లో వారున్నారు. పిల్లాడిమీది వెర్రి మమ కారంతో ఆమె తనకు దూరమైపోతున్నదాఅనిపించింది అతనికి తను ఆమెకు దగ్గర కావాలంటే, మానసికంగా ఇద్దరూ పూర్తిగా ఏకంకావాలంటే తనుకూడా ఆమెలాగా పిల్లాడిపై మమకారం పెంచుకోవాలి. కాని, ఎప్పటికయినా అదిప్రమాద కరం. ఎంత స్నేహామైనా ఆ పిల్లాడు తమ పిల్లాడు కాడు. ఎంత గారాబంగా పెంచినా వాడికి తాము తల్లిదండ్రులు కాలేరు. వాడు లక్ష్మిని, తనని అమ్మా, నాన్నా అనిపిలవడు. పసి తనంలో తమ ఒడిలో కేరింతవేసినా, పెద్దవుతున్న కొద్దీ వాడు క్రమంగా తమకు దూరమైపోతాడు. వాడిపై తమకున్న మమకారం వాడికి తమపై ఉండదు. అది సహజం. ఆ సంగతి లక్ష్మి ఎప్పుడూ ఆలోచించి ఉండదు. తెలిసి తెలిసి తనుకూడా మమకారం పెంచుకోవడం మంచిది కాదు. ఇలా ఆలోచిస్తూ అతను నిద్రలోకి జారిపోయాడు.

లక్ష్మికి మాత్రం నిద్రపట్టలేదు, ఆమె ఆలోచనల తీరు దుర్గాప్రసాద్‌కి తెలిసినట్లే, అతనిని గురించి లక్ష్మికి తెలుసు అతను తన విషయమే ఆలోచిస్తున్నట్లు ఆమెకు తెలుసు. ఏమని ఆలోచిస్తున్నాడో కూడా తెలుసు. పిల్లాడు ఎప్పటి కైనా వాళ్ళ పిల్లాడే అవుతాడన్న సంగతి తనకి తెలీకకాదు. తెలిసినా చేయగలిగిందేమీ లేదు. వాడు నిస్పందేహాంగా ఆనంద

మోహానే అని తనకు అనిపిస్తున్నప్పుడు-పర్యవసానం ఏదైనప్పటికీ-వాడిపై మమకారం పెంచుకోకుండా ఎలావుండగలదు? వాడు తన దగ్గర కాకపోతే ఎదురింట్లోనైనా ఉంటాడుకదా? పెద్దయిన తర్వాత కూడా వాడు తనని 'అమ్మా' అని పిలుస్తాడేమో; అలా పిలవడం తప్పా? మరీ భవిష్యత్తులోకి అంత దూరం ఆలోచిస్తే మనస్సుకి కాస్తంతైనా శాంతి వుండదు. ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. ఆలోచన అనవసరం.

అర్ధరాత్రి వేళ ఎదురింట్లోనుంచి పిల్లవాడి ఏడుపు వినిపించింది. అస్పష్టమైన సగం కలలతో, ఆలోచనలతో కలత నిద్రపోతున్న లక్ష్మికి మొదట ఆ ఏడుపు కలలో వినిపించినట్లు అనిపించింది. తర్వాత ఏడుపు బిగ్గరగా వినిపించడంతో ఉలిక్కిపడి లేచి కూర్చుంది. పిల్లాడు గిలకలివేసినట్లుగా ఏడుస్తున్నాడు. ఆమె అందోళనతో తల్లడిల్లిపోయింది. వెంటనే వెళ్ళి ఏమయిందో తెలుసుకోవాలనిపించింది. దుర్గాప్రసాద్ గాఢంగా నిద్రపోతున్నాడు. అతన్ని లేపాలా వద్దా అని కాసేపు తటపటాయించి, చివరికి వుండలేక లేపింది.

"ఏమండీ...పిల్లాడు ఏడుస్తున్నాడండీ...ఆకలేస్తోందో ఏమిటో...సుందరి లేచిందో లేదో...వాడి సంగతి చూస్తోందో లేదో..."

"బలేదానివే లక్ష్మి...పిల్లాడికి ఆకలివెయ్యకుండా ఉంటుందా? ఏడిస్తే వాళ్ళు లేవకుండా వుంటారా? ఇంతలోకే అంతా గాభరాపడతావేం? పడుకో మరేం ఫర్వాలేదు."

"అది కాదండీ...ఆకలేసి ఏడ్చాడో...ఇంకెందుకైనా ఏడ్చాడో? ఒక్కసారి వెళ్ళి కనుక్కొద్దామా?"

"సరే బాగానే ఉంది. రేపట్నుంచి రోజూ రాత్రి పూట పిల్లాడి ఏడుపు వినిపిస్తూనే వుంటుంది. అలా అని అర్ధరాత్రిపూటవెళ్ళి తలుపులు కొడతామా?"

పిల్లాడి ఏడుపు ఆగిపోయింది. లక్ష్మికి మనసు కుదుట పడింది. దుర్గాప్రసాద్ మళ్ళీ నిద్రలో మునిగి పోయాడు. కొంత సేపటికి లక్ష్మి ఆలోచనల మీదుగా కలల్లోకి, కలత నిద్రలోకి జారిపోయింది. తెల్లారి లేచి మొహం కడుక్కోగానే లక్ష్మి హడావుడిగా సుందరి ఇంటికి పరుగెత్తుకు వెళ్ళింది. సుందరి వంటింట్లో పనిచేసుకుంటోంది. రామచంద్ర రావు ఇంకా నిద్రలేవలేదు. పాపాయి వంటింటి పక్కగదిలో ఉయ్యాల్లో కేరింత వేస్తున్నాడు. సుందరి లక్ష్మిని చూసి నవ్వుతూ, "తెల్లారకుండా పరుగెత్తుకొచ్చేశావు. ఏమిటి విశేషం? ఒక్కరాత్రికే పిల్లాడి మీద బెంగపెట్టుకున్నా వేమిటి?" అంది.

"అది కాదు సుందరీ...రాత్రి వాడి ఏడుపు వినిపిస్తే కంగారు పడ్డాను ఏమయిందోనని. రాత్రే వద్దామనుకుంటే మా వారు కోప్పడ్డారు."

సుందరి నవ్వేసింది. "బలేదానివే లక్ష్మి...పసిపిల్లలు ఏడవరూ?"

"నీకేం-నవ్వులాటగానే వుంటుంది...రాత్రి ఎంత గాబరాపడ్డానో తెలుసా! ఆయన్ని లేపితే సరిగా నువ్వు అన్నట్లే అన్నారు-పిల్లలు ఏడవరా అని."

"మరి అలా అనక ఇంకేమంటారు! ఆకలేసి ఏడ్చాడు. పాలు ఇస్తే మళ్ళీ నిద్రపోయాడు. ఇక నుంచి రోజూ ఏడుపు వినిపిస్తూనే ఉంటుంది. నువ్వేం గాభరాపడక్కర్లేదు. నిజే

పంగా ఉంటాడు వాడు. చూడు ఎలా ఆడుకుంటు న్నాడో..."

లక్ష్మి పిల్లాణ్ణి ఎత్తుకుంది. "ఓరినీ...రాత్రి ఎంత కంగారు పెట్టేశావురా! ఏమీ ఎరగనట్లుగా నవ్వుతున్నావు" అని కాసేపు ముద్దులాడింది. "మీవారు ఆఫీసుకు వెళ్ళిన తర్వాత మళ్ళీ వస్తాను సుందరీ" అని చెప్పి ఇంటికి తిరిగి వచ్చేసింది.

16

దుర్గాప్రసాద్, రామచంద్రరావు ఆఫీసులకు వెళ్ళిన తర్వాత, సాయంత్రం మళ్ళీ వాళ్ళు తిరిగి వచ్చేవరకు లక్ష్మి, సుందరి పిల్లాణ్ని పెట్టుకుని వాళ్ళింట్లోనో, వీళ్ళింట్లోనో కాల క్షేపం చేసేవారు. లక్ష్మి ఒక్కక్షణం కూడా నానిగాణ్ని విడిచిపెట్టేది కాదు. ఎప్పుడూ వాణ్ణి ఒళ్లో పడుకోబెట్టుకునో, ఎత్తుకునో ఉండేది. వాడి పనులన్నీ తనే చేసేది "కన్నగాడు, కాసుగాడు, బంగారుకొండగాడు" అంటూ వాణ్ని ముద్దు లాడుతూ, కళ్ళుమూసుకుని 'దోబూచి' ఆడిస్తూ, వాడు నవ్వుతుంటే, వాడితోపాటు తనూ నవ్వుతూ, ఇంకో పక్క సుందరితో కబుర్లు చెబుతూ ఉండేది. వాడు నిద్రపోతున్న ప్పుడు మాత్రం ఇష్టం లేకపోయినా తప్పని సరిగా ఉయ్యాల్లో పడుకోబెట్టేది. వాడు నిద్రపోతుంటే తనకేమీ తోచేదికాదు. వాడు తన చేతుల్లో లేకపోతే ఏదో ఖాళీ అయిపోయినట్లుగా, వెలితిగా అనిపించేది. ఆ చేతుల్తో ఏమి చేయాలో తెలీక వూరికే చేతులు నలుపుకుంటూ, వేళ్ళు విరుచుకుంటూ ఉండేది.

అస్తమానం కాలుకాలిన పిల్లిలాగా ఉయ్యాల దగ్గరే తిరిగేది. ఆమె అవస్థ చూసి సుందరి నవ్వుతూ ఉండేది.

నానిగాడు ఎప్పుడు నిద్రలేస్తాడా అని చూస్తూ ఉండేది లక్ష్మి. "ఒరే...ఇంకెంతసేపు నిద్రపోతావురా...లేవరా... నువ్వు నిద్రపోతుంటే నాకు బావుండదురా...ఇంట్లో సందడే లేదురా" అంటూ వాడ్ని కుదిపేది.

సుందరి అవసరమైతే తప్ప పిల్లాడ్ని ఎత్తుకునేదికాదు. కన్నతల్లి కనుక సహజంగా ఆమెకు పిల్లాడిపై లక్ష్మికి ఉన్నంత ప్రేమ ఉంది కాని, ఆమె స్వభావం వేరు. ఆమె పిల్లాడ్ని చూస్తూనే తృప్తిపడేది. లక్ష్మిలాగా అస్తమానం ముద్దులు పెట్టుకునేదికాదు. వాడ్ని ఉయ్యాల్లో పడుకోబెట్టేసి, తన పనులు తను చేసుకునేది. వాడిమీద ప్రేమను ఆమె మాటల్లోగానీ, చేతల్లోగానీ వ్యక్తం చేసేదికాదు. గారాబం ఎక్కువైతే పెంకెతనం వస్తుందనీ, ఎత్తు అలవాటు చేయడం మంచిది కాదనీ మధ్య మధ్య లక్ష్మిని హెచ్చరిస్తూ ఉండేది కూడా.

"పసివాడు కనుక ఎత్తుకుంటాము. పెద్దయితే ఎత్తుకుంటామా?" అనేది లక్ష్మి.

వాడు పెద్దయితే ఎత్తుకోడానికి వీలుండదు కదా అని తలుచుకుంటేనే బాధగా ఉండేది లక్ష్మికి. 'వీడు ఎప్పుడూ ఇలా పాపాయిగానే ఉండిపోతే బావుండును' అనుకునేది.

రామచంద్రరావుకంటే దుర్గాప్రసాద్ ముందుగా ఆఫీసు నుంచి తిరిగి వచ్చేవాడు. దుర్గాప్రసాద్ రాగానే సుందరి తన ఇంటికి వెళ్ళిపోయేది. తర్వాత కాసేపు లక్ష్మి, దుర్గాప్రసాద్ పిల్లాడితో కాలక్షేపం చేసేవారు. అతను

రోజూ ఏవో రంగు రంగుల ఆటవస్తువులు కొనుక్కొచ్చేవాడు. వాటిని చూపిస్తూ, పిల్లాడిని ఆడించేవాడు, ముద్దులాడేవాడు. అతను పిల్లాడిని "ఏమోయ్" అని పలకరిస్తే, లక్ష్మి మొట్టికాయ వేసేది. "ఏమోయ్ ఏమిటి? ఏదో పరాయివాళ్ళ పిల్లాడ్ని పరామర్శించినట్లు? శుభ్రంగా ఏరా అనండి-" అని మందలించేది. అయినా అతను పిల్లాడ్ని 'ఏరా' అనలేకపోయేవాడు. లక్ష్మిలాగా 'కన్నగాడు, కాసుగాడు' అనలేకపోయేవాడు. పిల్లాడిపై ఎంత ప్రేమ కలిగినా సరే, వీడు మన పిల్లవాడు కాదు అనే మాట అతనికెప్పుడూ మనస్సులో మెదులుతూ ఉండేది. ఆ పిల్లవాడిని గుండెకు హత్తుకునే హక్కు తనకు లేదని అనిపించేది. తను అలా పిల్లవాడ్ని కౌగలించుకున్నట్లు తెలిస్తే రామచంద్రరావుకి తనపై చాలా కోపం వస్తుందని అనిపించేది. లక్ష్మికి ఎప్పుడు అలా అనిపించేది కాదు. కాని నిజంగా రామచంద్రరావును లక్ష్మికంటే దుర్గాప్రసాదే బాగా అర్థం చేసుకున్నాడు.

మొదట్లో ఈ దంపతుల అభిమానానికి ముగ్ధుడైనా, క్రమంగా రామచంద్రరావుకు వీరి పట్ల చిరాకు కలగడం మొదలు పెట్టింది. "ఏదో మంచి వాళ్ళుకదా, స్నేహంగా ఉంటున్నారుకదా అని వూరుకుంటుంటే మరీ ఎక్కువగా చనువు తీసుకుంటున్నారు. మాపిల్లవాడ్ని తమ పిల్లవాడులాగా చూసుకుంటూ, మాకంటే ఎక్కువ గారాబం చేస్తూ చివరికి మాకు కాకుండా చేసేట్టు వున్నారు. మా జీవితంలోకి దురాక్రమణ చేస్తున్నారు" అనుకున్నాడు. సుందరికీ లక్ష్మికీ మధ్యగల ప్రాణస్నేహం తెలుసు కనుక, ఆ మాట సుందతో అంటే ఆమె బాధపడుతుందని వూరుకున్నాడు కాని,

అతని వాలకాన్నిబట్టి సుందరి కొంచెం గ్రహించింది. అతన్ని ఎలా మార్చాలా అని ఆలోచించేది.

రామచంద్రరావు ఆఫీసు నుంచి తిరిగివచ్చే సమయానికి లక్ష్మి పిల్లవాణ్ణి తీసుకు వెళ్ళి, సుందరికి ఇచ్చేసి వచ్చేది. రామచంద్రరావు కాసేపు కొడుకును ముద్దులాడేవాడు. అతడు కొడుకుని ముద్దులాడుతున్న దృశ్యం ఎప్పుడైనా కంటబడితే లక్ష్మికి నవ్వు వచ్చేది. "అహా...నాకు కదా ఇంత అందమైన కొడుకున్నాడు" అని అతడు గర్వపడుతున్నట్లు అనిపించేది. పీనాసి వ్యాపారి తన డబ్బును చూసి తెగ మురిసిపోతున్నట్లుగా, ఆ డబ్బు మీద ఎవరైనా కన్ను వేస్తారేమోనని భయపడుతున్నట్లుగా వుండేది అతని ధోరణి.

ఒకరోజు సాయంత్రం ఆరున్నర గంటలవేళ రామచంద్రరావు ఇంటికి తిరిగి వచ్చిన తరువాత లక్ష్మి పిల్లవాణ్ణి తీసుకుని వెళ్ళింది. తలుపు దగ్గరకు వేసివుంది. లోపలినుంచి విసుగ్గా రామచంద్రరావు మాటలు వినిపించాయి. లక్ష్మి బైటే ఆగిపోయి చెట్టు నీడన చీకటిలో నుంచుంది.

"ఎప్పుడూ వాళ్ళింట్లోనే వుంటాడేం? అసలు వాడు మన పిల్లవాడా? వాళ్ళపిల్లవాడా?"

"ఇస్ బిగ్గరగా అనకండీ, పిల్లవాణ్ణి తీసుకుని లక్ష్మి వస్తుంది. వింటే బాధపడుతుంది."

"వింటే విననీ! నేనేం తప్పు మాట్లాడానా? ఆఫీసునుంచి రాగానే వాణ్ణి చూడాలని ఉండదూ నాకు?"

"మీరు వచ్చే టైముచూచుకుని ఐదు నిముషాలు దాటకుండా తీసుకొచ్చేస్తుంది కదండీ...అంతగా విసుక్కుంటారు? రాత్రంతా మన ఇంట్లోనే వుంటాడు కదా? పాపం వాళ్ళకి

పిల్లలు లేరు. ఇంక పుట్టరుకూడాను. వాడ్ని మనకంటే ముద్దుగా చూసుకుంటున్నారు. వాడికి మనింట్లో లోటు జరుగుతుందేమో కాని, వాళ్ళింట్లో ఏ లోటు జరుగదు. ఎలాగూ నేను మళ్ళీ ఉద్యోగంలో చేరితే వాడు పగలంతా వాళ్ళింట్లోనే ఉండాల్సిందే. ఇప్పట్నించీ అలవాటైతే మంచిదేగా, లేకపోతే నేను ఉద్యోగం మానేయాల్సి వస్తుంది. నిజంగా అంతగా స్నేహానికి ప్రాణంపెట్టే వాళ్ళు ఈరోజుల్లో ఎవరు దొరుకుతారండీ? మన అదృష్టం కొద్దీ దొరికారుగాని.

"వాళ్ళు మంచివాళ్ళు కాదనీ, వీణ్ణి వాళ్ళింట్లో వుంచకూడదనీ నేనేం అనటం లేదు. కాని, మరీ టూమచ్ అయితే కష్టం. ఏదైనా లిమిట్‌లో వుండాలి- అంతే,"

వాళ్ళ సంభాషణ ఆగిపోయింది. సుందరి వంటపనిలో నిమగ్నమయింది. రామచంద్రరావు తనపనులేవో చేసుకుంటునాడు. ఒక్క నిమిషం ఆగి లక్ష్మి లోపలికి వెళ్ళింది. పిల్లవాడ్ని ఒక్కసారి ముద్దుపెట్టేసుకుని సుందరికి యిచ్చేసింది. వాళ్ళ సంభాషణ తను విన్నట్లుగా సుందరికి అనుమానం రాకుండా ఓ ఐదునిమిషాలు మామూలుగా నవ్వుతూ మాట్లాడి, ఇంటికి తిరిగి వచ్చింది.

ఆ రాత్రి అంతా బాధపడింది లక్ష్మి. రామచంద్రరావు గురించి తను అనుమానిస్తున్నది నిజమే అయింది. అతనిపట్ల తనకు ఇదివరకు నుంచి వున్న అసహ్యంలాంటి భావం ఇప్పుడు ఇంకా పెరిగింది. అతను అప్పుడప్పుడూ అలా విసుక్కుంటూనే ఉంటాడేమో. అతనికి సర్దిచెప్పుకో లేక సుందరి అవస్థపడుతుందేమో. తనకు సుందరికి మధ్య ఇతనెక్కడ దొరికాడా అనుకుంది. అతనివల్ల తాము ఇద్దరం విడిపోవలసిన

పరిస్థితి ఎప్పుడైనా వస్తుందేమోనని తలచుకుంటే భయం వేసింది. మనస్సు విలవిలలాడి పోయింది. కాసేపు దిండుమీద తలపెట్టుకుని ఏడ్చింది. రామచంద్రానికి చిరాకు కలగకుండా జాగ్రత్త పడడం తప్ప చేయగలిగిందేమీ లేదనుకుంది. రోజూ అతను ఇంటికి వచ్చే వేళకు కొంచెం ముందుగానే నానిగాడ్ని వాళ్ళింట్లో దింపెయ్యాలనుకుంది. అయినా సుందరి ఉద్యోగానికి వెడితే పగలంతా పిల్లాడు తన దగ్గరే ఉంటాడు-ఫరవాలేదు. తన అవసరం వాళ్ళకి వుంది. పెళ్ళాం ఉద్యోగం చేయడం రామచంద్రరావుకి అవసరం. అందుకని ఇకపై అతను సుందరి దగ్గరకూడ తనను విసుక్కోక పోవచ్చు. అలా అనుకున్న తర్వాత లక్ష్మికి మనస్సు నెమ్మదించింది.

ఆ మర్నాటినుంచి సాయంత్రం రామచంద్రరావు ఇంటికి తిరిగి రావడానికి ముందుగానే నానిగాడ్ని సుందరికి అప్పగించేయడం మొదలు పెట్టింది లక్ష్మి. దానివల్ల దుర్గా ప్రసాద్ ఎక్కువసేపు పిల్లాడితో కాలక్షేపం చేయడానికి వీల్లే కుండా పోయింది. ఒకొక్కప్పుడు అతను ఆలస్యంగా ఇంటికి వస్తే అప్పటికే పిల్లాడ్ని తీసుకువెళ్ళి అప్పగించేసేది లక్ష్మి ఈ మార్పును సుందరి గమనించింది. తన భర్త విసుక్కోవడం లక్ష్మి విన్నదేమోనని అనుమానించింది. అయినా ఆ విషయం లక్ష్మితో ప్రస్తావించలేదు.

ఒకరోజు దుర్గాప్రసాద్ "పిల్లాడి దర్శనమేఅపురూపమై పోతోందే ఈ మధ్య" అని అడిగాడు.

"రామచంద్రరావుగారు ఆఫీసునుంచి తిరిగి వచ్చేసరికి ఇంట్లో పిల్లాడు హాజరుగా వుండాలిట. అందుకని పెందరాళే వెళ్ళి అప్పగించేస్తున్నాను-" అని చెప్పింది లక్ష్మి.

'ఓహో' అని వూరుకున్నాడు దుర్గాప్రసాద్. రోజులో ఎప్పుడో ఒకప్పుడు కాసేపు పిల్లాడ్ని చూడకపోతే అతనికి ఎలాగో వుంటుంది. పిల్లాడితో ఓ పావుగంటయినా కాలక్షేపం చేస్తే రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. ఆ సంగతి అతను చెప్పకపోయినా లక్ష్మి గమనించింది, "అంతగా పిల్లాడ్ని చూడాలనివుంటే ఓ అరగంట ముందుగా వస్తూవుండండి ఆఫీసు నుంచి" అని సలహా ఇచ్చింది లక్ష్మి.

సలహా బాగానే వుందనుకున్నాడు దుర్గాప్రసాద్. ఆ మర్నాటినుంచే నానిగాడి కోసం అరగంట ముందుగా ఆఫీసు నుంచి రావడం మొదలుపెట్టాడు. ఆఫీసుకు తనే మేనేజరు కనుక, ముందుగా పని పూర్తిచేసుకుని వచ్చేస్తే అడిగేవాళ్ళు లేరు. పిల్లాడికోసమే అతను పెందరాళే ఆఫీసునుంచి వస్తున్నట్లు సుందరికూడా అర్థంచేసుకుంది.

17

తర్వాత కొద్ది రోజులకే సుందరి మళ్ళీ ఉద్యోగంలో చేరింది. మొదటి రోజు పిల్లాడిని విడిచి ఆఫీసుకు వెళ్ళడానికి ఎంతో బాధగా అనిపించింది. ఆఫీసులో పని చేస్తున్నంతసేపు మనస్సు వాడిమీదనే ఉంది. తర్వాత క్రమంగా అలవాటయింది. రామచంద్రరావు, దుర్గాప్రసాద్ ఉదయం తొమ్మిది

గంటలకే భోజనాలు చేసి ఆఫీసులకు వెళ్ళిపోయేవారు. తర్వాత లక్ష్మి సుందరి ఇంటికి వెళ్ళేది. 11 గంటలకి సుందరి ఆఫీసుకు వెళ్ళేవరకు అక్కడేవుండి, పిల్లాడి పనులన్నీచేసేది. సుందరికి 'టాటా' చెప్పి, పిల్లాడ్ని తీసుకుని ఇంటికి వచ్చేది. సాయంత్రం ఐదు గంటలకి సుందరి ఆఫీసునుంచి తిరిగి వచ్చే వరకు లక్ష్మికి పిల్లాడితో కాలక్షేపం అయ్యేది. సుందరి ఆఫీసు నుంచి తిన్నగా లక్ష్మి ఇంటికే వచ్చేది. పిల్లాడ్నితీసుకుని ఇంటికి వెడతానంటే బలవంతంగా కూర్చోబెట్టేది.

"మీ వారు రావడానికి ఇంకా గంట పైగా వుంది కదా? ఇప్పటినుంచి వెళ్ళి ఏం చేస్తావు? ఆఫీసులో పని చేసిచేసి వచ్చి, ఇంటికి రాగానే పని మొదలు పెట్టాలంటే తలనొప్పిగా వుండదూ? ఆఫీసునుంచి సరాసరి ఇక్కడికి వచ్చి, శుభ్రంగా కాఫీతాగి, రెస్టు తీసుకుని, పిల్లాడ్ని ముద్దులాడి, మీ వారు వచ్చేలోపుగా ఇంటికి చేరవచ్చు. తర్వాత వంటపని మొదలు పెట్టవచ్చు" అనేది లక్ష్మి.

తర్వాత ఇద్దరూ కలిసి టిఫిన్ తిని, కాఫీ తాగేవారు. అలసిపోయి, ఈజీ చైర్‌లో వెనక్కి చేరగిలబడి కాఫీ తాగుతున్న సుందరిని చూస్తే, ఆమెకి సేవ చేయాలనిపించేదిలక్ష్మికి. తన పమిట కొంగుతో ఆమె నుదుటిమీద చెమట తుడిచేది. "తలనొప్పిగా వుందా సుందరీ? అమృతాంజనం రాయనా?" అనేది.

"ఛీ...నేనేం చిన్నపిల్లనా లక్ష్మీ? వాడ్ని గారాబం చేస్తున్నది చాలక నన్నుకూడా గారాబం చేస్తున్నావా?" అనేది సుందరి నవ్వుతూ.

"అలా నీకు సేవచేస్తే నాకు ఎంత తృప్తిగా వుంటుందో తెలిస్తే నువ్వు అలా అనవు."

"నీకు తృప్తిగా వుంటే చాలా...నాకు ఉండద్దా? మరి నాచేత నువ్వు అలా చేయించుకుంటావా?"

"ఓ...నాకు అదేం లేదు అవసరమయినప్పుడు తప్ప కుండా చేయించుకుంటాను."

"సరే అయితే. అవసరమయినప్పుడు నేనూ చేయించుకుంటాను. అవసరం రాకుండా పోదు. నీచేత సేవచేయించుకోకుండాపోను. ఇప్పుడు మాత్రం అంత అవసరంలేదు."

"ఆ భాగ్యం ఎప్పటికో కదా?"

"ఛీ...జమీందారిణివై వుండి, ఇవేం పిచ్చికోరికలు లక్ష్మీ" అని మందలించేది సుందరి.

సాయంత్రం ఐదున్నరకి దుర్గాప్రసాద్ వచ్చేవాడు. అతను కాసేపు పిల్లాడితో కబుర్లు చెప్పుకున్న తర్వాత, సుందరి పిల్లాడిని తీసుకుని ఇంటికి వెళ్ళేది. రామచంద్రరావు ఆరు దాటిన తర్వాత ఇంటికి చేరేవాడు.

లక్ష్మికి నానిగాడు తప్ప వేరే ప్రపంచం లేకుండా పోయింది. వాడి సాన్నిహిత్యమే, వాడితో అనుబంధమే తన జీవితానికి సార్థకతగా అనిపించేది. వాడు లేని తన జీవితాన్ని వూహించుకోవడంకూడా కష్టంగా ఉండేది. వాడిమీది ప్రేమ ఆమెను మైకంలా కమ్మేసింది. వాడు దగ్గరున్నంత సేపూ ఏదో పారవశ్యం అనుభవించేది. సాయంత్రం సుందరిని తీసుకు వెళ్ళినప్పటినుంచి, మళ్ళీ మర్నాడు వాడ్ని తనకు అప్పగించే వరకు వాడి ఊహలతోనే, వాడి స్మృతులతోనే గడిపేది.

వాడు సుందరి దగ్గరవున్నా తనతోనే, తనఒడిలోనే ఉన్నట్లుగా వూహించుకునేది. ఆ ఊహతోనే ఉల్లాసంగా వుండేది. ఎంతో తృప్తిగా, తనకు ఏలోటు లేనట్లుగా, తన కింకేమీ అక్కరలేదన్నట్లుగా ఉండేది.

దుర్గాప్రసాద్‌కి కూడా నానిగాడ్ని చూస్తే ఎంతో తృప్తి కలిగేది. మనస్సు హాయిగా వుండేది. ఎప్పుడైనా ఒకరోజు ఆఫీసునుంచి ఆలస్యంగా వస్తే పిల్లాడి దర్శనం కాకపోతే ఏదో వెలితిగా వుండేది. కానీ, అంతలోనే తనని తను హెచ్చరించుకునేవాడు. మమకారం పెంచుకోకూడదని రెండేసి రోజులు, మూడేసి రోజులు పిల్లవాడిని చూడకుండా ఉండడానికి ప్రయత్నించేవాడు. కావాలనే ఆఫీసు నుంచి ఆలస్యంగా వచ్చేవాడు అతను వరసగా మూడురోజులు పిల్లవాడ్ని చూడకపోతే లక్ష్మికే ఎలాగో వుండేది. బైటికి చెప్పకపోయినా సుందరికి కూడా అనిపించేది. "అయ్యో ఆయన చూడలేదే" అని రోజులో ఎప్పుడో ఒకప్పుడు లక్ష్మితో పాటు దుర్గాప్రసాద్ కూడా పిల్లాడ్ని ముద్దులాడితేనే సుందరికి తృప్తిగా వుండేది.

ఈ ఇద్దరు తల్లుల తీరు చూసి ఇరుగు పొరుగు అమ్మలక్కలు ముక్కున వేలేసుకునేవారు, నోళ్ళునొక్కుకునేవారు, చెవులు కొరుక్కునేవారు. వీద్దరి ప్రాణస్నేహం, అవ్యాజప్రేమ వాళ్ళకి అసలు అర్థం కాలేదు. ఎందుకంటే అవ్యాజప్రేమ ఎలా ఉంటుందో వారికి తెలియదు. అటువంటిది ఒకటి ఉంటుందంటే వారు నమ్మలేరు. అది వాళ్ళకి ఎప్పుడూ అనుభవంలోకి రాలేదు. భర్తలు ఆఫీసులకి వెళ్ళిన తర్వాత సాయంత్రందాకా ఏదో ఒకలాగా కాలక్షేపం జరగాలి కనుక,

వాళ్ళు ఒకచోటచేరి మాట్లాడుకుంటారు. పచ్చీసు ఆడుకుంటారు. ఎప్పుడైనా మార్నింగ్‌షో సినిమాలకు వెడతారు. కూరలు తెచ్చుకోడానికి కలిసి మార్కెట్‌కి వెడుతూవుంటారు. పప్పో, పంచదారో అయిపోతే బదులు అడిగి తెచ్చుకుంటారు. అంతవరకే వాళ్ళ స్నేహాలు. వాళ్ళలో ఎవరికీ ఎవరి మీద అభిమానంలేదు, ఆపేక్షలేదు. ప్రతి ఇల్లాలు ఇంకో ఇల్లాలిని గురించి మరో ఇల్లాలితో చెడ్డగానే చెబుతుంది. ఆ సంగతి ప్రతి ఇల్లాలికీ తెలుసు, అయినా ఏమీ ఎరగనట్లుగా నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ సహజీవనం సాగిస్తున్నారు. లక్ష్మి, సుందరి వీళ్ళతో కలిసేవారుకారు. మాట్లాడిస్తే ముక్తసరిగా మాట్లాడి వూరుకునేవారు. తమ స్నేహం ఈ అమ్మలక్కలకి గిట్టదని వాళ్ళిద్దరికీ తెలుసు.

లక్ష్మి, సుందరిలలో ఎవరో మరొకరిని తమ స్వార్థానికి ఉపయోగించుకుంటున్నారని అమ్మలక్కలకి అనుమానంగా వుండేది. ఎవరు యెవరిని ఉపయోగించుకుంటున్నారో పరిశోధించాలని వాళ్ళకి తహతహగా వుండేది. సుందరి తను ఉద్యోగం చేసుకోవాలి కనుక, పిల్లాడ్ని చూసేందుకు ఎవరోఒకరు కావాలి కనుక, అమాయకురాలైన లక్ష్మిని మంచిచేసుకుని,పిల్లాడ్ని ఆమెకి అంటగట్టిందా? లేక లక్ష్మి తనకి పిల్లల్లేరు కనుక, పుట్టరు కనుక సుందరి పిల్లాడ్ని దగ్గరకు తీసుకుని వాణ్ణి తల్లికి కూడా దూరం చేస్తోందా? ఈ రహస్యం తెలుసుకోడానికి వాళ్ళు ప్రయత్నిస్తున్నారు.

ఒకరోజు సుందరి ఆఫీసుకు వెళ్ళిన తర్వాత పొరుగింటావిడ లక్ష్మి ఇంటికి వచ్చి కూర్చుని బాతాఖానీ ప్రారంభించింది.

"ఆ సుందరి మహాగడుసుది. నిన్ను బాగా బుట్టలో వేసుకుంది" అంది ఆవిడ.

"సుందరి నన్ను బుట్టలో వేయడం ఏమిటండీ" అంటూ నవ్వేసింది లక్ష్మి.

"నువ్వు ఒట్టి వెర్రిబాగులదానివి. నీకేం అర్థమవుతుంది! తెల్లవన్నీ పాలు అనుకుంటావు. నంగనాచిలా నవ్వుతూ నిన్ను స్నేహం చేసుకుని నీచేతఅడ్డమైన చాకిరి చేయించుకుంటోంది."

"నేనేం చాకిరి చేస్తున్నానండీ!"

"ఈ పిల్లడికి పొద్దస్తమానం చేస్తున్నదిచాకిరీ కాదూ? వీడ్ని అయినకాడికి నీమీద వదిలేసి తను రింగురంగామని ఆఫీసుకి పోయి సంపాదించుకుంటోందా? నువ్వు వీడ్ని చూడకపోతే తనకా సంపాదన వుండదు కదా? ఇంత శ్రీమంతురాలివై వుండి ఆయాలాగా ఈ పేద పిల్లాడికి చాకిరి చేయడం కర్మ కాకపోతే ఏమిటి?"

"మీకు ఎలా కనిపిస్తున్నా నాకు మాత్రం చాకిరి లాగా లేదు మామీ. వీడ్ని సుందరి అంట గట్టలేదు. తనని మళ్ళీ ఉద్యోగంలో చేరమని ప్రోత్సహించింది నేనే. లేకపోతే తను ఉద్యోగం మానేద్దామనే అనుకుంది. వీడితోనాకు పగలంతా జోలెదు కాలక్షేపం అవుతోంది."

"నీలాంటి ధనవంతురాలు దొరికితే ఆవిడకి, ఆవిడ పిల్లాడికి లోటేముంది? మొత్తానికి పిల్లాడు అదృష్టవంతుడు. గర్భదరిద్రుల యింట పుట్టినా జమిందారీ దర్జాలన్నీ సాగుతున్నాయి. తన పిల్లాడికి కావలసినవన్నీ నీచేతనే కొనిపిస్తోంది కదా?"

"నా దగ్గర్నుంచి దమ్మిడీ యెత్తు సహాయం పొందడం సుందరికి ఇష్టంలేదు మామి. నేనే నా సంతోషం కోసం నా

తృప్తి కోసం అంతా చేస్తున్నాను. వీధిలో నలుగురూ ఇలా అనుకుంటారని సుందరి భయపడుతూనే వుంది. చివరికి ఇవాళ మీరు మాట అననే అన్నారు" అంది లక్ష్మి నిష్ఠూరంగా.

"సరే అయితే ఇంకేం నలుగురూ అనుకుంటారని తెలిసే, ఇష్టంలేదని చెబుతూనే ఇంత సహాయం పొందుతోందన్న మాట! కాని మంచికి పోతే చెడు యెదురైనట్టు ఇవాళ నువ్వు ఆవిడగారికి యెంత దోచి పెట్టినా రేపు నువ్వు ఏదో ఒక మాట పడకతప్పదు. అప్పుడు చింతించి ప్రయోజనంలేదు. ఇప్పటికైనా తెలివి తెచ్చుకొని ఈ జంజాటం వదిలించుకుంటా వేమోనని ఇంతగా చెబుతున్నాను. డబ్బుగలదానివి, హాయిగా మొగుడితో కార్లో షికార్లు కొట్టక నీకిదేం చాకిరి! పాడు చాకిరి! నీ అంతస్తు యెక్కడ? ఆవిడ అంతస్తు యెక్కడ?"

"అంతస్తు చూసుకునేటట్లయితె మిమ్మల్ని గడప దాటి ఇంట్లోకి రానివ్వకూడదు మామీ. కాని నాకు ఆ పట్టింపులు లేవు. నా పుట్టింటి వారు పేద వాళ్ళే, ఇవాళ నేను డబ్బుగలదాన్నని వాళ్ళని వదులుకుంటానా? సుందరి నాతోబుట్టువు లాంటిదే."

"సరే నీఇష్టం తల్లీ! హితం కోరాను కనుక చెప్పాను. వస్తాను, అవతల బోలెడు పనుంది" అంటూ లేచింది మామీ. గడప దాటుతూ ఆవిడ "ఈ స్నేహాలు యెంత కాలం సాగుతాయో చూడకపోము" అని గొణుక్కోవడం లక్ష్మికి వినిపించింది.

"మిమ్మల్నిద్దరినీ విడదీయకపోతే చెవి తెగ్గోసుకుంటా" అని ఆవిడ సవాలు చేసినట్లుగా అనిపించింది లక్ష్మికి. ఆవిడ మిగతా అమ్మలక్కలని కూడగట్టుకుని ఎటువంటి వ్యూహాలు

పన్నుతుందో, అందరూ కలిసి సుందరికి తనపై ఎటువంటి దుర్బోధలు చేస్తారో అని తలచుకుంటే భయంతో ఒళ్ళుజల్లు మంది. వీళ్ళందరి బారినుంచి తమ స్నేహాన్ని రక్షించుకోవడం ఎలా? ఈ వ్యూహాల నుంచి ఉచ్చులనుంచి బైటపడడం ఎలా? ఈ కుళ్ళుమనుషులందరికి దూరంగా తను, సుందరి, పిల్లాడ్ని తీసుకుని యెక్కడికైనా వెళ్ళిపోగలిగితే బావుండును. కాని యెక్కడికి వెడతారు? ఎలా సాధ్యం? ఈ ఆలోచనలతో చాలా సేపు ఏడ్చింది. వాళ్ళు సుందరికి కూడా దుర్బోధలు ప్రారంభించకముందే ఆమెను హెచ్చరించాలనుకుంది.

సాయంత్రం సుందరి ఆఫీసునుంచిరాగానే జరిగినదంతా చెప్పింది. "వాళ్ళు మనల్ని విడదీయాలని చూస్తున్నారు సుందరీ...వాళ్ళు నీదగ్గరికి కూడా వచ్చి నన్నుగురించి ఏవో చెబుతారు. అవేవీ నమ్మకు సుందరీ...నువ్వూ, నానిగాడు లేకపోతే నాకీ జీవితంలో ఇంకేమిలేదు సుందరీ" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

సుందరి తన చెంగుతో లక్ష్మి కన్నీరు తుడిచింది. ఆమె చేతిని తనచేతిలోకి తీసుకుంది. "లేదు లక్ష్మీ...నీమీద నా మనస్సు విరిచేయడం ఎవరికీ సాధ్యంకాదు. నా గురించి నాకు యెంతబాగా తెలుసో నిన్ను గురించి కూడా అంతబాగా తెలుసు. నిన్ను ద్వేషించడం అంటే నన్ను ద్వేషించినట్లే అవుతుంది. మా ఇంటావిడ నిన్నరాత్రే బోధ చేసింది-ఇదే ధోరణిలో. నువ్వు నా పిల్లాడిని నాకు కాకుండా చేస్తున్నా వట. నీ దగ్గర అలవాటై వాడు నన్ను తల్లి కాదంటాడట. ఉద్యోగం కోసం చూసుకుంటే పిల్లాడు దక్కకుండా పోతా డట. "పోనీలే మామీ పిల్లాడిని లక్ష్మికే పెంపకంయిచ్చేస్తాను"

అన్నాను. ఆవిడ నోరెత్తలేక పోయింది. నిష్కారణంగా మన మీద వాళ్ళకెందుకో అంత అసూయ? మనంవదులుచ్చుకోవాలని చూసినా వాళ్ళు మాత్రం మనల్ని వదలరు. ఈ ముసలి మామిలంతా కలిసి ఇంకా కుట్ర చేయవచ్చు. కాని మన స్నేహాన్ని పాడు చేయడం వాళ్ళ తరంకాదు లక్ష్మీ! పరిస్థితులు ఎప్పుడు ఎలా మారతాయో తెలీదు. ఒకవేళ మనం విడిపోవడం కూడా జరిగినా నీ మీద నా స్నేహభావం మాత్రం ఎప్పటికీ పోదు. ఈ ఒక్క విషయం నానిగాడి మీద ప్రమాణం చేసి చెప్పగలను." సుందరి గొంతు రుద్ధమయింది.

"ఈ ఒక్క మాట చాలు సుందరీ...ఇంక నేను దేనికీ భయపడను. ఏ దిగులూ లేదు నాకు-" అంది లక్ష్మి.

18

వీధిలో అమ్మలక్కలు ఎంత గుసగుస లాడుకున్నా లక్ష్మి, సుందరి మామూలుగానే ఉన్నారు. వాళ్ళ స్నేహం ఇంకా వృద్ధి అవుతున్నది కూడా. పిల్లవాడికి ఆరోనెలవచ్చింది. చక్కగా పాకు తున్నాడు. బొమ్మలతో ఆడుకుంటున్నాడు. వీధిలో వాళ్ళదిష్టి ఎక్కడ తగులుతుందో నని వాడికి రోజూ ఇద్దరు అమ్మలూ దిష్టి తీసేవారు. వాడు ఇద్దరు అమ్మల దగ్గర సమానంగా అలవాటయాడు. ఇదరికీ తేడా తెలిసేది కాదు వాడికి.

ఒకరోజు సుందరి చాలతలనొప్పిగావుందనిమధ్యాహ్నం రెండు గంటలకే ఆఫీసునుంచి వచ్చేసింది. అలవాటు ప్రకారం సరాసరి లక్ష్మి ఇంటికి వచ్చింది. ఇల్లంతా నిశ్శబ్దంగావుంది.

వంటమనిషి బైటవరండాలో చెంగుపరచుకుని పడుకుని నిద్ర పోతోంది. లక్ష్మి, పిల్లాడుకూడానిద్రపోతున్నట్లున్నారు. అలికిడి లేదు.దుర్గాప్రసాద్ యింట్లోలేని సమయంలో సుందరి సరాసరి లక్ష్మి పడక గదిలోకి వెళ్ళడం అలవాటే. అలాగే పడకగది వైపు వెళ్ళింది. తలుపు ఓరగా వేసివుంది. లోపలకు వెళ్ళ గానే అక్కడి దృశ్యం ఆశ్చర్యం కలిగించింది. మంచంమీద లక్ష్మి గాఢనిద్రలో వుంది. పక్కనే పిల్లాడు పడుకుని ఆమె వద్ద పాలు తాగుతున్నాడు. లక్ష్మి ముఖం పాపాయి ముఖం లాగా అమాయకంగా, ప్రశాంతంగా, తేటగా వుంది. గొప్ప తృప్తి ఆమె ముఖంలో కనిపిస్తోంది. సుందరి వచ్చిన అలికిడికి ఆమె నిద్ర లేవలేదు. ఒక్కనిమిషం అలాగే నుంచుని ఆ దృశ్యాన్ని చూసింది సుందరి. అంతలో గబుక్కున జ్ఞాప కం వచ్చి గది తలుపు నెమ్మదిగా గడియపెట్టింది. తనలాగానే యెవరైనా యిరుగమ్మ, పొరుగమ్మ వచ్చి తొంగిచూస్తే ఈ దృశ్యం కనిపించేదికదా అని భయపడింది.

చప్పుడు కాకుండా మంచం దగ్గరకు వచ్చింది. మంచం మీద కూర్చుని లక్ష్మి ముఖంకేసి చూస్తోంది. తన పిల్లాడికి పాలు యిస్తున్నందుకు లక్ష్మిపై ఆమెకు అసూయగానీ, కోపంగానీ కలగలేదు. ఏ విధమైన బాధా కలగలేదు. తను యిన్నాళ్ళూ ఈ సంగతి వూహించలేదు కాబట్టి, మొదటిసారి చూసింది కాబట్టి, ఆశ్చర్యం మాత్రం కలిగింది. కాని యిప్పుడు యిది సహజంగానే అనిపిస్తూంది. ఈ విధంగా తాము యిద్దరూ పిల్లవాడి ప్రేమను సమానంగా పంచుకుంటు న్నారు. ఈవిధంగా తాము ఇద్దరూ ఇంకాసన్నిహితులైనారు.

వాడు పెద్దవాడైన తర్వాతకూడా తమ ఇద్దరినీ సమానంగా ప్రేమించాలి, గౌరవించాలి.

ఇప్పుడు నిద్రలేపితే లక్ష్మి తప్పుచేసినదానిలా కంగారుపడుతుందేమో. పోనీ చప్పుడు కాకుండా లేచి వెళ్ళి పోదామా, బైటికివెళ్ళి తలుపుకొట్టి, పిలిచి లోపలకు వద్దామా అనుకుంది. కాని తనకు ఈ సంగతి తెలుసుననీ, తానేమీ బాధ పడడంలేదనీ, తనకేమి అభ్యంతరం లేదని లక్ష్మి తెలుసుకుంటేనే మంచిదని అనిపించింది. లక్ష్మి పాలు ఇవ్వడం, వాడు తాగడం చాలా రోజులుగా జరుగుతున్నట్లుంది. ఇప్పుడీ అలవాటును మానిపించడానికి ప్రయత్నిస్తే లక్ష్మి విపరీతంగా బాధపడుతుంది. ఆమె నుంచి పిల్లాడ్ని వేరుచేయడం మహా పాపం. ఎవరు యెన్ని అనుకొన్నాసరే వాడు ఆమె పిల్లాడే. విధివశాత్తూ రెండు కుటుంబాలు దూరం కావలసి వస్తే వాడు లక్ష్మితోనే వుంటాడు. అందుకు మానసికంగా తాను యిప్పటి నుంచే సిద్ధం కావాలి. పిల్లాడి మీద యింక ఆశ వదులుకోవాలని తలుచుకుంటే చాలా బాధ అనిపించింది.

ఆప్యాయంగా లక్ష్మి తల నిమురుతుంటే కొంతసేపటికి లక్ష్మి కళ్ళుతెరిచింది. సుందరినిచూచి ఉలిక్కిపడలేదు. పమిట సర్దుకుంటూ, "ఎంతసేపయిందివచ్చి? అప్పుడే ఐదుఅయిందా?" అని అడిగింది.

"లేదు...తలనొప్పిగా వుంటే పర్మిషన్ తీసుకొనివచ్చేశాను." "తలనొప్పిగా వుందా" ఏదైనా టాబ్లెట్ వేసుకున్నావా?" కాఫీ తెస్తాను ఆగు" అంటూ లేవబోయిందిలక్ష్మి.

"కాఫీ తర్వాత తాగవచ్చులే గానీ...నువ్వు తలుపు తెరుచుకుని పడుకుంటావుకదా...ఎవరయినా వచ్చి తొంగి

చూస్తే నువ్వు వాడికి పాలివ్వడం చూస్తే ఏమనుకుంటారు చెప్పు? తలుపు వేసుకుని పడుకోకూడదూ? వీధిలో అమ్మ లక్కలు ఇప్పటికే కళ్ళలో నిప్పులుపోసుకుంటున్నారు మన స్నేహం చూసి."

"ఈ పడకగదిలోకి అడుగుపెట్టే అధికారం నీకు తప్ప ఎవరికీ లేదు సుందరీ. నాతో ఎవరికయినా పనుంటే కేకవేసి పిలుస్తారు. నేనే బైటికి వెడతాను. అయినా ఎందుకయినా మంచిది...ఇహనుంచి తలుపు గడియపెట్టుకుని పడుకుంటాలే. అవునుగానీ సుందరీ నీకేమైనా కోపం వచ్చిందా? నీకు ఇష్టం లేని పని ఏదీ చెయ్యను నేను. వద్దంటే మానేస్తాను."

"లేదు లక్ష్మీ...వాడు నీ పిల్లవాడే. నీ పిల్లాడు నీ దగ్గర పాలు తాదితే నాకు కోపం దేనికి?" అంది సుందరి ఆప్యాయంగా లక్ష్మి తల నిమురుతూ.

"లేదు సుందరీ...వీడు నా పిల్లాడు కాదు–మనపిల్లాడు. వీడిమీద ప్రేమను కూడా నీతో పంచుకోకుండా వుండలేను. నేను ఒక్కదాన్నీ భరించలేను. సుందరీ నాకెప్పుడయినా విపరీతమయిన సంతోషం కలిగితే ఆ సమయంలో నువ్వు దగ్గర లేకపోతే నాకెంతో బాధగా అనిపిస్తుంది. అంత సంతోషం నిరర్థకమనిపిస్తుంది. నీతో పంచుకోలేని సంతోషం ఎందుకొచ్చిన సంతోషం. ఏం చేసుకోను అనిపిస్తుంది. పోనీనువ్వు దగ్గరున్నావనుకో...ఈ సంతోషాన్ని ఎలా పంచి ఇవ్వడం అన్న సమస్య వస్తుంది. నేను ఎలా అందించడం? నువ్వు ఎలా అందుకోవడం...నేను చెబుతున్నది అర్థమవుతోందాసుందరీ."

"ఆహా...శుభ్రంగా అర్థమవుతోంది. నాకు అర్థంకావాలని నువ్వు అంతగా శ్రమపడనక్కర్లేదు. అసలు నువ్వేమీ

చెప్పకపోయినా నాకంతా అర్థమైపోతుంది...నీకెప్పుడు సంతోషం కలిగినా నాకు పంచి యిస్తూనే వున్నావు. నేను అందుకుంటూనే వున్నాను" అంది సుందరి నవ్వుతూ.

"స్నేహం అంటే అలా ఉండాలి. ఇంతకంటే గొప్ప స్నేహం ప్రపంచంలో ఎక్కడా వుండదు."

"సరేగానీ...వాడికి నువ్విలా పాలిస్తున్న సంగతి మన ఇద్దరికీ తప్ప ఇంకెవరికీ తెలియకూడదు."

"సరే తెలియనివ్వను-ఒట్టు" అంది లక్ష్మి.

19

లక్ష్మి ఎప్పుడూ భవిష్యత్తు గురించి ఆలోచించదు. దేని పర్యవసానం ఎలా ఉంటుందన్న ఆలోచన ఆమెకురాదు. ఆ క్షణంలో అనుభూతి మధురమైనదైతే సంతోషిస్తుంది. బాధాకరమయినదయితే బాధపడుతుంది. ఒంటరిగా వుంటే ఊహాల్లో తేలిపోతూవుంటుంది. ఆ ఊహాలెప్పుడూ మధురమైనవే అయి ఉంటాయి. చెడును ఎప్పుడూ వూహించుకోదు. సుందరి అలా కాదు. ఆమె భవిష్యత్తు గురించి చాలా దూరం ఆలోచిస్తుంది. పర్యవసానాలను గురించిఆలోచిస్తుంది. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తుంది. ఊహాల్లో తేలిపోయే అలవాటు ఆమెకులేదు.

ఒకవేళ ఏ పరిస్థితుల్లోనైనా తన కుటుంబంగాని, లక్ష్మి కుటుంబంగాని వేరేవూరు వెళ్ళి స్థిరపడవలసిన అవసరం వస్తే పిల్లవాడిని లక్ష్మికి దత్తత ఇవ్వడానికి భర్తను ఎలా ఒప్పించాలా అని సుందరి ఎప్పుడూ ఆలోచిస్తూ వుండేది. అటువంటి పరిస్థితికి క్రమంగా భర్తను అలవాటు చేయాలని ప్రయత్నిం

చేది. వీలయినప్పుడల్లా లక్ష్మి, దుర్గాప్రసాద్‌ల మంచితనం గురించి, వాళ్ళిద్దరికీ నానిగాడిపై గల ప్రేమను గురించి చెబుతూ, వాళ్ళపై అతని అభిమానాన్ని పెంచడానికి ప్రయత్నించేది. వాళ్ళపై తనకున్నంత అభిమానం, స్నేహం భర్తకు కూడా వుంటే సమస్యలేదు. కాని అతను మాత్రం పిల్లాడి విషయంలో మొహమాట పడేవాడు కాదు.

సుందరి ఎప్పుడయినా సరదాకి అన్నట్లుగా అతనితో "మన నానిగాడ్ని లక్ష్మికి దత్తతఇచ్చేద్దామండీ...కావాలంటే మనకి మళ్ళీ పిల్లలు పుడతారు...వీళ్ళకింక పిల్లలు పుట్టరు కదా—పైగా వీడంటే లక్ష్మికి ప్రాణం" అనేది. రామచంద్రరావు సరదాకైనా 'పోనీ అలాగే' అనేవాడు కాదు. కనీసం 'చూద్దాం' అనైనా అనేవాడుకాదు. "పాపం ఆశ! బంగారంలాంటి పిల్లాడ్ని కాజేద్దామని చూస్తున్నారు కాబోలు. అదేం కుదరదని చెప్పు. స్నేహం అయితే స్నేహం వరకే. మనకింకా పిల్లలు పుడితే మాత్రం వీడ్ని యిచ్చెయ్యాలనిఏముంది" అనేవాడు నిర్మొహమాటంగా.

తన భర్త యిలా అంటున్నట్లు ఒకరోజు సుందరి దిగులుగా లక్ష్మితో చెప్పింది.

"అవునుమరి...నాకు యిచ్చేస్తానని అనడం దేనికి? పిల్లవాడ్ని యిచ్చేస్తానంటే కన్న తండ్రికి బాధగా వుండదూ? ఆయనకి మాత్రం వాడిమీద మమకారం వుండదూ? నానిగాడు యెప్పుడూ మన ఇద్దరి మధ్య వుండచ్చుగా? దత్తత ప్రశ్న దేనికి? నువ్వు వాడ్ని నాకు దత్తత ఇచ్చినా నేను తీసుకోను. వాడిమీది ప్రేమను నీతో పంచుకోకుండా వుండలేనని ఇదివరకే చెప్పానుగా?" అంది లక్ష్మి.

సంక్రాంతి పండుగకు లక్ష్మి యింట్లోనే నానిగాడికి భోగిపళ్ళుపోసి, పేరంటంచేశారు. లక్ష్మి ఆంధ్ర సంప్రదాయం ప్రకారం బొమ్మలకొలువుకూడా పెట్టి, దాదాపు వందమందిని పేరంటానికి పిలిచి, మిఠాయిలు పంచి పెట్టింది. అంతా పెద్ద యెత్తున ఘనంగా జరిపించింది.

"ఇదేమిటమ్మా భోగిపళ్ళు మీ యింట్లోపొయ్యక యిక్కడ పోస్తున్నారు. ఇటువంటివి కలిగినంతలో సొంత ఇంట్లో చేసుకుంటేనే బావుంటుంది" అన్నారు కొందరు అమ్మలక్కలు సుందరితో.

"ఇది వాడికి ఇక్కడైనా అక్కడైనా ఒకటే. విశాలంగావుంటుందని యిక్కడ చేస్తున్నాం. పైగా లక్ష్మిబొమ్మల కొలువుకూడా పెట్టిందిగా? రెండూ కలిసొస్తాయి" అంది సుందరి.

"ఇంతకీ పిల్లాడు అదృష్టవంతుడు. అన్నీ ఘనంగా జరిగే యోగంవుంది వాడికి. శ్రీమంతుల అండ అందరికీ దొరుకుతుందా?" అని కొందరు సన్నగా అనుకోవడం లక్ష్మికి వినిపించింది.

ఇటువంటి మాటలు వినడం లక్ష్మికి, సుందరికి మామూలు అయిపోయింది. వాటిని పట్టించుకోవడం మానేశారు. పేరంటం అయింతర్వాత అందరూ వెళ్ళగానే పిల్లాడికి రోజూకంటే శ్రద్ధగా దిష్టితీసేశారు.

పిల్లాడి మొదటి పుట్టినరోజు పండుగకూడా యిలాగే లక్ష్మి ఇంట్లోనే ఘనంగా జరిగింది. లక్ష్మిని బుట్టలో వేసుకుని ఇటువంటి ఖర్చులన్నీ పెట్టిస్తున్నట్లు అమ్మలక్కలు వ్యాఖ్యానిస్తారని తెలిసినా, తనకు ఇవన్నీ ఇష్టం లేకపోయినా లక్ష్మి

ఆనందం కోసం మెదలకుండా వూరుకొంటోంది సుందరి. ఎవరు ఏమనుకున్నా లక్ష్మి సంతోషిస్తే, పిల్లాడు సుఖపడితే చాలుననుకుంది. వీధిలో జనంకూడా అప్పటికి కొంత అల వాటు పడ్డారు వీళ్ళ ధోరణికి. అయితే ఛాన్సు దొరికినప్పుడు పుల్లవిరుపు మాటలు అనకుండా మాత్రం వూరుకోవడంలేదు.

పిల్లవాడికి కొద్దికొద్దిగా మాటలు వస్తున్నాయి. లక్ష్మి వాడ్ని ఒళ్ళో కూర్చోబెట్టుకుని మాటలు నేర్పుతోంది. వాడు చక్కగా నడుస్తున్నాడు. మూడుచక్రాల తోపుడుబండి యిచ్చి, దాని కడ్డీపట్టుకుని నడవడం నేర్పింది లక్ష్మి. వాడు ఈ ఇంటినుంచి ఆ ఇంటికి తోపుడుబండి తోసుకుంటూ నడుస్తున్నాడు. వాడు సుందరినీ, లక్ష్మినీ కూడా 'అమ్మా' అనే అంటున్నాడు. సుందరి దగ్గర ఉన్నప్పుడు లక్ష్మిని 'ఇంకో అమ్మ' అంటున్నాడు. లక్ష్మిదగ్గర వున్నప్పుడు సుందరిని 'ఇంకో అమ్మా' అంటున్నాడు. ఇద్దరినీ ఒకే విధంగా చూసే వాడు. తన అసలు అమ్మ ఎవరో వాడికి తెలియదు. కాని సుందరి దగ్గరకంటే లక్ష్మి దగ్గర ఎక్కువ అలవాటయ్యాడు.

పిల్లవాడు ఇద్దరినీ 'అమ్మా' అనడం విని అమ్మలక్కలు నోళ్ళు నొక్కుకున్నారు. వీళ్ళ స్నేహం శ్రుతిమించి రాగాన పడుతోందనుకున్నారు.

"పోనీ పిన్ని అనైనా అలవాటు చేయక పోయావ టమ్మా? 'అమ్మ' అని అలవాటు చేశావేమిటి?" అని ఒకావిడ మందలింపుగా చెప్పబోయింది.

"పోనీ లక్ష్మే వాడితల్లి అనుకోండి. అయినా నాకు లేని బాధ మీకు దేనికి చెప్పండి" అని కొంచెం గట్టిగా సమాధాన మిచ్చింది సుందరి.

ఒక్కొక్కప్పుడు రామచంద్రరావుకూడా విసుక్కునే వాడు 'లక్ష్మిని అమ్మా' అంటాడేమిటని. "పోనిద్దురూ, అన్నంత మాత్రాన అమ్మయిపోతుందా? ఇందులో అంతగా బాధ పడేందుకు ఏముంది? ఏదో లక్ష్మి పుణ్యమా అని నేను వాడి సంగతి ఆలోచించకుండా నిశ్చింతగా ఉద్యోగం చేసుకో గలుగుతున్నాను. ఉద్యోగం చెయ్యబట్టే మనవాళ్ళను ఆదుకో గలుగుతున్నాము. మన స్నేహాన్ని చూసి ఓర్వలేక వీధిలో అమ్మలక్కలు ఏవో అంటుంటే వాళ్ళతోపాటు మీరూ మొదలు పెట్టారా?" అని మందలింపుగా అనేది సుందరి. నిజమే-తనదే తప్పు అని ఊరుకునేవాడు రామచంద్రరావు.

పిల్లవాడు రామచంద్రరావును 'నాన్న' అనేవాడు. దుర్గాప్రసాద్‌ని 'బాబాయ్‌గారు' అనేవాడు. వాడు దుర్గాప్రసాద్ దగ్గరకంటే రామచంద్రరావు దగ్గరే ఎక్కువ చనువయ్యాడు. దుర్గాప్రసాద్‌కి పిల్లాడంటే ముద్దువున్నా, ఉద్దేశపూర్వకంగానే అతను పిల్లాడితో సాన్నిహిత్యాన్ని పెంచుకోలేదు. "ఏమోయ్" అనేవాడు. అందుకు రామచంద్రరావు సంతోషించేవాడు. లక్ష్మికూడా అలాగే ప్రవర్తించాలనిఅనుకునేవాడు. స్నేహంగా వుండచ్చు, సహాయం చేయవచ్చు. పిల్లాడ్ని ముద్దుచేయవచ్చు. కాని, వాడ్ని సొంత పిల్లాడిలా చూడకూడదు.

20

మురళీమోహన్‌కి మూడేళ్ళు నిండిన తర్వాత సుందరి మళ్ళీ గర్భవతి అయింది. ఈసారి అందరికంటే యెక్కువగా సుందరే సంతోషించింది. మళ్ళీ తనకు మగపిల్లవాడు పుడితే

మోహన్‌ని లక్ష్మికి యిచ్చేయడానికి రామచంద్రరావుకి అట్టే అభ్యంతరం వుండకపోవచ్చుననుకుంది. అందుకని మగపిల్లాడే పుట్టాలని కోరుకుంది. ఆడపిల్లయితే మళ్ళీ మగపిల్లాడికోసం ఎదురుచూడవలసి వస్తుంది. ఇంతమంది పిల్లల్ని పోషించే స్తోమత తమకు లేదు. రామచంద్రరావు మాత్రం ఈసారి ఆడపిల్ల పుట్టాలని కోరుకుంటున్నాడు. మగపిల్లాడు వున్నాడు కదా; ఒక్క ఆడపిల్ల వుంటే ఇంక చాలు అనుకున్నాడు. మోహన్‌ని లక్ష్మికి ఇవ్వడానికి తన భర్త ఒప్పుకునే పక్షంలో తను ఎంతమంది పిల్లలయినా కనవచ్చుననుకుంది సుందరి.

సుందరి గర్భవతి అయిందని తెలిసి లక్ష్మికూడా ఎంతో సంతోషించింది.

"ఇన్నాళ్ళు మోహన్ ఒక్కడే వుండడం బాగాలేదు. వాడికి తోడుగా ఒక చెల్లెలువుంటే బావుంటుంది"-అందిలక్ష్మి.

"కాదు లక్ష్మి...మగపిల్లాడే పుట్టాలని కోరుకుంటున్నాను. మగపిల్లాడు పుడితే మోహన్‌ని నీకు దత్తత యివ్వడానికి ఎలాగైనా మా వారిని ఒప్పిస్తాను. ఇప్పుడు ఆడపిల్ల పుడితే మళ్ళీ మగపిల్లాడికోసం యెదురుచూడాలి."

"పోనీ ఇప్పుడు మగపిల్లాడు పుట్టినా నువ్వు ఆ తర్వాతైనా ఆడపిల్లని కనాలి, ఆడపిల్ల లేకపోతే ఇల్లు కళగా ఉండదు."

"ఇంతమందిని కని, పెంచి, పెద్దచేసేందుకు నాకు ఓపికా లేదు, స్తోమతాలేదు లక్ష్మి."

"నువ్వు కని వాళ్ళని నాకుఅప్పగించేసెయ్యి. వాళ్ళని నేను పెంచుతాను. నాకు ఓపికా వుంది, స్తోమతా వుంది.

నాకు పనివాళ్ళున్నారు కనుక యిబ్బందేమీ లేదు. నువ్వు మామూలుగా నిశ్చింతగా ఉద్యోగం చేసుకోవచ్చు."

"లేదు లక్ష్మి... ఈసారి యెలాగయినా ఉద్యోగంమానక తప్పదు. ఒక్క పిల్లాడ్ని నీకు అప్పగిస్తేనే వీథిలో జనం రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు. మళ్ళీ ఇంకో పిల్లాడ్నో, పిల్లనో నీమీద వదిలిపెడితేవాళ్ళమాటలు మనంభరించలేము."

"ఏడిశారు. అనుకునేవాళ్ళు అలా అనుకుంటూనే వుంటారు. వాళ్ళకోసం బతుకుతామా మనం? వాళ్ళను లక్ష్య పెట్టకూడదు" అంది లక్ష్మి.

"సరే చూద్దాంలే అప్పటి సంగతి" అని వూరుకుంది సుందరి.

ఈసారి సుందరి వుద్యోగం మానేయవలసి వస్తుందని రామచంద్రరావు కూడా అనుకుంటున్నాడు. ఇప్పుడు ఇద్దరు సంపాదించుతోంటేనే సంసారం గడవడం కష్టంగా వుంది. తన తల్లి దండ్రులకీ, సుందరి తల్లిదండ్రులకీ డబ్బు పంపుతుంటే తన కుటుంబానికి డబ్బుచాలకుండా పోతోంది. అక్కడికీ పిల్లాడి ఖర్చు పూర్తిగా లక్ష్మి భరిస్తోంది. ఆమెచూస్తున్నందు వల్లనే సుందరి ఉద్యోగం చేయగలుగుతోంది. ఇప్పుడు యింకో బిడ్డని కని లక్ష్మికి అప్పగిస్తే బావుండదు. అసలు ఈ లోపుగా పురిటికి బోలెడు ఖర్చు అవుతుంది. సుందరి కనీసం ఆరు నెల లయినా సెలవు పెట్టవలసి వస్తుంది. ఆ ఆరు నెలలూ ఆమెకు జీతం రాదు. డబ్బు యెలా సర్దుబాటు చేయాలా అని అతడు దిగులు పెట్టుకున్నాడు. అడిగితే దుర్గాప్రసాద్ యెంతైనా సహాయం చేస్తాడు. కానీ, తీసుకుంటే మళ్ళీ తీర్చాలికదా?

దుర్గాప్రసాద్ అడగకపోయినా తను తీర్చవలసిందే. ఉచితంగా సహాయం తీసుకోవడం తనకు యిష్టంలేదు.

రామచంద్రరావు డబ్బుని గురించిన చింతలో వుండగానే సుందరికి ఐదో నెలలోనే కడుపు పోయింది. ఆమె బ్రతకటమే కష్టమయింది. రామచంద్రరావుకు చేతులూ కాళ్ళూ ఆడలేదు. సమయానికి చేతిలో దమ్మిడీ లేకుండాపోయింది. దుర్గాప్రసాద్, లక్ష్మి ఆపద్బాంధవులలాగా ఆదుకున్నారు. తమ కారులో తీసుకు వెళ్ళి సుందరిని ఒక పెద్ద ఆస్పత్రిలో చేర్చారు. రామచంద్రరావు అడక్కుండానే దుర్గాప్రసాద్ నాలుగువందలు తీసి అతనికి యిచ్చాడు. "ఈ సమయంలో మీకు చాలా ఖర్చువుంటుంది. ఈ డబ్బు ఉంచండి. టెలిగ్రాం యిచ్చి మీ వాళ్ళని యెవరినయినా రమ్మనండి" అని సలహా యిచ్చాడు. సమయానికి అడక్కుండానే యింత సహాయం చేసిన దుర్గాప్రసాద్ మంచితనానికి రామచంద్రరావు ముగ్ధుడయ్యాడు. అతను వెంటనే సుందరి తల్లిదండ్రులకి టెలిగ్రాం యిచ్చాడు.

సుందరికి యింకోసారి గర్భం వస్తే బ్రతకదనీ, గర్భం రాకుండా యిప్పుడే ఆపరేషన్ చేయాలనీ చెప్పారు డాక్టర్లు. రామచంద్రరావు అందుకు ఒప్పుకున్నాడు. ఆపరేషన్ సవ్యంగానే జరిగింది. కాని, సుందరి అనారోగ్యంతో సగమైపోయింది. టెలిగ్రామ్ అంది, ఆమె పుట్టింటివాళ్ళు బయలుదేరి రావడానికి నాలుగు రోజులు పట్టింది. అంతవరకు లక్ష్మి ఆస్పత్రిలో వుండి సుందరికి సేవచేసింది. మోహన్ కూడా లక్ష్మిని అంటి పెట్టుకుని ఆస్పత్రిలోనే ఉన్నాడు. నౌకరు యింటిదగ్గర్నుంచి కారియర్లో భోజనం తెచ్చేవాడు. ఆ నాలుగు

రోజులూ రామచంద్రరావు దుర్గాప్రసాద్‌తో కలిసి భోజనం చేశాడు.

సుందరి తల్లి తన పెద్దకొడుకు రామాన్ని వెంటబెట్టుకు వూరినుంచి వచ్చింది. ఆస్పత్రికి వచ్చి కూతుర్ని చూసి కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. "ఎంత తీసి పోయావే తల్లీ! టెలిగ్రామ్ చేరి నప్పటినుంచి మనస్సు మనస్సులో లేదు. నుంచున్నపళంగా వచ్చేయ్యడానికి కాస్తాకూస్తా దూరమా... ప్రయాణానికే రెండురోజులు పట్టె. ఆ వెధవ పల్లెటూరికి టెలిగ్రాము చేర డానికి రెండు రోజులు పట్టింది. ఏదో ఆ దేవుడి దయవల్ల గండం గడిచింది" అంది ఆవిడ. తర్వాత లక్ష్మి చేతులు పట్టు కుని "నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేం తల్లీ. ఈ మహా నగ రంలో కష్టసమయంలో నువ్వే ఆదుకోకపోతే ఏమయ్యేది నా బిడ్డ? నిజంగా సుందరి ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యంవల్ల నీలాంటి స్నేహితురాలు దొరికింది" అంది.

"ఋణం ఏమిటి పిన్నిగారూ...సుందరికి సేవచేయడం అంటే అది సహాయం చేయడం కాదు. నాకు నేను చేసు కున్నట్లే. శరీరాలు వేరయినా మేమిద్దరం ఒక్కటే" అంది లక్ష్మి.

"నాకు తెలుసు తల్లీ నీ మనస్సు. నువ్వుండగా నా బిడ్డకి ఏ కష్టం రాదని తెలుసు. పాపం ఈ నాలుగు రోజులూ నీకు సరిగా నిద్రాహారాలున్నాయోలేదో, నువ్వు యింటికి వెళ్ళు తల్లీ. ఇంక నేను చూసుకుంటాను."

"లేదు పిన్నిగారూ...సుందరి ఆస్పత్రినుంచి విడుద లయ్యేవరకు నేను యిక్కడ ఉండవలసిందే. ఇంటికి వెళ్ళినా నాకు నిద్ర పట్టదు. ఇక్కడ నాకేమీ యిబ్బంది లేదు. ఇంటి

దగ్గర్నుంచి భోజనం వస్తుంది. కావాలంటే మీరు కూడా యిక్కడే ఉండండి. మీకూ భోజనం యిక్కడికే తెప్పిస్తాను. అల్లుడిగారితో పాటు రామం కూడా మా ఇంట్లో బోజనం చేస్తాడు."

"అబ్బే...ఇంక దేనికమ్మా...నేనే వెళ్ళి వంటచేస్తాను. అక్కడ పని కాగానే యిక్కడికి వచ్చి కూర్చుంటాను."

ఆవిడ కాసేపు మనవడ్ని ముద్దులాడింది. సుందరి పుట్టింటి సంగతులన్నీ అడిగింది లక్ష్మి. నాన్నగారు, చెల్లెళ్ళు, తమ్ముళ్ళు ఎవరెవరు ఏమేమి చేస్తున్నారో, ఏమేమి చదువుతున్నారో అడిగింది. ఆవిడ అందరిని గురించి చెప్పింది. తర్వాత ఆవిడ వంట చేసి పెట్టి వస్తానని చెప్పి యింటికి వెళ్ళింది.

21

తర్వాత మరి నాలుగు రోజులకు సుందరి ఆస్పత్రినుంచి యింటికి చేరింది. ఆమె చిక్కి సగమై పోయింది. ఆఫీసుకి నెల రోజులు సెలవు పెట్టేసింది. ఇవతల పుల్ల ఆవతల పెట్టవలసిన అవసరం లేకుండా యింటి పనులన్నీ ఆమె తల్లే చేస్తోంది. సుందరి పూర్తిగా విశ్రాంతి తీసుకుంటోంది.

లక్ష్మికి ఇప్పుడు కొత్త సమస్య వచ్చింది. ఇన్నాళ్ళూ సుందరి ఆఫీసుకు వెడుతున్నది కనుక మోహన్ పగలంతా లక్ష్మి ఇంట్లోనూ, రాత్రి అంతా సుందరి ఇంట్లోనూ వుండేవాడు. ఇప్పుడు సుందరి ఇంట్లోనే వుంటున్నది కనుక, పైగా ఆమె తల్లి కూడా వున్నది కనుక వాడు పగలు,

రాత్రికూడా సుందరి ఇంట్లోనే వుంటున్నాడు. వాడులేకుండా లక్ష్మికి ఏమీ తోచడం లేదు. తన పిల్లాడిని తననుంచి బలవంతంగా వేరు చేస్తున్నట్లుగా బాధపడింది లక్ష్మి. వాడు లేని ఇంట్లో పగలంతా గటపటం చాలా కష్టంగా వుంది. ఆరోగ్యం బాగా లేదు కనుక సుందరి కూడా రావడంలేదు. మోహన్‌ని, సుందరిని చూడకుండా ఉండలేక తనే వెళ్ళి వాళ్ళింట్లో కూర్చుంటోంది లక్ష్మి కాని, అక్కడకూడా ఇది వరకు న్నంత స్వతంత్రంగా వుండలేకపోతోంది. సుందరి తల్లి ఉనికివ ఆ ఇంటి పరిస్థితి, మనుషుల తీరు అంతా మారిపోయినట్లుగా అనిపిస్తోంది. అందరూ ముభావంగా ఉన్నట్లు, తనని పరాయిదాన్నిగా చూస్తున్నట్లు అనిపించింది.

పిల్లాడు మామూలుగా అలవాటు ప్రకారం లక్ష్మిని 'అమ్మా' అని అంటే, "అమ్మా ఏమిట్రా? పిన్ని అనరా" అని చెబుతూ వుండేది సుందరి తల్లి. అయినా వాడు 'అమ్మా' అనడం మానలేదు. ఒకరోజు ఆవిడ లక్ష్మి వింటూ వుండగానే "పిన్ని అనమంటుంటే నీక్కాదూ చెప్పేది? వెధవ అలవాటూ నువ్వూనూ" అని వాడిని గదమాయించింది.

ఆ సమయంలో అక్కడే వున్న ఇంటావిడ కల్పించుకొని "పసివాడు...వాడికేం తెలుస్తుంది. ఎలా అలవాటుచేస్తే అలా అంటాడు. అలవాటు చేసిన వాళ్ళని అనాలి" అని ఒక పుల్లవిరుపుమాట అని వెళ్ళిపోయింది.

ఏ చుప్పనాతి మామియో సుందరి తల్లికి బాగానూరిపోసిందని లక్ష్మికి అర్థమయింది. ఇదంతా చూస్తూ, వింటూ సుందరి నిస్సహాయంగా వుండిపోయింది. తను మరీ తటస్థంగా వుంటే లక్ష్మి బాధపడుతుందని కాబోలు ఆమె ఎలాగో సాహ

సించే" దనికే అమ్మా వాడ్ని అలా గదమాయిస్తావు? లక్ష్మిని 'అమ్మా' అంటే ఇంతలో మునిగి పోయిందేముంది? నేను ఆఫీసుకు వెడుతుంటే పగలంతా లక్ష్మి దగ్గర అలవాటయి పోయింది వాడికి" అంది.

"ఇష్టమైతే పగలు, రాత్రికూడా అక్కడే పెట్టుకోవచ్చు. కాదనే వాళ్ళెవరు? అమ్మా అంటుంటే మాత్రం వినేవాళ్ళకు బాగుండదు. పిన్ని అంటే ఇంతలో ఆపేక్ష తగ్గిపోతుందా ఏం?"అని సుందరి తల్లి వంటఇంట్లోనుంచే సమాధానమిచ్చింది.

ఆవిడ మాటలకి మనస్సు చివుక్కుమంది లక్ష్మికి. తను సుందరి పురిటికి వాళ్ళ వూరువెళ్ళినప్పుడు ఆవిడ ఎంతఆపేక్షగా చూసింది? పసివాడ్నిచూస్తూ 'నీ ఇంకో అమ్మ వచ్చిందిరా' అంది. ఇద్దరు తల్లులగారాబంతో వీడు ఎంత రాలుగాయి అవుతాడో అంది. ఆవిడే ఇప్పుడు పిల్లాడు 'అమ్మా' అంటుంటే సహించలేకపోతోంది. ఇప్పుడు ఆవిడచూపులోకూడా ఆపేక్ష కనిపించడంలేదు. సుందరిని, మోహన్‌ని చూడడానికి వచ్చి తను ఎక్కువసేపు కూర్చుంటే 'చూశావుగా వెళ్ళరాదూ. ఇంక ఎంతసేపు కూర్చుంటావు?' అన్నట్లుగా చూస్తోంది ఆవిడ. సుందరితో మనసారా మాట్లాడుకునేందుకు వీల్లేకుండా ఆవిడ కాపలా కాస్తూంది. అందుకని సుందరికూడా ఏమీ మాట్లాడలేకపోతోంది. ఆమె ముఖంలో దిగులు కనిపించింది. ఎన్నో చెప్పాలనుకుని ఏమీ చెప్పలేని నిస్సహాయత కనిపిస్తోంది. ఒక్కసారి మాత్రం ఆమె తల్లి దగ్గరలేని సమయంచూసి, తన చేతిని ఆప్యాయంగా తీసుకుని "మా అమ్మ వెళ్ళిపోయిన తర్వాత మళ్ళీ మనం మామూలుగానే ఉంటాం లక్ష్మీ" అని చెప్పింది.

సుందరి తల్లి చూపులని భరించలేక వాళ్ళింటికి వెళ్ళడం తగ్గించేసింది లక్ష్మి. రోజూ ఏదో ఒక సమయంలో ఒక్కసారి వెళ్ళి పరామర్శచేసి, వెంటనే వచ్చేస్తోంది. మోహన్ ఎప్పుడయినా వెంటపడి పరుగెతుకొస్తే ఐదు నిమిషాలు తిరక్కుండా సుందరి తమ్ముడు రామం వచ్చి వాడిని తీసుకువెళ్ళిపోయేవాడు. సుందరి తల్లి ఎప్పుడు వెళ్ళిపోతుందా తనూ, సుందరీ మళ్ళీ మామూలుగా ఎప్పుడు ఉండగలుగుతామా అని ఎదురు చూస్తోంది లక్ష్మి.

ఈ పరిస్థితి నంతటినీ దుర్గాప్రసాద్ గమనించాడు. ఇప్పుడు రోజులతరబడి అతనికి మోహన్ కనిపించడమే లేదు. తను యింట్లో లేనప్పుడుకూడా పిల్లవాడు అసలు ఈ యింటికి వస్తున్న సూచనలు కనిపించడంలేదు. ఆటవస్తువులన్నీ ఎక్కడివి అక్కడే ఉంటున్నాయి. లక్ష్మిలో వెతికిచూసినా ఎక్కడా ఉత్సాహం కనిపించడంలేదు. అంతా నిశ్శబ్దంగా సీరియస్‌గా ఉంది వాతావరణం. సస్పెన్స్ భరించలేక లక్ష్మిని అడిగాడు ఏం జరిగిందని. లక్ష్మి అంతాచెప్పింది. "సుందరీ వాళ్ళ అమ్మగారు ఉన్నంతవరకేలెండి. ఆవిడ వెళ్ళిపోయిన తర్వాత మళ్ళీ మామూలుగానే ఉంటాం. మోహన్ మళ్ళీ మన యింటికివస్తాడు. పగలంతా మన యింట్లోనే ఉంటాడు. నన్ను మళ్ళీ 'అమ్మా' అని పిలుస్తాడు" అని చెప్పింది. ఆమె మాటల్లో అతనికి ఎంతో విషాదం ధ్వనించింది.

22

రామచంద్రరావుకు ప్రమోషన్ వచ్చింది. ఇన్నాళ్ళు

యిద్దరూ కలిసి సంపాదించిన దానికంటె ఎక్కువ జీతంయిప్పుడు అతనొక్కడే సంపాదిస్తున్నాడు. ఆఫీసులో అతని హోదా పెరిగింది. అంతస్తు పెరిగింది. ఇంక సుందరి ఉద్యోగం చేయ వలసిన అవసరం లేదు. ఆమె ఉద్యోగానికి రాజీనామా యిచ్చేసింది.

ప్రమోషన్ వచ్చినందుకు రామచంద్రరావుకి మహా సంతోషంగా ఉంది. అలుడి జీతం, హోదా పెరిగినందుకు అత్తగారికి కూడా సంబరంగా వుంది. ఆవిడ యింటికి వచ్చిన అమ్మలక్కలందరికీ మహా గర్వంగా చెప్పుకుంది ఈ విషయం. అందరూ సంతోషించారు. సంపాదన హోదా పెరిగి నందుకు కాక, వీరందరి సంతోషానికి వేరే కారణం ఉంది. సుందరి ఉద్యోగం మానేసింది కనుక, యిక యింటిపట్టునే ఉంటుంది కనుక, పిల్లవాడిని పగలంతా లక్ష్మి యింటిలో విడిచిపెట్టవలసిన అవసరం ఉండదు. ఇకనుంచి పగలూ' రాత్రీ వాడు అసలు తల్లిదగ్గరే ఉంటాడు. పిల్లవాడికిక్రమంగా లక్ష్మిదగ్గర అలవాటు తగ్గుతుంది. దానివల్ల లక్ష్మి, సుందరి కూడా క్రమంగా దూరమవుతారు.

ప్రమోషన్ వచ్చిందని తెలిసి దుర్గాప్రసాద్ రామ చంద్రరావును అభినందించాడు. లక్ష్మి సుందరిని అభినందిం చింది. సుందరి నవ్వి వూరుకుంది, ఆ నవ్వులో సంతోషం ఏ మాత్రం కనిపించలేదు. "ఇంక నీకు ఆఫీసు పని ఉండదు. ఇదివరకు పొద్దున్ననగా వెళ్ళి సాయంత్రం నీరసంగా కాళ్ళీడ్చు కుంటూ వచ్చే దానివి. ఇప్పుడింక ఆ బాధ వుండదు. హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు. జ అమ్మగారు వెళ్ళిపోయిన తర్వాత ఇక పగలంతా మనదే ౖం" అన్నది లక్ష్మి. అయినా సుంద

రిలో ఉత్సాహం కనిపించలేదు. మళ్ళీ అలాగే నవ్వి వూరు కుంది. "పిచ్చిదానా! నీకు పరిస్థితులేమీ అర్థంకావు. నీ ఆలోచనలే నీవి. ఈ జనం మన చుట్టూ ఎలా ఉచ్చుపన్నుతున్నారో నీకు తెలియదు" అన్నట్లుగా వుంది ఆమె నవ్వు.

నిజానికి లక్ష్మి పరిస్థితులని అర్థంచేసుకోకపోలేదు. సుందరి అంత దిగులుగా ఎందుకు ఉందోకూడాఆమెకు తెలుసు. సుందరి ఇంతకాలం మోహన్‌ని లక్ష్మికి పెంపకం ఇచ్చేయాలనే అనుకునేది. తనకి ఇంకొక బుజ్జిగాడు, ఇంకొక పాపాయి పుడితే అప్పుడు మోహన్‌ని లక్ష్మికి ఇచ్చేయడానికి ఎలాగైనా భర్తని ఒప్పించవచ్చునని అనుకుంది. ఇప్పుడిక తనకి పిల్లలు పుట్టరని తేలిపోయింది. తనకి వున్నదల్లా ఒక్క మోహన్. వీడిని లక్ష్మికి ఇచ్చేస్తే తన జీవితం శూన్యమయిపోతుంది. ఆ బాధ అనుభవించడానికయినా తాను సిద్ధమే, కాని, వాడిని ఇవ్వడానికి తన భర్తగాని, తల్లిగాని ఒప్పుకోరు. సంపాదన పెరిగింది కనుక పెద్ద ఇంటికి మారాలని రామచంద్రరావు ఆలోచిస్తున్నాడు. ఇల్లు మారితే పిల్లవాడు లక్ష్మికి దూరమై పోతాడు. లక్ష్మి బాధను తను చూడలేదు. ఏం చేయాలి? ఈ ఆలోచనలతో సుందరి క్రుంగిపోతోంది. బయటికి చెప్పక పోయినా ఆమె ఆలోచనలన్నీ లక్ష్మికి తెలుస్తూనేవున్నాయి. సుందరిని చూస్తుంటే లక్ష్మికి గుండె తరుక్కుపోతోంది. పిల్ల వాడిమీది వెర్రిమమకారంతో తనుసుందరికి చాలాద్రోహంచేశానని అనిపించింది. ఉద్దేశపూర్వకంగా కాకపోయినా తనవల్ల ఆమెకు చాలా అన్యాయం జరిగిందని అనిపించింది. ఎట్టి పరి స్థితిలోనూ తల్లీ బిడ్డలను వేరుచేయకూడదు. గర్భనష్టం జరిగిన తర్వాత సుందరికి మోహన్‌పై మమకారం పెరిగినట్లు

తాను గమనించింది. ఎవరికైనా అది సహజం. క్రమంగా తనే దూరంగా వుండడం అలవాటు చేసుకోవాలి. ఒకవేళ పిల్లవాడిని తనకి పెంపకం ఇవ్వడానికి సుందరి సిద్ధపడినా తను తీసుకోకూడదు. వాళ్ళు ఇల్లు మారితే రెండేసి మూడేసి రోజులు పిల్లాడిని చూడకుండా వుండ గలగాలి.

ఇలా ఆలోచిస్తున్నకొద్దీ లక్ష్మికి దిగులు పెరుగుతోంది. మాటల్లో ప్రస్తావించకపోయినా ఇద్దరికీ ఒకరి దిగులు ఒకరికి అర్థమవుతూనేవుంది. ఇద్దరూ నిస్సహాయస్థితిలోనేవున్నారు. అమ్మమ్మ అదుపు ఆజ్ఞల ఫలితంగా పిల్లవాడు లక్ష్మి దగ్గరికి రావడం బాగా తగ్గింది. లక్ష్మి వెళ్ళడం కూడా తగ్గించింది.

సుందరి ఆరోగ్యం కుదుట పడిన తర్వాత ఆమె తల్లి వెళ్ళిపోయింది. పిల్లాడిని లక్ష్మి దగ్గరకి తరచుగా పంపవద్దనీ, లక్ష్మిని 'అమ్మ' అని పిలిపించవద్దనీ గట్టిగా హెచ్చరించి మరీ వెళ్ళింది. ఇంటి పనులు చేసిపెట్టేందుకు ఒక పని మనిషిని కుదిర్చి వెళ్ళింది. ఆవిడ వెళ్ళిన తర్వాత సుందరికి, లక్ష్మికి కూడా ఎంతో తెరిపిగా అనిపించింది. ఖైదునుంచి విడుదలయినట్లుగా అనిపించింది.

తల్లి వెళ్ళిపోయిన మర్నాడు, భర్త ఆఫీసుకు వెళ్ళిపోగానే సుందరి పిల్లాడిని తీసుకుని లక్ష్మి యింటికి వచ్చింది. ఆమె ఇంట్లో అడుగు పెట్టగానే లక్ష్మి ఎదురువెళ్ళి స్నేహితురాలిని కావలించేసుకుంది. ఒకరిని చూసి ఒకరు కన్నీళ్ళు పెట్టుకున్నారు. తను లక్ష్మి యింటికి వచ్చి ఎన్నో సంవత్సరాలు అయిపోయినట్లుగా అనిపించింది సుందరికి. లక్ష్మి యిన్ని నెలలుగా బాకీ పడిన ముద్దులన్నీ పిల్లాడికి చెల్లించేసింది. సుంద

రికీ, లక్ష్మి! కుంబాల మధ్య పొరపొచ్చాలు వస్తాయనివూహించ
ఏదో దిగులమీద వాళ్ళకింత కోపం దేనికో అర్థంకావడంలేదు.
వరకటి సన్నాళ్ళు ఇంత స్నేహంగా ఉన్నందుకు, వాళ్ళ
మంతా సొంత పిల్లాడిగా పెంచినందుకు, ఇబ్బందులలో ఆదు
మార్గం దుకు వెళ్ళేటప్పుడు మాట మాత్రంగా చెప్పేటంత
నం కూడా లేకపోయింది వాళ్ళకి అని బాధపడ్డాడు
మాత్ర ప్రసాద్. పిల్లాడిమీదగానీ, సుందరిమీదగాని మరీ అంత
తల్లి కారం తగదని ఒకటికి రెండుసార్లు మెల్లగా హెచ్చరిం
కదా లక్ష్మి వినిపించుకోలేదు. అంతకంటే గట్టిగా మందలించ
పోయాడతను.

పిల్ల "అర్జెంటుగా ఏదైనా టెలిగ్రాము వచ్చిందేమోనండీ.
అనకి చెప్పే టైముకూడా లేకపోయిందేమో" అన్నది
లక్ష్మి. కాని, తనమాటపై తనకే నమ్మకం లేకపోయింది
దుమెకి. సుందరి స్వార్థపరురాలని తనభర్త అనుకుంటాడేమో
నని, ఆమెను సమర్థించడానికి అన్నట్లుగా ఆ మాట అన్నది.
సుందరి గురించి వీసమంతయినా చెడ్డగా అనుకోవడానికి గాని,
అనడానికిగాని ఆమె మనస్సు అంగీకరించలేదు. "సుందరికి
నాపై అణుమాత్రమైనా కోపం ఉండడానికి వీల్లేదు" అని
పదే పదే అనిపిస్తోంది తనకి.

"టెలిగ్రామ్ వస్తేమాత్రం తలుపుకొట్టి చెప్పి వెళ్ళ
డానికేం? వాళ్ళు కావాలనే చెప్పకుండా వెళ్ళారు. అసలు
రామచంద్రరావు కావాలని ప్రయత్నించి మద్రాసు హెడ్డా
ఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఉంటాడు. పిల్లాడిని
నీనుంచి తప్పించడానికే ఇలా చేసి ఉంటాడు" అన్నాడు
దుర్గాప్రసాద్.

తాను గమనించింది. ఎవరికైనా అది సహజం. కడం ఇన్ని
తనే దూరంగా వుండడం అలవాటు చేసుకోవాలి. ర్యంతో,
పిల్లవాడిని తనకి పెంపకం ఇవ్వడానికి సుందరి సి యాడు.
తను తీసుకోకూడదు. వాళ్ళు ఇల్లు మారితే అయ్యో
మూడేసి రోజులు పిల్లాడిని చూడకుండా వెళ్ళ
గలగాలి. సుకు

ఇలా ఆలోచిస్తున్న కొద్దీ లక్ష్మికి దిగులు పెరుగుత పిడ.
మాటల్లో ప్రస్తావించకపోయినా ఇద్దరికీ ఒకరి దిగులు డుచ
అర్థమవుతూనేవుంది. ఇద్దరూ నిస్సహాయస్థితిలోనేవున్నా కర
అమ్మమ్మ అదుపు ఆజ్ఞల ఫలితంగా పిల్లవాడు లక్ష్మి దగ్గ వహ
రావడం బాగా తగ్గింది. లక్ష్మి వెళ్ళడం కూడా తగ్గించిం

సుందరి ఆరోగ్యం కుదుట పడిన తర్వాత ఆమె తల్లి
వెళ్ళిపోయింది. పిల్లాడిని లక్ష్మి దగ్గరకి తరచుగా పంపవద్దనీ,
లక్ష్మిని 'అమ్మ' అని పిలిపించవద్దనీ గట్టిగా హెచ్చరించి మరీ
వెళ్ళింది. ఇంటి పనులు చేసి పెట్టేందుకు ఒక పని మనిషిని
కుదిర్చి వెళ్ళింది. ఆవిడ వెళ్ళిన తర్వాత సుందరికి, లక్ష్మికి
కూడా ఎంతో తెరిపిగా అనిపించింది. ఖైదునుంచి విడు
దలయినట్లుగా అనిపించింది.

తల్లి వెళ్ళిపోయిన మర్నాడు, భర్త ఆఫీసుకు వెళ్ళిపో
గానే సుందరి పిల్లాడిని తీసుకుని లక్ష్మి యింటికి వచ్చింది. ఆమె
ఇంట్లో అడుగు పెట్టగానే లక్ష్మి ఎదురువెళ్ళి స్నేహితురాలిని
కావలించేసుకుంది. ఒకరిని చూసి ఒకరు కన్నీళ్ళు పెట్టు
కున్నారు. తను లక్ష్మి యింటికి వచ్చి ఎన్నో సంవత్సరాలు
అయిపోయినట్లుగా అనిపించింది సుందరికి. లక్ష్మి యిన్ని
నెలలుగా బాకీ పడిన ముద్దులన్నీ పిల్లాడికి చెల్లించేసింది. సుంద

రెండు కుటుంబాల మధ్య పొరపొచ్చాలు వస్తాయనివూహించ లేదు. తమమీద వాళ్ళకింత కోపం దేనికో అర్థంకావడంలేదు.

ఇన్నాళ్ళు ఇంత స్నేహంగా ఉన్నందుకు, వాళ్ళ పిల్లాడిని సొంత పిల్లాడిగా పెంచినందుకు, ఇబ్బందులలో ఆదు కున్నందుకు వెళ్ళేటప్పుడు మాట మాత్రంగా చెప్పేటంత అభిమానం కూడా లేకపోయింది వాళ్ళకి అని బాధపడ్డాడు దుర్గాప్రసాద్. పిల్లాడిమీదగానీ, సుందరిమీదగాని మరీ అంత మమకారం తగదని ఒకటికి రెండుసార్లు మెల్లగా హెచ్చరిం చినా లక్ష్మి వినిపించుకోలేదు. అంతకంటే గట్టిగా మందలించ లేక పోయాడతను.

"అర్జెంటుగా ఏదైనా టెలిగ్రాము వచ్చిందేమోనండీ. మనకి చెప్పే టైముకూడా లేకపోయిందేమో" అన్నది లక్ష్మి. కాని, తనమాటపై తనకే నమ్మకం లేకపోయింది ఆమెకి. సుందరి స్వార్థపరురాలని తనభర్త అనుకుంటాడేమో నని, ఆమెను సమర్థించడానికి అన్నట్లుగా ఆ మాట అన్నది. సుందరి గురించి వీసమంతయినా చెడ్డగా అనుకోవడానికి గాని, అనడానికిగాని ఆమె మనస్సు అంగీకరించలేదు. "సుందరికి నాపై అణుమాత్రమైనా కోపం ఉండడానికి వీల్లేదు" అని పదే పదే అనిపిస్తోంది తనకి.

"టెలిగ్రామ్ వస్తేమాత్రం తలుపుకొట్టి చెప్పి వెళ్ళ డానికేం? వాళ్ళు కావాలనే చెప్పకుండా వెళ్ళారు. అసలు రామచంద్రరావు కావాలని ప్రయత్నించి మద్రాసు హెడ్డా ఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని ఉంటాడు. పిల్లాడిని నీనుంచి తప్పించడానికే ఇలా చేసి ఉంటాడు" అన్నాడు దుర్గాప్రసాద్.

అదే నిజమనిపించింది లక్ష్మికి. ఇంతసేపూ తనకి రామచంద్రరావు సంగతి జ్ఞాపకం రాలేదు. పిల్లాడు తనని 'అమ్మా' అని పిలవడం అతనికి బొత్తిగా యిష్టంలేదని తనకి ముందు నుంచీ తెలుసు. కాని, కక్షతో యిలా చేస్తాడని ఊహించలేక పోయింది. అసలు ట్రాన్స్‌ఫర్ ప్రయత్నం సంగతి చివరి నిమిషందాకా సుందరికి కూడా తెలియకుండా చేసి ఉంటాడు. ఏమాత్రం ముందుగా తెలిసినా సుందరి తనతో తప్పకుండా చెప్పేది. ఈ యెడబాటుకు తాను మానసికంగా సిద్ధపడి ఉండేది.

"వాళ్ళ మద్రాసు ఆఫీసు అడ్రసు కనుక్కురండి. ఉత్తరమైనా రాద్దాం" అంది.

"నీకేమైనా పిచ్చా లక్ష్మి. ఇంకా ఏమైనా కాస్త అభిమానం మిగిలి వుంటే వాళ్ళే రాయాలి. అయినా కావాలని తెంచుకుపోయినవాళ్ళు ఉత్తరం ఎందుకు రాస్తారు? నువ్వు రాసినా సమాధానం యివ్వరు వాళ్ళు. నువ్వింక వాళ్ళని మరచిపోవడానికి ప్రయత్నించడం మంచిది-" అని కొంచెం మందలిస్తున్నట్లుగానే చెప్పాడు దుర్గాప్రసాద్.

లక్ష్మి జీవచ్ఛవంలాగా అయిపోయింది. కిటికీ తలుపులు తెరిచి, తాళం పెట్టి వున్న ఎదురింటిని చూస్తూ, సుందరినీ, పిల్లాడినీ తలుచుకొని ఏడిచేది. వాళ్ళిద్దరూ లేని తన జీవితం శూన్యంగా నిరర్థకంగా కనిపించేది. "ఇక ఈ జీవితం దేనికి? ఎవరిని చూసుకొని బ్రతకాలి? యింక తన బ్రతుక్కి ప్రయోజనం ఏమిటి?" అనుకునేది. ఇంత శిక్ష అనుభవించడానికి తను చేసిన మహాపాపం ఏమిటి? ఇంత గాఢంగా స్నేహం చేయడమే తప్పా? పిల్లాడిపై అంత మమకారం పెంచుకోవ

డమే నేరమా? అవును-ఆనందమోహన్ పోయినప్పుడే తనకు బుద్ధి రావలసింది. కాని తెలిసి మళ్ళీ మురళీమోహన్ మీద అంతటి మమకారం పెంచుకుంది. మమకారం మనిషికి శాపం. ఆ శాపంతోనే తన జీవితం యిలా అయింది.

వారం రోజుల తర్వాత...ఒక ఉదయం లక్ష్మి అలవాటు ప్రకారం కిటికీ తెరిచి ఎదురింటివైపు చూసింది. ఆశ్చర్యం! తలుపు తెరిచి వుంది. భరించలేనంతటి సంతోషం పొంగి వచ్చింది.

"ఏమండీ...సుందరివాళ్ళు వచ్చేశారండీ" అని ఒక్క కేకపెట్టి యెదురింటికి పరుగు తీసింది లక్ష్మి. దుర్గాప్రసాద్ ఆశ్చర్యంతో గుమ్మం దగ్గరికి వచ్చి నించుని చూస్తున్నాడు.

"సుందరీ...సుందరీ" అంటూ వెళ్ళిన లక్ష్మికి ఆఇంట్లో ఒక అపరిచిత యువతి యెదురయింది.

"ఎవరుకావాలండీ?" అనడిగింది ఆమె.

"సుందరి లేదా?" ఆత్రంగా అడిగింది లక్ష్మి.

"సుందరి ఎవరండీ?"

"సుందరి వచ్చిందేమోననుకున్నాను, మీరు......"

"మేము రాత్రే వచ్చి చేరామండీ...మీరు ఎదురింట్లో ఉంటారా?"

"ఊ" అని నీరసంగా జవాబిచ్చి కాళ్ళీడ్చుకుంటూ తిరిగి వచ్చింది లక్ష్మి. తలుపులు తెరచివుంటే సుందరే వచ్చిందనుకుంది. కాని, వాటాలోకి యింకెవరో అద్దెకి వస్తారని ఊహించలేకపోయింది యిన్నాళ్ళు. ఇంకా తనకి భ్రమలు పూర్తిగా విచ్చిపోలేదన్నమాట. తన హృదయంలో సుందరి స్థానాన్ని మరెవ్వరూ ఆక్రమించలేనట్లే సుందరి కాపురం

చేసిన ఆ ఎదురింట్లోకి యింకెవరూ రారనుకుంది. ఎంత వెర్రిబాగులది తను!

సాయంత్రం ఐదుగంటల వేళ కిటికీ దగ్గర నించుంటే ఎదురింటి అమ్మాయి చంటి పిల్లాడిని యెత్తుకుని కనిపించింది. తనని చూడగానే సన్నగా నవ్వింది. "రానా?" అన్నట్లు ఆశగా చూసింది. తను వరండాలోకి వెళ్ళి, రమ్మన్నట్లుగా తల ఊపింది. ఆమె రాగానే కూర్చోమని కుర్చీ చూపించింది.

"పొద్దున్న మీరు వచ్చేసరికి యిల్లంతా సామాను పరుచుకొని చిరాకుగా వుందండీ. మిమ్మల్ని కూర్చోమని కూడా అనలేకపోయాను. మీరు తెలుగు మాట్లాడేసరికి ప్రాణం లేచివచ్చింది. ఇక్కడంతా కన్నడంవాళ్ళు, అరవ్వాళ్ళే ఉంటారనుకున్నాను" అంది ఆమె.

లక్ష్మి ఆమెను గమనిస్తూ, మర్యాదకోసం మెల్లగా నవ్వి ఊరుకుంది. ఆ అమ్మాయి తన స్నేహం కోరుతున్నట్లు ఆప్యాయంగా మాట్లాడుతోంది. మొహం కళగా వుంది. చూపులో మంచితనం కన్పిస్తోంది. మధ్యతరగతి అమ్మాయిలాగే వుంది. మధ్యతరగతి వాళ్ళు కాకపోతే అంత చిన్న ఇంట్లోకి ఎందుకు వస్తారు? లక్ష్మి పరధ్యానంగా వుండి మాట్లాడకపోవడంతో మళ్ళీ ఆ అమ్మాయే మాట్లాడింది.

"మా వాటాలో యిదివరకు కూడా తెలుగువాళ్ళేఉండేవాళ్ళాండీ? సుందరి అన్నారు కదూ? మీరుచాలా స్నేహంగా వుండేవారా? వాళ్ళు యెక్కడికి వెళ్ళిపోయారు?"

"ఒకే ప్రాణంగా వుండేవాళ్ళం. ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయారు."

"నాపేరు వరలక్ష్మి, మాది కృష్ణాజిల్లా, మావారు పోస్టల్లో పనిచేస్తున్నారు.

లక్ష్మి యింకా పరధ్యానంలోనే వుంది.

"మిమ్మల్ని చూస్తే మీతో స్నేహంచేయాలనిపిస్తోంది."

"ఊఁ" అని ఊరుకుంది లక్ష్మి.

కొత్తమ్మాయిని, చంటిపిల్లాడిని మార్చిమార్చిచూసింది లక్ష్మి. ఆ అమ్మాయి మంచిదానిలా కనిపిస్తోంది. స్నేహం కోరుతూ ఆప్యాయంగా మాట్లాడుతుంటే తను ముభావంగా వుండడం బావుండదు. సుందరితో చేసినంత గాఢంగా కాక పోయినా ఈమెతో మామూలుగా స్నేహం చేస్తే తప్పే ముంది? మురళీమోహన్‌తో పోల్చుకోకపోతే ఈ పిల్లాడు బాగానే ఉన్నాడు. పిల్లాడిని ఎత్తుకోవాలని అనిపించలేదు. కాని మర్యాదకోసం దగ్గరకు తీసుకోవాలనుకుంది. కొత్త కాబోలు-పిల్లాడు రాలేదు. రాకపోవడం మంచిదే అనుకొంది లక్ష్మి

"పేరేమిటి?" అని అడిగింది.

"రామకృష్ణ!" అని చెప్పింది వరలక్ష్మి.

* * *

ఇంకో వారంరోజుల తర్వాత అనుకోకుండా సుందరి నుంచి ఉత్తరం వచ్చింది. ఎంతో ఆత్రంగా కవరు చింపి చది వింది లక్ష్మి.

"మాట మాత్రంగా చెప్పకుండా ఇల్లు ఖాళీచేసి రాత్రికి రాత్రే వెళ్ళిపోయానని నీకు బాగా కోపం వచ్చి ఉంటుంది. విశ్వాసఘాతకురాలినని అనుకొనివుంటావు. ముందుగా చెప్పి

నందువల్ల ప్రయోజనం లేదనే చెప్పలేదు. నన్ను మరచిపోవ డానికి ప్రయత్నించు. నువ్వు నన్ను, అంతకంటే ముఖ్యంగా మోహన్‌ని-యెంత త్వరగా మరచిపోతే నాకు అంత శాంతిగా సంతోషంగా వుంటుంది. ఇంక నాకు పిల్లలు పుట్టరు. నాకు న్నది వీడొక్కడే. వాడిని నీకు అప్పగించి నేను బతకలేను. ఇద్దరిలో యెవరో ఒకరం బాధపడక తప్పదు. పిల్లాడ్ని నీకు యిస్తే నాతోపాటు మావారు యింకా ఎక్కువగా బాధ పడతారు. మన స్నేహం కోసం మావారు యెందుకు బాధ పడాలి? పిల్లాడి మీద నాకెంత హక్కు వుందో మా వారికీ అంతే హక్కు వుందికదా? మావారి పిల్లాడిని నీకు అప్పగించే అధికారం నాకెక్కడ వుంది? ఇదంతా నీతో చెబితే నువ్వు కళ్ళనీళ్ళు పెట్టుకుంటే చూడలేక చెప్పకుండా వచ్చేశాము. పిల్లాడిమీద నీనీడ పడడం కూడా మా వారికి ఇష్టంలేదు. అందుకే మద్రాసుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఈ జీవితంలో యింకెప్పుడూ మనం కలుసుకోకూడదనీ, ముఖ్యంగా నీ సంగతి మా అబ్బాయికి పెద్దవాడైన తర్వాత కూడా తెలియకూడదనీ అనుకుంటున్నాను. మా అడ్రసు తెలుసుకునే ప్రయత్నం కూడా చేయవద్దు."

ఉత్తరం చదివి నిర్విణ్ణురాలయింది లక్ష్మి. నిజంగా ఆ ఉత్తరం రాసింది సుందరేనా? అంత పరుషమైన వాక్యాలు ఎలా రాయగలిగింది ఆమె? సుందరి మనస్సు యెంతో కోమల మైనది. ఆమె అలా రాయలేదు. అతను బలవంతంగా రాయించి ఉంటాడు. కాని దస్తూరి సుందరిదే. అందుకని ఆ మాటలు సుందరి చెప్పినవిగానే అనుకోవాలి. ఇంక సుందరి, పిల్లవాడు ఈ జీవితంలో తనకు తటస్థపడరు తటస్థపడినా తను

మొహం తిప్పేసుకోవాలి. ఉత్తరం రాయకూడదు. అసలు వాళ్ళని గురించిన ఆలోచనే మనస్సులోకి రానీయకూడదు. ప్రాణస్నేహితురాలుగా సుందరి ఇచ్చిన ఆజ్ఞ అది.

లక్ష్మి మనస్సులో ఇంకా ఏ మూలో మినుకుమినుకు మంటున్న ఆశాకిరణం సుందరి ఉత్తరంతో పూర్తిగా ఆరి పోయింది. ఇంటి నిండా మోహన్ ఆట వస్తువులూ, వాడి చొక్కాలూ లక్ష్మిని వెక్కిరిస్తున్నాయి. ఆమె బాధ చూడలేక పోతున్నాడు దుర్గాప్రసాద్. వీధిలో అమ్మలక్కల వ్యాఖ్యా నాలు ఎక్కువైనాయి. లక్ష్మి, సుందరి విడిపోయినందుకు అందరూ సంతోషించారు. లక్ష్మి ధనవంతురాలు కనుక కొందరు ఆమె స్నేహం కోసం ప్రయత్నించారు. కాని లక్ష్మి ఎవరినీ చేరనియ్యలేదు. అసలు గడపదాటి బైటకు రావడం మానేసింది. ఎప్పుడైనా ఎదురింటి వరలక్ష్మి వస్తే గోడని చూసినట్లుగా చూస్తోంది. ఈమె మానసికస్థితిని అర్థం చేసుకుని ఆమె కూడా రావడం మానుకుంది. లక్ష్మి మనస్సు క్రమంగా మొద్దుబారిపోయింది.

ఈ ఇల్లు, ఈ వీధి, ఈ వాతావరణం నుంచి తాను బైట పడితే తప్ప ఆమె మానసికంగా కోలుకోదని అనుకున్నాడు దుర్గాప్రసాద్. ఉద్యోగంవదిలేసి, ఇల్లుఅమ్మేసి, కొంతకాలం తూర్పుగోదావరిజిల్లాలోని తన స్వగ్రామంలో వున్నాడు. కొన్నాళ్ళుఅత్తవారింట్లో ఉన్నాడు. కొంతకాలంభార్యనుతీసు కునిఆసేతుహిమాచలం యాత్రలు చేశాడు. ఏడాది గడిచేసరికి లక్ష్మి మానసికంగా కొంత నిబ్బరం తెచ్చుకుంది. దుర్గా ప్రసాద్ మళ్ళీ బెంగుళూరు చేరి వేరే ప్రాంతంలో యింకో

బంగళాకొని, సొంత వ్యాపారం పెట్టాడు. వారి జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమయింది.

24

కథ అర్ధాంతరంగా ఆగిపోయింది. కథలో పాత్రలను గురించే ఆలోచిస్తూ నిద్రకు ఉపక్రమించాడు కృష్ణమోహన్. గాఢంగా నిద్రపోలేక పోయాడు. కలత నిద్రలో కలలు, ఆలోచనలు, ఊహలు అన్నీ కలగాపులగమైపోయాయి. లక్ష్మి, సుందరి-దుర్గాప్రసాద్, రామచంద్రరావు, పిల్లవాడు, అందరూ తనకు అతిసన్నిహితులు ఆత్మీయులు అయినట్లు అనిపించింది. వారి మధ్య పొరపొచ్చాలను తొలిగించి మళ్ళీ కలపాలని మనస్సు మధన పడుతున్నది. మళ్ళీ అంతలో–"ఇదంతా నవలే కదా, ఏదో కుటుంబ సమస్య అయినట్లు వాళ్ళని గురించి తనకు ఇంత తాపత్రియం దేనికి" అని మనస్సు హెచ్చరిస్తోంది. ఎప్పుడు తెల్లవారుతుందా, రాజ్యలక్ష్మమ్మగారిని కలుసుకొని ఎప్పుడు చర్చిస్తానా అనే తహతహతో జాగ్రదవస్థకీ, స్వప్నావస్థకీ మధ్య ఊగిసలాడుతూ రాత్రి గడిపాడు.

ఉదయం తొమ్మిది గంటలకల్లా శాంతికుటీరంలో వాలాడు కృష్ణమోహన్. రాజ్యలక్ష్మమ్మగారిని చూస్తూనే "అదేమిటండీ! అంత అర్ధాంతరంగా ఆపేశారు కథని?" అని సంజాయిషీ కోరుతున్నట్టుగా అడిగాడు.

ఆవిడనవ్వుతూ..."ఏమిటంత కంగారు! కాసేపు స్తిమితంగా కూర్చుని, కాఫీతాగి, ఆతర్వాత కథసంగతి మాట్లాడవచ్చు" అంది.

"రాత్రంతా అసలు సరిగా నిద్రేపట్టలేదు. మీరు మరీ అన్యాయంగా ఇద్దరినీ విడదీశారు. ఇంకా వాళ్ళిద్దరూ కలుసుకుంటారేమో ననుకుంటూ చదివాను. రహీమని మధ్యలో ఆపేశారు. సినిమా ఇంటర్వెల్ దాకాచూపించి ఇంటికి పొమ్మన్నట్లుగా ఉంది."

ప్రమీల కాఫీ తీసుకువచ్చింది. "ఈ అసంపూర్తికథ చదివి మీరు సరిగ్గా ఇలాగే అంటారని అనుకున్నాను. నేనుచదినప్పుడు నాకూ అలాగే అనిపించింది" అంది కాఫీ అందిస్తూ.

"ముందే చెప్పాను కదర్రా అసంపూర్తికథ అని! దీన్ని ఎలా ముగించాలో తెలియకనే ఇన్నాళ్లు కాగితం మీద పెట్టకుండా ఊరుకున్నాను" అంది రాజ్యలక్ష్మమ్మగారు.

"సుఖాంతం చేస్తే తప్ప ఇంత విషాదాన్ని మన ప్రేక్షకులు భరించలేరండీ! చదివినప్పటి నుంచి నాకేబాధగా ఉంది" అన్నాడు కృష్ణమోహన్.

"ఏదో రకంగా వాళ్ళని కలిపేస్తే చాలదు. ముగింపు వాస్తవికంగా ఉండాలి. నిజంగా జీవితంలో ఏం జరుగుతుందో ఎలా జరుగుతుందో ఊహించి రాయాలి. సుఖాంతం చేస్తావో, దుఃఖాంతం చేస్తావో నీ ఇష్టం. ఇది నీ చేతుల్లో ఉంది. కావాలంటే సినిమాకు అనుగుణంగా కొంత మార్చుకోవచ్చు. కొన్ని కొత్త పాత్రలు, కొన్ని అదనపు సన్నివేశాలు పెట్టుకోవచ్చు. కాని దయచేసి ఇందులో చౌకబారు హాస్యం, కుస్తీపట్లు, ముష్టి యుద్ధాలు మాత్రం పెట్టకు" అంది ఆవిడ.

"ఛ. .ఛ....అలా చెయ్యనండీ. మీకు పూర్తిగా నచ్చే విధంగా, మీరుమెచ్చే విధంగా కథను పూర్తిచేసిచూపిస్తాను. దీని గురించి చాలా ఆలోచించాలి."

"ఆ రెండు కుటుంబాలు ఎలాగైనా కలుసుకోవాలి. అయితే ఆ కలయిక వాస్తవికంగా ఉండాలి. కాని వాస్తవికత కోసం కథను దుఃఖాంతం మాత్రం చేయకండి" అంది ప్రమీల.

"మోహన్‌కథను ఎలా ముగించాలో ఎలా ముగించవచ్చునో నేను చెప్పలేను గాని, నీ ఆలోచనకు కొన్ని పాయింట్లు అందిస్తాను" అంటూ రాజ్యలక్ష్మమ్మగారు తాను రాసిన కథ అనంతర భాగాన్ని భావన చేస్తున్నట్లుగా, కిటికీలోనుంచి దూరంగా కనిపిస్తున్న అందమైన ప్రకృతి దృశ్యాన్ని చూస్తూ ఇలా చెప్పారు.

"పాతికేళ్లు గడుస్తాయి. దుర్గాప్రసాదరావు, రామచంద్రరావు గతాన్ని పూర్తిగా మరచి పోతారు. లక్ష్మి, సుందరి మాత్రం ఒకరి నొకరు తలుచుకుంటూనే ఉంటారు. తమ భర్తల దగ్గర ఆ ప్రస్తావన తీసుకురాకుండా వారిద్దరూ స్నేహగాథను రోజూ మననం చేసుకుంటూనే వుంటారు. అయితే ఒకరినొకరు కలుసుకునే ప్రయత్నం మాత్రం చేయరు. అడ్రసు తెలుసుకునేందుకు కూడా ప్రయత్నించరు.

"సుందరి కొడుకు పెద్దవాడై, ప్రయోజకుడై గొప్ప ఆఫీసరో, కళాకారుడో అవుతాడు. పెద్దపేరు తెచ్చుకుంటాడు. ఒక సారెప్పుడో హఠాత్తుగా విచిత్ర పరిస్థితులలో అతను లక్ష్మికి తటస్థపడతాడు. లక్ష్మి యెవరో అతనికి తెలియదు. ఆమె గురించి వాళ్ళ అమ్మ యెప్పుడూ చెప్పలేదు అతనికి. కాని, అతను మురళీమోహన్ అని కొన్ని పరిస్థితులవల్ల ఆమె తెలుసుకోగలుగుతుంది. ఏదో సాకుతో అతన్ని పలుకరిస్తుంది. పరిచయం చేసుకొంటుంది. మూడు సంవత్సరాలు తన ఒడిలో ఆడుకుని, తనదగ్గర పాలుతాగి, తనను అమ్మా అని పిలిచిన ఆ పసివాడు పాతికేళ్ళ తర్వాత

ఆకస్మికంగా తటస్థపడితే, తనను గుర్తించలేకపోతే ఆమె మానసిక క్షోభ యెలా వుంటుంది? సుందరి ఆజ్ఞ ప్రకారం తను యెవరో ఆకుర్రవాడికి చెప్పడానికి వీల్లేదు. మరణించిన తన పిల్లవాడే పునర్జన్మ యెత్తి మురళీమోహన్‌గా పుట్టాడనుకుంటున్న లక్ష్మి, అంతగా యెదిగిపోయి యువకుడైన అతడిని పుత్రవాత్సల్యంతో యెలా దగ్గరకు తీసుకోగలుగుతుంది? ఎలా ఒడిలోకి తీసుకోగలుగుతుంది? యెలా ముద్దు పెట్టుకోగలదు? అసలు ముట్టుకుంటేనే అతను ఏమనుకుంటాడో నన్న భయంతో దూరంగా వుండాలంటే యెంత బాధగా వుంటుంది ఆమెకి? ఈ మానసిక స్థితిని స్పష్టంగా చిత్రించాలి నువ్వు. మోహన్-నువ్వింకా పెళ్ళికానివాడివి. పిల్లడిమీద తల్లికి, తండ్రికి యెంత మమకారం ఉంటుందో ఇప్పుడు నీకు బాగా అర్థంకాదు. నువ్వు తండ్రివైన తర్వాత తెలుస్తుంది.

"శైశవంలో తల్లికి ప్రేమకలిగితే పిల్లాడిని యెత్తుకుంటుంది. ముద్దులు పెట్టుకుంటుంది. అందులో గొప్ప తృప్తి లభిస్తుంది. పాతికేళ్ళవాడైన తర్వాత కూడా తల్లికి అదే మాదిరి ప్రేమ కలుగుతుంది. కాని ఆ వయస్సులోని వాడ్ని ఒళ్ళోకి తీసుకోలేదు. ముద్దుపెట్టుకోలేదు. అలా చేయలేక పోతున్నందుకు తీవ్రమైన వేదన కలుగుతుంది. అసంతృప్తి మిగిలిపోతుంది. శైశవదశ నుంచి పిల్లవాడు పెద్దవాడవుతున్న కొద్దీ వాడు తనకు క్రమంగా దూరమైపోతున్నాడని తల్లికి బాధ కలుగుతుంది. కాని ఆ బాధ పిల్లవాడికి అర్థంకాదు. రెక్కలొచ్చిన పక్షిలాగా అతడు తల్లిదండ్రుల నుంచి దూరంకావాలనీ, తనకు తానుగా

నిలబడాలనీ కోరుకుంటాడు. అయితే ప్రతిజీవితంలోను యిది మామూలే కనుక, లోకసహజం కనుక తల్లిదండ్రులు కూడా ఈ అనుభవానికి అలవాటు పడుతారు. కాని, లక్ష్మికి ఆ పిల్లవాడు క్రమంగా దూరంకాలేదు. ఒక్కసారి హఠాత్తుగా తెంచుకు వెళ్ళిపోయినట్లుగా దూరమై, మళ్ళీ పాతికేళ్ళ తర్వాత ఆకస్మికంగా కనిపించాడు. తప్పిపోయిన కొడుకు పాతికేళ్ళకి కనిపించినట్లయింది లక్ష్మికి. అయినా తను తల్లినని అతనికి చెప్పకూడదు. తన మనస్సులో చెలరేగే సంక్షోభం వ్యక్తం కానివ్వకూడదు. ఈ పరిస్థితిని ఆధారంగా పెట్టుకుని కథ ముగింపు ఆలోచించు."

కృష్ణమోహన్ కాసేపు మౌనంగా వుండిపోయాడు. "ఈ విధమైన సెంటిమెంట్స్ గురించి నేనెప్పుడూ ఆలోచించ లేదు. మీరు చెబుతుంటే ఒక కొత్తప్రపంచంలోకి ద్వారాలు తెరుచుకుంటున్నట్లుగా అనిపిస్తోంది నాకు" అన్నాడు

"పాపం నీకు బుర్ర వేడెక్కిపోయినట్లుంది" అంటూ రాజ్యలక్ష్మమ్మగారు నౌకరును పిలిచి మళ్ళీ టీ తెప్పించింది.

టీ తాగి మళ్ళీ రేపు వస్తానని చెప్పి, రూమ్‌కి తిరిగి వెళ్ళాడు కృష్ణమోహన్.

*　　　*　　　*

రోజంతా ఆ కథ గురించే ఆలోచించాడు. కథలోని పాత్రలన్నీ తన చుట్టూ తిరుగుతున్నట్లుగా అనిపించింది, కథా ప్రపంచంలో పూర్తిగా నిమగ్నుడై పోయాడు. ఆ పాత్రలన్నీ సజీవంగా కనిపిస్తున్నాయి. లక్ష్మిని తలుచుకుంటే ఎంతో వేదన కలుగుతోంది. అసలు అది కథ కాదనీ, నిజంగా జరిగి ఉంటుందనీ అనిపిస్తోంది. ఆ కథని రాజ్యలక్ష్మమ్మగారు

చాలా ఆవేశంతో రాసినట్లుంది. పొద్దున కథ ముగింపు గురించి మాట్లాడినప్పుడు కూడా ఆవిడ యెంతో ఫీలింగ్‌తో మాట్లాడింది. ఆవిడ సన్నిహితులైనవారి కుటుంబంలో ఆ మాదిరిగా జరిగిందేమో. లేకపోతే అసలది ఆవిడ కథేనేమో? అంతే అయుంటుంది.

అది ఆవిడ కథ అవునో కాదో యెలా తెలుస్తుంది? ఆవిడ నడిగితే చెప్పదు. ప్రమీల నడగాలి రేపు. కాని ప్రమీలకి కూడా తెలియకపోవచ్చు అయితే కొన్ని ఆధారాలు ప్రమీల ద్వారా తెలియవచ్చు. ఆ కథలో లక్ష్మీరాజ్యం ఈ రాజ్యలక్ష్మమ్మగారే అయుంటుంది. అసలు ఆవిడ తనకీ కథ చెప్పడంలో ఉద్దేశం ఏమైవుంటుంది? సినిమా కథ కోసం తను అవస్థపడుతుంటే సహాయం చేయడానికే చెప్పి వుంటుందా? లేకపోతే, తన ద్వారా ఈ కథ వెండితెర కెక్కితే, ఆసినిమా చూసి సుందరి పశ్చాత్తాప పడుతుందేమో, మళ్ళీ రెండు కుటుంబాలు సన్నిహిత మవుతాయేమోననే ఆశతో చెప్పిందా? ఈ కారణమే సబబుగా కనిపిస్తున్నది తనకి. ఆ సుందరి యెవరో, ఆ పిల్లాడు యెవరో తెలిస్తే తను వాళ్ళని కలిపే ప్రయత్నం చేస్తే ఈ కథ నిజంగానే సుఖాంతమవుతుంది. రచయితగా తను కేవలం సినిమా కథని సుఖాంతం చేస్తే చాలదు. ఇది కట్టుకథ కాదని రూఢి అయితే ఆ ఇద్దరు తల్లుల జీవితాలను కూడా ఆనందమయం చేయాలి తను. మానవతా దృష్టితో ఒక వ్యక్తిగా తను నెరవేర్చవలసిన బాధ్యత అది. ఈ వాస్తవగాథను వెండితెర కెక్కిస్తే ప్రేక్షకులు కూడా ఆనందిస్తారు.

మర్నాడు ఉదయం 11 గంటలకి కృష్ణమోహన్ శాంతికుటీర్‌కు వెళ్ళాడు. భోజనాలైన తర్వాత అతను, ప్రమీల ఊటీ లేక్ చూడడానికి వెళ్ళారు. అందమైన సరస్సులో పడవలో పోతున్నప్పుడు ఇది వాస్తవమా, సినిమాలో దృశ్యమా అని భ్రమ కలిగింది ఇద్దరికీ.

"ఈ సరస్సు చుట్టూ ప్రకృతి ఎంత అందంగా ఉందో చూడండి. ఈస్ట్‌మన్‌కలర్ సినిమాల్లో ఇటువంటి అందమైన దృశ్యాలని చూస్తున్నప్పుడు అదంతా కలర్ మహిమ కెమేరా మహిమ అనుకునేదాన్ని. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తుంటే ఈ అందం నిజమని ఒప్పుకోక తప్పడంలేదు. మీ సినిమాలో ఈ అందాలన్నీ చూపిస్తారా?" అంది ప్రమీల.

"ఇంకా సందేహమా? నాయికా నాయకులు యిలాగే ఈ సరస్సులోనే నౌకావిహారం చేస్తారు. ప్రొడ్యూసర్‌గారి ఆత్మశాంతికోసం, ప్రేక్షకుల మనోల్లాసంకోసం డ్యూయెట్ కూడా పాడతారు" అన్నాడు కృష్ణమోహన్.

ప్రమీల కాస్త సిగ్గుపడింది. ఆ సిగ్గు అతడికి కనిపించకుండా మొహం ప్రక్కకు తిప్పుకుంది. అయినా అతనికి తెలిసిపోయింది.

"ఇంతకీ మీ సినిమా కథ తయారయిందా?" అని అడిగింది ఆమె.

"అప్పుడేనా? రాజ్యలక్ష్మమ్మగారు సప్లయి చేసిన ముడిపదార్థంతో, మీ సహాయంతో సినిమా కథ తయారు చేయాలి."

"నా సహాయమా? మీరు వేళాకోళం చేస్తున్నారు. నేనేమన్నా రచయిత్రినా?"

"నాకు సహాయం చేయడానికి రచయిత్రి కానక్కర్లేదు. నా కథలో మీరూ ఒక పాత్ర అయితే చాలు."

"వేషం వేయమంటారా ఏమిటి ఖర్మ? నాకు నాటకానుభవమూ లేదూ, నాది ఫోటోజనిక్ ఫేసూ కాదు."

"అదికాదు నా ఉద్దేశం. నా ఆంతర్యమేమిటో తర్వాత మీకే అర్థమవుతుంది. ముందు రాజ్యలక్ష్మమ్మగారిని గురించి నేను అడిగే సమాచారం అందించండి చాలు."

"అడగండి. నాకు తెలిస్తే, తెలిసినంతమటుకు చెబుతాను."

"ఆ కథని ఆవిడ రాసిన ధోరణిచూస్తే అది కట్టుకథ కాదనీ నిజంగా జరిగివుంటుందనీ అనిపించింది. మీరూ చదివారు కదా? మీ కేమనిపించింది?"

"నాకూ అలాగే అనిపించింది."

"ఆ కథ గురించి మీరు ఆవిడతో ఏమీ మాట్లాడలేదా?"

"లేదు. ఎలా మాట్లాడాలో, ఏం మాట్లాడాలో తెలీలేదు. నేనంటే ఆవిడకి చాలా ప్రేమ, కాని సాధారణంగా ఆవిడ ఎప్పుడూ సీరియస్‌గా ఉంటుంది. ఏదో ఆలోచిస్తున్నట్లుగా వుంటుంది. ఎక్కువగా మాట్లాడదు. మీరు ఎలాగూ ఆవిడతో కథ సంగతి చర్చిస్తారు కదా? అప్పుడు శ్రద్ధగా వింటే నా సందేహాలన్నీ తీరిపోతాయని ఊరుకున్నాను."

"ఆ కథలో లక్ష్మి ఈ రాజ్యలక్ష్మమ్మగారేమోనని నాకనిపించింది. ఆ సుందరి యెవరై ఉంటుందో మీరు ఊహించగలరా? ఆవిడ స్నేహితురాళ్ళల్లో అటువంటివాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఆ పిల్లవాడు యెవరై వుంటాడు?"

"సుందరి సంగతి పిల్లాడి సంగతి తెలీదుకాని ఆవిడకి ఎప్పుడో ఒక పిల్లాడు పుట్టి పసితనంలోనే పోయాడని మాత్రం తెలుసు."

"అయితే ఒక మంచి ఆధారం దొరికింది. అసలు మీకు ఆవిడతో యెంతకాలంగా పరిచయం వుంది? కథలో లక్ష్మికి సుందరి పిల్లాడిపై ఎంత మమకారం వుందో మీపై ఆవిడకు అంత మమకారం వుందా?"

"ఈవిడతో మా కుటుంబానికి పరిచయం పదేళ్ళనించే. నామీద ఆవిడకి ప్రేమ వుంది కాని, మరీ అంత పిచ్చి మమకారం లేదు. నన్ను చూడకుండా ఆవిడ చాలా రోజులుండగలదు. కాని నన్ను తన కుటుంబంలో దాన్నిగానే చూసుకుంటుంది. నేను కూడా మా యింట్లోకంటే ఆవిడ ఇంట్లోనే ఎక్కువగా ఉంటూ వుంటాను. మా అమ్మకంటే ఆవిడే ఎక్కువ నాకు."

25

నౌకా విహారంలో కృష్ణమోహన్‌కి ఆశించినంత సమాచారం లభించలేదు. రాజ్యలక్ష్మమ్మగారి గురించి మరీ పాత సంగతులేవీ ప్రమీలకి తెలియవని తేలిపోయింది. ప్రమీలని శాంతికుటీర్‌లో దిగబెట్టి, సాయంత్రం నాలుగు గంటలకి రూమ్‌కి తిరిగి వచ్చాడు. ఆ రోజు జరిగినదంతా డైరీలో రాస్తూ ఉండగా గాలికి రెప రెప లాడుతూ వెనకటి పేజీల్లో రాసిన వాక్యాలు కనిపించాయి. రైలు ప్రయాణంలో తను నిద్రపోతూ ఉండగా రాజ్యలక్ష్మమ్మగారు తన తలపై చేయి

వేసి నిమిరిన సంఘటన గురించి రాసుకున్న వాక్యాలు కని పించడంతో ఎవరో వెన్ను చరిచి ఏదో జ్ఞాపకం చేసినట్లు అని పించింది. తనపట్ల ఆవిడకి అంత ప్రత్యేకాభిమానం దేనికి? రోజూ భోజనం దగ్గర అంత ఆప్యాయంగా వడ్డిస్తుంది దేనికి? హృదయంలోని ప్రేమనంతటినీ కళ్ళల్లోకి తెచ్చుకున్నట్లు అలా చూస్తుంది దేనికి? ఇప్పుడు అర్థమయింది-ఆ కథలోని మురళీమోహన్ తనే. కథ కోసం తన పేరును ఆవిడ అలా మార్చింది. తన తల్లి పేరు కామేశ్వరి. ఆ పేరును శివకామ సుందరిగా మార్చింది. తన తండ్రి పేరు సూర్యచంద్రరావు. రామచంద్రరావుగా మార్చింది. కథ ముగింపు గురించి తనకు సలహా ఇస్తున్నప్పుడు ఆవిడ తనని "మోహన్" అని పిలిచింది. "ఈ కథ ముగింపు నీ చేతుల్లో ఉంది" అంది.

క్రాస్‌వర్డ్ పజిల్లో ఒక్క ఆధారం దొరికితే దాన్ని బట్టి వరసగా అనేక జవాబులు దొరికినట్లు ఆలోచిస్తున్న కొద్దీ చాలా సందేహాలు నివృత్తి అయిపోతున్నాయి. 'తన ఒడిలో పెరిగిన పిల్లాడు పాతికేళ్ళ తర్వాత యువకుడుగా కనిపిస్తే అతడిని ఎలా దగ్గరకు తీసుకోగలుగుతుంది?' అంది ఆవిడ. 'పుత్రవాత్సల్యం యెలా ఉంటుందో నీకు తెలీదు' అంది. అది ఆవిడ అనుభవం కాకపోతే ఆవిడకు మాత్రం యెలా తెలుస్తుంది? ఈ కొద్ది రోజుల పరిచయంలో ఆవిడ తనతో మాట్లాడిన ప్రతి మాటకీ అసలు అర్థమేమిటో యిప్పుడు తెలుస్తోంది తనకి. ఆవిడ కేవలం సినిమా కోసం ఆ కథ చెప్పలేదు. తను కాకుండా మరొక సినిమా రచయిత యెవరైనా యిలాగే తటస్థపడి ఉంటే ఆవిడ ఈ కథ చెప్పేదికాదు. 'ఇది నీ కథ,'

అని ఆవిడ స్పష్టంగా చెప్పింది. ఇప్పుడు నిజంగానే ఈ కథను సుఖాంతం చేయవలసిన బాధ్యత తనపై ఉంది.

రాస్తున్న డైరీ సగంలో ఆపేసి నుంచున్న ఫళంగా బయల్దేరి శాంతి కుటీర్‌కు వెళ్ళాడు. హాలులో పేము కుర్చీల్లో కూర్చుని ఏవో పుస్తకాలు చదువుతున్నారు రాజ్యలక్ష్మమ్మగారు, ప్రమీల. కృష్ణమోహన్‌ని చూడగానే ఆవిడ 'రా కూర్చో' అని కుర్చీ చూపింది. అతను కూర్చోగానే ఆవిడ "టీ తెస్తాను ఉండు" అంటూ లేచింది. లేస్తుండగా ఆవిడ చేతిలోని పుస్తకంలోంచి ఒక చిన్నపిల్లాడి ఫోటో జారి కిందపడింది. ఆవిడ కంగారుగా ఆ ఫోటో తీసుకొని గబగబా లోపలకు వెళ్ళిపోయింది. కాని అప్పటికే ఆ ఫోటో కృష్ణ మోహన్ కంటపడింది. వెంటనే గుర్తుపట్టేశాడుకూడా. గిరజాల జుట్టుతో ఉన్న ఆ రెండేళ్ళ పసిపిల్లాడి ఫోటో ఎవరిదో కాదు-తనదే. ఆ ఫోటో కాపీ ఒకటి తనచిన్నప్పటిఫోటోల ఆల్బంలో ఉంది. తన అనుమానం రూఢి అయింది. ఆఫోటో గురించి తను అడుగబోతుండగా ఆవిడ కంగారుగా లోపలకు వెళ్ళిపోయింది. తను అడగకపోవడమే మంచిదయిందనుకున్నాడు. అడిగితే రహస్యం బయట పడిపోతుంది. ఆవిడ ఏదో అబద్ధంచెప్పి తప్పించుకుని ఇంక ఇక్కడ ఒక్క క్షణం కూడా ఉండకుండా ప్రయాణం కట్టేస్తుంది. సుందరి ఆజ్ఞ ప్రకారం ఆవిడ తనెవరో ఆ 'యువకుడికి' తెలియనివ్వదు. అందుకని ఇప్పుడు ఏమీ తెలియనట్లే ఉండాలి. కథను సుఖాంతం చేసిన తర్వాతనే తను 'ఇంకో అమ్మ'కు దగ్గరకావాలి. తను ప్రమీలను వివాహం చేసుకోవడంద్వారా అమ్మ, ఇంకో అమ్మ మళ్ళీ సన్నిహితం కావాలి.

"ఆ ఫోటో ఎవరిదో తెలుసా?" అని ప్రమీలని అడిగాడు.

"పుస్తకంలో పేజీ గుర్తుకోసం ఆ ఫోటో పెట్టుకుంటుంది. ఎవరో పిల్లాడు అందంగా ఉన్నాడని పెట్టుకున్నానని చెబుతుంది ఆవిడ. కాని చనిపోయిన ఆవిడ పిల్లాడేమోనని నా అనుమానం" అని చెప్పింది ప్రమీల.

అంతలో రాజ్యలక్ష్మమ్మగారు టీ తెచ్చింది. ఏమీ ఎరగనట్లుగా మామూలుగా కబుర్లు చెప్పుకుంటూ టీతాగారు.

o o o o

కృష్ణమోహన్ రాత్రి రెండు గంటలదాకా మేలుకొని కథ రాశాడు. కథల వేటకై ఊటీకి బయలుదేరిన ఒక సినీ రచయితకి రైలులో ఒక నడి వయస్కురాలు ఒక యువతి పరిచయం కావడంతో ప్రారంభించి, అతడికి—కథా వస్తువు దొరక్క పోవడంవల్ల ఆవిడ ఒక అసంపూర్తి కథ రాసి ఇవ్వడం, ఆ కథలోని లక్ష్మి ఆవిడేననీ, ఆ పిల్లాడు తనేననీ అతడు గ్రహించడం వరకు రాశాడు. తర్వాత ఈ కథ ఎలా ముగియాలి, ఎలా ముగుస్తుంది అని ఆలోచిస్తూ నిద్రపోయాడు. వాస్తవం, ఊహ, తను రాస్తున్న సినిమాకథ అన్నీ కలగా పులగమై పోయి మనస్సనే వెండితెరపై ఈస్ట్మన్ కలర్ కలగా దర్శనమిచ్చాయి. ఆ సుందర స్వప్న చిత్రానికి రచయిత, దర్శకుడు, నిర్మాత, కళాదర్శకుడు, సంగీత దర్శకుడు. ఛాయాగ్రాహకుడు అన్నీ తనే. సినిమా కథ రాయబోతే అది ఆత్మకథ అయింది.

మర్నాడు మామూలుగా ఉదయం 11 గంటలకుశాంతి కుటీర్ కు వెళ్ళాడు. రాజ్యలక్ష్మమ్మగారి పోర్షన్ కి తాళం

పెట్టిఉంది. ఆశ్చర్యపోయాడు. తనతో చెప్పకుండా, తనని వెంట తీసుకు వెళ్ళకుండా ఆవిడ, ప్రమీల ఎక్కడికి వెళ్ళారా అనుకున్నాడు. వెనక్కి తిరిగి రాబోతుంటే నౌకరు కనిపించాడు. రాజ్యలక్ష్మమ్మగారు, ప్రమీల బెంగుళూరుకు వెళ్ళిపోయారని అతడు చెప్పాడు.

"నాకేదైనా చీటీ ఇచ్చారా? ఏమైనా చెప్పమన్నారా?" అని అడిగాడు కృష్ణమోహన్. ఏమీ ఇవ్వలేదనీ, ఏమీ చెప్పలేదనీ, అసలు అంత హఠాత్తుగా ఎందుకు వెళ్ళిపోయారో తనకూ తెలియదనీ చెప్పాడు నౌకరు.

పక్క పోర్షన్‌లో ఉన్న అమెరికన్ కుటుంబంవాళ్ళని అడిగి రాజ్యలక్ష్మమ్మగారి బెంగుళూరు అడ్రసు తీసుకుని రూమ్‌కి తిరిగి వచ్చాడు. రాజ్యలక్ష్మమ్మగారు, ప్రమీల తనతో ఒక్కమాటకూడా చెప్పకుండా అంత ఆకస్మికంగా వెళ్ళిపోవడం చాలా బాధ కలిగించింది. సుందరి, రామచంద్రరావు రాత్రికి రాత్రి గప్‌చిప్‌గా ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోతే లక్ష్మి ఎలా బాధపడిందో-అంత తీవ్రంగా కాకపోయినా-అలాగే బాధపడ్డాడు కృష్ణమోహన్. ఈ కొద్ది రోజుల్లోనే రాజ్యలక్ష్మమ్మగారు, ప్రమీల తనకి ఆప్తబంధువులయినారు. మమకారాన్ని మాటల్లో చెప్పుకోకపోయినా మానసికంగావాళ్ళు, తను చాలా సన్నిహితులయినారు. తన జీవితంలో ఇంతవరకెప్పుడూ ఎవ్వరూ తనకు ఇంత సన్నిహితంగా రాలేదు. ఊటీ వచ్చినప్పటినుంచి రోజూ ఎప్పుడెప్పుడు వెళ్ళి వాళ్ళను చూస్తానా అని తహ తహలాడేవాడు. వాళ్ళని విడిచి హోటల్‌కి తిరిగి రావాలనిపించేది కాదు.

ఆవిడ తనతో చెప్పకుండా వెళ్ళిపోవడానికి కారణం

ఏమై ఉంటుందా అని ఆలోచించాడు. క్రిందటిరోజు తను ఆ ఫోటోను చూసినట్లు, గుర్తుపట్టినట్లు, రహస్యాన్ని పసి గట్టేసినట్లు ఆవిడ తెలుసుకున్నదన్నమాట. ఆవిడకి తెలియ కూడదని తను ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. తను ఇంకా ఊళ్ళోవుంటే 'సుందరి' ఆజ్ఞను ఉల్లంఘించినట్లవు తుందని ఆవిడ భయపడింది. అందుకే అడ్రసు చెప్పకుండా కూడా వెళ్ళిపోయింది.

కృష్ణమోహన్‌కి ఇంక వూటీలో ఉండాలనిపించ లేదు.

రాజ్యలక్ష్మమ్మగారు, ప్రమీల లేని ఊటీతో తనకేమీ నిమిత్తం లేదనిపించలేదు. వాళ్ళు అసలు తనకు పరిచయం కాకపోతే వూటీనుంచి కదలాలనిపించేది కాదేమో. కాని ఇప్పుడు వాళ్ళు లేని ఊటీ అందం తనని ఆకర్షించలేక పోతోంది. అదీగాక తను ఇక్కడికి వచ్చినపనికూడా అయి పోయింది. ఈ కథ ముగింపు ఇంక మద్రాసులో జరగా ల్సిందే ననుకున్నాడు. వెంటనే రూమ్ ఖాళీచేసి బయల్దేరాడు.

26

మద్రాసులో రైలుదిగి, ఇంటికి చేరగానే అమ్మ ఆశ్చర్యపోయింది "అదేమిట్రా! నెలరోజులు మకాం వేస్తానని చెప్పి పదిహేను రోజులయినా కాకుండా తిరిగి వచ్చేశావు? కథరాయడం పూర్తయిందేమిటి?" అని అడిగింది ఆవిడ.

లేదమ్మా ముగింపు మాత్రం "మిగిలింది. ఒకావిడ కథ

చెప్పి పుణ్యం కట్టుకుంది. నువ్వు ముగింపు చెప్పి పుణ్యం కట్టుకో" అన్నాడు.

"నేనేమన్నా రచయిత్రినట్రా? ఎన్నడూ లేనిది ఇలా అడుగుతున్నావేమిటి ఇవాళ?"

"ఈ కథకి ముగింపు చెప్పడానికి రచయిత్రి కానక్కర్లేదు. నాకు కథ చెప్పినావిడకూడా రచయిత్రి కాదు."

"ఇంతకీ ఎవరావిడ?"

"నీలాంటిదే ఒక అమ్మ-రాజ్యలక్ష్మమ్మ. నీవయస్సే ఉంటుంది ఆవిడకి."

"రాజ్యలక్ష్మమ్మా...?" అని ఏదో అనుమానంగా మొహం పెట్టింది ఆవిడ. "కథ సంగతి తర్వాత చూడచ్చుగాని ముందు స్నానంచేసి భోజనంచేసి పడుకో. పగలంతా ప్రయాణంచేసి బడలికగా లేదూ?" అంది.

అమ్మ చెప్పినట్లు చేశాడు కృష్ణమోహన్. పొద్దున్నే లేచి కథసంగతి చూద్దామని ఫైలు, డైరీ బల్లమీద పెట్టి, లైటు ఆర్పి పడుకొన్నాడు.

o o o o

పొద్దున్నే లేచి కాఫీ తాగినతర్వాత టేబుల్ దగ్గరికివచ్చి కూర్చుని, ఫైలు తిరగేసేసరికి తను కథ ఆపిన చోటునుంచి అమ్మ దస్తూరి కనిపించింది. అమ్మ ఇలా రాసింది.

"సుందరి ఎటువంటి పరిస్థితుల్లో బెంగుళూరునుంచి వెళ్ళిపోయిందో, వెళ్ళిన తర్వాత అంత కఠినంగా ఎందుకు ఉత్తరం రాసిందో లక్ష్మి సరిగానే ఊహించింది. సుందరి మనస్సు లక్ష్మికి తెలుసు. లక్ష్మి హృదయం అమృతకలశమని సుందరికి తెలుసు. లక్ష్మి మీద సుందరికి ఏ మాత్రం కోపంగాని,

అసూయగాని లేవు. కాని భర్త బలవంతంమీద ఆ విధంగా ప్రవర్తించవలసి వచ్చింది. మాటమాత్రం చెప్పకుండా రాత్రికిరాత్రి ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోతే లక్ష్మి ఎంత బాధపడు తుందో సుందరికి బాగా తెలుసు. పిల్లాడు పుట్టి పోయినప్పుడు ఎటువంటి జడస్థితిలో పడిపోయిందో అటువంటి స్థితిలో మళ్ళీ పడిపోతుందేమోనని భయపడిందికూడా. కాని సుందరి భర్తను ఎదిరించలేకపోయింది. సుందరి తల్లిచేసిన బోధలు రామచంద్ర రావుకి బాగా తలకెక్కాయి. స్వయంగా కోరి ప్రయ త్నించి, మద్రాసుకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. అసలు అంతకుముందు తనకు ప్రమోషన్ రాగానే సుందరిని ఉద్యో గం మానిపించడంకూడా పిల్లాడినుంచి లక్ష్మిని వేరు చేయ డానికే.

"లక్ష్మితో చెప్పేసి వెడదామండీ" అని సుందరి ఎంత చెప్పినా వినలేదు రామచంద్రరావు.

"దేనికి చెప్పడం? చెప్పిన దగ్గర్నుంచీ ఏడుపులూ, శోకాలేగా? చెప్పాల్సిన అవసరమేమీ లేదు" అన్నాడు.

"లేదండీ, తను సంతోషంగా బొట్టుపెట్టి సాగనంపు తుందండీ. మనకు ట్రాన్స్‌ఫర్ వస్తే వెళ్ళవద్దని బలవంతం చేస్తుందా ఏమిటి? ఇంతకాలం స్నేహంగా ఉండి, వాళ్ళ వల్ల ఎంతో సహాయం పొంది, చివరికి చెప్పకుండా వెళ్ళి పోయామని తెలిస్తే విశ్వాసంలేని వాళ్ళమని వీధిలో అందరూ మనల్నే అనుకుంటారు" అని సుందరి చెప్పినా రామచంద్ర రావు లక్ష్యపెట్టలేదు.

"మనం వెళ్ళిపోయిన తర్వాత మనల్ని గురించి వీధిలో

వాళ్ళు ఏమనుకున్నా ఫర్వాలేదు. వాళ్ళ మొహాలు మళ్ళీ మనం చూడబోవడంలేదు" అన్నాడు.

మద్రాసు వచ్చేసిన తర్వాతకూడా తమ అడ్రసు తెలుసుకొని లక్ష్మి, దుర్గాప్రసాద్ వెతుక్కుంటూవస్తారేమో ననే అనుమానంతో రామచంద్రరావు తన భార్యచేత అంత కఠినంగా ఉత్తరం రాయించాడు. శాశ్వతంగా తెగతెంపులు చేసుకుంటున్నట్లు మళ్ళీ జన్మలో మొహం చూపవద్దని రాయిం చాడు. ఉత్తరంలో ఒక్క అక్షరంకూడా సుందరి హృదయం లోంచి వచ్చింది కాదు. ఆ విషయం లక్ష్మి అర్థం చేసుకో గలదనే నమ్మకం సుందరికి ఉంది.

భార్యచేత అలా ఉత్తరం రాయించాడన్నమాటేగాని రామచంద్రరావుకి మనశ్శాంతి లేకుండాపోయింది. సుందరి రోజూ లక్ష్మిని తలుచుకుని బాధపడేది. కన్నీళ్ళు పెట్టుకునేది. లక్ష్మి రోజూ కలలో కనిపించేది. విశ్వాస ఘాతుకంగా ప్రవ ర్తించినందుకు క్షమించమని తను ఆమెను వేడుకునేది. పిల్లాడు కూడా బెంగపెట్టుకున్నాడు. 'ఇంకో అమ్మ'ని కలవరించే వాడు. ఇంకో అమ్మమీది బెంగతో పిల్లాడికి ఒకసారి జ్వరం కూడా వచ్చింది.

ఇదంతా చూసి తను చాలా తప్పు చేసినట్లుగా బాధ పడడం మొదలుపెట్టాడు రామచంద్రరావు. అయినా ఇప్పుడు మళ్ళీ బెంగుళూరుకు ఉద్యోగం మార్పించుకోవడానికి వీల్లేదు. అక్కడ నుంచి వచ్చేటప్పుడు లక్ష్మి, దుర్గాప్రసాద్‌లతో చెప్పి స్నేహపూర్వకంగావీడ్కోలుతీసుకుని వచ్చినట్లుంటే ఎప్పుడైనా తాము వెళ్ళి చూసిరావడానికి వీలుండేది. వాళ్లూవచ్చి చూసి పోతూ ఉండేవారు. పిల్లాడ్ని తనకి ఇచ్చేసెయ్యమని లక్ష్మి

ఎప్పుడూ అడగలేదు. తాము ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వాళ్ళు ఎంతో ఆదరంతో ఆదుకున్నారు. అంత నిష్కల్మషంగా, నిస్వార్థంగా స్నేహం చేసేవాళ్ళు చాలా అరుదుగా ఉంటారు. తనే అనవసరంగా తొందరపడ్డాడు. అనుమానపడ్డాడు. ఆ విషయం సుందరి దగ్గర ఒప్పుకున్నాడుకూడా. అయినా అతనికి మనశ్శాంతి చిక్కలేదు. ఒక్కసారి బెంగుళూరు వెళ్ళి క్షమాపణ చెప్పుకుని వస్తేతప్ప మనశ్శాంతి ఉండదని అనుకున్నాడు. లక్ష్మిని చూడాలని సుందరికూడా కలవరిస్తోంది.

భార్యాభర్తలిద్దరూ యెంతో ఆశతో పిల్లాడ్ని తీసుకుని బెంగుళూరు వెళ్ళారు. దుర్గాప్రసాద్ ఇంటికి తాళం పెట్టి ఉంది. తాము ఇదివరకు కాపరం ఉన్న ఇంటికి వెళ్ళి కనుక్కుంటే దుర్గాప్రసాద్ ఆ ఇల్లు అమ్మేశాడనీ, ఉద్యోగం వదిలేసి, వూరువిడిచి వెళ్ళిపోయారనీ తెలిసింది. యెక్కడికి వెళ్ళారో తెలియదనీ, ఎవరికీ చెప్పలేదని వీధిలోవాళ్ళు చెప్పారు. అదివరకు సుందరిని, లక్ష్మిని విడదీయడానికి ప్రయత్నించిన అమ్మలక్కలే- "అదేమిటమ్మా సుందరీ...లక్ష్మితో ఒక్కమాటైనా చెప్పకుండా వెళ్ళిపోయావట. నువ్వంటే ప్రాణం పెట్టేదికాదా పాపం...అలా చేశావేమిటమ్మా" అని మందలించారు.

లక్ష్మి ఇంట్లో పని చేసిన వంటమనిషి కనిపించింది. లక్ష్మి యెంత బాధపడిందో, యెలా వైరాగ్యంలో పడిపోయిందో ఆమె వర్ణించి చెప్పింది. "ఆవిడ మీకోసం ప్రాణం పెట్టినా మీకు విశ్వాసం లేకపోయింది" అన్న ధోరణిలో వంటమనిషి ఎత్తి పొడుపుగా మాట్లాడింది. సుందరికి మనస్సంతా

కలచివేసినట్లయింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

దుర్గాప్రసాద్ అదివరకు పని చేసిన ఆఫీసుకు వెళ్ళికను కున్నాడు రామచంద్రరావు. రాజీనామా ఇచ్చి వెళ్ళి పోయాడనే చెప్పారు గాని, ఎక్కడికి వెళ్ళాడో వాళ్ళూ చెప్పలేకపోయారు. సుందరి, రామచంద్రరావు ఉసూరు మంటూ మద్రాసుకు తిరిగివచ్చారు. కొన్నాళ్ళ తర్వాత రామచంద్రరావు లక్ష్మివాళ్ళ పుట్టింటికి వెళ్ళి కనుకున్నాడు. లక్ష్మి, దుర్గాప్రసాద్ దేశాటనం చేస్తున్నారనివాళ్ళుచెప్పారు. క్షమాపణ చెప్పుకునేందుకు కూడా అవకాశం లేకపోయింది కదా అని బాధపడ్డారు సుందరి, రామచంద్రరావు. తర్వాత క్రమంగా దంపతులిద్దరూ మనస్సును సమాధాన పరచు కున్నారు. మళ్ళీ రెండు కుటుంబాలు ఒక్క వూళ్ళో, ఒక్క వీధిలో ఉండడం సాధ్యం కానప్పుడు యింకా వాళ్ళకోసం వెతకడం దేనికి? లక్ష్మి మనస్సుకు తగిలిన గాయం ఈ పాటికి నయమై పోయి ఉంటుంది. ఇప్పుడు మళ్ళీ ఆ గాయాన్ని రేపడం దేనికి?

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచి పోయాయి. పాతికేళ్ళు గడిచినా సుందరి మాత్రం లక్ష్మిని మరిచి పోలేకపోయింది. ఎప్పుడో, ఎక్కడో లక్ష్మి తనంతట తనే హఠాత్తుగా కనిపిస్తుంది. తనను నిండు మనస్సుతో క్షమిస్తుంది. మళ్ళీ ఇదివరకటిలాగా అంత మధురమైన స్నేహంతో తనను ముంచి ఎత్తుతుంది. ఇద్దరూ మళ్ళీ సన్ని హితులవుతారు. ఈ ఆశ మాత్రం సుందరిని వదలలేదు. రామచంద్రరావు క్రమంగా ఈ పాతకథను మరచి పోగలి గాడు. అతని మనస్సుపై దాని ప్రభావంకూడా చెరిగిపోయింది.

తన కొడుకు, లక్ష్మి కలుసుకోకూడదనీ, ఒకరి నొకరు గుర్తించకూడదనీ సుందరి యెప్పుడూ అనుకోలేదు. వాళ్ళు కలుసుకోవాలనే అనుకుంది. కొడుకుద్వారా మళ్ళీ తామిద్దరూ కలుసుకోవాలని అనుకుంది. లక్ష్మిని బాధపెట్టినందుకు ప్రాయశ్చిత్తంగా తన కొడుకుని ఆమె చేతుల్లో పెట్టి 'వీడు నీ పిల్లాడే' అని అప్పగించాలనుకుంది. తన కొడుకు చేత లక్ష్మిని 'అమ్మా' అని అనిపించాలనుకొంది. అప్పుడే ఈ కథ సుఖాంతమవుతుంది."

o o o o

అమ్మ రాసింది చదువుతుంటే కృష్ణమోహన్‌కు కన్నీళ్ళు ఆగలేదు. రాస్తున్నంత సేపూ అమ్మకూడా ఏడుస్తూనే ఉన్నట్లుంది. చాలాచోట్ల సిరా అక్షరాలు తడిసిపోయాయి. అంతా చదివిన తరువాత అతని మనస్సు ఎంతో తేలికై హాయిగా అనిపించింది. అమ్మ ఎంత మంచిది! ఇంకో అమ్మ యెంత మంచిదో అమ్మకూడా అంతమంచిది. "అమృతమూర్తులైన ఇద్దరు అమ్మలు దొరికినందుకు నేను యెంత అదృష్టవంతుడో్న" అనుకున్నాడు. రాత్రి తను పడుకోగానే తన కథ, డైరీ చదివి, తను నిద్రలేచే లోపుగానే కథని సుఖాంతం చేసింది అమ్మ.

ఇంక ఈ కథని వెండితెర కెక్కించాలి. సినీ రచయిత-అనగా హీరో-తను ప్రమీలను ప్రేమించినట్లు తల్లికి చెబుతాడు. "నీ సుఖంకంటే, నీ ఇష్టంకంటే మాకు కావలసిందేమిత్రా" అంటారు తల్లి, తండ్రి. పెళ్ళిచూపులకి తల్లిదండ్రులను బెంగుళూరు తీసుకువెడతాడు. అక్కడ 'లక్ష్మి' 'సుందరి' కలుసుకుంటారు. ఆనందంతో ఆలింగనం చేసుకొని కన్నీ

పెట్టుకుంటారు. "ఇదుగో నీ పిల్లాడ్ని నీకు అప్పగించేస్తు న్నాను. ఇంక నీకు నిశ్చింత" అని సుందరి తన కొడుకుని లక్ష్మికి అప్పగింత పెడుతుంది. సినీ రచయిత లక్ష్మిని 'అమ్మా' అంటాడు.

హీరోకి, హీరోయిన్‌కి పెళ్ళి నిశ్చయమవుతుంది. లక్ష్మి సుందరి, దుర్గాప్రసాద్, రామచంద్రరావు అక్షతలుచల్లుతు ఉండగా హీరో, హీరోయిన్ మెడలో మంగళసూత్రం కడతాడు.

○ ○ ○ ○

కథ రాయడం ముగించిన కృష్ణమోహన్ మనస్సులో "మాంగల్యం తంతునానేన మమజీవన హేతునాం..." అనే సి దృశ్యం మెదిలింది.

అనగనగా ఓ కథ

నండూరి పార్థసారధి

"ఈ ప్రయాణంలో వీరిద్దరితో తన పరిచయం ఏవిధంగా పరిణమిస్తుంది? కేవలం ప్రయాణీకులలాగే రైలు దిగగానే ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోతారా? రైలు దిగిన తర్వాతకూడా పరిచయం కొనసాగుతుందా? ఇంకా వృద్ధి పొందుతుందా? దాని పర్యవసానం ఎలా వుంటుంది? వీరిద్దరూ తన కథలో ప్రధాన పాత్రలవుతారా? అయితే ఆ కథ ఎలా వుంటుంది? ప్రమీల హీరోయిన్ అవుతుందా? హీరో ఎవరు? తనేనా? లేక తన జీవిత కథలోనే వీరిద్దరూ ప్రవేశిస్తారా? ఎందుకో— వీరితో తన సంబంధం ఈ ప్రయాణంతోనే ముగుస్తుందని అనిపించటం లేదు."

తప్పక చదవండి నండూరి పార్థసారధిగారి కలం నుండి వెలువడిన 'అనగనగా ఓ కథ'. ఆద్యంతం కుతూహలం రేకెత్తించే నవల.

యం. శేషాచలం అండ్ కో.,

మచిలీపట్నం-సికింద్రాబాద్

Cover Printed at Nandini Art Printers, Hyd-2